

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 18 + 28



మంగళవారం | 13-3-2018 వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 327 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 1.41 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 12.31 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా. 4.57-6.43; దుర్ముహూర్తం: ఉ. 8.52-9.39, రా. 10.20-11.07; అమృతఘడియలు: తె. 3.35-5.22; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.22 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



రణరంగం

తొలిరోజే అసెంబ్లీలో యుద్ధ సన్నివేశం



సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో స్వామిగౌడ్

హెడ్‌ఫోన్ విసిరిన కోమటిరెడ్డి.. మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం

నిరసనతో సమావేశాలు ప్రారంభం.. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న కాంగ్రెస్

ప్రసంగ ప్రతులు ముక్కలుగా చించివేత

వాటిని గాల్లోకి విసురుతూ నినాదాలు

పోడియంలోకి దూసుకొచ్చేందుకు యత్నం

కాంగ్రెస్ సభ్యులను అడ్డుకున్న మార్షల్స్

కుడి కంటి కార్నియా దెబ్బతింది

మరో 24 గంటలపాటు పరిశీలనలోనే

ఆ తర్వాతే శస్త్ర చికిత్సపై నిర్ణయం: వైద్యులు

సరోజినీ ఆస్పత్రిలో చేరిన మండలి చైర్మన్

సీఎం కేసీఆర్, ఇతర నేతల పరామర్శ

గూండాల్లా వ్యవహరించారు

గవర్నర్ లక్ష్యంగానే దాడి.. హరీశ్ ఆరోపణ

సరుకు ఉంటే ప్రశ్నలేయండని సవాల్



ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్. చిత్రంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి;



కాంగ్రెస్ సభ్యులను మార్షల్స్ అడ్డుకోవడంతో హెడ్‌ఫోన్ విసురుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి

అసెంబ్లీ సమావేశాలు.. గవర్నర్ ప్రసంగానికి కాంగ్రెస్ నిరసన తెలుపుతోంది. ప్రసంగ ప్రతులను కాంగ్రెస్ సభ్యులు చించి గాల్లోకి విసురుతున్నారు. అంతలోనే.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెడ్‌ఫోన్ పీకి గాల్లోకి విసిరారు. అది తగిలి మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయమైంది. ఆయనను ఆస్పత్రికి తరలించారు. కాంగ్రెస్ నేతలు తాగి అసెంబ్లీకి వచ్చారని టీఆర్ఎస్ ఆరోపిస్తే.. ఉద్దేశపూర్వక దాడి కాదని కోమటిరెడ్డి వివరణ ఇచ్చారు.



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు తొలిరోజే రణరంగాన్ని తలపించాయి. ఉభయ సభల సమావేశంలో గవర్నర్ నరసింహన్ ప్రసంగాన్ని కాంగ్రెస్ సభ్యులు అడ్డుకున్నారు. వారిని నిలువరించడానికి మార్షల్స్ రంగంలోకి దిగారు. ఈ ఆందోళన మధ్యలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెడ్‌ఫోన్ విసిరేశారు. అది కాస్తా గవర్నర్ పక్కనే కూర్చున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలింది. ఆయన కుడి కంటికి గాయమైంది. ఈ విషయాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. కోమటిరెడ్డి సహా ఇతర కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకునే దిశగా

మిగతా 15వ పేజీలో...

దశ తిరిగింది

రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడొద్దు

అణగారిన వర్గాలకు వృద్ధి ఫలాలు అందాలి

సవాళ్లను అధిగమిస్తూ వృద్ధిలోకి రాష్ట్రం

14

టీఎస్ ఐపాస్‌తో 1.18 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రత్యక్షంగా, పరోక్షంగా 4.47 లక్షల కొలువులు

ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

సర్కారు సీరియస్!

కోమటిరెడ్డిపై వేటు?

సంపత్, రామ్మోహన్‌రెడ్డిలపైనా

పదవీ కాలం ముగిసేవరకూ ఔట్

మిగిలిన కాంగ్రెస్ సభ్యులపైనా సస్పెన్షన్!

అత్యంత కఠినంగా వ్యవహరించాలని తీర్మానం

వారిపై చర్యలు తీసుకునే బాధ్యత స్పీకర్‌కు

కవరేజీ వీడియోలను వీక్షించిన సభాపతి

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్, రామ్మోహన్ రెడ్డిపై బహిష్కరణ వేటు వేయాలని ప్రభుత్వం

మిగతా 15వ పేజీలో...

15

బీసీల జోలికొస్తే పాతరేస్తాం

రాష్ట్ర మంత్రుల హెచ్చరిక

కాంగ్రెస్ సభ్యులు తాగి వచ్చారు: పల్లా

ఉద్దేశపూర్వక దాడి కాదు

స్వామిగౌడ్ అంటే నాకు అభిమానం

నన్ను టార్గెట్ చేశారు: కోమటిరెడ్డి

వెంటాడి.. వేటాడి..

నడిరోడ్డుపై నరికేశారు!

18

ఇంటర్ విద్యార్థి హత్య

వేట కొడవళ్లతో దాడి

కూకట్‌పల్లిలో దారుణం







తయారీ కాదు..
మరమ్మతులే

కోచ్ ఫ్యాక్టరీకి బదులు.. వ్యాగన్ ఓవర్‌హాలింగ్ పరిశ్రమ

విభజన హామీలపై భేటీలో కేంద్రం ప్రతిపాదన

బడ్జెట్‌లో 20 కోట్లు.. మెట్టుగుట్టలో ఏర్పాటు

బయ్యారంపై కమిటీ నివేదిక వచ్చాకే నిర్ణయం

గిరిజన విశ్వవిద్యాలయానికి మరింత భూమి

ఉద్యాన వర్సిటీకి 300 కోట్లని అంచనా



న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు విభజన హామీల్లో పేర్కొన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులుగా వ్యాగన్ పిరియాడిక్ ఓవర్‌హాలింగ్ పరిశ్రమను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈసారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ దీని కోసం రూ.20 కోట్ల నిధులు కేటాయించిన విషయాన్ని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న 13వ షెడ్యూల్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా ఆధ్వర్యంలోని కమిటీ సోమవారం ఢిల్లీలో రాష్ట్ర అధికారులతో సమావేశమయింది. రాష్ట్రం తరఫున తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా విభజన హామీల్లోని నాలుగు అంశాలపై చర్చ

మిగతా 2వ పేజీలో...



హైదరాబాద్ నూతన కమిషనర్ అంజనీకుమార్

బాధ్యతలు స్వీకరించిన

కొత్త కమిషనర్

మరో ఇద్దరు ఎస్పీల బదిలీ

నల్లగొండకు ఎస్పీగా రంగనాథ్

త్వరలో మరికొందరికి స్థానచలనం!

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా నియమితులైన అంజనీకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బషీర్‌బాగ్‌లోని కమిషనరేట్‌లో ఇన్‌చార్జి కమిషనర్ వీవీ శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గవర్నర్ నరసింహన్, డీజీపీ మహేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా

మిగతా 2వ పేజీలో...



అసెంబ్లీ ముట్టడిలో భాగంగా వేల సంఖ్యలో ముంబై నగరంలోకి అడుగుపెడుతున్న మహారాష్ట్ర రైతులు

అన్నదాతా.. జయహో!

16

రైతుల డిమాండ్లకు ఫడణవీస్ సర్కారు ఓకే.. మహారాష్ట్రలో ఆందోళన విరమించిన రైతులు

తెల్లవారుజామునే ముంబైకి ఆందోళనకారులు.. రైతన్నలపై వెల్లువెత్తిన అభిమానం

పూలవానతో ముంబై ప్రజల స్వాగతం.. మంచినీళ్లు, ఆహారం, పాదరక్షలు సరఫరా





ఉజ్జయినీ కాళి – అనంత కల్పవల్లి



పరంజ్యోతి

18 (అష్టాదశ) మహాశక్తి పీఠాలలో ఒకటైన ఉజ్జయినిలో మహాకాళిగా అమ్మవారి రూపాన్ని వర్ణించడం జరిగింది. అలాగే ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మహాకాళేశ్వరుని రూపం ఇక్కడ కనిపిస్తుంది. ఉజ్జయినిలో ఆ మహాకాళీదేవి హరసిద్ధి మాతగా ప్రసిద్ధి చెందింది. అక్కడి స్థల పురాణం ప్రకారం అంధకాసురుని వధించడానికి హరుడు వచ్చాడు. ఇద్దరికీ యుద్ధం జరిగింది. ఆ రాక్షసునికి ఉన్న వరాల బలంతో మరణించకపోవడంతో మహాంకాళిని పిలిచాడు శివుడు. ఆ తల్లి ప్రత్యక్షం అయి అంధకాసురుని సంహారానికి కారణం అయ్యింది. అలా రాక్షస సంహారం జరగాలన్న హరుని కోరిక సిద్ధింపజేయటం వలన ఆనాటి నుంచి ఉజ్జయినీలోని మహాకాళిని "హరసిద్ధి" మాతగా కొలవటం ప్రారంభం అయ్యింది. ఆ పరిసర ప్రాంతంలో "గడ్ కాళి" ఆలయం కూడా కనపడుతుంది. కొంతమంది ఈమెను మహాకాళిగా భావించటం కూడా కనిపిస్తున్నది. ఉజ్జయినీలో ఆ తల్లి రాత్రివేళ సంచరిస్తూ ఆ ప్రాంతాన్ని రక్షిస్తూ ఉంటుంది. ఉజ్జయినిలోనే కాళిదాసమహాకవికి నాలుక మీద వాగ్బీజాన్ని వ్రాసింది మహాకాళి. అంతేకాక విక్రమార్కుని ఇంటి ఇలవేల్పు ఉజ్జయినీ కాళి. విక్రమార్కుని అనుగ్రహించి వెయ్యేళ్ళు రాజ్యాధికారాన్ని, అనంతమైన ఐశ్వర్యాన్ని, దీర్ఘాయువుని ప్రసాదించింది. భర్తృహరి కవి కూడా ఉజ్జయిని కాళి కోసం తపస్సు చేసి ఆమె అనుగ్రహాన్ని పొందినవారని తెలుస్తున్నది. ఇప్పటికీ ఉజ్జయినిలో భర్తృహరి తపస్సు చేసిన గుహలు ఉన్నాయి. నాథ సంప్రదాయానికి ఆద్యుడైన మత్స్యేంద్రనాథుడు కూడా ఉజ్జయిని కాళిని ఆరాధించి ఆమె అనుగ్రహాన్ని; కాళీమంత్ర సిద్ధిని పొందటం జరిగింది. ఉజ్జయినిలో మత్స్యేంద్రనాథుని సమాధిని కూడా స్థానికులు పూజించటం కనిపిస్తుంది. ఇవాల్టికీ ప్రతిరోజు వేలమంది యాత్రికులు అక్కడికి వెళ్ళి ఆమె దర్శనం చేసుకొని ఆమె అనుగ్రహంతో కష్టాలను తొలగించుకుంటున్నారు, కోరికలు తీర్చుకుంటున్నారు.

– మాతాజీ రమ్యానందభారతి

'నీట్' తప్పులు సరిచేసుకోవచ్చు

హైదరాబాద్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) నీట్-2018 పరీక్షకు దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థులు చేసిన తప్పులను సరిచేసుకునే అవకాశాన్ని సీబీఎస్‌ఈ కల్పించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. పేరు, పుట్టిన తేదీ, కేటగిరి, అంగ వైకల్య స్థితి, మీడియం, పరీక్షా కేంద్రాల మార్పు, పరీక్ష కోడ్, తల్లిదండ్రుల పేరు లాంటి అంశాల్లో ఏదైనా తప్పుగా రాస్తే వాటిని సరిదిద్దుకోవచ్చని తెలిపింది. నీట్ వెబ్‌సైట్‌లో ఈ నెల 15నుంచి 17 రాత్రి 11.50 వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

18 నుంచి ఎడ్‌సెట్ దరఖాస్తులు

- మే 31, జూన్ 1వ తేదీల్లో పరీక్ష

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఎడ్‌సెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 15న జారీ చేయనున్నట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 24 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజును జనరల్ విద్యార్థులకు రూ.650, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.450గా నిర్ణయించారు. ఎడ్‌సెట్ పరీక్షను మే 31, జూన్ 1వ తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. మే 21 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 3న ప్రాథమిక కీని విడుదల చేయనున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ మధుమతి తెలిపారు. జూన్ 11న ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

మే 25న లాసెట్

- ఈ నెల22న నోటిఫికేషన్

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లాసెట్‌కు ఈ నెల 25వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. లాసెట్‌ను మే 25వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహిస్తారు. ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 25 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. మే 28న ప్రాథమిక కీని విడుదల చేస్తారు. జూన్ 10న ఫలితాలు విడుదల చేస్తారు.





టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేస్తున్న లింగయ్య యాదవ్, సంతోష్, బండా ప్రకాశ్ చిత్రాల్లో మంత్రులు, ఎంపీ కేకే

3 స్థానాలు.. 5 నామినేషన్లు!

టీఆర్ఎస్ నుంచి ముగ్గురు.. కాంగ్రెస్ నుంచి ఒకరు.. ఇండిపెండెంట్‌గా మరొకరు

- ముగిసిన రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి జరగనున్న ఎన్నికల కోసం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా నామినేషన్లకు చివరి రోజైన సోమవారం నామినేషన్లు వేశారు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో ఖాళీ కాబోతున్న మూడు స్థానాల భర్తీకి ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. అధికార టీఆర్ఎస్ తరఫున జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్ ఒక్కొక్కరు రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. పలువురు రాష్ట్ర మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి టీఆర్ఎస్ అభ్యర్థులు గన్‌పార్క్ నుంచి పాదయాత్రగా అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకొని.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంతం నర్సింహాచార్యులుకు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌కు వెళ్లి జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తరఫున మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా శ్రమశక్తి పార్టీ నేత జాజుల భాస్కర్ నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన ఉంది.



కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బలరాంనాయక్, చిత్రంలో ఉత్తమ్, జానా, గీతారెడ్డి తదితరులు



వ్యవసాయ శాఖ కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర రైతు సమితి సమన్వయ సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా సుఖేందర్ రెడ్డిని అభినందిస్తున్న మంత్రులు పోచారం, జగదీశ్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్

రైతులకు అండగా 'సమితి'

- సంఘటిత శక్తిగా మార్చేందుకే ఏర్పాటు: గుత్తా
- రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుఖేందర్‌రెడ్డి
- బండికి రెండెడ్ల లాంటోళ్లం: మంత్రి పోచారం
- 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి.. రాష్ట్ర రైతాంగానికి అండగా నిలుస్తుందని ఆ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చాంబర్లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందని, దిక్సూచి మనమే కావాలన్న ధృఢ సంకల్పంతో వివిధ వర్గాలు, రైతు నాయకులతో చర్చించిన సీఎం కేసీఆర్.. దేశంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టనుందని, మండలానికి 10 చొప్పున 5వేల వరినాటు యంత్రాలను సబ్సిడీపై అందించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. మంత్రి పోచారం మాట్లాడుతూ.. తాను, సుఖేందర్‌రెడ్డి.. ఇద్దరమూ పెద కాపులమని, బండికి రెండు ఎడ్ల లాంటోళ్లమన్నారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితికి ప్రభుత్వం హామీగా ఉండి రూ.6 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పిస్తుందని, వాటితో మద్దతు ధరకు పంటలను రైతు సమితులు కొనుగోలు చేస్తాయని తెలిపారు. సుఖేంద్‌రెడ్డి నేతృత్వంలో రైతు సమితులు అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలవాలని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. కాగా దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఈ కార్యక్రమాన్ని అమలు చేసే పరిస్థితి వస్తుందని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు.

నాలుగు విప్లవాలకు రాష్ట్రంలో నాందీ ప్రస్తావన..

గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి అవసరమైన నాలుగు విప్లవాలకు రాష్ట్రంలో నాందీ ప్రస్తావన జరిగిందని మంత్రి కేటీఆర్ అన్నారు. 2022 నాటికి రాష్ట్రంలోని రైతుల ఆదాయం రెట్టింపు కావడం ఖాయమని తెలిపారు. మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ల నేతృత్వంలో 46 వేల చెరువులు, కుంటలను నింపుతూ చేపపిల్లలు వదిలే కార్యక్రమం ద్వారా నీలి విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. పాల ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా క్షీర విప్లవానికీ శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. కనీస మద్దతు ధర సాధించడం కోసమే రైతు సమన్వయ సమితుల ఏర్పాటు జరిగిందన్నారు. మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి తదితరులు హాజరై.. గుత్తాకు అభినందనలు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటెయ్యొచ్చు!

ఎమ్మెల్యేలకు 'విప్' అడ్డంకి ఉండదు.. 'అనర్హత' సమస్య ఉత్పన్నం కాదు

- పోలింగ్‌కు హాజరవ్వాలని కోరవచ్చు
- ఓటేశాక పార్టీ ఏజెంట్‌కు చూపాలి
- ఇదీ రాజ్యసభ ఎన్నికల పోలింగ్ విధానం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ ఎన్నికల్లో శాసనసభ్యులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఎన్నికల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీ ఆదేశాలతో సంబంధం లేకుండా ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయితే, ఎవరికి ఓటు వేశారన్న విషయాన్ని పోలింగ్ కేంద్రంలోని తమ పార్టీ ఏజెంట్‌కు చూపించిన తర్వాతే బ్యాలెట్ పత్రాన్ని బాక్సులో వేయాలి. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా తెలంగాణలో ఖాళీ అయ్యే మూడు స్థానాల కోసం ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. నామినేషన్ల దాఖలు గడువు సోమవారంతో ముగియనుంది. అయితే, మూడు స్థానాల కోసం నలుగురు అభ్యర్థులు (ముగ్గురు టీఆర్ఎస్, ఒకరు కాంగ్రెస్ నుంచి) పోటీ చేస్తే.. 23న పోలింగ్ అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికల పోలింగ్ విధానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం, నిబంధనల ప్రకారం.. రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఆయా పార్టీలు విప్ జారీ చేసే విధానం లేదు. రాజ్యసభ ఎన్నికల పోలింగ్‌నకు పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరు కావాలని, పార్టీ క్రమశిక్షణ పాటించాలని మాత్రమే లిఖితపూర్వకంగా డైరెక్షన్ ఇవ్వొచ్చు. దానిని పాటించటం, పాటించకపోవటం.. సభ్యుల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. పోలింగ్‌కు హాజరైన ఎమ్మెల్యే.. తమ పార్టీ కోరుకున్న అభ్యర్థికి ఓటు వేయనప్పటికీ, అతనిపై అనర్హత వేటు పడే అవకాశం లేదు. అసెంబ్లీలో ప్రాతినిధ్యం కలిగిన ప్రతి పార్టీ ఈ ఎన్నికల్లో తమ తరఫున ఒక ప్రతినిధి/ఏజెంట్‌ను పోలింగ్ కేంద్రంలో నియమించుకోవచ్చు. బ్యాలెట్ పత్రంలో తాము కోరుకున్న అభ్యర్థికి ఎమ్మెల్యే ఓటు వేయలేదని ఏజెంటు గుర్తిస్తే, అతడిపై పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే కారణంతో సస్పెన్షన్ సహా ఇతర చర్యలు తీసుకోవచ్చు.

ఒక్కొక్కరికి గెలుపునకు 30 ఓట్లు అవసరం

తెలంగాణలో భర్తీ కావాల్సిన మూడు స్థానాలకు నలుగురు అభ్యర్థులు పోటీకి దిగి పోలింగ్ అనివార్యమైతే, ఒక్కో అభ్యర్థి గెలుపునకు 30 ఓట్లు అవసరమవుతాయి. ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెడతామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ లెక్కల ప్రకారం కేవలం 19 ఓట్లే ఉన్నాయి. 2014లో 21 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ గెలిచినప్పటికీ, ఇద్దరు అభ్యర్థులు అకాల మరణం పొందారు. ఆ రెండు స్థానాలకు (నారాయణఖేడ్, పాలేరు) జరిగిన ఉప ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ గెలిచింది. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య 19కి పరిమితమైంది. అయితే ఆ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు ఇప్పటికే టీఆర్ఎస్‌తో కలిసి నడుస్తున్నారు. అంటే వాస్తవంగా కాంగ్రెస్ తరఫున గెలిచి ఆ పార్టీలో ఉన్నది 11 మంది మాత్రమే. ఏకైక స్వతంత్ర ఎమ్మెల్యేతో పాటు, ఇటీవల టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మద్దతుతో ఆ పార్టీ బలం 13ను మించదు. పైగా కాంగ్రెస్ పార్టీకి ఇంతవరకు ఇతర పార్టీలు మద్దతు ప్రకటించలేదు. ఇలా.. ఏ లెక్కన చూసినా రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు బొత్తిగా లేవు. మరోవైపు టీఆర్ఎస్‌కు అసెంబ్లీలో 82 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక సీపీఐ ఎమ్మెల్యే కూడా అధికార పార్టీలో కొనసాగుతున్నారు. ఏడుగురు సభ్యులు ఉన్న మజ్లిస్ సైతం టీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో టీఆర్ఎస్ బలం 97కు పెరగనుంది. కాంగ్రెస్ అభ్యర్థి పోటీలో ఉన్నప్పటికీ, టీఆర్ఎస్ అభ్యర్థులు ముగ్గురూ సునాయాసంగా గెలుపొందుతారు. కాంగ్రెస్ అభ్యర్థి పోటీ చేయకపోతే, ఈనెల 15న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక టీఆర్ఎస్ అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక నమోదవుతుంది. లేకపోతే 23న జరిగే పోలింగ్, కౌంటింగ్ తదుపరి వారి విజయం ఖరారవుతుంది.

పార్టీల వారీగా బలాబలాలు

అసెంబ్లీ గణాంకాల ప్రకారం పార్టీల వారీగా టీఆర్ఎస్‌కు 82 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 19, మజ్లిస్‌కు 7, బీజేపీకి 5, టీడీపీకి 3 ఎమ్మెల్యేలు ఉన్నారు. సీపీఐ, సీపీఎంకు ఒక్కో ఎమ్మెల్యే ఉంటే, స్వతంత్ర ఎమ్మెల్యే ఒకరు ఉన్నారు.

తయారీ కాదు.. మరమ్మతులే

(మొదటిపేజీ తరువాయి..)

జరిగింది. ఈ సందర్భంగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వడం సాధ్యపడదని, దానికి ప్రతిగా వ్యాగన్ పరిశుభ్రత, పూర్తిస్థాయి మరమ్మతుల పరిశ్రమను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కమిటీ పేర్కొంది. దీని ఏర్పాటు కోసం 160 ఎకరాల భూమి కావాల్సి ఉందని, వరంగల్ అర్బన్ జిల్లాలో మెట్టుగుట్ట దగ్గర పరిశ్రమను ప్రారంభించాలని ప్రతిపాదించారు. దీంతో మెట్టుగుట్ట సీతారామ దేవస్థానం భూములను కేటాయించేందుకు రాష్ట్రం సుముఖత వ్యక్తం చేసింది. ఇక బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీపై... మెకాన్ కమిటీ నివేదిక వచ్చిన తరువాతే నిర్ణయం తీసుకోనున్నట్లు కేంద్ర కమిటీ పేర్కొంది. ఈ ఫ్యాక్టరీకి రాష్ట్రం ఎటువంటి ప్రోత్సాహకాలు ఇస్తుందో తెలపాలని కోరింది. కాగా భూపాలపల్లి జిల్లా ములుగులో ఏర్పాటు చేయనున్న గిరిజన విశ్వవిద్యాలయానికి 500 ఎకరాల భూమి కావాలని కేంద్రం అడగగా, రాష్ట్రం ఇప్పటికే 200 ఎకరాలు సేకరించింది. మరో 100 ఎకరాలు అసైన్డ్ భూములు తీసుకోనున్నట్లు తెలిపింది. మరో 200 ఎకరాలు అటవీ భూములను తీసుకోవాల్సి ఉందని, దీనిపై సర్వే చేసేందుకు రాష్ట్రం నిధులు ఇచ్చిన విషయాన్ని తెలియజేసింది. మరో హామీ అయిన ఉద్యానవన యూనివర్సిటీ ఏర్పాటుపై పనులు చురుగ్గా సాగుతున్న విషయాన్ని తెలిపింది. సిద్దిపేట జిల్లాలో ఏర్పాటు చేస్తున్న యూనివర్సిటీకి రూ.300 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇక్కడ వర్సిటీ శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్ రూ.200 కోట్లు ప్రకటించారు.

బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిషనర్

(మొదటిపేజీ తరువాయి..)

కలుసుకున్నారు. అంజనీకుమార్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తుండగానే.. 1990 బ్యాచ్ ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. నగరంలోని జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందారు. హైదరాబాద్‌తో పాటు, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేశారు. బోస్నియాలో ఐక్యరాజ్య సమితి శాంతి దళాల తరఫున అందించిన సేవలకు గాను.. రెండు సార్లు 'యునైటెడ్ నేషన్స్ పీస్ మెడల్' అందుకున్నారు. అంజనీకుమార్‌కు హైదరాబాద్‌లో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవం ఉంది. మూడున్నరేళ్లపాటు అదనపు కమిషనర్ (శాంతి భద్రతలు)గా సేవలందించారు. ఆ తర్వాత రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీగా రెండేళ్లు పనిచేశారు. గ్రేహౌండ్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలతోపాటు.. నిజామాబాద్ రేంజ్ డీఐజీగా, వరంగల్ రేంజ్ ఐజీగా పనిచేశారు. అంజనీకుమార్ సతీమణి వసుంధర సిన్హా ఐఆర్ఎస్ అధికారిగా పనిచేస్తున్నారు. అటు.. రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా నియమితులైన జితేందర్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న ఆయనను శాంతిభద్రతల విభాగానికి ప్రభుత్వం బదిలీ చేసింది. జితేందర్ సర్వీసులోకి వచ్చిన తొలినాళ్లలో నిర్మల్, ఆదిలాబాద్ ఏఎస్పీగా, మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. డీఐజీగా పదోన్నతి పొందాక.. విశాఖ, వరంగల్ రేంజ్, గ్రేహౌండ్స్‌లో సేవలందించారు. పోలీస్ అకాడమీ జాయింట్ డైరెక్టర్‌గా, సీఐడీ, విజిలెన్స్ విభాగాల్లో ఐజీ స్థాయిలో విధులు నిర్వర్తించారు. మరోవైపు ప్రభుత్వం సోమవారం ఇద్దరు ఎస్పీ స్థాయి అధికారులను బదిలీ చేసింది. హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-2గా ఉన్న ఏవీ రంగనాథ్ నల్లగొండ ఎస్పీగా బదిలీ అయ్యారు. నల్లగొండ ఎస్పీగా ఉన్న డీవీ శ్రీనివాసరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నల్లగొండ జెడ్పీ చైర్‌పర్సన్ భర్త, కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసు దర్యాప్తులో జాప్యం కారణంగానే శ్రీనివాస్‌పై ప్రభుత్వం బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. త్వరలో మరికొందరు ఐపీఎస్‌ల బదిలీలు జరగనున్నట్లు తెలిసింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38.0	21.0
ఆదిలాబాద్	37.3	17.0
విశాఖపట్నం	36.0	22.6
హైదరాబాద్	35.5	23.3
విజయవాడ	35.1	21.4

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 6 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. బుధవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో మంగళవారం లాటరీ ద్వారా జారీచేసే టిక్కెట్లు.. సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, తోమాల:18, అర్చన:18, ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.com లో సంప్రదించాలి.

– ఆంధ్రజ్యోతి, తిరుమల



మెహుల్ చోక్సీ సంస్థతో జైట్లీ కుమార్తెకు లింకు!

పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించిన మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ సంస్థతో జైట్లీ కుమార్తెకు చెందిన జైట్లీ అండ్ బక్షీ న్యాయవాద సంస్థ కొంతకాలం కలిసి పని చేసింది. అందుకే ఈ కుంభకోణంపై జైట్లీ నోరుమెదపడం లేదు. ఈ స్కాం వెలుగులోకి రావడానికి నెల రోజుల ముందు 'జైట్లీ అండ్ బక్షీ' సంస్థకు గీతాంజలి గ్రూపు పెద్దమొత్తంలో చెల్లించింది.

– రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.72	పాత ధర 68.31
కొత్త ధర రూ.76.74	కొత్త ధర 68.28
పెరుగుదల: 2 పైసలు	తగ్గుదల: 3 పైసలు



వృద్ధాప్యంలో కండలు ఇక కరగవు

లండన్, మార్చి 12: వయసు పైబడినకొద్దీ కండలు కరిగిపోతుంటాయి. వృద్ధాప్యంలో కాళ్లు, చేతుల్లోని కండరాలు కరిగిపోయి బక్కచిక్కినట్లు కనిపిస్తుంటారు. అయితే అలా ఎందుకు అవుతుందో మాత్రం ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోయారు. దీనిపై పరిశోధన జరిపిన యూకేలోని మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు.. వయసుపైబడే కొద్దీ కాళ్లలోని కండరాలను నియంత్రించే 30 నుంచి 50శాతం నాడులు బలహీనపడిపోతాయని గుర్తించారు. దీంతో మెదడు, కండరాల మధ్య సంబంధం తెగిపోవడం వల్ల కండలు కరిగిపోతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఈ నాడులు బలహీనపడటాన్ని తగ్గిస్తే కండరాలు కరగకుండా జాగ్రత్త పడొచ్చని పేర్కొన్నారు.



సానుభూతికి జన్యువులూ కారణమే

లండన్, మార్చి 12: ఎదుటివారి కష్టాలు, బాధలను చూసి ఎవరైనా కరిగిపోతుంటారు. వారిపై ఎంతో కొంత సానుభూతి చూపుతుంటారు. వారి కష్టాల్లోని తీవ్రత, భావనలను బట్టి సానుభూతి తీవ్రత ఆధారపడి ఉంటుందని తెలుసు. అయితే ఎదుటివారి ఫీలింగ్సే కాకుండా జన్యువులు కూడా సానుభూతి చూపడంలో కీలకపాత్ర పోషిస్తాయని అంటున్నారు యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి పరిశోధకులు. 46వేల మందిపై జరిపిన ఈక్యూ పరీక్షల ఆధారంగా ఈ విషయాన్ని గుర్తించారు.

రెవెన్యూ లోటు తగ్గుముఖం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ లోటు తగ్గుముఖం పట్టింది. గత అక్టోబర్‌లో ఏకంగా రూ.4548.22 కోట్లుగా ఉన్న లోటు... జనవరి నాటికి రూ.3643.66 కోట్లకు తగ్గింది. ఏప్రిల్‌లో రూ.308.20 కోట్ల రెవెన్యూ మిగులుతో 2017-18 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. సంవత్సరాంతానికి రూ.4571.30 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ... మధ్యలో రెవెన్యూ రాబడులు తగ్గడం, వ్యయాలు పెరగడంతో రెవెన్యూ లోటు నమోదైంది. అయితే, ఫిబ్రవరి, మార్చి నాటికి ఈ లోటు మరింత తగ్గవచ్చని ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. మిగులు నమోదైనా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు.

వైద్య విద్య మొదటి ఏడాది ఫలితాలు విడుదల

హైదరాబాద్,మార్చి12(ఆంధ్రజ్యోతి) : వైద్య కోర్సుల మొదటి సంవత్సర పరీక్షా ఫలితాలను కాళోజీనారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం ప్రకటించింది. మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఎండీ ఆయుర్వేద, ఎంఎస్సీ నర్సింగ్, ఆయుష్ పీజీ యునానీ, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ ఫలితాలను విడుదల చేసింది. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ కేఎన్‌ఆర్‌యూహెచ్ఎస్.ఇన్‌లో ఉంచారు.

కాపీయింగ్ జరిగితే ఇన్విజిలేటర్లదే బాధ్యత

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పరీక్ష సమయంలో ఏ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడినా ఆ పరీక్ష హాల్ ఇన్విజిలేటరే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే డీఈవోలు, ఎంఈవోలు తమ పరిధిలో జరిగే కాపీయింగ్‌కు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి అన్ని జిల్లాల డీఈవోలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులు, కాపీయింగ్ కేసుల నమోదుకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. అయితే, ఈ నిర్ణయంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్ డిమాండ్ చేశారు.

15 నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా కొనసాగుతున్న పాఠశాలలను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని ఆదేశించారు. ఇక ఉన్నత పాఠశాలల్లో ఐచ్ఛిక సెలవుల విధానాన్ని మార్చుతూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించారు. ఐచ్ఛిక సెలవులను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల పరంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

జీవోను అమలు చేయండి: అర్చక ఉద్యోగులు

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : అర్చక, ఉద్యోగులకు వేతనాల చెల్లింపునకు సంబంధించిన జీవో నెం.577 పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని అర్చక, ఉద్యోగుల జేఏసీ కోరింది. సీఎస్‌ను సచివాలయంలోని ఆయన కార్యాలయంలో జేఏసీ కన్వీనర్ గంగు భానుమూర్తి అధ్యక్షతన అర్చకులు సోమవారం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ద్వంద్వ వేతన చెల్లింపు విధానానికి స్వస్తి పలికి ఒక పనికి ఒకే వేతనం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని సీఎస్‌ను కోరారు.

టీఏసీ సిఫారసుతోనే హోదా: మేఘవాల్

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర జలవనరుల శాఖ క్లియరెన్స్ ఇవ్వడంతోపాటు సాంకేతిక సలహా మండలి (టీఏసీ) సిఫారసు చేస్తే.. మార్గదర్శకాల ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటిస్తామని కేంద్ర జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ స్పష్టంచేశారు. రాజ్యసభలో టీఆర్ఎస్ ఎంపీ డి.శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లను పరిశీలించిన జల సంఘం.. వాటిని ప్రాజెక్టు అథారిటీ వర్గాలకు పంపిందని తెలిపారు.

బకాయిలు ఇవ్వకుంటే నడపలేం: మిల్లర్లు

సోమాజిగూడ/హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మిల్లింగ్ చార్జీలను మార్చి 31వ తేదీ లోగా చెల్లించాలని, లేనిపక్షంలో ఏప్రిల్ నుంచి రైస్ మిల్లులను నడపమని తెలంగాణ రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లెవీ సమస్య మిల్లులను సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ఇప్పటికే ఈ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, 2000 మిల్లుల్లో ఏడొందలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశా రు. కేంద్రం ఆదేశాలను రాష్ట్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ప్రాశస్త్యాన్ని వక్రీకరించొద్దు: శంకర్‌రెడ్డి

భద్రాచలం, మార్చి, 12: భద్రాద్రి రాముడి ప్రాశస్త్యాన్ని వక్రీకరించొద్దని అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం భద్రాచలంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి వైదిక సిబ్బంది శ్రీరామచంద్రుడి ఆలయాన్ని రామనారాయణుడి ఆలయంగా మార్చడం సరికాదన్నారు. ఆలయంలో వైదిక సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోందన్నారు.

తెలంగాణలో 20 రోడ్డు ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు రూ.5972 కోట్ల విలువైన 20 రోడ్డు ప్రాజెక్టులను మంజూరు చేశామని కేంద్ర రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రి మన్సుక్ ఎల్ మాండవియా వెల్లడించారు. ఈ మొత్తంతో 866 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ. 1350 కోట్లు ఖర్చు చేశామని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ఎంఎ ఖాన్ అడిగిన ఓ ప్రశ్నకు సోమవారం ఆయన లిఖితపూర్వకంగా తెలిపారు.

పశువైద్యుల సంఘం అధ్యక్షుడిగా రమేశ్

నాంపల్లి/హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పశువైద్యుల సంఘం నూతన అధ్యక్షుడిగా రమేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సహాధ్యక్షుడిగా డాక్టర్ సట్లా వెంకట్, ఉపాధ్యక్షులుగా వెంకట్‌యాదవ్, లక్కం ప్రభాకర్, భయ్యబొజ్జ వెంకటరాజు, జీనత్‌భాను ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల విభజన

» వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలి: హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏపీ పునర్విభజన చట్టం నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్తు ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు రెండు ప్రభుత్వాలను ఆదేశించింది. విధి విధానాలను 4వారాల్లో, విభజన ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని ఇరురాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖలకు ఉత్తర్వులు జారీచేసింది. ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశించింది.

సుప్రీం కోర్టులో 'ధిక్కరణ' పిటిషన్ డిస్మిస్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల ఆస్తుల విభజనపై కేంద్ర హోంశాఖ ఇచ్చిన ఆర్డర్‌ను సవాలు చేసిన ఏపీ ప్రభుత్వం, ఉన్నత విద్యామండలికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గత నెలలో దాఖలు చేసిన ధిక్కరణ పిటిషన్‌ను సోమవారం కొట్టేసింది. ఈ పిటిషన్ సాంకేతికంగా సరికాదని, కేంద్రప్రభుత్వ ఆర్డర్‌ను హైకోర్టులో సవాల్ చేయాలని జస్టిస్ అరుణ్‌మిశ్రా స్పష్టం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇరు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల మధ్య ఆస్తులు, నగదు, సిబ్బంది పంపిణీకి సంబంధించి 2016 మార్చి 18న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును అమలు చేయకుండా కేంద్ర హోంశాఖ వక్రభాష్యం చెబుతూ 2017 ఏప్రిల్ 18న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఆర్డర్ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందన్న అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి ఇంటర్ లాకింగ్ అప్లికేషన్ వేశాయి. అయితే ఈ అప్లికేషన్ తగిన రీతిలో లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడంతో ఉపసంహరించుకున్న ప్రభుత్వం.. సుప్రీంకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.

ఫ్లోరోసిస్ పెరిగింది..
కాంగ్రెసోళ్ల ఆదాయమూ పెరిగింది

» 50ఏళ్లలో వాళ్లే బాగుపడ్డారు

» జనం బతుకులు మారలేదు: కేటీఆర్



నల్లగొండ జిల్లా చండూరులో జరిగిన ప్రగతి సభలో మాట్లాడుతున్న కేటీఆర్

చండూరు, మార్చి 12: కాంగ్రెసోళ్ల తీరు 'అమ్మకు అన్నం పెట్టనోళ్లు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తానన్నట్లు'గా ఉందని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ పెరిగిందని, దాంతోపాటే కాంగ్రెస్ నాయకుల ఆదాయమూ పెరిగిందని ఆరోపించారు. సోమవారం నల్లగొండ జిల్లా చండూరులో నిర్వహించిన ప్రగతి సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని ఏనాడైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. 50 ఏళ్ల అధికారమిస్తే వారు బాగుపడ్డారే తప్ప ఇక్కడి ప్రాంతం, ప్రజల బతుకులు మారలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే నల్లగొండలో ఫ్లోరోసిస్ పెరిగిందని, దాంతో పాటే వారి ఆదాయాలూ పెరిగాయని ధ్వజమెత్తారు. గతంలో స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో చేపట్టిన నల్లగొండ పర్యటనలో తానూ పాల్గొన్నానని, ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్థులను చూసి ఏడుపొచ్చిందని.. అందుకే ఫ్లోరైడ్ భూతాన్ని సంపూర్ణంగా తరిమికొట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ సురక్షిత మంచి నీటిని అందించేందుకే మిషన్ భగీరథను చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారని, అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు సిగ్గుచేటని అన్నారు. మాకు పదే పదే నీతులు చెప్పే జానారెడ్డి.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇటువంటి దౌర్జన్యాలకు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జపాన్ 'ఇసే ఫుడ్స్'

నర్మెట్టలో 140 ఎకరాల్లో యూనిట్ ఏర్పాటు.. అనుమతి పత్రాలు అందించిన మంత్రులు

హైదరాబాద్ మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన ప్రముఖ ఆహార పదార్థాల కంపెనీ 'ఇసే ఫుడ్స్' రాష్ట్రంలో ఒక యూనిట్‌ను ప్రారంభించనుంది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామ పరిధిలో 140 ఎకరాల్లో ఈ కంపెనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది. ఇక్కడ కోడిగుడ్ల ప్రాసెసింగ్ పరిశ్రమ, కోళ్ల ఫారంలో వెలువడే వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను ఇసే ఫుడ్స్ తయారుచేయనున్నది. ఈ మేరకు రాయితీలు, అనుమతుల పత్రాలను సోమవారం ఆ కంపెనీ ప్రత్యేక బృందానికి మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డి అందజేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీ ద్వారా టోక్యో ఒలంపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఇసే ఫుడ్స్ పౌష్టికారాన్ని అందించేందుకు ఒక ఎంవోయూను ఈ సందర్భంగా కుదుర్చుకున్నారు. పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర విద్యార్థులను శిక్షణ కోసం జపాన్‌కు తీసుకువెళ్లడానికి ఈ కంపెనీ అవకాశం కల్పించనుంది. అలాగే సుజుకి కంపెనీ భాగస్వామ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. జపాన్‌కు చెందిన కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. జపాన్ పరిశ్రమలను రప్పించాలన్న ప్రభుత్వ చొరవను జపాన్ ప్రధాని ప్రత్యేక సలహాదారు మిట్సుహిరోమియాకోషీ అభినందించారు.



కోదండరాంను కలిసిన కపిలవాయి దిలీప్‌కుమార్

ప్రజల ఆకాంక్ష మేరకే పార్టీ

» ఉద్యమకారులంతా కలిసిరావాలి: కోదండ

» కోదండరాంతో కలసి నడుస్తాం: కపిలవాయి

సోమాజిగూడ/హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోవడంతో జనం కోరిక మేరకే రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు టీజేఏసీ చైర్మన్ కోదండరాం తెలిపారు. అభివృద్ధి జరగాలంటే రాజకీయాల్లో ఉండాలని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఆయన సతీమణి, ఆర్‌ఎల్‌డీ మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు ఇందిర, ఆ పార్టీ నేత రియాజ్, రైల్వే కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, జాతీయ బ్యాంకు ఉద్యోగ మేళా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు కోదండరాం ఏర్పాటు చేయబోయే పార్టీలో చేరతామని ప్రకటించారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతతో పారదర్శకంగా పాలన సాగించడంలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి సచివాలయానికి రారని, ఆయన ఇంటికి వెళ్లి కలుద్దామంటే ధర్మదర్శనం దొరకదని, ఇలాంటి విచిత్ర పరిస్థితి ఎక్కడా లేదని ఆక్షేపించారు. తమ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక కీలక ఘట్టం పూర్తయిందని, అతి త్వరలోనే పేరుపై కూడా స్పష్టత వస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వాళ్లంతా తమ పార్టీతో కలసి రావాలని పిలుపునిచ్చారు. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో సకల జనుల సమ్మె వంటి ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలు నిర్వహించిన కోదండరాం సారథ్యంలో కలసి నడవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

అడవుల్లోకి నో ఎంట్రీ!

» ట్రెక్కింగ్‌పై నిషేధం

» ధూమపానంపై కఠిన చర్యలు

» తమిళనాడు ఘటనతో అప్రమత్తమైన రాష్ట్ర అటవీ శాఖ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తేని సమీపంలోని అడవుల్లో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంతో తెలంగాణ అటవీ శాఖ అప్రమత్తమైంది. అడవుల్లో ట్రెక్కింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాల్లో ఇతరులకు అనుమతి ఉండదని తెలిపింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అడవుల ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ వాహనాలతో నిరంతర గస్తీని కొనసాగిస్తున్నామని వివరించింది. అగ్గిపెట్టెలు, బీడీలు, సిగరెట్లు, లైటర్ వంటివి తీసుకుని అడవుల్లోకి ప్రవేశించినా.. ధూమపానం చేసినా.. అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అగ్ని ప్రమాదాలు తరచూ సంభవించే ప్రాంతాల్లో ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వ ఉద్యోగులు, హరిత సైనికులు, హరిత రక్షణ సమితులు సహకరిస్తున్నాయని పేర్కొంది. అగ్ని ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో తక్షణం స్పందించేలా సిబ్బందిని నియమించామని వివరించింది.

అన్ని శాఖలకూ ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్లు: సీఎస్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రభుత్వ శాఖకూ ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ వెబ్‌సైట్లు, పోర్టళ్లకు సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఐటీ డైరెక్టర్ దిలీప్ కొణతం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల వెబ్‌సైట్ల నిర్వహణపై పది రోజుల్లో నివేదిక అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఐటీ శాఖ సర్వీసు ప్రొవైడర్‌గా పనిచేయాలని, అవసరమైతే సీజీజీ సహకారాన్ని తీసుకోవాలన్నారు. జీవోలు తెలుగులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ తమ శాఖతో పాటు రాష్ట్ర పోర్టల్ నిర్వహిస్తూ.. వివిధ శాఖలకు సహకారం అందిస్తున్నట్లు వివరించారు.

చైనా చక్రవర్తి!

అందరూ అనుకుంటున్నట్టుగానే, కొందరు భయపడినట్టుగానే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ దేశానికి యావజ్జీవాధ్యక్షుడయ్యారు. గతకాలపు అనుభవాల దృష్ట్యా సమష్టినాయకత్వం ఎదగాలన్న సదుద్దేశంతో మూడుదశాబ్దాల క్రితం చేసుకున్న ఓ నియమాన్ని జిన్‌పింగ్‌కోసం అక్కడి కమ్యూనిస్టు పార్టీ వద్దనుకుంది. దేశాధ్యక్ష పదవిలో ఓ వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే కూర్చోవాలన్న నిబంధనను రద్దుచేయడాన్ని పార్లమెంటులో ఇద్దరు వ్యతిరేకించడం, ముగ్గురు ఓటింగ్‌లో పాల్గొనకపోవడం వంటి విన్యాసాలు బాహ్య ప్రపంచం కోసమని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇప్పుడు, రెండో పర్యాయం కుర్చీలో కూర్చోబోతున్న జిన్‌పింగ్ రాబోయే ఐదేళ్ళపాటు దేశాన్నీ, పార్టీనీ, సమస్త అధికార వ్యవస్థలనూ ఏలిన తరువాత కూడా 2023లో కుర్చీ దిగనవసరం లేదు. గత అక్టోబర్‌లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సమావేశాల్లో వారసుణ్ణి ప్రకటించే సంప్రదాయాన్ని తోసిపుచ్చి, గత నెలాఖరులో పార్టీ అధ్యక్షుడి కాలపరిమితిని నిర్ధారిస్తున్న నిబంధనను రాజ్యాంగం నుంచి తొలగించాలంటూ జిన్‌పింగ్ ప్రతిపాదించినప్పుడే ఆయనకు ఇక ఎదురులేదన్న వాస్తవం ప్రపంచానికి అర్థమైపోయింది.

ఈ నిర్ణయంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదో లేదో తెలియదు కానీ, ఎవరూ నోరెత్తకుండా ప్రభుత్వం ముందునుంచే జాగ్రత్తలు తీసుకున్నది. 'విన్నీ ద ఫూహ్' క్యారెక్టర్‌తో సోషల్ మీడియా విమర్శకులు ఆయనను విమర్శిస్తుంటారు కాబట్టి, అక్కడి మాధ్యమం వైబోలో ఈ క్యారెక్టర్ వాడకంపైనా, సంబంధిత పదాలపైనా నిషేధం అమలులోకి వచ్చింది. జిన్‌పింగ్ ఆదేశానికి చైనా కమ్యూనిస్టు పార్టీ సై అనగానే సామాజిక మాధ్యమంలో విమర్శలు ఆరంభాయి. దీంతో, అనైతికత, అసమర్థత, వ్యతిరేకత తదితర వందలాది పదాలు నిషేధిత జాబితాలోకి చేరిపోయాయి. దీనికి ఆగ్రహించిన చైనీయులు 'రెండు పర్యాయాలు సరిపోదు' అంటున్న ఓ పాతకాలం నాటి కండోమ్ ప్రకటనను సామాజిక మాధ్యమాల్లో వాడుతూ తమ అక్కసు తీర్చుకున్నారనీ, చివరకు పాలకులు దీనినీ నిషేధించారంటూ వార్తలు వచ్చాయి. ఇదంతా మావో జ్ఞాపకాలు ఇంకా చెదిరిపోని కారణమో, జిన్‌పింగ్ మీద నమ్మకం లేనందువల్లనో తెలియదు కానీ ప్రజల అభీష్టంతో అక్కడి పాలకులకు పనిలేదు. శతాబ్దకాలపు శక్తిమంతమైన చైనా అధ్యక్షుడు అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచాధినేతలు అనేకులు జిన్‌పింగ్ నిర్ణయాన్ని స్వాగతించారు. ట్రంప్ వ్యాఖ్యలో ఎగతాళి ఉన్నదో, ఆయనకూ మనసులో ఇటువంటి కోరిక ఉన్నదో తెలియదు కానీ, ప్రజాస్వామ్యదేశాల ప్రజలకు ఒంటబట్టని పరిణామం ఇది. ప్రజాస్వామ్యదేశాల్లో సైతం అన్ని వ్యవస్థలు నిర్వీర్యమైపోతూ, వ్యక్తిపూజ, వ్యక్తికేంద్రీకృతపాలన హెచ్చుతున్న కాలంలో, తమ నిరవధిక పాలనకోసం చట్టాలు మార్చడానికి నాయకులు సంకల్పిస్తున్న తరుణంలో చైనా వారికి తోవచూపుతున్నది.

దేశాధ్యక్షుడైన తొలిపర్యాయంలోనే జిన్‌పింగ్ ఇలా శాశ్వతత్వాన్ని సాధించుకోగలగడం విశేషమే. అందుకు ఎంచుకున్న దారులపై వచ్చిన విమర్శలను అటుంచితే, గత అక్టోబర్ సమావేశాల్లోనే ఆయన రెండవసారి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిని చేజిక్కించుకోవడంతో పాటు, అప్పటివరకూ మావో, డెంగ్‌లకు మాత్రమే దక్కిన అరుదైన గౌరవాన్ని కూడా సొంతం చేసుకున్నారు. వారిద్దరి ఆలోచనలు, సిద్ధాంతాలతో పాటు ఈయన నూతనశకపు ఆలోచనా విధానం కూడా అధ్యయనాంశాల్లో ఒకటిగా చేరింది. వారిలాగానే ఈయన కూడా 'అధినేత' అంటూ గౌరవపూర్వకంగా పిలిపించుకోవడం ఆరంభమైంది. అధినేతలుగా అవతరించడానికి 'అవినీతిపై పోరు' అందరిమాదిరిగానే జిన్‌పింగ్‌కూ ఉపకరించింది. మిగతా దేశాల్లో మాదిరిగా అవినీతిపరులపై సాగుతున్న దర్యాప్తులు, విచారణల వివరాలు బాహ్య ప్రపంచానికీ, కనీసం అక్కడి ప్రజలకు కూడా తెలియవు కానీ, కోట్లు పోగేస్తున్న వేలాదిమంది నాయకులను కడిగివేశారన్న ప్రచారం మాత్రం విస్తృతంగా సాగి ప్రజల్లో పార్టీ పట్ల ఆదరణ పెరిగింది. పనిలోపనిగా భవిష్యత్తులో తన రాజకీయ ప్రస్థానానికి అడ్డుపడతారనుకున్న డజన్లకొద్దీ పార్టీ సీనియర్లు ఈ ప్రక్షాళనలో కొట్టుకుపోయారన్న విమర్శలూ లేకపోలేదు. పార్టీలో ప్రత్యర్థులు మాత్రమే కాదు, కనీసం భిన్నాభిప్రాయాన్ని వ్యక్తంచేయగలిగేవారు కూడా మిగల్లేదని ఇప్పటి పరిణామం చెబుతున్నది. తన ఏలుబడిలో ఆర్థికంతో పాటు సర్వరంగాల్లోనూ సాధించిన విజయాలు కొనసాగాలన్నా, వేళ్లూనుకోవాలన్నా తానే నిరవధికంగా అధికారంలో కొనసాగాలన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. మావో నాయకత్వంలో స్వాతంత్ర్యం పొందిన చైనా, డెంగ్ ఆలోచనలతో సంపదను పెంచుకుంటే, తన ఏలుబడిలో అది సర్వశక్తిమంతం అవుతుందని జిన్‌పింగ్ హామీ ఇస్తున్నారు. బలంగా కాళ్ళూనుకుని ఉన్న చైనా మరింత బలపడాలంటే వినూత్నమైన ఆలోచనలతో విస్తరించాలంటూ మరో ముప్పయ్యేళ్ళకాలంలో రెండుదశల్లో ఆర్థికంగానూ, అధునాతన సామ్యవాద దేశంగానూ అవతరించే లక్ష్యాన్ని ఆయన అక్టోబర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. చైనా ఓ తిరుగులేని శక్తిగా అవతరించడానికి అవసరమైన అన్ని అధికారాలూ తనకే దఖలుపడాలన్న ఈ 'ఛైర్మన్ ఆఫ్ ఎవరిథింగ్' లక్ష్యం ఎట్టకేలకు నెరవేరింది. ఆయన పొందిన ఈ శాశ్వతత్వం, ప్రవచించిన నవయుగం శాంతికి బాటలు పరుస్తుందో, లేక ప్రజా సంపదంతా సేనలమీద పెట్టుబడులుగా మారిపోయి మరిన్ని ఘర్షణలకు దారితీస్తుందో చూడాలి.

సంక్షోభంలో న్యాయ వ్యవస్థ

ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు ఇటీవల రెండు రోజులు కోర్టులను బహిష్కరించారు. హైకోర్టులో న్యాయమూర్తులను నియమించాలని, శాశ్వత ప్రధానన్యాయమూర్తిని నియమించాలని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ఇటీవల కొత్తగా చేర్చిన సెక్షన్ 41ని తొలగించాలని రెండు రాష్ట్రాలకు చెందిన న్యాయవాదులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా టి. రాధాక్రిష్ణన్ నియామకాన్ని సుప్రీంకోర్టు కొలీజియమ్ సిఫార్సు చేసి నెల రోజులు దాటిపోయింది. ఈ సిఫార్సుకు కేంద్ర ప్రభుత్వం మోక్షం కలిగించలేదు. ఈ నేపథ్యంలో ఒడిస్సా, వెస్ట్ బెంగాల్, కర్నాటక హైకోర్టుల న్యాయవాదుల తరువాత ఇప్పుడు తెలుగు రాష్ట్రాల న్యాయవాదులు కోర్టులను బహిష్కరించేత వరకూ వెళ్ళారు. ఈ పరిస్థితి మిగతా రాష్ట్రాలలో కూడా ఉత్పన్నమయ్యే అవకాశం కనిపిస్తోంది. అయినా కేంద్ర ప్రభుత్వంలో స్పందన కనిపించడం లేదు.

దేశంలో రోజురోజుకీ కేసుల సంఖ్య పెరిగిపోతూ ఉంటే, న్యాయమూర్తుల కొరత మరింత పెరిగిపోతూ ఉంది. న్యాయమూర్తుల కొరత క్రింది కోర్టుల నుండి హైకోర్టులు, సుప్రీంకోర్టు వరకూ తీవ్రంగా ఉంది. హైకోర్టులు, సుప్రీంకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకానికి ఎలాంటి పరీక్షలు, ఇంటర్వ్యూలూ ఉండవు. రిజర్వేషన్లు అంతకంటే లేవు. అయినా నియామకాలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సుప్రీం కోర్టు–కేంద్ర ప్రభుత్వాల ఆధిపత్య పోరులో దేశం నలిగిపోతోంది.


సుప్రీంకోర్టులో ఆరు ఖాళీలు ఉన్నాయి. 24హైకోర్టులలో 395 ఖాళీలు ఉన్నాయి. క్రింది కోర్టులో 6వేల న్యాయమూర్తుల పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ సంవత్సరం ఏడుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు. హైకోర్టులలో చాలామంది న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు. మన హైకోర్టుకు మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 61 కాగా, ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తులు కేవలం 31 మంది. హైకోర్టులో న్యాయమూర్తుల నియామకంలో తీవ్ర జాప్యం జరిగేందుకు కారణం గత మూడు సంత్సరాలుగా హైకోర్టుకు శాశ్వత ప్రధాన న్యాయమూర్తి లేకపోవడం. మన దేశంలో ఇటీవలి కాలంలో మాదిరిగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తులు ఉన్న పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు.

న్యాయమూర్తులని, ప్రధాన న్యాయమూర్తిని నియమించమని న్యాయవాదులు రోడ్డుకెక్కే పరిస్థితి ఏర్పడడం శోచనీయం. మన హైకోర్టు న్యాయవాదుల నిరసనలో న్యాయబద్ధత ఉంది. దేశంలోని అన్ని హైకోర్టుల న్యాయవాదులు ఇలా నిరసనలు, కోర్టు బహిష్కరణలు చేయకముందే కేంద్ర ప్రభుత్వం మేలుకుంటే బాధితులకు న్యాయం దొరికే అవకాశం ఉంది. ఎందుకంటే, దేశంలోని హైకోర్టుల్లో 4.2 మిలియన్లకు మించి పెండింగ్ కేసులు ఉండగా, క్రింది కోర్టుల్లో 2.62 కోట్ల పెండింగ్ కేసులు ఉన్నాయి.

■ మంగారి రాజేందర్

(వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి)

పాలనలో బలప్రయోగమెందుకు?



తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్‌కౌంటర్లులేని తెలంగాణ ఒక రాజకీయ నినాదం. ఇప్పుడు అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్ పార్టీ తన మానిఫెస్టోలో చేర్చిన అంశమిది. ఒక సందర్భంలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్‌కౌంటర్లను 'పాడు ఎన్‌కౌంటర్లు' అని వ్యాఖ్యానించారు. దాదాపు 1969–71 సంవత్సరాల మధ్య వెంగళరావు ప్రభుత్వం ప్రారంభించిన ఈ 'మానవ హననం' నిరాఘాటంగా కొనసాగుతూనే ఉంది. రాజకీయ పార్టీ ఏదైనా, ముఖ్యమంత్రి ఎవరైనా విధానం ఒకటే. ఎన్‌కౌంటర్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికీ ఇవి రాజ్యాంగాతీత హత్యలని ప్రజాస్వామ్యవాదులు, పౌరహక్కుల సంఘాలూ అంటూనే ఉన్నాయి. తీరా హత్యలు పౌరహక్కుల సంఘాల నాయకులను మింగే దాకా వచ్చాయి. ఎన్‌కౌంటర్లను ప్రభుత్వం, మీడియా ప్రతిహింసగా చిత్రీకరిస్తూ ఏదో ఒకమేర సమాజ సమ్మతిని సాధించగలిగాయి. ఎన్‌కౌంటర్‌లు హింస–అహింస మధ్య చర్చగాకాక, హింస–ప్రతిహింస మధ్య ఘర్షణగా చూడాలి. హింస ఎవరిది, ప్రతిహింస ఎవరిదనే మౌలికమైన ప్రశ్న అర్థం కానంతవరకు ఈ మొత్తం 'హింస' పట్ల సరైన అవగాహన సాధ్యం కాదు.

మానవ చరిత్ర పరిణామ క్రమంలో రాజ్య ఆవిర్భావం ఒక చారిత్రక మలుపు. ప్రజలను పాలించడానికి ఏర్పడిన రాజ్యానికి ఇంత బలప్రయోగం చేయాల్సిన అవసరం ఎందుకు? పోలీసులు, పారామిలిటరీ బలగాలూ లేకుండా పాలన సాధ్యం కాదా? సమాజంలో ఏ వైరుధ్యం నుంచి ఈ బలప్రయోగ అవసరం ఏర్పడింది అన్న మౌలిక ప్రశ్నను అడగనంతవరకు సమస్య సమగ్రంగా అర్థం కాదు. 'హింస' వ్యవస్థీకృతమైపోవడంతో అది ఒక సహజ అవసరంగా, అది లేకుంటే సమాజం మనలేదు అనేది ఒక విశ్వాసమై పోయింది. భూస్వామ్య వ్యవస్థలో భూస్వామి హింస సహజమైపోయి, ఆయన ఆధిపత్యాన్ని ప్రశ్నించిన వాళ్ళు హింసాపరులైపోయారు. భూస్వామి పాలేరును కొడితే అది సహజమేనని పించి, పాలేరు తిరిగి కొడితే ఆ తిరుగుబాటులో చాలా హింస కనిపిస్తుంది. నిరంతరంగా సమాజంలో హింస–ప్రతిహింస ఘర్షణలో పరిష్కారాలు వెతుకుతుంటారు. ఈ హింసాకాండను ఆపడం చరిత్రలో సాధ్యమా అన్న ప్రశ్న ఉంటుంది. అది సాధ్యం కాకపోయినా దాని తీవ్రతను తగ్గించే చారిత్రక అవకాశం ఎప్పుడూ ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ హింసాప్రతిహింసలు పరాకాష్ఠకు చేరిన తెలుగు సమాజంలోని మానవీయ స్పందన నుండి పౌరస్పందన వేదిక పుట్టింది. ఆ సుసంపన్న అనుభవం తెలుగు సమాజానికి ముఖ్యంగా తెలంగాణ సమాజానికి ఉంది. ఈ ప్రయోగం చేసిన తెలంగాణ చరిత్రకు ఒక గొప్ప అనుభవాన్ని అందించింది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రాజ్య హింసకు ఒక అడ్డుకట్ట వేయాలనే ఒక బలమైన ఆకాంక్ష దాగి ఉంది. ఉద్యమ కాలంలో 2002 ఆగస్టు 30న ప్రెస్‌క్లబ్‌లో పౌర స్పందన వేదిక నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో 'శాంతిని సాధించాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రభుత్వం నాటకమాడుతోందని, బలమైన రాజకీయ నిర్ణయం లేకుండా శాంతి సాధ్యం కాదనీ, ప్రభుత్వం పోలీసుల కనుసన్నలలో పనిచేస్తున్నదని, పోలీసులే అంతిమ నిర్ణయాధికారాన్ని కల్గి ఉన్నారనీ, ఐనా శాంతి చర్చలు తప్ప వేరే మార్గం లేదని ఈ ప్రక్రియలో ప్రభుత్వమే కీలక పాత్ర నిర్వహించాలనీ' కేసీఆర్ అభిప్రాయపడ్డారు. శాంతి సాధించకపోతే పోలీసుల అరాచకాలకు అంతం ఉండదని అప్పుడు జరిగిన కొన్ని అరాచకాలను ప్రస్తావిస్తూ, దీనికి తెలంగాణ రాష్ట్ర సాధన ఒక మార్గమని కేసీఆర్ అన్న మాటలు 'వేదిక ప్రచురణ'లో రికార్డయి ఉన్నాయి. అయితే కేసీఆర్‌ను కూడా చాలామందిని వేధిస్తున్న ప్రశ్నే వేధిస్తూ ఉంటుంది. విప్లవకారులు ఆయుధాలు పట్టుకొని ఈ రాజ్యాన్నే కూలదోస్తాం అన్నప్పుడు రాజ్యం ఎందుకు ఊరుకొంటుంది అన్నది ప్రశ్న. సమాజంలో ఆకలి, అసమానతలు, ఆధిపత్యం, శ్రమదోపిడీ ఉన్నంత వరకు ప్రతిఘటన ఏదో ఒక రూపంలో ఉంటుంది. అన్యాయానికి గురైన వాళ్ళు న్యాయం కోసం, సమానత్వం కోసం ఏదోఒక రూపంలో పోరాడుతూనే ఉంటారు. ఈ అవగాహన చాలామందిలో ఉండదు. ఈ చారిత్రక సత్యాన్ని అవగాహన చేసుకొన్న పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షేమ రాజ్య భావనను ముందుకు తెచ్చి తన బలప్రయోగానికి ఒక సాధికారతను సాధించుకొన్నది. భారత రాజ్యాంగం సరాసరి సమానత్వ ఆశయాన్ని అంగీకరించి ఆదేశిక సూత్రాలలో దానిని చేర్చి, రాజ్యం ఏ చర్యలు తీసుకొన్నా సమానత్వం, సంక్షేమం అనే లక్ష్యాలు గీటురాయి కావాలని ఆదేశించింది. ఇంకా ముందుకెళ్ళి రాజ్యం యథాతథ వ్యవస్థను కాపాడే శక్తిగా కాక, సామాజిక మార్పుకు సాధనంగా పనిచేయాలని స్పష్టంగాపేర్కొంది. రాజ్యం ఈ సమానత్వాన్ని సాధించడంలో విఫలమైతే 'ఈ రాజ్యాంగం ఎంతో శ్రమకోర్చి నిర్మించిన ఈ ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు పేల్చి వేస్తారు' అని అంబేద్కర్ ఒక ప్రవక్తలా పాలకులను హెచ్చరించారు. ఇవాళ రాజ్యాంగం పట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్లిందో లేదోకాని అది పాలకులకే అవరోధంగా కనిపిస్తున్నది. గత మూడు నాలుగేళ్ళుగా రాజ్యాంగ వ్యవస్థలన్నీ సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. నిజానికి రాజ్యాంగపర స్వతంత్ర సంస్థలు లేకుండా నియంతృత్వాన్ని నియంత్రించడం సాధ్యం కాదు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రత్యర్థులకు వ్యతిరేకంగా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొంటున్నారు. రేపు కేంద్రంలో అధికారం పోతే

> రైతులు, నిరుద్యోగులు ఎక్కడికి పోతారు? ఏమవుతారు? అనే ప్రశ్నలకు సమాధానం దొరికే దాకా ప్రతిఘటనా రాజకీయాలు తీవ్రతరం అవుతుంటాయి. మౌలికమైన మానవ సమస్యలకు మనుషులను నిర్మూలించడం సరైన సమాధానం కాదు. ఎన్‌కౌంటర్లు మానవహక్కులకి, రాజ్యాంగ ప్రమాణాలకూ, చట్టబద్ధ పాలనకూ వ్యతిరేకం.

ప్రత్యామ్నాయంగా వచ్చే రాజకీయ శక్తులు తమను కూడా ఇలాగే వేధించవచ్చుననే దూరదృష్టి అన్ని పార్టీలలో లోపించింది. ఇక పాలక వర్గాల మధ్యే రాజ్యాంగం ఆటుపోట్లను ఎదుర్కొంటుండడంతో రాజ్యాంగ ఆదర్శాలైన ప్రజాసంక్షేమం, సమానత్వం అనే భావనలు ప్రధాన స్రవంతి చర్చల్లో కూడా లేకుండా పోయాయి. కానీ సమాజ మథనంలో ఈ అత్యున్నత విలువలు ఏదో ఒక రూపంలో సజీవంగా ఉంటూ ప్రతిఘటనా రాజకీయాలకు ఊపిరిపోస్తుంటాయి.

సమకాలీన సమాజంలో విస్తృతమైన అసంతృప్తి ఉంది. అసంతృప్తి ఉద్యమాలకు దారితీస్తే, పౌరసమాజంలోని పాలక పార్టీ అనుబంధ సంస్థలు ప్రత్యక్ష హింసకు పాల్పడుతున్నాయి. ఇంట్లో కూర్చున్న కల్బుర్గీని, గౌరీ లంకేష్‌ను కాల్చి చంపారు. మత విశ్వాసాల పేర మీడియా ముందే మనుషులను కాల్చి చంపుతున్నారు. పాలనకు ఈ స్థాయి హింస అవసరమైంది. రాజ్యాంగం, చట్టబద్ధ పాలన అనే అత్యున్నత ప్రజాస్వామ్య ప్రమాణాలు ఏమైనట్టు? విప్లవకారులను ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపడం దగ్గర ప్రారంభమై, అది పౌర సమాజంలోని భిన్న రంగాల్లోకి చొచ్చుకొచ్చింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి 'నేరస్థులైన వారిని మట్టుపెట్టండి' అనడం ఏ చట్టబద్ధ పాలన? అక్కడి నుంచి తమను ఎవరు వ్యతిరేకించినా, విమర్శించినా ఇదే పద్ధతి ఉపయోగించే దశ ఎంతో దూరంలో లేదు.

తిరిగి తెలంగాణకు వస్తే, మావోయిస్టు ఎజెండానే మా ఎజెండా అన్న వారిలో కేసీఆర్ మొదటి వారు కాదు చివరి వారు కూడా కాదు. ఈ రాజకీయాలు కేవలం హింసాపూరిత రాజకీయాలైతే ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు ఎన్టీఆర్ దగ్గరి నుండి కేసీఆర్ దాకా ఎందుకు అలా మాట్లాడుతున్నట్లు? ఈ రాజకీయ ధోరణిని కొంచెం లోతుగా పరిశీలిస్తే, మావోయిస్టుల ఆయుధం మీద ఆంక్షలే కాని వారి ఆశయాల మీద కాదని స్పష్టమౌతుంది. మావోయిస్టులవి నిషేధ రాజకీయాలైతే టీఆర్ఎస్ పార్టీ అలా మాట్లాడడం రాజ్యాంగ వ్యతిరేకమే కదా? ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి విప్లవ శ్రేణులన్నీ మద్దతిచ్చాయి. సమగ్ర సామాజిక మార్పుకోసం పోరాడే రాజకీయాలు తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించడమేమిటన్న ప్రశ్న లేకపోలేదు. తెలంగాణ రాష్ట్ర మేర్పితే రాజ్య హింస తగ్గుతుందన్న ఆకాంక్ష కావచ్చు లేదా చిన్న రాష్ట్రంలో ప్రజాస్వామ్య సమీకరణ సులభం అని కావచ్చు, కారణం ఏదైనా తెలంగాణ రాష్ట్ర సాధనలో విప్లవ శ్రేణులు నిర్వహించిన పాత్ర ఇప్పుడు చరిత్రలో భాగం. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో మావోయిస్టు సాయుధ రాజకీయాలు దాదాపు లేనట్లే! కానీ అధికారంలోకి వచ్చిన మరునాటి నుండి ఎప్పుడైనా ఈ రాజకీయాలు పుంజుకోవచ్చుననే భయం పాలకులను వెంటాడుతోంది. మొగ్గలోనే తుంచేయండి అని కేంద్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం బలమైన సూచనలే ఇచ్చి ఉంటారు. రాష్ట్రం వస్తూనే మొదట వివేక్ అనే పిల్లవాడిని, తర్వాత శ్రుతి, సాగర్‌లను ఎన్‌కౌంటర్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా అనూహ్యమైన ప్రతిఘటన రావడంతో పాలకులు ఆలోచనలో పడ్డారు. ఎన్‌కౌంటర్లు ఆపాలని నిర్ణయించుకున్నట్టు అనిపించినా, కొంత వ్యవధి తర్వాత తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశించి పదిమందిని ఎన్‌కౌంటర్ చేశాయి. అందులో తెలంగాణకు చెందిన వారు ఒకరు, ఇద్దరే. నీళ్లు, నిధులు పంచుకునే దగ్గర సరిహద్దులు సమస్యాత్మకమైతే, అణచివేతకు అవి అడ్డంకి కాలేదు. ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగినా మౌలిక సమస్యలను పట్టించుకోనంతవరకు ప్రతిఘటనా రాజకీయాలు అనివార్యంగా బతికే ఉంటాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొత్తం దేశం ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం తెలంగాణ కూడా ఎదుర్కొంటున్నది. ఇది మొత్తం నూతన ఆర్థిక విధానాల నుంచి పెరిగిన సమస్య. అభివృద్ధి నమూనా మారకుండా రైతులకు భవిష్యత్ లేదు. అలాగే తీవ్రమైన నిరుద్యోగ సమస్య. తెలంగాణలో కేవలం 12 వందల ఉద్యోగాలకు ఏడు లక్షల మంది పోటీపడ్డారు. ఈ పిల్లలంతా ఎక్కడికి పోతారు? మనిషన్న తర్వాత ఏదో ఒక పని కావాలి కదా? మనం అవలంబిస్తున్న అభివృద్ధి నమూనా ఉద్యోగాలను (ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో) కుదిస్తుందే తప్ప విస్తృత పరచదు. ఈ రెండు సవాళ్ళూ వ్యవస్థీకృత అభివృద్ధి నమూనాలో అంతర్భాగం. టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రెండు సమస్యలకు మౌలిక విధానపర పరిష్కారాలు సీరియస్‌గా చర్చించిన దాఖలాలు లేవు. రైతులు, నిరుద్యోగులు ఎక్కడికి పోతారు? ఏమవుతారు? అనే ప్రశ్నలకు సమాధానం దొరికే దాకా ప్రతిఘటనా రాజకీయాలు తీవ్రతరం అవుతుంటాయి. మౌలికమైన మానవ సమస్యలకు మనుషులను నిర్మూలించడం సరైన సమాధానం కాదు. విస్తృత ప్రజాఉద్యమం ద్వారా ఏర్పడిన తెలంగాణ వైపు దేశం మొత్తం ఆసక్తిగా చూస్తున్నది. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ అన్న నినాదానికి ఏమైనా అర్థం ఉండాలి కదా! ఎన్‌కౌంటర్లు మానవహక్కులకి, రాజ్యాంగ ప్రమాణాలకూ, చట్టబద్ధ పాలనకూ వ్యతిరేకం.

■ ప్రొ. జి.హరగోపాల్

జనవాక్యం

మా సారు సేవ చిరస్మరణీయం

కాజీపేటకు మూడు కిలోమీటర్ల దూరంలోని రాంపేట గ్రామంలో జన్మించిన మా సారు (దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్) ఈ నెల 2వతేదీ జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో రాంపేటతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో తీవ్ర విషాదం అలముకొంది. గ్రామంలోనే మొదటగా బీఎడ్ పూర్తి చేసి, ప్రజల చేత 'సారు' అని పిలిపించుకున్న వ్యక్తి మా సారు. నాడు రాంపేట గ్రామంలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ఆయన తీవ్రంగా శ్రమించి సమస్యను తీర్చారు. గ్రామంలో చదువుకుంటున్న విద్యార్థులకు, చదువురానిపెద్దలకు చదువు చెప్పారు. తరాపల్లి, కడిపికొండ ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్‌గా కొన్నాళ్ళు పనిచేశారు. అక్కడ కూడా విద్యార్థులకు మార్గదర్శిగా, గ్రామ ప్రజలకు తలలో నాలుకగా మెలిగారు. 1999లో రాంపేటలో ప్రభుత్వ ఆసుపత్రి నెలకొల్పడంలో ఆయన కృషి మరువలేనిది. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడినపుడు చురుగ్గా పనిచేశారు. అనేక మంది యువకులను తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములను చేశారు. ఆ తరువాత విప్లవోద్యమంలోకి వెళ్ళి 17 సంవత్సరాలుగా ఊరికి దూరంగా ఉన్నా, మా సారు జ్ఞాపకాలు మాత్రం ప్రజలలో పదిలంగా ఉన్నాయి. తన కన్నా చిన్నవారిసైతం ఎంతో గౌరవంగా సంబోధించేవారు. ఆయన మంచితనం, నడవడికను చూసి అందరూ ఆయన్ను సారు అని పిలిచేవారు. ఆయన గ్రామంలో ఎవరిని పలుకరించినా ముందు 'తిన్నావా' అని అడిగేవారు. ఆకలి విలువ తెలిసిన గొప్ప మానవతావాది మా సారు. అందుకే ఆయన అయినవారినందరినీ వదిలి అడవిమార్గం పట్టారు. గత 17 ఏండ్లుగా తన సేవలను మైదాన ప్రాంతంతో పాటు, ఆదివాసులకూ విస్తరించి చివరివరకూ కొనసాగించారు. చీమకైనా కీడుతలపెట్టక, సకల జనుల క్షేమం కోరుకొనే మా సారును మనం కొట్లాడి తెచ్చుకొన్న తెలంగాణ ప్రభుత్వమే ఎన్‌కౌంటర్ పేరుతో పొట్టనపెట్టుకోవడం అత్యంత బాధాకరం. మా సారు భౌతికంగా మన మధ్య లేకపోయినా సాటి మనుషులకోసం ఆయన చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచేఉంటుంది.

– దాడబోయిన రంజిత్

అన్నదాతల అవస్థలు తీరేనా?



> ఎటువంటి నీడ లేకుండా పొలాల్లో ఎండను తట్టుకొంటూ రైతులు భోజనాలు చేయడం చూడదగ్గ దృశ్యమేనా? మనం తింటున్న ఆహారాన్ని సమకూరుస్తున్న కష్టజీవులు వారు. మరి మన అన్నదాతలను అటువంటి కష్టాలకు గురిచేయడం ఎంతైనా శోచనీయం. రైతులు ఇలా అనేక కష్టనష్టాలకు లోనవుతూ సుదీర్ఘ పాదయాత్రలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించనవసరం లేకుండా ప్రభుత్వాలు ఇప్పటికైనా వివేకంతో, దూరదృష్టితో వ్యవహరిస్తాయా?

'మెహర్బానీ నక్కో, హక్క్ హవేత్!' – సోమవారం నాడు ముంబైకి చేరిన అరవైవేలమంది రైతులు తమ రెక్కల కష్టాన్ని గుర్తించాలని నినదించారు. తాము ప్రభుత్వ కరుణాకటాక్షాలను కోరడం లేదని, రాజ్యాంగబద్ధమైన హక్కులను మాత్రమే డిమాండ్ చేస్తున్నామని వారు స్పష్టం చేశారు అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో పంట రుణాలు మాఫీ చేయాలని, భూములు కేటాయించాలని మొదలైన డిమాండ్లతో నాసిక్ నుంచి ముంబైకి సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించారు.

ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన ఈ సుదీర్ఘ పాదయాత్రకు ('లాంగ్ మార్చ్' అని కిసాన్ సభ అభివర్ణించింది) అగ్రభాగాన జీవా పాండు గావిట్ (సిపిఎమ్ ఎమ్మెల్యే), అజిత్ నావ్లే (కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి) తదితర నాయకులు ఉన్నారు. వారి వెనుక కొంతమంది రైతులు 'మహారాష్ట్ర రాజ్య కిసాన్' అని రాసి వున్న బ్యానర్లను ప్రదర్శించారు. ఆ తరువాత ప్లకార్డులు, తాగునీటి సీసాలు, బ్యాగులు, బిస్కట్ ప్యాకెట్లతో వేలాది రైతులు వారిని అనుసరించారు. ఈ సుదీర్ఘ యాత్రలో తమ బిడ్డలను భుజాలకెత్తుకొన్న ఎంతోమంది తల్లులు కూడా పాల్గొన్నారు. దూరాన్ని, ఎండ తీవ్రతను కూడా లెక్కచేయకుండా ఈ రైతు జనావళి తమ హక్కుల కోసం నినదిస్తూ ముందుకు నడిచారు.

గత శనివారంనాడు నేను ఈ రైతులతో పాటు దాదాపు నలభై కిలోమీటర్లు నడిచాను. ఎండ తీవ్రతకు తాళలేక, ఇక నడవలేక పూణేకు తిరిగి వెళ్ళిపోయాను. అయితే ఎండనక, వాననక పొలాల్లో రేయింబవళ్ళు కష్టపడే ఈ కర్షకులు ఎటువంటి అలసటకు గురి కాలేదు. మహోత్సాహంతో ముందుకు సాగిపోయారు. ఎండను తట్టుకోవడానికి తల మీద ఏదైనా కప్పుకోమని కొంతమంది వృద్ధ స్త్రీలు కనీసం మూడుసార్లు నన్ను హెచ్చరించారు.

నిర్ణీత సమయాల్లో వాటర్ ట్యాంకర్లు వచ్చేవి. అవి వచ్చినప్పుడల్లా రైతులు వాటి వద్దకు పరుగెత్తి తమ సీసాల్లో మంచినీటిని పట్టుకొని తాగేవారు. ఈ 'లాంగ్ మార్చ్'లో కొట్టవచ్చినట్టు కన్పించిన ఒక అద్భుత విశేషమేమిటంటే యాత్ర పొడవునా ప్రతి ఒక్కరూ పూర్తి క్రమ శిక్షణను పాటించడం. ఎటువంటి హింసాత్మక సంఘటనలకు తావివ్వకుండా వారు తమ గమ్యాన్ని చేరుకొన్నారు. ఇదే విధమైన క్రమశిక్షణ పాదయాత్రకు జరిపిన ఏర్పాట్లు, ఆహార పంపిణీలో కూడా స్పష్టంగా కన్పించింది. భోజన ఏర్పాట్లకు కొంత మంది రైతులు, విస్తృత పాదయాత్ర నుంచి వైదొలగి, తాము ప్రత్యేకంగా ముందుకు సాగి వంటకు, భోజనాలకు అవసరమైన ప్రదేశాన్ని ఎంపిక చేసేవారు. రైతుల పాదయాత్ర అక్కడకు చేరే లోగా వారు తమ స్వయంగా సేకరించిన ఆహార సామాగ్రితో వంటచేసేవారు. ఎక్కడా పెద్దగుడారాలు కన్పించలేదు. మధ్యాహ్న మార్తాండుని ప్రతాపాన్ని భరిస్తూనే విశాల పొలాల్లో రైతులు కిచిడీ తినేవారు కొంతమంది జానపదగేయాలు ఆలాపించేవారు. ఆ పాటలకు అనుగుణంగా మరికొంత మంది నృత్యం చేసేవారు. అలా వారు తమ అలసట తీర్చుకొనేవారు.

ఎడతెగని సమస్యలతో సతమతమవుతున్న రైతుల నిర్వహించిన నిరసన ప్రదర్శన ఇది. వారు నిరసన తెలిపిన సమస్యలు కొత్తవేమీ కావు. సుదీర్ఘ కాలంగా వారు ఈ సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నారు. రైతు రుణాలను పాక్షికంగాగాక సంపూర్ణంగా రద్దు చేయాలనేది వారి మొదటి డిమాండ్. మహారాష్ట్ర ప్రభుత్వం రైతు రుణాల మాఫీ పథకాన్ని ప్రకటించింది. ఆ పథకం సమకూర్చే ప్రయోజనాలు చాలా పరిమితమైనవి. అటవీహక్కుల చట్టం కింద తమకు కేటాయించిన భూముల విషయంలో కూడా వారు అనేక సమస్యలనెదుర్కొంటున్నారు. ఆ చట్టం ప్రకారం ఏదైనా ఒక కుటుంబం ఇప్పటికే అటవీ భూమిని సాగుచేసుకొంటుంటే సదరు కుటుంబానికి గరిష్ఠంగా నాలుగు హెక్టార్ల భూమిని కేటాయిస్తారు. అయితే నాలుగు హెక్టార్ల భూమిని సాగుచేసుకొంటున్న కుటుంబాలకు సైతం కేటాయించిన భూమి సరిపడేంతగా లేదు. రైతుల డిమాండ్ల జాబితాలోని తదుపరి అంశం నాసిక్, థానే ప్రాంతాలలో నదుల అనుసంధాన ప్రాజెక్టుతో ఉత్పన్నమయ్యే సమస్యలు. ఈ అనుసంధానం వల్ల గిరిజన భూములు ముంపునకు గురయ్యే ప్రమాదమున్నది. ఇక స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుపరచకపోవడమనేది సరేసరి. ఈ సమస్యలన్నీ పాదయాత్రలో పాల్గొన్న రైతులు, వారి కుటుంబాలపై తీవ్రస్థాయిలో ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నవే.

అన్నదాతల విషయంలో ప్రభుత్వం, సమాజం ఎలా విఫలమయ్యాయో అన్నదానికి ఈ పాదయాత్ర తిరుగులేని రుజువు. వ్యవసాయం ఇప్పటికే ఒక కష్టసాధ్యమైన కార్యకలాపమైపోయింది. తమకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన వాటిని ఇవ్వాలన్నదే ఈ రైతుల డిమాండ్. దీన్ని సాధించుకోవడానికి విపరీతమైన ఎండను తట్టుకొంటూ 180 కిలోమీటర్లు నడవవలసిన దుస్థితి ఆ మట్టిమనుషులకు ఏర్పడింది. ఎటువంటి నీడ లేకుండా పొలాల్లో ఎండను తట్టుకొంటూ రైతులు భోజనాలు చేయడం చూడదగ్గ దృశ్యమేనా? మనం తింటున్న ఆహారాన్ని సమకూరుస్తున్న కష్టజీవులు వారు. మరి మన అన్నదాతలను అటువంటి కష్టాలకు గురిచేయడం శోచనీయం. రైతులు ఇలా అనేక కష్టనష్టాలకు లోనవుతూ సుదీర్ఘ పాదయాత్రలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించనవసరం లేకుండా ప్రభుత్వాలు ఇప్పటికైనా వివేకంతో , దూరదృష్టితో వ్యవహరిస్తాయని ఆశిస్తాను.


■ ఆయుష్ దూబే

('ది వైర్')

ట్రంప్ ఆదర్శ బాట!

అమెరికా ఉత్పత్తిదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోలార్ ప్యానెల్స్, వాషింగ్ మెషీన్లపై అదనపు దిగుమతి సుంకాలను విధించారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై కూడా సుంకాలు పెంచనున్నట్టు ఆయన ఇప్పటికే ప్రకటించారు. అవి త్వరలోనే అమలులోకి రానున్నాయి. 1990వ దశకంలో ప్రపంచీకరణ విధానాలకు సంపూర్ణ మద్దతునిచ్చిన దేశాలలో అమెరికాదే అగ్రస్థానమని చెప్పనవసరం లేదు. అప్పట్లో అమెరికన్ టెక్నాలజీ కంపెనీలే ప్రపంచ ఆర్థికవ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ 1993లో విప్లవాత్మక సాఫ్ట్‌వేర్ విండోస్‌ను ప్రవేశపెట్టింది. ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్ (ఐబిఎమ్), హెవెట్ ప్యాకర్డ్ (హెచ్‌పి) మొదలైనవి హై–టెక్ కంప్యూటర్ గూడ్స్‌ను అపరిమితంగా ఎగుమతి చేశాయి. అప్పట్లో ఈ అమెరికన్ కంపెనీలకు మరే దేశం నుంచి ఎటువంటి పోటీ లేదు. అలాగే మోన్సాంటో భారత్‌లో తన జన్యుమార్పిడి పత్తి విత్తనాలను విరివిగా విక్రయించగలిగింది.

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

> మనం మన విధానాలను మార్చుకోవాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆరాటపడకుండా దేశంలోనే మదుపులు చేసేలా మన వ్యాపారవేత్తలను ప్రోత్సహించాలి. స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకు విరుద్ధంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు పరుస్తున్న సంరక్షణ విధానాలు నిజానికి మనకు పరోక్ష లాభాన్ని సమకూర్చుతాయి.

స్వేచ్ఛా వాణిజ్యం అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు అత్యధిక లబ్ధిని సమకూర్చింది. మైక్రోసాఫ్ట్, మోన్సాంటో లాంటి కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ధరలకు అమ్మి అపార లాభాలను ఆర్జించడం వల్లే అమెరికాకు ఆ లబ్ధి చేకూరింది. స్వేచ్ఛా వాణిజ్యమే దిగుమతుల ద్వారా చౌక సరుకులు అమెరికన్ వినియోగదారులకు లభ్యమయ్యేలా చేసింది. అయితే గతదశాబ్దంలో అమెరికా, అధునాతన సాంకేతికతల సృష్టిలో తన అగ్ర స్థానాన్ని కోల్పోయింది. విండోస్ సాఫ్ట్‌వేర్ లాంటి కొత్త సాంకేతికతలను సృష్టించడంలో అమెరికా పురోగమనం మందగించింది. జన్యుమార్పిడి విత్తనాలను ఉత్పత్తిచేయడంలో భారతీయ కంపెనీలు విశేష నైపుణ్యాలను అభివృద్ధిపరచుకున్నాయి. స్వేచ్ఛా వాణిజ్యం ఇప్పటికీ అమెరికన్ వినియోగదారులకు చౌక భారతీయ వస్త్రోత్పత్తులను సమకూరుస్తుంది గానీ ఉద్యోగాలను సృష్టించలేకపోతోంది. ఈ సమస్యను అధ్యక్షుడు ట్రంప్ బాగా అర్థం చేసుకున్నారు. కనుకనే అమెరికన్ ఉత్పత్తిదారుల ప్రయోజనాలను పరిరక్షించే విధానాల్ని ప్రవేశపెడుతున్నారు. స్వల్ప దిగుమతి సుంకాలు ఉద్యోగాల నష్టానికి దారితీస్తాయి; అయితే చౌక ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతాయి. అధిక దిగుమతిసుంకాలు ఉద్యోగ సృష్టికి దారితీస్తాయి; అయితే సరుకుల ధరలను ఇతోధికంగా పెంచుతాయి. చౌక ఉత్పత్తుల కంటే ఉద్యోగాలకే ప్రాధాన్యమివ్వాలని ట్రంప్ నిర్ణయించారు. ఆ నిర్ణయం ముమ్మాటికీ సబబైనదే. తొలుత అందరికీ ఉద్యోగాలు ఉండడం చాలా ముఖ్యం కదా.

మనం కూడా ట్రంప్ సంరక్షణ విధానాలను తప్పక అనుసరించడం శ్రేయస్కరమేనా అనే విషయాన్ని నిశితంగా పరిశీలిద్దాం. 1990ల నుంచీ నేను ప్రపంచీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ వస్తున్నాను. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించే బదులు బహుళజాతి సంస్థల ద్వారా నవీన సాంకేతికతలను సమకూర్చుకోవడానికి ప్రయత్నించాలని, దేశీయ మదుపులను మరింతగా ప్రోత్సహించాలని, భారతీయ కంపెనీలకు అత్యాధునిక సాంకేతికతలను సమకూర్చాలని నేను వాదిస్తూ వచ్చాను. చైనా నుంచి చౌక సరుకులను దిగుమతి చేసుకోవడం ఎందుకు? మౌలిక సదుపాయల నిర్మాణ వ్యయాలను, పాలనా వ్యవస్థలో అవినీతి మూలంగా భారతీయ కంపెనీలకు పెద్ద మొత్తంలో అవుతున్న వ్యయాలను తగ్గించాలి. ఏ సరుకులను చైనా నుంచి దిగుమతి చేసుకొంటున్నామో అవే సరుకులను పోటీ ధరలకు ఉత్పత్తిచేసేలా భారతీయ కంపెనీలను ప్రోత్సహించాలి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వస్తున్నప్పుడు సహజంగానే ఎగుమతులు పెరుగుతాయి. స్వేచ్ఛా వాణిజ్యానికి పరిస్థితులు అనుకూలంగాఉంటాయి. ప్రపంచీకరణ విధానాల మంచి చెడ్డలు, వాటి భావి పర్యవసానాల గురించి ఆనాడే నేను ఊహించింది పూర్తిగా సరియైనదేనని రుజువయింది. రెండున్నర దశాబ్దాలకు పైగా ప్రపంచీకరణలో సగటు వృద్ధి రేటు మనం గర్వించే విధంగా పెరగలేదు. కొత్త సాంకేతికతల సృష్టిలో మనం ఇప్పటికీ వెనుకబడివున్నాం. కొత్త ఉద్యోగాలను సృష్టించలేకపోతున్నాం. వ్యవసాయరంగంలో పరిస్థితులు బాగా క్షీణించాయి. రైతులు అనేక సమస్యలతో సతమతమవుతూ జీవనోపాధికి పట్టణాలు, నగరాలకు వలసపోతున్నారు. రెండు దశాబ్దాల క్రితం నేను చేసిన ఆ వాదనలకు ఇప్పటికీ ఉపయుక్తత ఉన్నది. కనుక వాటిని మరింత గట్టిగా పునరుద్ఘాటిస్తున్నాను. నేడు బహుళజాతి కంపెనీలు తిరిగి అమెరికాకు వెళ్ళిపోతున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెద్దగా రావడం లేదు. వచ్చే సూచనలు కూడా కన్పించడం లేదు. అమెరికా ఉత్పత్తిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు డొనాల్డ్ ట్రంప్ మరింతగా సంరక్షణ విధానాలను ప్రవేశపెట్టే అవకాశమున్నది. ఆ విధానాలు అమలవుతున్న కొద్దీ మన ఆర్థిక వ్యవస్థకు సమస్యలు పెరుగుతాయి. మన యువజనుల అమెరికా స్వప్నాలు ఫలించే అవకాశం ఎంత మాత్రం ఉండదు. చెప్పవచ్చిందేమిటంటే గత రెండు దశాబ్దాలుగా పెద్దగా ఏ మేలు చేయని ప్రపంచీకరణ వచ్చే దశాబ్దంలో కూడా ఎటువంటి మేలు చేసే అవకాశం లేదు.

మనం మన విధానాలను మార్చుకోవాలి. విధిగా కొత్త విధానాలను అనుసరించాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆరాటపడకుండా దేశంలోనే మదుపులు చేసేలా మన వ్యాపారవేత్తలను ప్రోత్సహించాలి. మూలధనం లేక పోవడం మన సమస్య కాదు. మనకు అపారంగా మూల ధనం ఉన్నది. మన వ్యాపారవేత్తలు విదేశాలలో భారీగా మదుపులు చేయడమే ఇందుకు నిదర్శనం. చౌక దిగుమతుల నుంచి రక్షణ కల్పించడం జరిగితే అధునాతన సాంకేతికతలను సమకూర్చుకోవడానికి వారు ఏ మాత్రం వెనుకాడరు. విదేశాలకు మన సహజ సంపదలను ఎగుమతి చేయడానికి బదులు మన ప్రజలు వాటిని మరింత అధికంగా వినియోగించుకొనేలా చేయాలి. స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలకు విరుద్ధంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు పరుస్తున్న సంరక్షణ విధానాలు మనకు పరోక్షంగా లబ్ధిని సమకూర్చేవని చెప్పవచ్చు. ఆ విధానాల పర్యవసానంగా మన ప్రభుత్వం బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకు గాక, దేశ ప్రజల సంక్షేమానికి అధికప్రాధాన్యమివ్వడం అనివార్యమవుతుంది.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

11వ పీఆర్‌సీ కమిషన్ వేస్తాం

ఏపీ ఎన్జీవోల సంఘానికి సీఎం హామీ

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ కోసం 11వ పీఆర్‌సీ కమిషన్ వేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. ఇందుకు సంబంధించి విధివిధానాలపై ఆర్థికశాఖతో త్వరలో చర్చిస్తానని ఏపీ ఎన్జీవోల సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాల్సి ఉందన్నారు. విభజన చట్టంలోని హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రాల్లో సాయంత్రం 4 నుంచి 6 వరకు ఏపీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహిస్తారు.

మూడూ ఏకగ్రీవం

రాజ్యసభ ఎన్నికల బరిలో ముగ్గురే

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి రాజ్యసభకు జరగాల్సిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం మూడు సీట్లకు ముగ్గురే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో పోటీ లేదని తేలిపోయింది. టీడీపీ రెండు సీట్లకు, వైసీసీ ఒక సీటుకు నామినేషన్లు దాఖలు చేశాయి. వైసీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి డమ్మీఅభ్యర్థిగా ఆయన సతీమణి ప్రశాంతి కూడా నామినేషన్ వేశారు. టీడీపీ అభ్యర్థులు సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్ సోమవారం కోలాహలంగా నామినేషన్లు వేశారు.



సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రతో చంద్రబాబు




జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దంపతులు గుంటూరు జిల్లా కాజ గ్రామంలో సొంతింటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకే అమరావతిలో ఇల్లు నిర్మిస్తున్నానని, పార్టీ కార్యాలయాన్ని కూడా సమాంతరంగా నిర్మిస్తానన్నారు.

దక్షిణాది సొమ్ములతో ఉత్తరాదికి సోకులు!

- మేం దేశంలో అంతర్భాగం కాదా?
- సెంటిమెంట్‌తో నిధులు రావన్నారుగా?
- మరి.. తెలంగాణ రాష్ట్రాన్ని ఎలా ఇచ్చారు?
- శాసన మండలిలో చంద్రబాబు ఉద్ఘాటన

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల పన్నులతో ఉత్తరాది రాష్ట్రాలను అభివృద్ధి చేస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. దక్షిణ భారతదేశం నుంచి పన్నుల రూపంలో డబ్బులు కేంద్రానికి ఎక్కువగావస్తాయని, కేంద్రం మాత్రం ఉత్తర భారతదేశానికే ఎక్కువ ఖర్చు చేస్తోందన్నారు. 'మీరు అభివృద్ధి చెందుతున్నారు' అంటూ రాష్ట్రానికి సహాయం చేయకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తీరు బాధాకరమని... ఆ తర్వాత రాష్ట్రంపై చిన్నచూపు చూస్తుంటే మరింత బాధ వేస్తోందని అన్నారు. బీజేపీ కూడా కాంగ్రెస్ లాగా చేస్తే ఏమాత్రం మంచిది కాదన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం శాసన మండలిలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రత్యేక హోదాతోపాటు రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన 18 హామీలను అమలు చేయాల్సిందే అని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వ తీరును దునుమాడారు. "హక్కుల కోసం పోరాడతాం. రాజీ పడేది లేదు. ప్రత్యేక హోదాతో సహా విభజన చట్టంలో పేర్కొన్నవన్నీ సాధించేదాకా వెనక్కి తిరిగి చూసేది లేదు. ఎంతదాకానైనా వెళతాం" అని ఉద్ఘాటించారు. ఆయా అంశాలపై చంద్రబాబు స్పందన ఆయన మాటల్లోనే...

తెలంగాణకు, ఇతర రాష్ట్రాలకు ఉన్నట్లుగా నవ్యాంధ్రకు కూడా ఒక రాజధాని నగరం కావాలి. ఏపీకి రాజధాని అవసరంలేదా? ఏపీకి ఉదారంగా కేంద్ర సంస్థలు ఎందుకు మంజూరు చేయరు? ఏపీ భారత దేశంలో భాగం కాదా? కేంద్రం ఇచ్చిన నిధులకు యూసీలు పంపలేదనడం సరికాదు. ప్రధానమంత్రి మోదీ తిరుపతి సభలో... కాంగ్రెస్ పార్టీ తల్లిని చంపి బిడను బతికించిందని అన్నారు. తల్లిని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



సెంటిమెంటుతో రాష్ట్రం ఇచ్చారుగా?

సెంటిమెంట్‌తో నిధులు రావని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించడం బాధాకరం. ఏం... తెలంగాణ ప్రజల సెంటిమెంట్ కోసం రాష్ట్రాన్ని విభజించలేదా? హోదా ఏపీ హక్కు. అది రాష్ట్రానికి ఇచ్చి తీరాల్సిందే. ప్రత్యేక హోదా, రాయితీలు ఇవ్వలేమని జైట్లీ నిర్మొహమాటంగా ప్రకటించారు. అందుకే కేంద్రం నుంచి వైదొలిగాం. ప్రత్యేక హోదా ఇవ్వకూడదని తాము చెప్పలేదని 14వ ఆర్థిక సంఘం సభ్యుడు గోవిందరావు స్పష్టంచేశారు. కేంద్రం చట్టాన్ని గౌరవించాలి. హామీలు నిలబెట్టుకోవాలి.

మా డబ్బులేంటి?

బీజేపీ నేతలు హామీలు నెరవేర్చకుండా ఎదురుదాడి చేస్తున్నారు. సిమెంటు రోడ్లకు 'మా డబ్బులు ఇచ్చాం' అంటున్నారు. మా డబ్బులు, మీ డబ్బులు అని ఏవీ ఉండవని గుర్తు పెట్టుకోవాలి. ఇక్కడి ప్రజలు పన్నులు కడితే 42 శాతం వాటా రాష్ట్రానికి ఇస్తారు. కేంద్రం 58 శాతం పెట్టుకుంటుంది. దక్షిణ భారత దేశం నుంచి వసూలయ్యే పన్నులే ఎక్కువ. కేంద్రం మాత్రం ఉత్తర భారతదేశంలో ఎక్కువ నిధులు ఖర్చు చేస్తోంది.

లోపాల పుట్టగా చట్టం...

విభజన చట్టంలోని లోపాల వల్ల ఎంతో నష్టపోతున్నాం. రాష్ట్రంలో ఉన్న పలు పరిశ్రమల నుంచి రావాల్సిన ఆదాయం కూడా తెలంగాణకు వెళ్తోంది. కృష్ణపట్నం పోర్టు వల్ల ఆదాయమూ కోల్పోతున్నాం.

విద్యా రంగంలో నలభై ఏళ్లలో జరగని మార్పులు ఈ రెండు దశాబ్దాల్లోనే జరిగాయంటే అతిశయోక్తికాదు. ఈ మార్పులు పాఠ్యపుస్తకాలు, బోధనల్లోనే కాకుండా బోధించే బోర్డుల్లోనూ రావడం విశేషం. ఒకప్పుడు చదువు అంటే విద్యార్థిని స్కూల్‌లో వేస్తే సరిపోయేది. ఇప్పుడు పరిస్థితి మారింది. రకరకాల సిలబస్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు ఏవో ఒకటి రెండు పెద్ద పట్టణాల్లో తప్ప అంతగా అందుబాటులో లేని పరీక్షా బోర్డులు ఇప్పుడు టూటైర్, త్రీటైర్ సిటీలకు కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం పాఠశాలల అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. ఏయే బోర్డులు, సిలబస్‌లు అందుబాటులో ఉన్నాయో తెలిస్తే తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవడం సులువు అవుతుంది.

ఏ సిలబస్ బెస్ట్..?



సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)

దేశంలో అత్యధిక మంది విద్యార్థులు చదువుకుంటున్న బోర్డుల్లో ఇది ఒకటి. దేశవ్యాప్తంగా 2017 సంవత్సరంలో ఈ బోర్డు నుంచి టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థుల సంఖ్య దాదాపుగా ఇరవై లక్షలు. 1962లో సిబిఎస్ఇ బోర్డు ప్రారంభం అయినప్పుడు కేవలం 302 పాఠశాలలు ఈ బోర్డు పరిధిలో ఉండగా 2017 అకడమిక్ ఇయర్ ప్రారంభం నాటికి 19,316 పాఠశాలలు దీని పరిధిలో అనుమతి పొంది ఉన్నాయి. ఇవి కాకుండా 25 దేశాల్లో మరో 211 సిబిఎస్ఇ పాఠశాలలు ఉన్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇండియా సెకెండరీ స్కూల్ ఎగ్జామినేషన్, పన్నెండో తరగతి విద్యార్థులకు ఆల్ ఇండియా సీనియర్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ పరీక్షలను సిబిఎస్ఇ నిర్వహిస్తుంది.

అనుకూలతలు

- నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ రూపొందించిన ప్రామాణిక పుస్తకాలను కరికులమ్‌లో ఉపయోగిస్తారు.
- ఈ సిలబస్‌తో ఉండే లాభం ఏమంటే 'జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ), నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్) తదితర పరీక్షల సిలబస్ అంతా దాదాపుగా సిబిఎస్ఇ సిలబసే. ఇదేకాకుండా చాలా పోటీ పరీక్షల సిలబస్‌ను సిబిఎస్ఇ పుస్తకాల ఆధారంగా రూపొందిస్తారు.
- 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్' ద్వారా వచ్చే ఈ సర్టిఫికెట్‌కు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంటుంది. తరచుగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీలు లేదా ఇతర కారణాల వల్లే మారే వ్యక్తుల పిల్లలకు ఇది ఉపయోగకరం.

ప్రతికూలతలు

- సిబిఎస్ఇ టీచింగ్ విధానం చాలా వరకు థియరిటికల్‌గా ఉంటుంది. నిజజీవిత విధానాలతో దీనిని పోల్చుకుని అర్థం చేసుకోవడం కష్టం.

ఇంటర్నేషనల్ బాక్యులరేట్ (ఐబి)

- అనలిటికల్ స్కిల్స్, లాంగ్వేజ్, భాష, హ్యూమానిటీస్ మొదలైన వాటిపై ఇంటర్నేషనల్ బాక్యులరేట్ (ఐబి) ఎక్కువ దృష్టిపెడుతుంది.
- ఐబి మూడు స్థాయిల్లో ఉంటుంది.
- ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు చదివే విద్యార్థులకు ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ (పివైపి),
- ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు మిడిల్ ఇయర్స్ ప్రోగామ్ (ఎంవైపి)
- పదకొండు నుంచి 12 తరగతుల వరకు చదివే వారి కోసం ఐబి డిప్లొమా ప్రోగ్రామ్ (ఐబిడిపి)

అనుకూలతలు

- క్లాసు రూమ్‌లో ప్రశ్నలు అడగడాన్ని, విద్యార్థుల మధ్య చర్చలను ప్రోత్సహిస్తారు. విద్యార్థులు సొంతంగా నేర్చుకునేలా తయారు చేస్తారు.
- ఒక సబ్జెక్టును విద్యార్థి అత్యున్నత స్థాయిలో చదవాలనుకుంటాడా, లేక స్టాండర్డ్ స్థాయిలో చదవాలనుకుంటాడా... అని చూసి అందుకు అనుగుణమైన విధానాన్ని ఐబి అందిస్తుంది. స్టాండర్డ్ స్థాయిలో చదవాలనుకునే విద్యార్థికి సబ్జెక్టు ముఖ్య విషయాలను మాత్రమే చెబుతారు. అయితే ఉన్నత స్థాయిలో చదవాలనుకునే విద్యార్థులకు లోతుగా బోధిస్తారు. తరగతి గదిలో 25 మంది విద్యార్థుల కంటే ఎక్కువ మంది ఉండడానికి ఐబి కరికులమ్ అనుమతించదు. విద్యార్థులు, ఉపాధ్యాయుల చర్చకు ఈ సంఖ్య అనువుగా ఉంటుందని భావిస్తుంది.

ప్రతికూలతలు

- విదేశాల్లో ఇది బాగా ప్రాచుర్యం పొందింది. మన దేశానికి ఇటీవల కాలంలోనే పరిచయం అయింది.
- ఇతర బోర్డులతో పోలిస్తే దీనికి సంబంధించిన ఫ్యాకల్టీ లభించడం కష్టం.
- ఐబి పాఠశాలల ఫీజు చాలా ఎక్కువ.

సెకెండరీ స్కూల్ సర్టిఫికెట్ (ఎస్ఎస్‌సి)

ఆయా రాష్ట్రాలు తమ పరిధిలోని స్కూళ్లలో అనుసరించే సిలబస్‌ను సంబంధిత ఎస్ఎస్‌సి (సెకెండరీ స్కూల్ సర్టిఫికెట్) బోర్డు రూపొందిస్తుంది.

అనుకూలతలు

- భారతదేశంలోని రాష్ట్రాలన్నీ కూడా దాదాపుగా తమకు ప్రత్యేకమైన బోర్డును పెట్టుకున్నాయి. ఇవి వివిధ రకాల సామర్థ్యాలు ఉన్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని సిలబస్‌ను రూపొందిస్తాయి.
- ఆయా రాష్ట్రాల చరిత్ర, భాషలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి వీటి ద్వారా వీలు అవుతుంది.
- ఇతర బోర్డులతో పోలిస్తే వీటి ఫీజులు చాలా తక్కువగా ఉంటాయి.

ప్రతికూలతలు

- ఇతర కరికులమ్‌తో పోల్చినప్పుడు సిలబస్ సంపూర్ణంగా ఉన్నట్లు అనిపించదు. ప్రాక్టికల్ అప్లికేషన్ ఆఫ్ నాలెడ్జ్ మీద ఇక్కడ అంత ఫోకస్ ఉండదు.
- క్లాసురూములో విద్యార్థుల సంఖ్య ఎక్కువ. వీటిలో పరిమితులు ఉన్నా పెద్దగా పట్టింపు ఉండదు. దీని వల్ల ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయుడు సరిగా దృష్టిపెట్టలేడు.

ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (ఐసిఎస్ఇ)

దేశంలోని విద్యార్థులు చదివే ప్రధాన బోర్డులలో ఐసిఎస్ఇ బోర్డు ఒకటి. 2017 సంవత్సరం నాటికి దేశ వ్యాప్తంగా 2106 (పదో తరగతి), 908 (12వ తరగతి) ఐసిఎస్ఇ స్కూల్స్ ఉన్నాయి. దాదాపు రెండున్నర లక్షల మంది విద్యార్థులు 2017 సంవత్సరంలో టెన్త్ (ఐసీఎస్ఈ), ఇంటర్ (ఐఎస్‌సీ) పరీక్షలు రాశారు. పాఠశాల విద్యార్థుల మానసిక పరిణతిని దృష్టిలో పెట్టుకుని సిలబస్‌ను రూపొందించుకునేలా పాఠశాలలకు ఐసిఎస్ఇ స్వేచ్ఛను ఇచ్చింది. విద్యార్థులు స్వయంగా నేర్చుకోవడానికి ఈ బోర్డు సిలబస్‌లో ప్రాధాన్యం ఇస్తారు.

అనుకూలతలు

- వారి ఇష్టాన్ని అనుసరించి ఏ పాఠ్యపుస్తకాన్ని అయినా అనుసరించే స్వేచ్ఛ ఐసిఎస్ఇ పాఠశాలలకు ఉంది.
- ఐసిఎస్ఇలో చాలా రకాలైన సబ్జెక్టులు అందుబాటులో ఉంటాయి.
- ఈ బోర్డులో విచారణ ఆధార లెర్నింగ్ ఉంటుంది. అంతేకాకుండా ఇది విద్యార్థులకు భాషపై పట్టు ఉండే విషయంలో ఎక్కువ దృష్టిపెడుతుంది.
- ఒక నిర్మాణాత్మకమైన సమాచారం, భాష, ఆర్ట్స్, సైన్స్‌లపై సమదృష్టి ఉంటుంది.
- పై తరగతులకు వెళుతున్నప్పుడు సబ్జెక్టులను ఎంచుకోవడంలో ఉండే సరళత, నేర్చుకోవడంలో ఇబ్బందులు ఉండే విద్యార్థులు (లెర్నింగ్ డిజెబిలిటీస్) కొన్ని సబ్జెక్టులను వదిలివేయడం లేదా తమ స్థాయికి తగిన సబ్జెక్టులను ఎంచుకునే సౌలభ్యం ఇందులో ఉంటుంది.

ప్రతికూలతలు

- 2018-19 అకడమిక్ ఇయర్ నుంచి అమలులోకి వచ్చే కొత్త పరీక్షా నిబంధనలు 5, 8 తరగతులు చదివే విద్యార్థులపై మరింత ఒత్తిడి పెంచేలా ఉన్నాయి.

కేంబ్రిడ్జి అసెస్‌మెంట్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (సిఏఐఇ)

ఇంటర్నేషనల్ జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (ఐజిసిఎస్ఇ), ఓ లెవెల్, ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఏ లెవల్, ప్రి యూనివర్సిటీ ఎగ్జామ్‌లను సిఏఐఇ అందిస్తుంది.

అనుకూలతలు


- సాధారణంగా సిఏఐఇ పరీక్షలు మే, జూన్ నెలలో నిర్వహిస్తారు. అయితే భారతీయ విద్యార్థుల కోసం వీటిని మార్చి నెలలో నిర్వహించే వెసులుబాటును సిఏఐఇ ఇచ్చింది. దీని ద్వారా ఈ విద్యార్థులు కూడా ఇతర బోర్డు విద్యార్థులతో సమానంగా ఫలితాలను పొంది వివిధ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందడానికి వీలు అవుతుంది.
- విద్యార్థులు తమ అభిరుచులు, ఆలోచనలు, కెరీర్ ఆసక్తులకు అనుగుణంగా సబ్జెక్టులు ఎంచుకోవచ్చు.

ప్రతికూలతలు

- ఈ పాఠశాలల సంఖ్య తక్కువ. ఫీజులు చాలా ఎక్కువ. దీంతో అందరికీ అందుబాటులో ఉండే అవకాశం తక్కువ.

భారత్-ఇరాన్.. చిరకాల మైత్రి

ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ భారత్‌లో పర్యటించారు. రౌహానీ పర్యటనలో ఇరు దేశాల మధ్య వ్యాపారం, ఇంధనం, భద్రతా రంగాల్లో సహకారం తదితర అంశాలకు సంబంధించి తొమ్మిది ఒప్పందాలు కుదిరాయి. అంతేకాకుండా రౌహానీ పర్యటనలో పలు కీలక అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. భద్రతా మండలిలో భారత్ సభ్యత్వానికి ఇరాన్ మద్దతు వంటివి. ఈ నేపథ్యంలో రౌహానీ పర్యటన విశేషాలతోపాటు కుదిరిన ఒప్పందాల్లోని ముఖ్యాంశాలు..



ఆర్థిక, వాణిజ్య సంబంధాలు - ద్వంద్వ పన్నుల నివారణ

☆ ఇరు దేశాల మధ్య పెట్టుబడులు, సేవలు విస్తృత పరచేందుకు వీలుగా ద్వంద్వ పన్నుల నివారణా ఒప్పందం కుదిరింది. దీంతో పన్ను విషయాల్లో పారదర్శకత వస్తుంది. పన్ను ఎగవేతలు తగ్గుతాయి. వ్యాపార, వాణిజ్య సంబంధాల మెరుగుకు ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం, ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతాయి. ఇరానియన్ పసర్‌గడ్ బ్యాంక్ శాఖను భారత్‌లో ఏర్పాటు చేసే విషయం పరిశీలనలో ఉంది. ఇటీవల సీఐఐ ప్రాంతీయ కార్యాలయాన్ని టెహ్రాన్‌లో ఏర్పాటు చేశారు. ఇరాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయాన్ని భారత్‌లో ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. డబ్ల్యుటీఓలో ఇరాన్ సభ్యత్వానికి భారత్ మద్దతునిస్తోంది. వాణిజ్య రంగంలో పరస్పర విశ్వాసం పెరిగేలా దిగుమతులు, కౌంటర్‌వెయిలింగ్ అంశాల్లో ఎటువంటి అపోహలకు తావు లేకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తారు.

పౌర సహకారం - వీసాలు

☆ దౌత్యపరమైన పాస్‌పోర్టులు ఉన్నవారు ఈ రెండు దేశాల్లో పర్యటించేందుకు వీసా అవసరం లేకుండా మినహాయింపునిస్తారు. నాగరికత, సాంకేతికపరంగా ఇరు దేశాలను బలోపేతం చేసేందుకు వివిధ స్థాయిల్లో చర్చలను చేపడతారు. అందులో భాగంగా 2018 - 19లో ఇరాన్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాను నిర్వహిస్తారు. టెహ్రాన్ యూనివర్సిటీలో చైర్ ఆఫ్ ఇండియన్ స్టడీస్‌ని ఏర్పాటు చేస్తారు. భారత్‌లో పర్షియన్ భాషా కోర్సులను ప్రోత్సహిస్తారు. రక్షణ విభాగానికి సంబంధించి నౌకాశ్రయాల్లో నౌకలు, శిక్షణ, రక్షణ, నిపుణుల నిరంతర అభ్యాసాలు తదితర అంశాల్లో సహకారానికి చర్చలు జరుపుతారు. ఖైదీల అప్పగింతపై ఇరు దేశాల మధ్య 2008లోనే అవగాహన కుదిరింది. దాన్ని అమలు చేస్తారు.

ఇతర అంశాలు

☆ వ్యవసాయ పంటలు, ఉద్యానవనం, యంత్రాలు, విత్తనాలు, పాడి పరిశ్రమ అభివృద్ధికి సాంకేతికంగా సహకరించుకోవడం, అనుభవం, పరిజ్ఞానం, ఈ కామర్స్ / లాజిస్టిక్స్ సేవల్లో సహకారానికి నిపుణులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయడం, పరిశోధన, వైద్య విద్య బోధన, చికిత్స, ఔషధ పరికరాలు వంటి అంశాల్లోనూ ఒప్పందాలు కుదిరాయి.

భారత్‌కు మద్దతు

☆ ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా భద్రతా మండలిలో చేయాల్సిన మార్పులను ఇరు దేశాలు ప్రస్తావించాయి. భద్రతా మండలిలో భారత్ సభ్యత్వానికి ఇరాన్ మద్దతును ప్రకటించింది. అదేవిధంగా ఇరాన్‌లోని ఫర్జద్ బీ ఆయిల్ గ్యాస్ క్షేత్రంపై భారత్ ఆసక్తి చూపింది. భారత్, ఇరాన్‌కి రెండో అతిపెద్ద చమురు కొనుగోలుదారు. ఈ నేపథ్యంలో చమురు, ఇతర వాణిజ్య కార్యకలాపాలను పర్యవేక్షించే ఆసియన్ క్లియరింగ్ యూనియన్‌ను పునరుద్ధరించడానికి ప్రిఫరెన్షియల్ ట్రేడ్ అగ్రిమెంటును పరిశీలించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

ఉత్తర - దక్షిణ కారిడార్‌లో ఇరు దేశాలు

☆ భారత్ ప్రతిపాదించిన అంతర్జాతీయ ఉత్తర - దక్షిణ రవాణా కారిడార్ నిర్మాణంలో ఇరు దేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇందులో నౌక, రైలు, రోడ్డు మార్గం ద్వారా సరుకు రవాణా చేస్తారు. ఈ మార్గం పొడవు దాదాపు 7,000 కి.మీ. ఇది భారత పశ్చిమ తీరమైన ముంబైలోని అంజలీ తీరం నుంచి రష్యా తీరంలోని అస్త్రఖాన్ పోర్టు వరకు ఈ రవాణా కారిడార్‌ను నిర్మిస్తున్నారు.

సారూప్యత

☆ ఇరు దేశాల మధ్య సారుప్యత ఉన్న అంశాలు ఎన్నో ఉన్నాయి. అవి.. ఇరు దేశాలు ఉమ్మడిగా ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్లను వ్యతిరేకిస్తున్నాయి. తీవ్రవాదంపై ఉమ్మడి పోరు చేస్తున్నాయి ఇరాన్ ప్రపంచ వ్యాప్త షియా ముస్లింలకు నాయకత్వం వహిస్తుంది. భారత్‌లో కూడా అధిక సంఖ్యలో షియాలు ఉన్నారు. భారత్, ఇంధనం కోసం ఎదురు చూస్తున్న దేశం కాగా ఇరాన్ పుష్కలంగా ఇంధన వనరులు ఉన్న దేశం. ఇవన్నీ ఇరు దేశాల బంధం మెరుగవ్వడానికి దోహదం చేస్తున్నాయి.

రాజకీయంగా కూడా

☆ రాజకీయంగా కూడా ఇరాన్ పలు సందర్భాల్లో భారత్‌కు మద్దతుగా నిలుస్తోంది. పాకిస్థాన్‌కి చెందిన ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్‌కి వ్యతిరేకంగా భారత్‌కు ఇరాన్ మద్దతనిస్తుంది.

ఆర్థికాంశాలు

☆ ఇరాన్ ప్రపంచపు రెండో అతిపెద్ద సహజవాయు నిక్షేపాలు గల దేశం. అయినప్పటికీ ఎగుమతుల్లో వెనకబడి ఉంది. ఆంక్షల సడలింపుతో భారత్‌తో వాణిజ్యం పెంచుకుంటుంది. భారత్ నుంచి ఇరాన్ చమురు, సహజవాయు నిక్షేపాల్లో పెట్టుబడులు పెరుగుతున్నవి.

గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం

☆ ఇరాన్ నుంచి గ్యాస్ సరఫరా చేసేందుకు ఉద్దేశించిన ఇరాన్ - పాకిస్థాన్ - ఇండియా గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టును 7 బిలియన్ డాలర్ల వ్యయంతో ప్రారంభించారు. అయితే అమెరికా ఆంక్షలతో 2008లో ఈ ప్రాజెక్టును నిలిపివేశారు. ఈ ప్రాజెక్టు పొడవు 2,135 కిమీ. దీనిలో 1,100 కిమీ ఇరాన్‌లో ఉండగా మిగతాది పాకిస్థాన్‌లో ఉంటుంది భారత తీర ప్రాంతం నుంచి బార్మర్ వరకు దీన్ని నిర్మిస్తారు. అంతేకాకుండా భారత్ చాబహార్ పోర్టుని అభివృద్ధి చేస్తుంది. ఇది ఆఫ్ఘనిస్థాన్‌కి ప్రత్యామ్నాయ రవాణా మార్గం, మధ్య ఆసియాకి ముఖ ద్వారం.

అనుసంధానకర్తలుగా ప్రవాసులు

☆ ప్రవాస భారతీయులు ఎక్కువగా ఇరాన్‌లో ఉన్నారు. వీరు ఇరు దేశాల మైత్రికి అనుసంధానకర్తలు. 8 వేల మంది ఇరాన్ విద్యార్థులు భారత్‌లో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి భారత్ ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఈ అంశం కూడా ఇరు దేశాల సంబంధాలను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా ఈ అంశంలో మరింత సహకారం కోసం విద్యార్థుల మార్పిడి ఒప్పందం కూడా కుదిరింది.



డాక్టర్ పి.వి. లక్ష్మయ్య
(డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్)

జాబ్ కార్నర్

తెలంగాణ పోస్టల్ సర్కిల్

తెలంగాణ పోస్టల్ సర్కిల్ - గ్రామీణ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **1058** (జనరల్ వర్గానికి 559, ఓబీసీలకు 247, ఎస్సీలకు 133, ఎస్టీలకు 76, దివ్యాంగులకు 43 పోస్టులను కేటాయించారు.)
- డివిజన్లు: ఆదిలాబాద్, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, హైదరాబాద్ (సిటీ/ సౌత్ ఈస్ట్), మెదక్, సంగారెడ్డి, సికింద్రాబాద్.
- అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- వయసు: 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి
- ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
- దరఖాస్తు ఫీజు: రూ.100 (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 9
- వెబ్‌సైట్: http://appost.in/gdsonline

నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో సెక్యూరిటీ గార్డులు

నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సిఎల్) - పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **664**
- పోస్టుల వారీగా ఖాళీలు: అసిస్టెంట్ లోడింగ్ క్లర్క్ 26, క్లర్క్ 51, ట్రిప్‌మాన్ 16, క్లర్క్ (ఒఎల్) 7, అకౌంట్స్ క్లర్క్ 19, అసిస్టెంట్ క్యాషియర్ 5, స్టోర్ ఇష్యూ క్లర్క్ 7, ఫార్మాసిస్ట్ 3, డ్రెస్సర్ 8, సెక్యూరిటీ గార్డ్ 393, మైనింగ్ సిర్దార్ 36, జూనియర్ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ 21, జూనియర్ కెమిస్ట్ 9, ఆపరేటర్ 54, టెలికాం / రేడియో మెకానిక్ 7, జూనియర్ ట్రాన్స్‌లేటర్ 2
- అర్హత: 10వ తరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నియమాల ప్రకారం హిందీ ప్రభాకర్/ ప్రవేశిక / డిప్లొమా - ఫార్మసీ / సర్టిఫికెట్ ఆఫ్ మైనింగ్ సిర్దార్‌షిప్, ఫస్ట్ ఎయిడ్ అండ్ గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికెట్లు ఉండాలి. టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు బీఎస్సీ, ట్రాన్స్‌లేటర్ పోస్టులకు బీఏ (హిందీ/ ఇంగ్లీష్) / డిప్లొమా (హిందీ ట్రాన్స్‌లేషన్) ఉత్తీర్ణులై ఉండాలి. సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత.
- రాత పరీక్ష వివరాలు: ఇందులో మొత్తం 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్, స్పోర్ట్స్, డిఫెన్స్, జనరల్ సైన్స్, ఎన్‌సిఎల్‌కు సంబంధించిన సమాచారం, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్ / హిందీ, రీజనింగ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 28, 2018.
- వెబ్‌సైట్: www.nclcil.in

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

సమ్మర్ జ్యూస్

జల్ జీర

కావలసినవి:

చింతపండు (గింజలు లేనిది) - ఒక టేబుల్ స్పూన్, పుదీనా - ముప్పావు కప్పు, జీలకర్ర - ఒకటిన్నర టీస్పూన్, సోంపు - ఒక టీస్పూన్, నల్లమిరియాల పొడి - అర టీస్పూన్, ఆమ్‌చూర్ పొడి - ఒక టీస్పూన్, పెద్ద యాలక్కాయ - ఒకటి (ఇష్టపడితే), ఇంగువ - చిటికెడు (రుచి నచ్చితే), బూందీ - ఒక టేబుల్ స్పూన్, చాట్ మసాలా పొడి - ఒక టీస్పూన్ (ఇష్టపడితే), బ్లాక్ లేదా రాక్ సాల్ట్ - సరిపడా.

తయారీ:

- పుదీనా ఆకులను, చింతపండును శుభ్రంగా కడగాలి.
- బూందీని అర లేదా ముప్పావు కప్పు నీళ్లలో వేయాలి. అవి మెత్తపడిన తరువాత వడకట్టాలి. బూందీని, చాట్ మసాలాను కాకుండా మిగతా పదార్థాలని బ్లెండర్‌లో వేసి మిక్సీ పట్టాలి.
- వడకట్టిన మిశ్రమంలో నాలుగు కప్పులు లేదా సరిపడినన్ని నీళ్లు పోయాలి.
- దీన్ని ఫ్రిజ్‌లో ఉంచడం లేదా చల్లటి జల్‌జీరాను గ్లాసులో పోసుకుని తాగేయడమే తరువాయి.
- తాగేముందు నానబెట్టిన బూందీ, చాట్ మసాలాలను జల్‌జీరా మీద వేసుకుని తాగితే రుచిగా ఉంటుంది.



ఆరోగ్యం

నెయ్యి మంచిదే!



నెయ్యి అనగానే వద్దు...వద్దు అనే వారే ఎక్కువ. నెయ్యి తింటే శరీరంలో కొవ్వు పేరుకుపోతుందని చాలా మంది భయపడుతుంటారు. కానీ ఆ రోజులు ఇప్పుడు మెల్లగా 'కరిగి' పోతున్నాయి. దీనికి కారణం నెయ్యిని ఆరోగ్యకారిణిగా గుర్తించి వాడేవారు ఎక్కువవుతుండడమే. ఇంతకూ నెయ్యి ఎలా ఆరోగ్యకరమో చూద్దాం..

- పాలల్లో ప్రొటీన్ కాంపోనెంట్ కేసిన్ కారణంగా మిల్క్ ఎలర్జీలు వస్తాయనే అభిప్రాయం ఉంది. నిజానికి నెయ్యిని తయారుచేసేటప్పుడు పాలల్లో ఉండే లాక్టోస్, కేసిన్‌లు పైకి తేలతాయి. ఇలా నెయ్యిపై తేలిన వాటిని తీసేస్తారు.
- కొవ్వును కరిగించే విటమిన్లు నెయ్యిలో ఉన్నాయి. వాటిల్లో విటమిన్-ఇ, ఎ, కెలు కూడా ఉన్నాయి. ఇవి కంటి చూపును ఆరోగ్యంగా ఉంచడమే కాదు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి.
- పెద్దప్రేవు ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది.
- నెయ్యి వాడకంవల్ల శరీరంలో ఆరోగ్యకరమైన ఇన్సులిన్ ప్రమాణాలుంటాయి.
- శరీరంలోని ఇతర కొవ్వు, కలుషితపదార్థాలు సులువుగా బయటకు పోయేలా సహకరిస్తుంది.
- నెయ్యిలో విటమిన్ కె2 పుష్కలంగా ఉంటుంది. ఎముకలకు కావాల్సినంత కాల్షియంను అందజేస్తుంది కూడా.
- బ్రెయిన్ బాగా పనిచేయడానికి ఆరోగ్యవంతమైన ఫ్యాట్స్ అవసరం. అలాంటి మంచి ఫ్యాట్స్ ఎన్నో నెయ్యిలో ఉన్నాయి.
- నెయ్యి వాడకం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- ఆవునెయ్యి వాడకం ఆరోగ్యానికి మంచిది.

ప్రయత్నం



మనదేశంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొలి ఇంక్యుబేషన్ సెంటర్ 'వీ-హబ్'. మహిళల 'ఇన్నోవేషన్'కు వేదిక ఇది. సరికొత్త ఆలోచనలకు రెక్కలు తొడిగేందుకు 'వీ-హబ్' అండదండలు అందిస్తుంది. ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థకు తొలి సీఈవోగా దీప్తి రావుల నియమితులయ్యారు. 'మహిళల్లో కూడా స్టార్టప్ సంస్కృతి తేవడమే తన లక్ష్యమని, దీని ద్వారా మరింత మంది రోల్‌మోడల్స్ కచ్చితంగా తయారవుతార'ని అంటున్న దీప్తి తన ఆలోచనలను 'నవ్య'తో పంచుకున్నారు.

ఆమె కోసం

అంకురాల హబ్!



మాది మహబూబాబాద్. హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నాన్న వాసుదేవరెడ్డి ఎకనామిక్స్ ప్రొఫెసర్. అమ్మ సృజన గృహిణి. నా చదువంతా హైదరాబాద్‌లోనే సాగింది. విజ్ఞాన్‌జ్యోతి కాలేజీలో ఇంజనీరింగ్ చేశా. పెళ్లయ్యాక అమెరికా వెళ్లిపోయా. కాలిఫోర్నియాలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేశా. అయితే రాష్ట్రాన్ని, ఇక్కడి భాష, సంస్కృతిని కోల్పోతున్నా అనే బాధ నిరంతరం నన్ను వెంటాడుతూ ఉండేది. నా ఆవేదనను నాతోపాటు అక్కడే ఉంటున్న స్నేహితులు, సన్నిహితులతో పంచుకునే దాన్ని. పండగల విషయంలో ఆ బాధ మరింత ఎక్కువగా ఉండేది. 'తెలంగాణ వేరు, అమెరికా వేరు. అక్కడి పండగలు ఇక్కడ జరుపుకోలేమ'న్నారు. బతుకమ్మ పండగ అంటే నాకిష్టం. అందుకే ఎవరేమనుకుంటే నాకేంటని 2006లో తొలిసారిగా అమెరికాలో బతుకమ్మ ఆడాను. అది చూసి అక్కడి మా సమీప బంధువులే నవ్వారు. ఎగతాళి చేశారు. అయినా వెనక్కి తగ్గొద్దని నిర్ణయించుకుని ప్రతి ఏటా పట్టుదలగా అక్కడ బతుకమ్మ సంబరాలు నిర్వహించాను. క్రమక్రమంగా అక్కడ ఉండే తెలుగువారిలో ఆసక్తి, ఆదరణ పెరుగుతూ వచ్చింది. 2015లో తెలుగువారితో పాటు అమెరికన్లు సైతం వందల సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించే దిశగా...

అమెరికాలో నేను చేస్తున్న కృషిని తెలంగాణ రాష్ట్ర ఐ.టి.శాఖ మంత్రి కేటీఆర్ గుర్తించారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు. ఆయన ప్రోత్సాహంతో కాలిఫోర్నియాలో ఉద్యోగాన్ని వదిలి 2016లో హైదరాబాద్ వచ్చేశా. ప్రారంభంలో ఇక్కడ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించా. గత ఏడాది నవంబరులో జరిగిన జీఈఎస్‌లో 'వీ-హబ్' ప్రారంభిస్తామని కేటీఆర్ ప్రకటించారు. అప్పటినుంచి దీని ఏర్పాటుపై ప్రధానంగా దృష్టి సారించాం. ఆయన ఆలోచనలకు అనుగుణంగా అధికార యంత్రాంగంతో కలిసి మూడు నెలలపాటు శ్రమించి 'వీ-హబ్'ను సిద్ధం చేశాం. కీలకమైన సీఈవో బాధ్యతలను నాకు అప్పగించారు.

నిజానికి మహిళల స్టార్టప్స్‌కు సంబంధించి విదేశాల్లో చాలా అవకాశాలుంటాయి. కార్పొరేట్ కంపెనీల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేకంగా 'ఇన్నోవేషన్' విభాగాలుంటాయి. వాటి అభివృద్ధి కోసం ఫండ్స్ కూడా ఉంటాయి. వాటిల్లో మహిళలను ప్రోత్సహిస్తారు. ఉదాహరణకు శామ్‌సంగ్ కంపెనీలో ఈ విభాగంలో మూడు వేల మంది దాకా ఉంటారు. మన దగ్గర 'ఫ్రీ థింకింగ్'ను ఎక్కువగా ఎంకరేజ్ చేయరు. మహిళాభివృద్ధికి సంబంధించి నాకు అనేక ఆలోచనలున్నాయి. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించేందుకు 'వీ హబ్' కృషి చేస్తుంది. ఇప్పటికే 'టీ-హబ్'తో స్టార్టప్‌ల రంగంలో హైదరాబాద్ జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తోంది. వీ-హబ్‌ను అంతకు మించి విజయవంతం చేయాలన్నదే నా ముందున్న లక్ష్యం. ఇందుకోసం ముఖ్యంగా మూడు కార్యాచరణలను సిద్ధం చేశాం. స్కూల్స్, కాలేజీ స్థాయిలోనే 'స్టార్టప్', 'ఇన్నోవేషన్' కల్చర్‌ను విద్యార్థుల్లో అభివృద్ధి చేయాలన్నది మొదటిది ఆచరణ ప్రణాళిక. ఇప్పటికే కొత్త ఆలోచనలకు వెలుగు చూపేందుకు టీ-హబ్, టీ- వర్క్స్, టాస్క్ వంటివి ఉన్నాయి. వాటిలో మహిళా స్వరం వినిపించేందుకు 'వీ-హబ్'ను వేదికగా చేయడం... మహిళలకు ఆయారంగాల్లో పూర్తి సహకారాన్ని అందించి, వారిని వాణిజ్యవేత్తలుగా తయారుచేయడం మూడోది. ఈ మూడింటితో ముందుకు సాగుతాం.

> ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించేందుకు 'వీ హబ్' కృషి చేస్తుంది. ఇప్పటికే 'టీ-హబ్'తో స్టార్టప్‌ల రంగంలో హైదరాబాద్ జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తోంది. వీ-హబ్‌ను అంతకు మించి విజయవంతం చేయాలన్నదే నా ముందున్న లక్ష్యం.



ఎన్నో ప్రత్యేకతల వీ-హబ్..

అమెరికాతో పాటు అనేక దేశాల్లో విమెన్ ఇంక్యుబేషన్ సెంటర్స్‌ను అక్కడ ప్రభుత్వాలు కాకుండా ఆయా కంపెనీలు వేటికవే ఏర్పాటుచేస్తున్నాయి. అభివృద్ధి, పరిశోధనల విభాగంలోని మొత్తం సిబ్బందిలో 51 శాతం మంది మహిళలు ఉంటే 'విమెన్ ఇంక్యుబేషన్ సెంటర్'గా పేర్కొంటున్నారు. 'వీ-హబ్' అలా కాదు. వాటితో పోలిస్తే భిన్నమైనది, ప్రత్యేకమైనది. ఇది నూటికి నూరుశాతం మహిళల కోసం ఉద్దేశించినది. స్టార్టప్‌లకు ఇక్కడ చోటు కల్పించి, వారికి కావాల్సిన శిక్షణ, ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని అందించనున్నాం. తొలుత 50 మందికి అనుకున్నాం. సరిపోదని భావించి ఆ సంఖ్యను రెట్టింపు చేశాం.

ఏ రంగంలోనైనా సరే వినూత్న ఆలోచనలున్న ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే 'వీ-హబ్' లక్ష్యం. ఆసక్తి కలవారు ముందుగా మా అధికారిక వెబ్‌సైట్ wehub.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

'వీ-హబ్' కేవలం తెలంగాణ వారికే పరిమితం కాదు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి వారి ఆలోచనలు, వ్యాపారంపై వారికి ఉన్న అవగాహనను అంచనా వేస్తుంది. చివరగా ఎంపికైన వంద మందికి గరిష్ఠంగా ఆరునెలల వరకు వసతితో పాటు కావాల్సిన శిక్షణ, న్యాయ సలహాలు, ఆర్థిక సహకారం అందిస్తాం.

పిల్లలున్న తల్లులైనా సరే...

చిన్న పిల్లలున్నారని అనేకమంది మహిళలు తమ ఆసక్తులకు దూరమవుతారు. పసిపాపలు, చిన్న పిల్లలున్నా తల్లులైనా ధైర్యంగా దరఖాస్తు చేసుకోవచ్చు. చిన్నారుల సంరక్షణ కోసం కార్యాలయంలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దాంతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం అందించాలన్న లక్ష్యంగా ఇప్పటికే నాలుగు బ్యాంకులతో చర్చలు కూడా జరిపాం. జిల్లాల్లోనే ఎక్కడికక్కడే రుణాలు అందించేలా 'వీ-హబ్' కృషి చేస్తోంది.

విశేషమేమిటంటే 'వీ-హబ్' ప్రారంభించిన మొదటి మూడు రోజుల్లోనే 49 అప్లికేషన్లు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. వాటిని పరిశీలించి మరో నెల రోజుల్లో కార్యాచరణలోకి దిగుతాం. మనకు రోల్‌మోడల్స్ చాలా తక్కువ మంది ఉంటారు. మహిళలైతే మరీ తక్కువ. వారు కూడా కొన్ని రంగాలకే పరిమితమయ్యారు. 'వీ-హబ్'తో చాలామంది రోల్‌మోడల్స్ చూసే రోజులొస్తాయని కచ్చితంగా, నమ్మకంగా చెప్పగలను.

• మహ్మద్.ఆర్.హెచ్.షరీఫ్
ఫోటోలు: అశోకుడు

సందర్భం

గౌరవప్రదమైన మరణం కోసమే...


అది 1998 సంవత్సరం...హెచ్.బి కరిబసమ్మ టీచర్‌గా పనిచేసి రిటైరయ్యారు. అప్పట్లో ఆమె కర్ణాటక హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. అందులో....'నన్ను గౌరవంగా చనిపోనివ్వండి' అంటూ కోరారు. ఇలా ఎథునేసియా కోసం కర్ణాటకలో తొలిసారిగా కోర్టు మెట్లు ఎక్కిన మహిళ ఆమె! ఇటీవల అత్యున్నత న్యాయస్థానం పాసివ్ ఎథునేసియాకు అనుమతినిస్తూ ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఆహ్వానిస్తూనే.... దాన్ని అడ్డంపెట్టుకుని చట్టవిరుద్ధ వ్యవహారాలకు పాల్పడకుండా పకడ్బందీ స్క్రీనింగ్ కూడా అవసరమని కరిబసమ్మ అభిప్రాయపడ్డారు. ఆమె మాటల్లోనే...

'నేను కర్ణాటకలోని దేవనగెరె మహిళా వృద్ధాశ్రమంలో ఉంటున్నా. ఇప్పుడు నాకు 80 ఏళ్లు. టీచరుగా పనిచేసి రిటైరయ్యాను. నా భర్తకు నేను రెండవ భార్యను. నాకు పిల్లలు లేరు. నా జీవితంతో బాగా అలసిపోయాను. రకరకాల తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతూ బతుకును భారంగా వెళ్లదీస్తున్నాను. 1995 నుంచి నాకు మధుమేహం ఉంది. దాంతోపాటు ఆర్త్రైటిస్, కండరాల తిమ్మిర్లు, స్లిప్డ్‌డిస్కుతో బాధపడుతున్నాను. ఇవే కాకుండా, కొలెరెక్టల్ క్యాన్సర్ కూడా ఉందని వైద్య పరీక్షల్లో వెల్లడైంది. దీంతో ఈ జబ్బుల బాధలను, నొప్పులను తట్టుకోవడం నా వల్ల కాలేదు. నా బాగోగులు చూసే వాళ్లు కూడా ఎవరూ లేరు. ప్రతి నెలా నాకొచ్చే పింఛనుతో బతుకును వెళ్లదీస్తున్నా. స్లిప్‌డిస్కుతో నేను పడుతున్న నొప్పులయితే వర్ణనాతీతం. ఇది వెన్నెముకను బాగా దెబ్బతీస్తుందన్న విషయం తెలిసిందే. నాకొచ్చే ఫించను డబ్బులు నా రోగాల చికిత్సకు ఏమాత్రం సరిపోవు. ఒంటరితనం నన్ను మానసికంగా, శారీరకంగా కృంగదీస్తోంది. దాంతో రోజు రోజుకీ నాకు బతుకు మీద ఆశ సన్నగిల్లింది. అందుకే తగ్గని రోగాలతో క్షణం క్షణం ఛస్తూ బతకడం కన్నా గౌరవపూర్వకంగా మరణించడం ఉత్తమమనిపించింది. అందుకే నా జీవితానికి స్వచ్ఛందంగా ముగింపు పలకాలని నిశ్చయించుకున్నాను. అంతే దానికి సంబంధించిన విజ్ఞాపన పత్రాలను 2003 సంవత్సరం నుంచి ఎందరో అధికారులకు ఇస్తూ వచ్చాను. ఈ ఏడాది ప్రధానికి సైతం ఒక విజ్ఞాపన పత్రం పంపించాను. మేముండే గ్రామంలో నా జబ్బులకు సంబంధించిన చికిత్స అందుబాటులో లేకపోవడంతో పేద మహిళగా ఈ కేసుపై పోరాటం ప్రారంభించాను.

నేను ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం లేదు కానీ వైద్యుని సహాయంతో ఎథునేసియా (మెర్సీ కిల్లింగ్) ద్వారా జీవితానికి స్వస్తిచెప్పాలని భావించాను. దీనికి ప్రభుత్వాధికారుల అనుమతి కోరాను. ఆత్మహత్య చేసుకుని పిరికిదానిలా చనిపోకుండా జీవితంపై అన్నిరకాలుగా పోరాటం చేసి అలసి, చివరకు గౌరవపూర్వకంగా చనిపోవాలని కోరుకుంటున్నా. ఇందుకోసం నా పోరాటం కొనసాగించాను. ఇందులో భాగంగా అప్పటి భారత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్, మాజీ ప్రధాని ఎ.బి.వాజ్‌పాయ్‌లకు లేఖల ద్వారా నా పోరాటానికి మద్దతు పలకాలని కోరాను. అంతేకాదు గత ఏడాది డిసెంబరు 20న సుప్రీంకోర్టుకు, ప్రధానికి కూడా లిఖితపూర్వక విజ్ఞప్తులు చేశాను. ఇప్పుడు సుప్రీంకోర్టు పాసివ్ ఎథునేసియాకు ఆమోదం ఇవ్వడం చారిత్రాత్మకం.... కానీ మెర్సీకిల్లింగ్ క్రమాన్ని తప్పుడుగా ఉపయోగించకుండా కఠినమైన స్క్రీనింగ్ అత్యావశ్యకం.

> **నాలాగే ఎందరో...**
> సమాజంలో సీనియర్ సిటిజన్స్‌ను చాలామంది పెద్ద బర్డెన్‌గా భావిస్తున్నారు. సీనియర్ సిటిజన్లు ఆత్మహత్యకు ప్రయత్నిస్తే సెక్షన్ 309 కింద అరెస్టు చేస్తారు. ఇది వారి బాధను మరింత రెట్టింపు చేస్తుంది. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే నాలాగే ఎందరో సీనియర్ సిటిజన్లు రోగాల బాధలు పడలేక, ఇంట్లో వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక గౌరవ మరణాన్ని కోరుకుంటున్న పరిస్థితులున్నాయి.





నా అభిప్రాయం ప్రకారం ప్రతి పౌరుడికీ గౌరవకరంగా చనిపోయే హక్కు ఉంది . రెండు దశాబ్దాలకు పైగా మెర్సీ కిల్లింగ్‌పై నేను పోరాటం చేస్తున్నాను. ఇంకా చెప్పాలంటే నాకు ఏభై ఏళ్లు ఉన్నప్పటి నుంచి ఇప్పటిదాకా దీనిపై పోరాటం కొనసాగిస్తూనే ఉన్నాను. గౌరవప్రదమైన మరణం కోసం బెల్జియం, ఐర్లాండ్, స్విట్జర్లాండ్, జర్మనీ, జపాన్, కెనడా తతదితర దేశాల్లో ఎథునేసియా (అసిస్టెడ్ సూయిసైడ్)ను చట్టబద్ధం చేశారు. అలాగే భారత్‌లో కూడా అలాంటి అవకాశం ఇవ్వాలి. నా పోరాటం 65 ఏళ్లు నిండిన, అందులోనూ తీవ్ర జబ్బులతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్స్ కోసం....అలాగే రోగగ్రస్థులైన పేద సీనియర్ సిటిజన్ల కోసం....! ఇటీవలి ఎథునేసియాను ఆమోదిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వ్యక్తుల డిగ్నిటీ రైట్స్ మీద సైతం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడిస్తోంది. ఇది ఎంతైనా సంతోషదాయకం.

ఎగ్జామ్ టైమ్

అంతకుముందు.. ఆ తర్వాత!

అప్పుడే ఓ విద్యా సంవత్సరం ఠక్కున గడిచిపోయింది. మార్చి నెల వచ్చేసింది. ఎండ వేడితో పాటు పరీక్షల సెగ ఇప్పుడు విద్యార్థులను కలవరపెడుతోంది. ముఖ్యంగా పదో తరగతి పరీక్షలు మొదలుకానున్నాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో షురూ అయ్యాయి. 'ఎలా రాస్తారో.... ఎన్ని మార్కులు వస్తాయో అని టీచర్లకే కాదు... తల్లిదండ్రులకూ టెన్షనే'! ఈ ఒత్తిళ్లన్నీ పిల్లలకూ తగిలి, పరీక్ష అంటే ఒక భూతం అనే భావన రేకత్తిస్తున్నాయి మరి పరీక్షకు ముందు, ఆ తర్వాత ఎలా ఉండాలి..... ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

యాక్షన్ ప్లాన్ ఉండాలి....!

సిలబస్‌ను ఎంత వరకూ కవర్ చేశారు? ఏం చదవక్కర్లేదు? ఈ ప్రశ్నలను మీపై మీరు సంధించుకోండి. పరీక్షలు దగ్గరకు వచ్చేశాయి కాబట్టి ఇంకా అదనంగా ఏం చదవాలి? అనే ఆలోచన రాకూడదు. వచ్చిన ప్రశ్నలను మళ్లీ మళ్లీ చదవాలి. ప్రశ్నాపత్రం ఈజీగా మీకు తెలిసినవి వస్తే ఓకే..! కానీ తెలియని వస్తే ఏం చేయాలి? ఎలా రాయాలి? అనేవి ఆలోచించి యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేసుకోండి. మీ తల్లితండ్రులు, టీచర్ల సాయంతో చేయండి.

దృష్టి పరీక్ష మీదే....!

పరీక్షలు... మీ జీవితాన్ని నిర్దేశించేవి. అందుకే ఎంతో జాగ్రత్తగా, ఏకాగ్రతతో చదవండి. మీ ఫ్రెండ్స్‌తో గొడవలు, కుటుంబ కలహాలు వీటన్నిటి నుంచి దూరంగా ఉండండి. వాటికి సంబంధించిన నిర్ణయాలు ఈ ఎగ్జామ్ సీజన్‌లో తీసుకోవడం మంచిది కాదు. ఒక్కసారి గాడి తప్పారో.... ఇక అంతే! అప్పటివరకూ చదివిందంతా మర్చిపోవడం ఖాయం.

పరీక్ష హాల్లో....!

ఎంతో టెన్షన్‌తో పరీక్ష సెంటర్‌లోకి అడుగుపెడతారు. కానీ అక్కడ మన ఏకాగ్రతను దెబ్బతీసే ఆకర్షణలూ, పరిస్థితులూ రెడీగా ఉంటాయి. సో... బి ఎవేర్. "హే.... ఈ క్వశ్చన్ చదివావా? ఇది గ్యారెంటీ అట" అంటూ మీ ఫ్రెండ్ మిమ్మల్ని అడుగుతాడు. పది నిమిషాల్లో పరీక్ష అనగా మీకూ చదవాలనిపిస్తుంది కానీ ఆ ఆలోచన మాత్రం మానుకోండి. అసలుకే ఎసరు వస్తుంది. ఒత్తిడి కారణంగా మీ కష్టమంతా వృథా అయిపోతోంది.

పోస్ట్‌మార్టమ్ వద్దు!

పరీక్ష హాల్లోంచి బయటకు వచ్చాక, 'ఈ క్వశ్చన్ రాశావా?... చాలా కష్టంగా ఉంది క్వశ్చన్ పేపర్...' ఇలా బోల్డెన్ని కామెంట్లు వినపడుతూ ఉంటాయి. అంతే కాదు.... ఎగ్జామ్ సెంటర్‌లోనే పరీక్షపై పోస్ట్‌మార్టమ్ మొదలుపెట్టేసే స్టూడెంట్స్ బ్యాచ్ ఒకటి రెడీగా ఉంటుంది. ఆ పరిసరాల్లోకి మాత్రం వెళ్లద్దు. 'నాకు గుర్తున్నంత వరకూ ప్రయత్నించాను' అనుకొని ఇంటికెళ్లి హ్యాపీగా టీవీ చూడండి. 'అంతేగానీ ఎలా రాశాం... ఏం రాశాం' అనే వాటి గురించి ఆలోచించినంత మాత్రాన గడిచిపోయిన పమయాన్ని వెనక్కి తీసుకురాలేం కదా! రేపటి కోసం ఇప్పుడు ఏం చేస్తున్నామన్నదే ముఖ్యం! ఎంజాయ్ యువర్ మూవ్‌మెంట్!



నవ్య డాక్టర్ ఆంధ్రజ్యోతి



ఏ డైట్.. కరెక్ట్?

'డైటింగ్ చేశా! దెబ్బకి సన్నబడ్డా!'..ఇది సౌమ్య మాట!

'ఏం డైటింగో? ఏంటో? బరువు తగ్గినట్టు నాకైతే అనిపించట్లేదు...డైటింగ్ శుద్ధ దండగ!'.... ఇది రమేష్ మాట!

'అదేదో డైటింగ్ అనీ, రోజుల్లోనే బరువు తగ్గొచ్చని అంటే....నేనూ ఫాలో అయ్యా! తగ్గటం తర్వాత సంగతి! నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది'.... ఇది రాధ రోదన!

వీళ్లందరూ అనుసరించింది ఒకే రకమైన డైట్ ప్లాన్! కానీ ఫలితం ఒక్కొకరికి ఒక్కోలా వచ్చింది. మరి, లోపం దేన్లో ఉంది? డైట్‌లోనా? లేక దాన్ని పాటించిన వ్యక్తుల్లోనా? నిజానికి, లోపం....'అవగాహన'లో ఉంది.

సమతులాహారంతో బరువును అదుపులో ఉంచుకోవచ్చు. ఇది అందరికీ తెలిసిన విషయమే! కానీ సమతులాహారం అంటే ఏంటి? ఏయే పోషకాలు, ఏయే మోతాదుల్లో ఉండాలి? ఆ పోషకాలు ఏ పదార్థాల్లో ఉంటాయి? ఏ కొవ్వులు శరీరంలో పేరుకోకుండా ఉంటాయి? ఏ ఆహారంతో ఏళ్ల తరబడి పేరుకుపోయిన కొవ్వును కరిగించొచ్చు? ఈ విషయాల మీద లోతైన అవగాహన మనలో చాలా మందికి ఉండదు. ఇక్కడే ఉంది అసలు చిక్కంతా! పైగా ఒకే సైజు టీ షర్ట్ అందరికీ సరిపోనట్టే, ఒకే రకమైన డైట్ ప్లాన్ అందరికీ సరిపోకపోవచ్చు. ఒకరికి ప్రొటీన్ ఎక్కువ అవసరం ఉండొచ్చు, మరొకరికి కొవ్వులు ఎక్కువ అవసరం కావచ్చు. మరికొందరికి పిండి పదార్థాలు తగుమాత్రంగా అవసరం పడొచ్చు. మరీ ముఖ్యంగా హృద్రోగులు, మూత్రపిండాల సమస్యలు, మధుమేహులకు నిర్దిష్టమైన డైట్ ప్లాన్ అవసరం పడొచ్చు. కాబట్టి బరువు తగ్గాలని ఎక్కడో చదివినది, విన్నది, ఎవరో పాటించి ఫలితం పొందిన డైట్ ప్లాన్‌ను అవగాహన లేకుండా అనుసరించటం సరి కాదు. అన్నిటి కంటే ముందు శరీర రుగ్మతల ఆధారంగా, వాడుకలో ఉన్న రకరకాల డైట్ ప్లాన్‌లు, వాటి పనితీరు, ఆ ప్లాన్‌లో తీసుకోవలసిన, తీసుకోకూడని పదార్థాల మీద అవగాహన ఏర్పరుచుకోవాలి. మరీ ముఖ్యంగా వైద్యుల పర్యవేక్షణలో, వారి సూచనల మేరకు డైట్ ప్లాన్‌ను అనుసరించాలి. రకరకాల డైట్ ప్లాన్స్, వాటి పనితీరు, అనుసరించే విధానాలు ఏవంటే...

అట్కిన్స్ డైట్

ఇది కీటోజెనిక్ డైట్‌కు ముందు వాడుకలో ఉన్న డైట్ ప్లాన్. డాక్టర్ రాబర్ట్. సి. అట్కిన్స్ అనే వైద్యుడు 1972లో ప్రతిపాదించిన డైట్ ప్లాన్ ఇది. పిండి పదార్థాలు, కొవ్వులు...మన శక్తి ఇంధనాలు. తక్కువ కొవ్వులు, ఎక్కువ పిండి పదార్థాలు ఉన్న ఆహారం తింటే, వాడుకోగా మిగిలిన పిండి పదార్థాలను శరీరం కొవ్వు రూపంలో నిల్వ ఉంచుకుంటుంది. అట్కిన్స్ డైట్ లక్ష్యం దీన్ని నియంత్రించటమే! పిండి పదార్థాలను తగ్గించటం ద్వారా చక్కెరలకు బదులుగా శరీరంలో పేరుకున్న కొవ్వును శక్తిగా ఉపయోగించటమే అట్కిన్స్ డైట్ లక్ష్యం.

పోషకాల నిష్పత్తి: 80% కొవ్వులు, 10% పిండి పదార్థాలు, 10% కొవ్వులు.

మాంసకృత్తులు: మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, రొయ్యలు, సోయా ఉత్పత్తులు

కొవ్వులు: వెన్న, చీజ్, కొబ్బరి నూనె

పిండి పదార్థాలు: కూరగాయల నుంచి వచ్చిన కార్బోహైడ్రేట్లు

మాంసకృత్తులతో కొవ్వుకు చెక్: పిండి పదార్థాలు తీసుకుంటే వాటిని శక్తిగా మార్చటం కోసం ఎక్కువ మొత్తంలో ఇన్సులిన్ అవసరం అవుతుంది. కానీ, మాంసకృత్తులకు అంత పరిమాణంలో ఇన్సులిన్ అవసరం ఉండదు. ఇక కొవ్వుకు కూడా ఇన్సులిన్ అవసరం ఉండదు. కాబట్టి అట్కిన్స్ డైట్‌లో ప్రొటీన్స్ ఎక్కువగా ఉంటాయి కాబట్టి కొద్దిగానే ఇన్సులిన్ ఉత్పత్తి అవుతుంది. దాంతో శరీరంలో కొవ్వు నిల్వ ఉండకపోగా, నిల్వ ఉన్న కొవ్వు శక్తిగా ఉపయోగపడుతుంది. దాంతో అధిక బరువు తగ్గటం మొదలవుతుంది.



కీటోజెనిక్ డైట్

లక్ష్యం: పిండిపదార్థాలకు బదులుగా, నిల్వ ఉండిపోయిన నిరర్థకమైన కొవ్వును శక్తిగా మార్చుకునేలా శరీరాన్ని ప్రేరేపించడమే కీటోజెనిక్ డైట్ లక్ష్యం. ఈ క్రమంలో, శక్తి కోసం తగినంత గ్లూకోజ్ లేనప్పుడు, మన శరీరం... తనలో నిల్వ ఉన్న కొవ్వును కరిగించుకుంటుంది. ఈ క్రమంలో 'కీటోన్స్' అనే యాసిడ్లు ఉత్పత్తవుతాయి. ఇవి మూత్రం ద్వారా వెళ్లిపోతాయి. మూత్రంలో కీటోన్స్ కనిపిస్తే, మన శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించుకుంటోందని అర్థం.

పోషకాల నిష్పత్తి: 60% కొవ్వులు, 35% మాంసకృత్తులు, 5% పిండి పదార్థాలు.

కొవ్వులు: కొబ్బరి నూనె, నెయ్యి, వెన్న, ఆలివ్ ఆయిల్ (తగుపాళ్లలో)

మాంసకృత్తులు: తోలు తీసిన కోడి మాంసం, మాంసం, చేపలు, గుడ్లు (పూర్తి), పన్నీర్, సోయా గ్రాన్యూల్స్, నగ్గెట్స్, టోఫూ (సోయా జున్ను)



పిండి పదార్థాలు: ఉల్లిపాయలు, టమేటాలు, బ్రొకోలీ, లెట్యూస్, కూరగాయలు (దుంపలు మినహా)

కొవ్వును కొవ్వుతోనే కరిగించాలి : బయటి నుంచి శరీరానికి ఆహారం ద్వారా 60% కొవ్వును ఇస్తున్నప్పుడు, శరీరంలో చక్కెరలను శక్తిగా మార్చే ఇన్సులిన్ ఉత్పత్తి కాదు. దాంతో శక్తి కోసం శరీరం నిల్వ ఉండిపోయిన కొవ్వు మీద ఆధారపడుతుంది. ఫలితంగా కొవ్వు కరగటం మొదలుపెడుతుంది. అయితే, తింటున్న కొవ్వు శరీరంలో పేరుకుపోదా? అనే అనుమానం రావొచ్చు. కానీ కీటోజెనిక్ డైట్‌లో తీసుకునే కొవ్వులన్నీ సింపుల్, మీడియం చైన్ ఫ్యాట్స్. ఇవి తీసుకున్న వెంటనే జీర్ణమై రక్తంలో కలిసిపోయే తత్వం కలిగినవి. కాబట్టి శరీరంలో పేరుకుపోతాయనే భయం అవసరం లేదు. ఇతర నూనెలు, కొవ్వు పదార్థాల్లో ఉండేవి లాంగ్ చైన్ ఫ్యాటీ యాసిడ్లు. వీటిలో శరీరంలోకి చేరే కొవ్వు కరగకుండా నిల్వ ఉండిపోతుంది. అలాగే కూరగాయలు ఉడికించి తినటం తప్పనిసరి. మాంసకృత్తులు ఎక్కువ మోతాదులో ఉంటాయి కాబట్టి తగుపాళ్లలో కూరగాయలు తినకపోతే మలబద్ధకం సమస్య తలెత్తుతుంది.

ఎంత కాలం?: కనీసం 3 నుంచి 6 నెలలపాటు అనుసరించవలసి ఉంటుంది. అయితే, మార్బిడ్ ఒబేస్, నార్మల్ ఒబేస్, అధిక బరువు...వీటిలో రకాన్ని బట్టి వ్యక్తుల కీటోజెనిక్ డైట్ కాల పరిమితిని వైద్యులు నిర్ణయిస్తారు. అనుకున్న బరువుకు చేరుకున్న తర్వాత డైట్ ప్లాన్‌లోని పోషకాల నిష్పత్తిని మళ్లీ మార్చవలసి ఉంటుంది.

ఎవరికి అనుకూలం...ఎవరికి ప్రతికూలం

మెటబాలిక్ డిజార్డర్ (థైరాయిడ్, మధుమేహం) ఉన్నవాళ్లు, స్థూలకాయులు, ఏ వయసువారైనా ఏ డైట్ ప్లాన్‌నైనా అనుసరించవచ్చు.



అయితే, మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్నవాళ్లు, గర్భిణులు, పిల్లలకు పాలిస్తున్న తల్లులు... డైట్ ప్లాన్స్ అనుసరించటం శ్రేయస్కరం కాదు.

డాక్టర్ ఎ. ఉష శ్రీ
న్యూట్రిషనిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్.

డైటింగ్...వైద్యుల పర్యవేక్షణలోనే!

ఒకరికి సత్ఫలితాన్నిచ్చిన డైట్ ప్లాన్ వేరొకరికి ప్రతికూల ఫలితాన్నివ్వొచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా పిండిపదార్థాలు, కొవ్వులు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు అంటే ఏంటి? అవి ఏయే పదార్థాల్లో ఉంటాయి? సమతులాహారంలో ఈ పోషకాల పరిమాణాల్ని ఎలా లెక్కించాలి? అనే విషయాల మీద అవగాహన ఉండాలి. అలాగే ఎలాంటి డైట్ ప్లాన్ పాటించాలని నిర్ణయించుకున్నా, అప్పటివరకూ ఒక రోజుకి మన శరీరానికి అందిస్తున్న క్యాలరీలెన్ని? వాటిలో ఏ రకమైన పదార్థాల వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతోంది? వ్యాయామంతో ఎన్ని క్యాలరీలు ఖర్చవుతున్నాయి? వీటన్నిటి లెక్క తెలిసి ఉండాలి. అలాగే శరీర రుగ్మతలు, తీసుకుంటున్న చికిత్సలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. వీటన్నిటి మీద అవగాహన ఏర్పరుచుకుంటే సరిపోదు. కొన్ని పరీక్షల ద్వారా బాడీ మాస్ ఇండెక్స్ సహాయంతో, ఒబేస్, సూపర్ ఒబేస్‌లలో ఏ కోవకు చెందిన వారో తెలుసుకోవాలి. మధుమేహులు, మూత్ర పిండాల సమస్యలున్నవాళ్లైతే అందుకు తగ్గట్టుగా డైట్ ప్లాన్‌లో మార్పులు కూడా చేసుకోవాలి. ఇవన్నీ తెలియాలంటే, ఎలాంటి డైట్ ప్లాన్ అనుసరించాలనుకున్నా, ముందుగా వైద్యుల్ని కలవాలి. వారి పర్యవేక్షణలో, వారి సూచన మేరకు పరీక్షలు చేయించుకుని డైట్ ప్లాన్ అనుసరించాలి. డైట్ చేస్తున్నంతకాలం క్రమం తప్పకుండా వైద్యుల్ని కలుస్తూ శరీరావసరాలకు తగ్గట్టు డైట్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేసుకుంటూ ఉండాలి. ఇలా వైద్యుల సహాయంతో, వారి సూచనలు క్రమం తప్పకుండా పాటిస్తూ అనుసరించగలిగితే ఎలాంటి డైట్ ప్లాన్‌తోనైనా అధిక బరువు తగ్గించుకోవచ్చు.




డాక్టర్ పి.వి. సత్యన్నారాయణ
సిటి సర్జన్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్.

వేగన్ డైట్

మాంసాహారం మినహా పూర్తి శాకాహారంతోనే బరువు తగ్గించటమే వేగన్ డైట్ లక్ష్యం. దీన్లో మాంసకృత్తులను రాజ్మా, సెనగపప్పు, పన్నీర్ మొదలైన పదార్థాల ద్వారా పొందే పద్ధతి ఉంటుంది. అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలతోపాటు, మాంసకృత్తులను అందించే పప్పులు, ధాన్యాలు ఈ డైట్‌లో ఉంటాయి.

పోషకాల నిష్పత్తి: మాంసకృత్తులు 40%, పిండి పదార్థాలు, కొవ్వులు - చెరో 30%.



మాంసకృత్తులు: కందిపప్పు, మినప్పప్పు, ఇతరత్రా పప్పు దినుసులు, పొట్టు తీయని ధాన్యాలు, నట్స్, సీడ్స్, టోఫు

కొవ్వులు: ఆలివ్, కనోలా నూనెలు, అవకాడో, నట్స్, సీడ్స్ వెన్న.

పిండి పదార్థాలు: బ్రెడ్, బార్లీ, కినోవా, ముదురు రంగు కూరగాయలు

పాలియో డైట్



ఇది కీటోజెనిక్ డైట్ లాంటిదే! కాకపోతే దీన్లో పళ్లు కూడా ఉంటాయి. పూర్తి వృక్షసంబంధ పదార్థాలు మాత్రమే తినడం ద్వారా శరీరంలో పేరుకున్న అదనపు కొవ్వును కరిగించటమే పాలియో డైట్ లక్ష్యం. మన పూర్వీకులు వేటాడి తెచ్చుకున్న జంతు మాంసం, తమకు అందుబాటులో ఉన్న పళ్లు, కూరగాయలు తిన్నట్టే, అదే విధమైన ఆహారం తీసుకోవాలి.

పోషకాల నిష్పత్తి: ఇది ప్రిమిటివ్ డైట్. కాబట్టి ఏ ఆహారం అందుబాటులో ఉంటే అవే తినాలి కాబట్టి ఈ డైట్‌లో పోషకాల నిష్పత్తికి లెక్కలు ఉండవు.

సాధారణ బరువు కంటే కొద్దిగా ఎక్కువ బరువు పెరిగిన వాళ్లకు, కీటోజెనిక్ డైట్ అనుసరించలేని వాళ్లకు అనువైన డైట్ ప్లాన్ ఇది. అయితే వీళ్లకు మధుమేహం ఉండకూడదు.

ఎవరైనా, ఎప్పుడైనా, ఎలాగైనా డైట్ చేయొచ్చు అనుకుంటే పొరపాటు. డైటింగ్‌కు ఓ పద్ధతి ఉంటుంది. ఏ ఇద్దరు వ్యక్తులూ ఒకేలా ఉండనట్టే, ఏ ఇద్దరి శరీర తత్వాలు, అవి స్పందించే తీరులూ ఒకేలా ఉండవు. అలాగే శరీర జీవక్రియల్లో కూడా తేడాలుంటాయి. కొందరు ఎంత చక్కెరలు తిన్నా బరువు పెరగరు. ఇంకొందరు కొద్దిపాటి చక్కెరకే బరువు పెరిగిపోతారు. మరీ ముఖ్యంగా, మన శరీరంలో ఎలాంటి రుగ్మతలు దాగున్నాయో వైద్య పరీక్షలు చేసేవరకూ తెలియదు. శరీరానికి సంబంధించి ఇంత క్లిష్టమైన వ్యవహారాలు ఉన్నప్పుడు, ఎక్కడో చదివిన, విన్న, చూసిన డైట్ ప్లాన్‌ను అనుసరించకూడదు. అధిక బరువు తగ్గించుకోవటం కోసం డైట్ ప్లాన్ ఎంచుకోవాలనుకుంటే, అనుభవజ్ఞులైన వైద్యుల్ని, పోషకాహార నిపుణుల్ని సంప్రదించాల్సిందే! వారి పర్యవేక్షణలో పరీక్షలు చేయించుకుని, ఫలితాలు, రుగ్మతలు, శరీర తత్వాల ఆధారంగా వాళ్లు సూచించిన డైట్ ప్లాన్ అనుసరించాలి. అప్పుడే శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆరోగ్యం చెక్కు చెదరకుండా సురక్షితమైన పద్ధతిలో, అధిక బరువును తగ్గించుకోగలుగుతాం.

ప్రకృతి వైద్యం



నువ్వులతో ... ఆరోగ్యం నవ్యంగా!

రుచి కోసమో, శక్తి కోసమో తినే నువ్వుల్లో ఔషధ గుణాలు కూడా ఎక్కువే. ప్రత్యేకించి స్త్రీలకు సంబంధించిన కొన్ని వ్యాధులను మందులతో పనిలేకుండానే నయం చేయగలిగే శక్తి వీటికి ఉంది. కాకపోతే వాటి రంగును బట్టి వాటి ఔషధ విలువల్లో కొంత తేడా ఉంటుంది. నలుపు, తెలుపు, ఎరుపు రంగుల్లో ఉండే నువ్వుల్లో నలుపు రంగు నువ్వులు వైద్యపరంగా ఎక్కువ ప్రామాణికమైనవి. నువ్వుల్ని ఏ రకంగా తీసుకున్నా, 50 గ్రాముల నువ్వుల్లోంచి శరీరానికి కావలసిన క్యాల్షియం లభిస్తుంది. మెనోపాజ్ తర్వాత ఏర్పడే క్యాల్షియం లోపాలను స్త్రీలు ఇలా పూరించుకోవచ్చు.

మొటిమలకు....

నువ్వుల నూనెకు సమానంగా ఆవు పాలు కలిపి అందులో చిటికెడు పసుపు వేయాలి. ఆ తర్వాత అదంతా పేస్ట్‌గా మారేదాకా వేడిచేయాలి. చల్లారాక ఆ పేస్ట్‌ను పట్టిస్తే, ముఖం మీదున్న మొటిమలు, బొడిపెలు తొలగిపోతాయి.

అతి మూత్రవ్యాధికి....

కొంత మంది స్త్రీలకు అతి మూత్ర వ్యాధి మొదలవుతుంది. ఆ స్థితిలో మందులతో పని లేకుండా, నువ్వుల వినియోగంతోనే ఆ సమస్యను నయం చేసుకోవచ్చు.

- 125 గ్రాముల నువ్వులకు 60 గ్రాముల గసగసాలు, 60 గ్రాముల వాము కలిపి ఒక మోస్తరుగా వేయించి ఆ తర్వాత మిక్సీలో వేసి చూర్ణం చేసుకుని గాజు పాత్రలో భద్రపరుచుకోవాలి. అందులోంచి రోజుకు రెండు సార్లు రెండు చెంచాల పొడికి కాస్తంత చిటికెడు మిశ్రి పొడి కలిపి కొద్ది రోజుల పాటు తీసుకుంటే అతి మూత్ర వ్యాధి తగ్గుతుంది.
- కొద్దిరోజుల పాటు రోజూ ఒక చెంచా నువ్వులు చిటికెడు వాము నమిలి తింటూ ఉన్నా, అతి మూత్రవ్యాధి హరిస్తుంది.

పైల్స్ సమస్యకు....

- గర్భిణిగా ఉన్నప్పుడు గానీ, ప్రసవం తర్వాత గానీ కొందరికి పైల్స్ సమస్య మొదలవుతుంది. ఇలాంటి వారు రోజూ రెండు చెంచాల నువ్వుల్ని తినేస్తే సమస్య తొలగిపోతుంది.

రుతుక్రమ దోషాలకు...

- బహిష్టు వేళల్లో కొందరికి కడుపు నొప్పి వస్తూ ఉంటుంది. అలాంటి వారు నువ్వుల కషాయంలో కాస్తంత బెల్లం వేసుకుని సేవిస్తే ఆ సమస్య ఉండదు.
- నొప్పి మరీ ఎక్కువగా వచ్చేవారు 8 చెంచాల నువ్వుల నూనెలో చిటికెడు మిరియాల పొడి, కాస్తంత బెల్లం వేసి ఆ ద్రావణం సగం అయ్యేదాకా మరిగించాలి. అది గోరువెచ్చగా మారాక, దాన్ని సేవించాలి. రోజుకు రెండు సార్లు సేవించాల్సిన ఈ ద్రావణాన్ని ప్రతిసారీ తాజాగానే తయారు చేసుకోవాలి.



అధ్యయనం

చల్లబడాలంటే వేడివి తాగాలి!

ఒళ్లు చల్లబడాలంటే విరుగుడుగా వేడిగా ఉండేవి తాగాలి. తమాషాగా అనిపించినా ఇది నిజం. యూనివర్శిటీ ఆఫ్ ఒటావా స్కూల్ ఆఫ్ హ్యూమన్ కైనెటిక్స్ చేపట్టిన అధ్యయనంలో మన శరీర ఉష్ణోగ్రత కంటే ఎక్కువ వేడిగా ఉండే ద్రవాలు తీసుకుంటే అవి స్వేదం ఉత్పత్తయ్యేలా చేసి ఒంటిని చల్లబరుస్తాయి.

ఫిట్‌నెస్

పొట్ట చదునుగా!

పొట్ట భాగంలోని కొవ్వు కరిగి చదునుగా మారాలంటే క్రాస్ క్రంచెస్ చేయాలి. ఇందుకోసం.....

- వెల్లకిలా పడుకుని, రెండు చేతులు మడిచి తల వెనక ఉంచుకోవాలి.
- కాళ్లను మడిచి పాదాలను నేల మీద ఆనించాలి.
- ఇప్పుడు కుడి మోచేతిని పైకి లేపుతూ ఏటవాలుగా వంగి మోచేతిని ఎడమ మోకాలికి తాకించాలి.
- నడుము పై భాగాన్ని లేపేటప్పుడ మడిచిన కాలునూ పైకి లేపి మోచేతికి తాకించాలి.
- కాళ్లను మడవకుండా కూడా ఈ వ్యాయామం చేయవచ్చు.
- ఇలా రెండు మోకాళ్లను కదిలిస్తూ 25 సార్లు క్రంచెస్ చేయాలి.

ఈ వ్యాయామంతో పై పొట్ట, కింది పొట్ట, పక్కటెముకల దగ్గరి కండరాలు బలపడతాయి. నడుము కూడా సన్నబడుతుంది. చేతుల్లోని కండరాలు కూడా టోన్ అవుతాయి. తొడల్లోని కొవ్వూ కరుగుతుంది.

హెల్తీ రెసిపి



శక్తి

చైల్డ్ హెల్త్



పసికందులు ఏడుస్తూనే ఉంటే..?

ప్రశ్న: మా బాబు వయసు నెల రోజులు. కానీ అందరు పిల్లల్లా పాలు తాగగానే పడుకోడు. ఏడుస్తూ ఉంటాడు. ఇలా రోజంతా ఎక్కువ సమయంపాటు ఏడుస్తూనే ఉంటాడు. రాత్రుళ్లు కొన్ని గంటలపాటే నిద్రపోతాడు. ఇది సహజమేనా, లేక బాబుకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉందని అనుకోవాలా?

కొందరు పసికందులు చక్కగా పాలు తాగుతారు, నిద్ర పోతారు, ఆడుకుంటూ ఉంటారు. ఇంకొందరు ఇందుకు భిన్నంగా ఆ పనులన్నీ సక్రమంగా చేస్తూ కూడా ఆపకుండా ఏడుస్తూ ఉంటారు. ఇందుకు ఎన్నో కారణాలుంటాయి. పసికందులు ఆకలి వేసినప్పుడు, పక్క తడుపుకున్నప్పుడు, చీమలు మొదలైన పురుగులు కుట్టినప్పుడు, చీకాకు కలిగినప్పుడు, విసుగు పుట్టినప్పుడు, అమ్మ అటెన్షన్ కోసం... ఇలా పలు రకాల కారణాల వల్ల ఏడుస్తారు. అయితే ఆ అవసరాలు తీరగానే వెంటనే ఏడుపు ఆపేస్తూ ఉంటారు. అలా కాకుండా అకారణంగా పిల్లలు ఏడుస్తూ ఉన్నారంటే వాళ్ల సమస్యను 'కాలిక్ పెయిన్'గా అనుమానించాలి. పొట్టలో నొప్పి, కడుపులో గ్యాస్ చేరుకోవడం, తల్లిపాలు పడకపోవటం, లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ వల్ల ఇది వస్తుంది. ఇలాంటి కాలిక్ పెయిన్‌తోపాటు విరేచనాలు, వాంతులు కూడా కనిపిస్తే వెంటనే వైద్యులకు చూపించాలి. పాల అలర్జీ ఉంటే తల్లి పాలు, పోత పాలు మానేసి వైద్యులు సూచించిన మిల్క్ పౌడర్ వాడాలి. ఈ స్థితి కొన్ని నెలలపాటు వేధించి సర్దుకుంటుంది. అరుదుగా కొందరిలో కొన్నేళ్లపాటు కొనసాగుతుంది. ఏదేమైనా పసికందులు ఆపకుండా ఏడుస్తూ ఉంటే పిల్లల వైద్యులను సంప్రతించటం అన్ని విధాలా శ్రేయస్కరం.



డాక్టర్ దినేశ్ కుమార్ చిర్ల,
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్.

సెక్సాలజీ

కలుస్తున్నా... కలగట్లేదేం?



ప్రశ్న: ఎటువంటి కుటుంబ నియంత్రణ పద్ధతులూ పాటించకుండా లైంగికంగా దగ్గరయినా నేను గర్భం దాల్చలేకపోయాను. ఇందుకు కారణం ఏమై ఉంటుంది? సంతానం కలగడం కోసం ఇంకొంత కాలం ఎదురు చూడొచ్చా? లేక వెంటనే కలవాలా?

ఆరోగ్యకరమైన జంట ఎటువంటి కుటుంబ నియంత్రణ పద్ధతులూ అవలంబించకుండా లైంగికంగా పాల్గొంటూ ఉంటే ఏడాదిలోపే గర్భం దాల్చటం ఖాయం. ఇలా జరగలేదంటే దంపతుల్లో ఒకరికి లేదా ఇద్దరికీ లోపం ఉందని అర్థం. చాలామంది దంపతులు గర్భధారణకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వరు. అసలు గర్భం దాల్చడంలో కూడా ఇబ్బందులుంటాయనే విషయాన్ని అంగీకరించరు. కానీ నిజానికి ప్రతి తొమ్మిది జంటల్లో ఒకరికి గర్భ ధారణ సమస్యలుంటాయి.

ఏం చేయాలి?: సంవత్సరం నుంచి గర్భం దాల్చాలని మీరు చేసిన ప్రయత్నాలు విఫలమైనా, 35 ఏళ్లు దాటి ఉండి, ఆరు నెలలుగా గర్భధారణకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోయినా వెంటనే వైద్యుల్ని సంప్రతించాలి. వైద్యులు స్త్రీపురుషులిద్దరికీ పరీక్షలు చేస్తారు. స్త్రీలల్లో అండం విడుదల, పురుషుల్లో శుక్ర కణాల పరిమాణం, నాణ్యత, చురుకుదనాలను పరీక్షల్లో గుర్తించి, లోపాలను చికిత్సతో సరి చేస్తారు. ఒకవేళ అప్పటికీ పిల్లలు కలగకపోతే ఫెర్టిలిటీ నిపుణుల సహాయం తీసుకోవలసి ఉంటుంది. వాళ్లు మాత్రమే లోతైన పరీక్షలతో గర్భధారణకు అడ్డు పడుతున్న విషయాలను కనిపెట్టగలుగుతారు.



డా షర్మిలా మజుందార్,
చీఫ్ సెక్సాలజిస్ట్ అండ్ సైకోఅనలిస్ట్,
Email :mili77@gmail.com
(కన్సల్టేషన్ కోసం)

అపోహ - వాస్తవం

హార్మోన్ సమస్య వాళ్లకేనా?

అపోహ: హార్మోన్ల సమస్యలు మధ్యవయసులోనే మొదలవుతాయి! మిగతా వయసుల్లో తలెత్తే అవకాశమే లేదు.

వాస్తవం: ఇది నిజం కాదు. పుట్టిన పసికందులతో సహా ఏ వయసు వాళ్లలోనైనా హార్మోన్లలో హెచ్చుతగ్గులు తలెత్తవచ్చు.

హెల్తీ రెసిపి



శక్తినిచ్చే లడ్డు

కొన్ని సార్లు భోజనానికీ, భోజనానికీ మధ్యలో నీరసంగా అనిపిస్తుంది. అలాంటప్పుడు తక్షణ శక్తినిచ్చే పదార్థాలు తినాలి. ఆ కోవకు చెందిన శ్నాక్స్‌లో బలవర్ధకమైన 'ఆప్రికాట్ లడ్డు' ఒకటి. శక్తినిచ్చే ఈ లడ్డు ఎలా తయారు చేయాలంటే...

కావలసిన పదార్థాలు:
ఎండు ఆప్రికాట్ - అర కప్పు
ఎండు ద్రాక్ష - అర కప్పు
బాదం - పావు కప్పు
వాల్‌నట్స్ - పావు కప్పు
పచ్చికొబ్బరి కోరు - 3 టేబుల్ స్పూన్లు
వెనీలా ఎసెన్స్ - కొన్ని చుక్కలు
ఫ్లాక్స్ సీడ్ పౌడర్ - 1 టేబుల్ స్పూను
దాల్చినచెక్క పొడి - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం:
- వెనీలా ఎసెన్స్ మినహా మిగతా పదార్థాలన్నీ ఫుడ్ ప్రాసెసర్‌లో వేసి తిప్పాలి.
- తర్వాత వెనీలా ఎసెన్స్ వేసి కలపాలి.
- పై పదార్థాలన్నీ తీపిగానే ఉంటాయి కాబట్టి, అదనంగా చక్కెర కలపాల్సిన అవసరం లేదు. ఒకవేళ తీపి ఎక్కువ కావాలనిపిస్తే రెండు టీస్పూన్ల తేనె కలుపుకోవచ్చు.
- చివర్లో లడ్డుగా చుట్టి ఎండు కొబ్బరి కోరులో దొర్లించాలి.
- వీటిని గాలి చొరబడని డబ్బాలో ఉంచి, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే కొన్ని వారాల వరకూ పాడవకుండా ఉంటాయి.

మరణంతో బాధకు ఫుల్‌స్టాప్!

కొన్ని సార్లు మరణం జీవితాన్ని కాదు, బాధను అంతం చేస్తుంది! కాబట్టే కొందరు మరణాన్ని కోరుకుంటారు! కొన్ని అనివార్య పరిస్థితుల్లో, ఊపిరి ఉన్నంతకాలం జీవచ్ఛవంలా బతికే బదులు మరణాన్ని స్వాగతించడమే ఉత్తమం అనిపిస్తుంది. ఇలాంటి అభాగ్యుల మరణేచ్ఛను గౌరవిస్తూ, తాజాగా సర్వోన్నత న్యాయస్థానం కారుణ్య మరణాల్లో పాసివ్ యుథనేషియా (సహజ కారుణ్య మరణం)కు సమ్మతించడంతో, అందుకు అర్హులైన అభాగ్యులకు ఊరట లభించినట్లైంది. కారుణ్య మరణాలు ఎంతవరకూ సమంజసం? తాజా తీర్పు దుర్వినియోగమయ్యే అవకాశాలు ఎంతవరకూ ఉన్నాయి? యుథనేషియా గురించి వైద్యులేమంటున్నారు?

కారుణ్య మరణం అంటే?

ప్రమాదాల్లో లేదా తీవ్రమైన వ్యాధుల్లో బ్రెయిన్ డెత్‌కు గురై, లేదా శాశ్వత కోమాలోకి వెళ్లిపోయిన వాళ్లను వెంటిలేటర్, కృత్రిమ వైద్య పరికరాలతో సజీవంగా ఉంచుతూ ఉంటారు వైద్యులు. ఈ రోగులు ఎప్పటికైనా తిరిగి మామూలు స్థితికి వస్తారనే ఆశతో ఇలా వారి ప్రాణాల్ని నిలిపి ఉంచడం సమంజసమే! కానీ కొందరి విషయంలో ఇది దాదాపు అసాధ్యం. అలాంటప్పుడు వైద్యానికయ్యే ఖర్చు, రోగి తాలూకు కుటుంబ సభ్యులు పడే మనోవేదన...రెండూ భరించలేనంత భారంగా మారతాయి. అలాంటప్పుడు అనుసరించవలసిన ప్రత్యామ్నాయమే 'యుథనేషియా'. అర్థమయ్యేలా చెప్పాలంటే... 'కారుణ్య మరణం'.

'ప్యాసివ్' యుథనేషియా

సుప్రీం కోర్టు 'ప్యాసివ్' యుథనేషియాకు ఆమోదం తెలిపింది. రోగిని తిరిగి మామూలు స్థితికి రప్పించటం కష్టమని నిర్ధారణకు వచ్చినప్పుడు, ముందుగానే స్వీకరించిన రోగి 'అంగీకారం' మేరకు, వైద్య నిపుణులు అతని జీవితానికి ముగింపు పలకవచ్చు. పాసివ్ యుథనేషియా అమలు విషయంలో... నైతికపరమైన, సాంఘికపరమైన, వృత్తిపరమైన చిక్కులు లేకపోలేదు. ఒక వైద్య నిపుణుడు తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్న రోగి మరణించేందుకు అవసరమైన చర్య తీసుకుంటే దాన్ని... 'యాక్టివ్ యుథనేషియా' (స్వచ్ఛంద కారుణ్య మరణం) అంటారు. అలా కాకుండా రోగి జీవితాన్ని పొడిగించటానికి అవసరమైనది ఏదీ చేయకుండా, లేదా అతని జీవితాన్ని పొడిగించే అంశాలకు ఆటంకం ఏర్పరిస్తే (వెంటిలేటర్ తొలగించటం ద్వారా శ్వాస ఆపేయటం), దాన్ని ... 'ప్యాసివ్ యుథనేషియా' అంటారు.

కారుణ్య మరణం



అభాగ్యులకు వరం!

క్యాన్సర్ చివరి దశలో ఉండి, శరీరంలోని ప్రధాన అంగాలన్నిటికీ వ్యాధి పాకిపోయి ఉన్న రోగులు, లేదా పదే పదే కేన్సర్ వ్యాధి తిరగబెట్టి, కీమో, రేడియేషన్, సర్జరీలతో చిక్కి శల్యమై, ఇక ఏ కొద్దిపాటి చికిత్సనూ తట్టుకోలేని రోగులు, కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకునే అవకాశాలు ఒక్క శాతం కంటే తక్కువగా ఉన్న రోగులు, ఏ చికిత్సకూ కేన్సర్ తగ్గక మరణపుటంచుల్లోకి చేరుకున్న రోగులకు 'ప్యాసివ్ యుథనేషియా' ఓ వరం లాంటిది. ఇలాంటి సందర్భాల్లో ఒక ఆంకాలజిస్ట్‌గా రోగి కుటుంబ సభ్యులకు నేనొక సలహా ఇస్తూ ఉంటాను. తిరిగి కోలుకునే అవకాశాలు లేనప్పుడు, చికిత్సతో మరింత బాధ పెట్టే బదులు, బతికే ఆ కొద్ది కాలం పాటు ఎటువంటి బాధలకూ గురి చేయకుండా బలాన్నిచ్చే మందులు, ఆహారంతో ఇంటి దగ్గరే గడుపుతూ, గౌరవప్రదంగా మరణించేలా చూడటమే ఉత్తమం అనేది నా ఉద్దేశం. ప్రాణాల్ని ఇవ్వలేనప్పుడు, ప్రాణాల్ని తీయకూడదు. ఇలా వైద్య విద్యలో వైద్యులందరం ప్రమాణాలు చేశాం. అయితే కొన్ని అనివార్య పరిస్థితుల్లో ఈ ప్రమాణాలు పక్కన పెట్టక తప్పదు. పైగా రోగి ప్రాణాలను చేతులారా తీయకుండా, పరోక్షంగా అతణ్ణి మరణానికి దగ్గర చేసే చర్యలు చేపట్టడమే జరుగుతుంది కాబట్టి ఈ చర్య యాక్టివ్ యుథనేషియా కోవ కిందకు రాదు. రోగి పూర్తి స్పృహలో ఉండి 'మరణేచ్ఛ వీలునామా' (లివింగ్ విల్) రాసి ఇచ్చినప్పుడు, అతని కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు పాసివ్ యుథనేషియా అమలు చేయొచ్చు.

అయితే ఎక్కువ శాతం మంది ఇలాంటి మరణాన్ని కోరుకోవట్లేదు. ఎక్కువ శాతం మంది రోగుల తాలూకు బంధువులు ఏం చేసైనా, ఎంత డబ్బు ఖర్చు అయినా రోగిని బ్రతికించమని కోరుకుంటూ ఉంటారు. కానీ ఇందుకు రోగులు సిద్ధంగా ఉండకపోవచ్చు. చికిత్సతో రోగి స్థితి అంతకంతకూ దిగజారుతున్నప్పుడు, రోగి తనంతట తానుగా చికిత్స తీసుకోవటం ఇష్టం లేదని వైద్యులతో చెప్పినప్పుడు... కుటుంబ సభ్యులతో మాట్లాడతాం! రోగికి, కుటుంబ సభ్యులకు... ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. అయినా రోగి మరణించాలనే బలంగా కోరుకున్నప్పుడు సాక్షులు, కుటుంబ సభ్యులు, ప్రభుత్వాధికారుల సమక్షంలో వీలునామా రాయించి, చికిత్సను ఆపేస్తాం. ఉదాహరణకు 'మరణేచ్ఛ వీలునామా' రాసి ఇచ్చి, చికిత్స తీసుకుంటున్న రోగికి గుండెపోటుతో శ్వాస ఆగిపోతే, సిపిఆర్ లాంటి సత్వర చికిత్స ఇచ్చి తిరిగి బ్రతికించం. అయితే ఈ విధానం అంతా ఎంతో పారదర్శకంగా జరుగుతుంది. కాబట్టి 'ప్యాసివ్ యుథనేషియా' దుర్వినియోగం అయ్యే అవకాశాలు తక్కువే!



డాక్టర్ సచిన్ సుభాష్ మర్ద
సర్జికల్ ఆంకాలజిస్ట్ - రోబోటిక్ సర్జన్,
యశోదా హాస్పిటల్, సోమాజిగూడ, హైదరాబాద్.

హెల్త్ కేర్



ఇలా చేయండి!

రెస్టారెంట్లలో అత్యంత అపరిశుభ్రమైన వాటిలో మెనూ ఒకటి. కాబట్టి పదార్థాలు ఆర్డర్ ఇచ్చిన తర్వాత చేతులు కడుక్కోండి.

మీకు తెలుసా?



క్షమించాలంటే..

మిమ్మల్ని మానసికంగా బాధించిన వ్యక్తిని క్షమించే ప్రక్రియ కోసం మన మెదడు కనీసం 6 - 8 నెలల సమయం తీసుకుంటుందని పరిశోధనల్లో రుజువైంది. ఆలోగా, బాధించిన వ్యక్తి ఎంత బతిమిలాడినా క్షమించాలనే ఆలోచన మీలో కలగదు.

బ్యూటీ

గంజి నీళ్లతో అందం



- తల స్నానం చేసిన వెంటనే అన్నం వార్చిన నీటిని వెంట్రుకలకు పట్టించి అరగంట తర్వాత కడిగేసుకుంటే వెంట్రుకలు మెరుపును సంతరించుకుంటాయి.
- ముఖానికి పట్టిస్తే తెరుచుకున్న చర్మ రంధ్రాలు మూసుకుపోవటమే కాకుండా యాస్ట్రింజెంట్‌గా పనిచేసి మొటిమలను తగ్గిస్తాయి.
- అన్నం వార్చిన నీటిలోని విటమిన్లు, ఖనిజ లవణాలు చర్మానికి పోషణనిస్తాయి. కాబట్టి ముఖానికి పట్టించి 10 నిమిషాల తర్వాత కడిగేస్తే చర్మం కాంతిమంతమవుతుంది.
- ఎండకు కమిలిన చర్మాన్ని రిపేర్ చేయటంతోపాటు, చర్మం త్వరగా కోలుకునేందుకు తోడ్పడుతుంది.
- ముంజేతులకు పట్టించి పది నిమిషాల తర్వాత కడిగేస్తే ఎండకు కమిలిన చర్మం బాగుపడుతుంది.

సైకాలజీ

ఏ కల వస్తే... ఏంటి?



కలలు నిజమవుతాయో లేదోగానీ, వాటిలో మాత్రం లోతైన అర్థాలు దాగుంటాయి. తరచుగా మనకొచ్చే కలల్ని విశ్లేషిస్తే మనకు తెలియకుండా మనలో దాగి ఉన్న భావోద్వేగాలు, భయాలు బయల్పడతాయి. ఉదాహరణకు....

గాల్లో ఎగరటం: ఆకాశంలో ఎగురుతున్నట్టు కల వస్తే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో ఉన్నారని, లేదా జీవితంలో ఎంతో ముఖ్యమైన నిర్ణయం తీసుకోబోతున్నారని అర్థం.

ఎత్తు నుంచి పడిపోవటం: ఎత్తు నుండి పడిపోతున్నట్టు కల వస్తే, ఏ విషయం మీదో పట్టు సాధించాలనే మీ ప్రయత్నానికి సూచన.

ఎవరో తరుముతున్నట్టు: జీవితంలో ఎదురయ్యే కష్టాలు, లేదా సమస్యల గురించి భయపడుతూ ఉంటే ఇలాంటి కలలొస్తాయి. ఆ భయాల్ని, సమస్యల్ని ఎదుర్కొంచటం కోసం వెంటనే సిద్ధం కండి.

నగ్నంగా: ఇది మీలోని భయానికి, అభద్రతాభావానికి సూచన.

చనిపోయినట్టు: చనిపోయినట్టు కల వస్తే, నిజంగానే చనిపోతామని అర్థం కాదు. మీ జీవితంలో ఒక అంకం లేదా ఒక బంధం ముగిసిపోతున్నందుకు సూచనే ఈ కల.

మంటలు: రగిలే మంటలు కలలోకొస్తే ఏదో మార్పు జరగబోతోందని అర్థం.

గర్భం దాల్చినట్టు: ఇది గొప్ప ఎదుగుదలకు, మార్పునకు సూచన.

నీళ్లు: నీళ్లు శుభ్రతకూ, కల్మషాలు, మలినాలు తొలగిపోవటానికీ సూచన.

డబ్బు: మన మనస్తత్వంలోని లోపాలకు ప్రతిబింబాలే డబ్బులు.

అక్రమ సంబంధం: మీలో అణగదొక్కిన లైంగిక వాంఛలు, జీవిత భాగస్వామితో ఆనందంగా లేకపోవటం, స్వీయ విలువ తగ్గినట్టు భావించటం ఈ కలలకు కారణాలు.

కలలు మన ఆలోచనలకు ప్రతిబింబాలు. మెదడు లోతుల్లోని భావాలను విప్పి చెప్పటానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. వాటిని వినగలిగితే మనకు మనం స్పష్టంగా అర్థమవుతాం, మనం నడవవలసిన దారి కనిపిస్తుంది. కాబట్టి కలలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం నిద్ర లేవగానే కలను గుర్తు తెచ్చుకుని విశ్లేషించే ప్రయత్నం చేయాలి. ఆలస్యం చేస్తే కలలను మర్చిపోతాం! వీలైతే కలల కోసం ఒక డైరీ కేటాయించాలి.

హెల్త్ వెల్త్



శీతల పానీయాలు వద్దే వద్దు!

చల్లగా, తీయగా గొంతు జారుతాయని శీతల పానీయాలను తాగేస్తే, దీర్ఘకాల వ్యాధులు తప్పవు. 750 మిల్లీ లీటర్ల కూల్ డ్రింక్‌లో సుమారు 4 టీస్పూన్ల పంచదార ఉంటుంది. దాంతో పాటు ప్రమాదకరమైన రసాయనాలూ ఉంటాయి. శీతల పానీయాల తయారీకి వాడే నీరు భూగర్భ జలం. దీన్లో పలు రకాల విషపూరిత పురుగు మందుల అవశేషాలుంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చేటు చేసేవే! పైగా శీతల పానీయాలు తాగటం వల్ల శరీరంలోని క్యాల్షియం మూత్రం ద్వారా విసర్జింపబడి, ఎముకలు గుల్లగా మారతాయి. కాబట్టి శీతల పానీయాలకు బదులు మజ్జిగ, పళ్ల రసాలు, చెరుకు రసం లాంటివి ఎంచుకోవాలి.

డైలీ సుడోకు - 130

	9		6				4	7
1			2					5
		7				8		
	5			6				3
6			3		2			1
8				4			7	
		4				1		
7					4			8
5	8				6		3	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతి లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-129 సమాధానం

[illegible]	8	[illegible]	[illegible]	[illegible]	3	[illegible]	2	[illegible]
9	[illegible]	7	1	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
2	[illegible]	5	[illegible]	9	[illegible]	7	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	1	2	[illegible]	[illegible]
5	[illegible]	[illegible]	[illegible]	3	[illegible]	[illegible]	[illegible]	9
[illegible]	[illegible]	3	2	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	8	[illegible]	1	[illegible]	6	[illegible]	4
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	9	1	[illegible]	2
[illegible]	6	[illegible]	8	[illegible]	[illegible]	[illegible]	3	[illegible]



పూజా హెగ్డే


పూజ లవ్స్ ప్రభాస్!

యస్... పూజా హెగ్డే ప్రేమలో పడే సూచనలు పుష్కలంగా ఉన్నాయి. అదీ ప్రభాస్‌తో! సూచనలు కాదులెండి... ష్యూర్‌షాట్‌గా ప్రేమలో పడటం ఖాయం! అందుకు ఇంకో మూడు నాలుగు నెలల టైమ్ పడుతుందంతే! అయితే... ప్రభాస్‌తో ప్రేమ వ్యవహారం రియల్ లైఫ్‌లో కాదు, రీల్ లైఫ్‌లో! ప్రస్తుతం ప్రభాస్ 'సాహో' చేస్తున్నారు. దీని తర్వాత 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ఒక ప్రేమకథా చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. అందులో హీరోయిన్‌గా పూజా హెగ్డేని ఎంపిక చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రభాస్, పూజ ఇప్పటివరకూ కలిసి నటించలేదు. సో... వారి జంట కొత్తగా ఉంటుందని దర్శక నిర్మాతలు భావించారట! యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ జూలైలో ప్రారంభించి, వచ్చే ఏడాది విడుదల చేయాలనేది నిర్మాతల ఆలోచనగా తెలుస్తోంది. అసలు, 'సాహో'లో శ్రద్ధా కపూర్‌ని సెలెక్ట్ చేయడానికి ముందు పూజ నటిస్తారనే ప్రచారం జరిగింది. కానీ, ఎందుకో కుదరలేదు. ఇప్పుడీ రాధకృష్ణ సినిమాతో కుదిరింది. ఇది కాకుండా తెలుగులో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ 'సాక్ష్యం'లో పూజా హెగ్డే నటిస్తున్నారు. రామ్‌చరణ్ 'రంగస్థలం'లో ప్రత్యేక గీతం చేశారు. త్వరలో చిత్రీకరణ మొదలు కానున్న ఎన్టీఆర్-త్రివిక్రమ్, మహేశ్‌బాబు-వంశీ పైడిపల్లి సినిమాల్లోనూ ఆమె హీరోయిన్. వరుసగా తెలుగులో అగ్ర హీరోలు ఒక్కొక్కరి సినిమాల్లో అవకాశాలు అందుకుంటోందీ సుందరి!!



నాని

ఉగాది నుంచి రెగ్యులర్‌గా!



నాగార్జున

"మా వైజయంతీ మూవీస్ సంస్థలో మణిశర్మ సంగీతం అందించిన చిత్రాలన్నీ మ్యూజికల్‌గా పెద్ద విజయాన్ని సాధించాయి. ప్రస్తుతం అక్కినేని నాగార్జున, నాని కాంబినేషన్‌లో మేం తెరకెక్కిస్తోన్న చిత్రానికి కూడా మణిశర్మ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి" అని నిర్మాత సి.అశ్వనీదత్ అన్నారు. నాగార్జున, నాని హీరోలుగా వైజయంతి మూవీస్ పతాకంపై టి. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో సి.అశ్వనీదత్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. సి.అశ్వనీదత్ మాట్లాడుతూ "ఉగాది రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం. మా బేనర్‌లో ఎన్నో మల్టీస్టారర్స్ చేశాం. అవన్నీ కమర్షియల్‌గా ఘనవిజయాల్ని అందుకున్నాయి. ఇప్పుడు నాగార్జున, నాని కాంబినేషన్‌లో చేస్తున్న మల్టీస్టారర్ కూడా బిగ్గెస్ట్ హిట్ అయి మా సంస్థకి మరింత మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు. వినోదాత్మకంగా సాగే వైవిధ్యమైన చిత్రమని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు: వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్.

నో వర్క్...నో మేకప్!



తమన్నా



సమంత



కాజల్

నో వర్క్! ఎవరికి? సమంతకి! ఎప్పుడు? ఆదివారం ఒక్కరోజు! అప్పుడు ఏం చేశారో తెలుసా? ఇంట్లోనే ఉన్నారు. సరదాగా పెంపుడు కుక్క పిల్లలతో ఆడుకున్నారు. "చక్కటి ఆదివారపు సాయంత్రాలు ఇలా ఉంటాయి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు. నో మేకప్! ఎవరికి? కలువ కళ్ళ సుందరి కాజల్ అగర్వాల్‌కు! పాలరాతి శిల్పం వంటి తమన్నాకు! కావాలంటే ఒక్కసారి ఫొటోలపై లుక్కేయండి! ప్రస్తుతం కాజల్ యూరప్‌లో ఉన్నారు. ఉదయమంతా 'ఎమ్మెల్యే' సినిమా కోసం పాటల చిత్రీకరణలో పాల్గొని అలసి సొలసి హోటల్‌కి చేరుకున్న తర్వాత మేకప్ తీసేసి కునుకు తీశారు. చివరకు కాసేపు నిద్రపోయే తీరిక దొరికిందన్నట్టు ఫొటోకి క్యాప్షన్ ఇచ్చారు. తమన్నా అయితే తమిళనాడులోని కొడైకెనాల్‌లో ఉన్నారు. ఓ తమిళ సినిమా చిత్రీకరణ చేస్తున్నారు. సోమవారం ఆమెకు సెలవు దొరికినట్టుంది. మేకప్ లేకుండా అదిగో అలా ఫొటోలో చూస్తున్నట్టు దర్శనం ఇచ్చారు. ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి. మేకప్ లేకున్నా ముద్దు వచ్చేస్తున్నారు కదూ!సోషల్ మీడియా వల్ల ఎవరు ఎక్కడ ఉన్నా... ఇదిగో ఇలా అభిమానులతో ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నారు.



దీపిక

అందమంతా డ్రస్సులోనే ఉన్నది!

బీటౌన్ లవ్ బర్డ్స్ రణవీర్ సింగ్, దీపికా పడుకోన్ ఇప్పటివరకూ ముచ్చటగా మూడు చిత్రాల్లో నటించారు. విచిత్రం ఏంటంటే... మూడింటిలోనూ ముగింపు విషాదమే. ఒక్కటంటే ఒక్క చిత్రంలోనూ హ్యాపీ ఎండింగ్ లేదు. 'గోలియోంకి రాసలీల రామ్-లీల'లో ఇద్దరూ షూట్ చేసుకుని చస్తారు. 'బాజీరావ్ మస్తానీ'లోనూ అంతే. దీపిక పాత్ర మరణిస్తుంది. ఇక, ఈ ఏడాది విడుదలైన 'పద్మావత్'లో ఆమెది సతీ సహగమనం చేసే పాత్ర. ఈ విషయాన్ని దీపికకు గుర్తు చేస్తూ 'హ్యాపీ ఎండింగ్ ఉన్న సినిమాలో మీరిద్దరూ కలిసి నటించడం మీకు ఇష్టమేనా?' అనడిగితే... "ఇష్టమే. అలాంటి సినిమా చేసే అవకాశం మాకు వస్తుందని ఆశిస్తున్నా. మా ఇంట్లోనూ అదే అడుగుతున్నారు. అమ్మ, ముఖ్యంగా చెల్లి 'ప్రతి సినిమాలోనూ నువ్వు ఎందుకు చావాలి?' అంటున్నారు. నెక్స్ట్ రణవీర్‌తో చేయబోయే సినిమాలో మా ఇద్దరిలో ఎవరిదీ మరణించే పాత్ర ఉండకూడదని, ఎమోషనల్ సినిమా కాకుండా హ్యాపీ లవ్ స్టోరీ కావాలని కోరుకుంటున్నా" అన్నారు. తెల్లటి డ్రస్‌లో ధగ ధగ మెరిసిపోతున్న ఈ డ్రస్ ఉంది చూశారా? ముంబయ్‌లో జరిగిన ఒక ప్రయివేట్ అవార్డుల కార్యక్రమానికి వేసుకుని వచ్చారు. ఈ డ్రస్, దీపిక ధరించిన తీరు తమన్నాకు తెగ నచ్చేశాయి. దాంతో సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపించారు.

పిచ్చి... కొత్తవి తెచ్చి!



నిధి అగర్వాల్

లెక్క లేదంట... నిధి అగర్వాల్ ఇప్పటివరకూ ఎన్ని రకాల పెర్‌ఫ్యూమ్స్ కొన్నారనే విషయంలో! ముప్పై రోజులకు ఒకసారి కొత్త పెర్‌ఫ్యూమ్ బాటిల్ ఆమె మేకప్ కిట్‌లో కనిపించాల్సిం దేనంటున్నారు. ఎవరీ సుందరి? అంటే... నాగచైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న 'సవ్యసాచి'లో హీరోయిన్. తెలుగులో ఆమెకు ఇదే తొలి సినిమా. హిందీలో 'మున్నా మైఖేల్' చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. అప్పుడప్పుడూ అభిమానులతో ముచ్చటిస్తుంటారు. ఆదివారం అలా అభిమానులతో ముచ్చటించిన్నప్పుడు 'మీరు నచ్చిన, ఇప్పుడు ఉపయోగిస్తున్న పెర్‌ఫ్యూమ్ ఏది?' అని ఓ అభిమాని అడిగారు. వెంటనే "నచ్చిన పెర్‌ఫ్యూమ్ అంటూ ఏదీ లేదు. ప్రతి ముప్పై రోజులకు ఒకసారి పెర్‌ఫ్యూమ్ మారుస్తా. అలా కొత్తవి తెచ్చి తెచ్చి... ఎన్ని తెచ్చానో కూడా గుర్తు లేదు" అని చెప్పారు నిధి అగర్వాల్. ప్రస్తుతం తెలుగులో 'సవ్యసాచి' చేస్తున్న ఈ సుందరి, తాజాగా ఓ హిందీ చిత్రం అంగీకరించారు. "అక్షయ్‌కుమార్ 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' చిత్రదర్శకుడు శ్రీ నారాయణ సింగ్ తీయబోయే తదుపరి చిత్రంలో నేనే హీరోయిన్. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఆ సినిమా జూన్‌లో మొదలవుతుంది" అని నిధి అగర్వాల్ తెలిపారు.

సితార అనే నేను...



బేబి సితార, కైరా అడ్వాణీ

మహేశ్‌బాబు తాజా సినిమా 'భరత్ అనే నేను' చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతుందని సోమవారమే చిత్రజ్యోతి తెలిపింది. ఈ సినిమా సెట్స్‌లో హీరోయిన్ కైరా అడ్వాణీతో కలిసి సితార అనే మహేశ్ కుమార్తె సందడి చేశారు. ఆ సందడిలో సరదా అంశం ఏంటంటే... ఇద్దరూ ఎవరి జుత్తు పొడవుగా ఉందోనని చూసుకున్నారు. ఈ సంగతిని మహేశ్ సతీమణి నమ్రత తెలిపారు. "ఇద్దరు అందగత్తెలు పొడవాటి జుత్తు పురస్కారం కోసం పోటీ పడుతున్నారు. 'భరత్ అనే నేను' సెట్స్‌లో సితార" అని పేర్కొన్నారామె.

పెద్ద సినిమాల కన్నా ఎక్కువ సంపాదించడం అలవాటు

- రాజేంద్రప్రసాద్



సాక్షీ చౌదరి, రాజేంద్రప్రసాద్

"నా సినిమా చిన్న సినిమా అన్నప్పుడల్లా... పెద్ద సినిమాల కన్నా ఎక్కువ సంపాదించడం నాకు అలవాటు. అందుకని, అనూప్ ఎన్ని పెద్ద సినిమాలు చేసినా... మా సినిమాకు చేసిన అనుభవం తప్పకుండా బాగుంటుందని అనుకుంటున్నా" అన్నారు రాజేంద్రప్రసాద్. ఆయన హీరోగా 'నిధి' ప్రసాద్ దర్శకత్వంలో జెబి క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మించిన చిత్రం 'ఊ.పె.కు.హ'. ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి... అనేది ఉపశీర్షిక. సాక్షీ చౌదరి హీరోయిన్. అనూప్ రూబెన్స్ సంగీతమందించిన ఈ సినిమా పాటలను సోమవారం విడుదల చేశారు. బిగ్ సీడీని 'జెమిని' కిరణ్, ఆడియో సీడీలను రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాగుతూ "మహేశ్ బాబుతో 'శ్రీమంతుడు', ఎన్టీఆర్‌తో 'నాన్నకు ప్రేమతో', తివిక్రమ్ తీసిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాల్లో నటించినప్పుడు నిర్మాతల నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా నేనెంత సౌకర్యవంతంగా నటించానో... ఈ చిత్రంలోనూ అంతే బాగా నటించాను. ఇదొక అర్బన్ కామెడీ చిత్రమిది" అన్నారు. "నేను 'నిధి' ప్రసాద్‌గారు దర్శకత్వం వహించిన ఒక చిత్రానికి కీబోర్డ్ ప్లేయర్‌గా వర్క్ చేశా. అక్కణ్ణుంచి ఆయన మంచితనం, స్నేహం ఇక్కడివరకూ నడిపించాయి. ఆయన కోసం ఈ చిత్రం చేశా. మరిన్ని మంచి చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా" అన్నారు అనూప్ రూబెన్స్. "పవన్‌కల్యాణ్‌గారి చిత్రం, అన్నపూర్ణ సంస్థలో చిత్రాలు.. వరుసగా పెద్ద పెద్ద చిత్రాలు చేస్తున్న సమయంలో నా కోసం, మా సంస్థ కోసం ఈ చిత్రం అంగీకరించిన అనూప్‌కి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అన్నారు 'నిధి' ప్రసాద్. ఈ కార్యక్రమంలో 'జెబి క్రియేషన్స్' అధినేత విక్రమ్, నటీనటులు సాక్షీ చౌదరి, రిషి, ఖయ్యూమ్, సాయి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం ఘడియల్లో విడిపోయి...



ప్రియమణి

ప్రియమణి టైటిల్ పాత్రలో శ్రీ శంఖు చక్ర ఫిలింస్ పతాకంపై కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'అంగుళీక'. ప్రేమ్ ఆర్యన్ దర్శకుడు. దీపక్ కథానాయకుడు. ఆదివారం కోడి రామకృష్ణ చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఈ కథ గురించి నాకు చాలాకాలంగా తెలుసు. టీజర్ చాలా బాగుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా అన్నింటినీ తట్టుకుంటూ నిర్మాతలు ఇంత వరకూ తీసుకొచ్చి దర్శకుడికి అండగా నిలబడ్డారు" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కాలచక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథ ఈ చిత్రం. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమజంట మళ్లీ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏళ్ల తర్వాత కలుసుకుంటారు. అదే సమయంలో పగతో రగిలిపోతున్న దుష్టాత్మ ఆ జంటపై పగ తీర్చుకుందా? ఆ ప్రేమ జంట ఆత్మలకు ఎలా మోక్షం కలిగింది అనేది సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది" అని అన్నారు. ప్రస్తుతం గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోందనీ, త్వరలో సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాత చెప్పారు.

అభిమానం పేరుతో అలా చెయ్యొద్దు

- వి.వి.వినాయక్



కాదంబరి కిరణ్, వినాయక్, మురళీధర్, కల్యాణ్, నాగేశ్వరరెడ్డి

"ఇతరుల బాధను పంచుకునే గుణం అందరికీ ఉండదు. కష్టం అన్నవారిని అతను ఆదుకుంటున్నాడు. ఆయన ప్రారంభించిన 'మనంసైతం'కు నా వంతు సాయంగా రూ.లక్ష విరాళంగా ఇస్తున్నా. ఇందులో ఎటువంటి రాజకీయాలు లేకుండా గొప్ప సంస్థగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నా. అభిమానం పేరుతో పూల మాలలు, శాలువాల కోసం ఖర్చు చేసే డబ్బును పేదల సేవకు వినియోగించండి. అదే అసలైన మానవత్వం" అని వి.వి.వినాయక్ అన్నారు. 'మనంసైతం' ఆధ్వర్యంలో అత్యవసరంలో ఉన్న పలువురి శనివారం ఫిల్మ్‌చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విరాళాలను అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నటుడు జిల్లేళ్ల మురళీధర్, డ్రైవర్ యూనియన్ రాజు, లైట్‌మెన్ కూతురు అనూజ, నటుడు ధమ్ కుమారుడు బాబు, ఉదయ్‌కాంత్ ఇలా పదిమందికి వి.వి.వినాయక్, సి.కల్యాణ్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. కాదంబరి కిరణ్ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో కష్టాలున్నాయని చెప్పుకుంటే అవకాశాలు రావనీ, దగ్గరకు కూడా రానీయరనే అపోహ ఉంది. అది తప్పు. కష్టాల్లో ఉన్నప్పుడు నన్ను చాలామంది ఆదుకున్నారు. చిరంజీవి గారితో సహా పెద్దలంతా మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు" అని అన్నారు.


నటుడు వంకాయల కన్నుమూత



సినీ నటుడు వంకాయల సత్యనారాయణమూర్తి (78) సోమవారం వైజాగ్‌లో కన్నుమూశారు. దసపల్లా హిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆయన కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో ఇబ్బందిపడుతున్నారు. సోమవారం ఉదయం పరిస్థితి విషమించడంతో సమీపంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా ఉదయం 8.30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య శకుంతల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విశాఖకు చెందిన సత్యనారాయణ హిందుస్థాన్ షిప్‌యార్డులో ఉద్యోగం చేస్తూ నాటకాలు వేస్తుండేవారు. 1976లో 'నీడ లేని ఆడది' చిత్రం ద్వారా సినీ రంగంలో ప్రవేశించారు. తెలుగులో 'సీతామాలక్ష్మి', 'శుభలేఖ', 'సాగరసంగమం' 'ఊరికిచ్చిన మాట', 'సూత్రధారులు', 'అత్తవారిల్లు', 'శ్రీనివాస కల్యాణం', 'విజేత', 'శృతిలయలు' ఇలా దాదాపు 182 చిత్రాల్లో నటించి మెప్పించారు. పలు సీరియళ్లలో కూడా ఆయన కనిపించారు. ముఖ్యంగా 'సీతామాలక్ష్మి' సినిమాలోని స్టేషన్ మాస్టరు పాత్ర ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ సినిమాలోని 'మావిచిగురు తినగానే...' పాటను ఇప్పటికీ ఆయన సెల్‌ఫోన్‌లో కాలర్ ట్యూన్‌గా పెట్టుకున్నారు. ఆయన చివరి చిత్రం 'కారం దోసె'. చదువుకునే రోజుల్లో బీకామ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వంకాయల.. 1960 ఆగస్టులో రైఫిల్ షూటింగ్ కాంపిటీషన్‌లో దేశంలోనే ప్రథమ, ప్రపంచంలో రెండో స్థానంలో నిలిచారు. అంతే కాదు ఆయనలో బాక్సర్, రెజ్లర్, వెయిట్ లిఫ్టర్, బాడీ బిల్డర్ కూడా ఉన్నారు. 'పాత రోజుల్లో సినిమా పరిశ్రమలోకి బతకడానికి వచ్చేవారు. నేను బతికి వెళ్లిన వాడిని కాబట్టి లౌక్యం తెలీదు. అక్కడ నిలబడాలంటే లౌక్యం తెలీదు కాబట్టి ఎక్కువ రోజులు సినిమాల్లో ఉండలేకపోయా' అని ఆయన చెబుతుండేవారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

ఒకరు కాదు.. ముగ్గురు దర్శకులు!



చిత్రం శ్రీను

సాధారణంగా ఓ సినిమాకు ఒకే ఒక దర్శకుడు ఉంటారు. ఆయన కనుసన్నల్లో చిత్రం తయారవుతుంది. అయితే ఒకరు కాదు ఏకంగా ముగ్గురు దర్శకత్వం వహిస్తున్న సినిమా 'విశ్వదాభిరామ'. హాస్య నటుడు చిత్రం శ్రీను ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సురేశ్‌కాశీ, సురేంద్ర కమల్, అశోక్ చక్రం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ అరుదైన చిత్రాన్ని సోలో స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సురేంద్ర కమల్ నిర్మిస్తున్నారు. చిత్రం గురించి దర్శకత్రయం మాట్లాడుతూ 'కొండవీటి కోట నేపథ్యంలో జరిగే డెత్ గేమ్ థ్రిల్లర్ ఇది. ఇంతవరకూ కామెడీ పాత్రల్లో అలరించిన చిత్రం శ్రీను తొలిసారి విలన్‌గా నటిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: సురేశ్ కాశీ, ఛాయాగ్రహణం: అజీమ్, తరుణ్ సోనూ.

10 రోజుల్లో ఐదు ఐపిఒలు

నేడు బిడిఎల్ ఇష్యూ

స్టాక్ మార్కెట్లో రానున్న పది రోజుల్లో పబ్లిక్ ఇష్యూల సందడి పెరగనుంది. బంధన్ బ్యాంకు, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ సహా ఐదు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలతో ఇన్వెస్టర్ల ముందుకు రానున్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి సమీకరించనున్న సొమ్ము 10,500 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. ఇవే ఈ ఆర్థిక సంవత్సరానికి చివరి భారీ పబ్లిక్ ఇష్యూలయ్యే అవకాశం ఉంది. ఇష్యూకు రానున్న ఇతర కంపెనీల్లో భారత్ డైనమిక్స్ లిమిటెడ్, సంధార్ టెక్నాలజీస్, కర్దా కన్‌స్ట్రక్షన్ ఉన్నాయి. వాటిలో హెచ్ఎఎల్‌ది భారీ ఐపిఓ కాగా కర్దా కన్‌స్ట్రక్షన్‌ది అతి చిన్న ఇష్యూ. భారత్ డైనమిక్స్ ఇష్యూ మంగళవారం ప్రారంభమై గురువారం ముగుస్తుంది.

జిఎస్‌టిలో భారీ ఎగవేతలు

తొమ్మిది నెలల్లోనే రూ. 34 వేల కోట్లు ఫట్... బిగ్‌డేటా విశ్లేషణలో అధికారులు

న్యూఢిల్లీ : పన్నుల ఎగవేతను నిరోధించే కట్టుదిట్టమైన వ్యవస్థగా ప్రభుత్వం ముందుకు తెచ్చిన జిఎస్‌టిలోనూ పన్నుల ఎగవేత యథేచ్ఛగా కొనసాగుతోంది. జిఎస్‌టిని ప్రవేశపెట్టి ఇంకా ఏడాది కూడా కాలేదు. పన్నుల రాబడిపై ప్రభుత్వ అంచనాలన్నీ దెబ్బతింటున్నాయి. ప్రతినెలా పన్నుల రాబడిలో తరుగుదలే తప్ప పెరుగుదల ఉండటం లేదు. దీనిపై అధికారులు దర్యాప్తు జరపగా, వ్యాపారులు ఎప్పటిలాగానే కొత్త మార్గాలను కనిపెట్టి ఎగవేతలకు పాల్పడుతున్నట్టుగా వెల్లడైంది. బ్లాక్‌మార్కెటింగ్, దిగుమతుల విలువను తగ్గించి చూపడం... ఇలాంటి మార్గాల ద్వారా పన్నుల ఎగవేతలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన గత తొమ్మిదినెలల కాలంలో ట్రేడ్‌కు సంబంధించిన బిగ్ డేటాను అధికారులు విశ్లేషించారు. ఈ సందర్భంగా దిగ్భ్రాంతి కలిగించే విషయాలు వెల్లడయ్యాయి. కనీసం 34 వేల కోట్ల రూపాయల మేర పన్నులు తక్కువగా వసూలైనట్టు ప్రాథమిక అంచనాల్లో వెల్లడైంది. శనివారం జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. డేటాను మరింత



లోతుగా అధ్యయనం చేసి ఒక వస్తువు , దిగుమతిదారు-ఉత్పత్తిదారు నుంచి ఆఖరున వినియోగదారుకు చేరే వరకు గల చైయిన్‌లో పన్ను ఎగవేతలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

- దేశవ్యాప్తంగా సుమారు 73,000 మంది పన్ను చెల్లింపుదారులు సుమారు 30 వేల కోట్ల రూపాయల ఐజిఎస్‌టిని చెల్లిస్తున్నారు. వీటికి సంబంధించిన రిఫండ్ క్లెయిమ్‌లు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.
- కస్టమ్స్ పోర్ట్‌ల్లో దిగుమతి చేసుకున్న సరుకులపై చెల్లించే ఐజిఎస్‌టి, సెస్ డేటాను పరిశీలించినప్పుడు 33 వేల మంది పన్ను చెల్లింపుదారులు, చెల్లించిన పన్నుల కంటే 10 వేల కోట్ల రూపాయలు అదనంగా క్లెయిమ్ చేస్తున్నట్టు వెల్లడైంది.
- జిఎస్‌టి అధికారుల వద్ద ఉన్న డేటా ప్రకారం.. జూలై-జనవరి మధ్య కాలానికి మొత్తం 16,925 కోట్ల ఐజిఎస్‌టి రిఫండ్ క్లెయిమ్స్ దాఖలయ్యాయి.
- దిగుమతిదారులు తాము దిగుమతి చేసుకుంటున్న సరుకులకు జిఎస్‌టి లేదా ఐజిఎస్‌టిని చెల్లిస్తున్నా, విక్రయాలను మాత్రం బిల్లులు లేకుండానే కానిచ్చేస్తున్నట్టు వెల్లడింది. ఒక వేళ ఈ సంస్థలు సక్రమంగా బిల్లుల ప్రకారం విక్రయిస్తే ఆ తర్వాత వీటిని కొనుగోలు చేసిన సంస్థలు టాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేయాలి. బిగ్ డేటా విశ్లేషణలో ఆఖరు అంచెలో కనిపించాల్సిన టాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లు కనిపించడం లేదు. అంటే దిగుమతైన సరుకులు బిల్లులు లేకుండా మార్కెట్లోకి చేరిపోతున్నాయన్నమాట.
- అదే విధంగా విలాసవస్తువులు, ప్రజారోగ్యానికి భంగంగా భావించిన వస్తువులపై ప్రభుత్వం జిఎస్‌టితో పాటు సెస్ కూడా వసూలు చేస్తోంది. ఇలాంటి వస్తువుల దిగుమతిలో కూడా దిగుమతి సంస్థలు జిఎస్‌టి, సెస్ చెల్లిస్తున్నాయి. ఆ తర్వాత టాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లు మాత్రం ఉండటం లేదు. పైగా చాలా సందర్భాల్లో విలువను తగ్గించి చూపిస్తున్నారు. ఉదాహరణకు 10 వేల రూపాయల ఫోన్‌ను కేవలం 7 వేల రూపాయలకు దిగుమతి చేసుకున్నట్టుగా బిల్లులు చూపిస్తున్నారు.
- ప్రభుత్వ వివరాల ప్రకారం జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత ఏడు నెలలకాలంలో పన్నుల వసూళ్ల ఈ విధంగా ఉన్నాయి. 2017 జూలై (రూ.93590 కోట్లు), ఆగస్టు (రూ.93,029 కోట్లు), సెప్టెంబరు (రూ.95,132 కోట్లు), అక్టోబరు (రూ.85,931 కోట్లు), నవంబరు (రూ.83,716 కోట్లు), డిసెంబరు(రూ.88,929 కోట్లు),జనవరి (రూ.88,047 కోట్లు).



ఫ్యాబ్ సిటీలో హెచ్ఎఫ్‌సిఎల్ ప్లాంట్

- శంకుస్థాపన చేసిన మంత్రి కెటిఆర్
- మూడు దశల్లో 7,000 ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టెలికాం ఎక్విప్‌మెంట్, ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ తయారీ సంస్థ హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్‌సిఎల్) హైదరాబాద్ సమీపంలోని ఫ్యాబ్ సిటీలో యూనిట్ ఏర్పాటు చేస్తోంది. 4జి, 5జి టెలికాం సేవలకు అవసరమైన ఆప్టికల్ ఫైబర్ (ఒఎఫ్) తయారీ కోసం ఏర్పాటు చేసే ఈ యూనిట్‌కు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు సోమవారం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో ఏర్పాటు చేసే ఈ యూనిట్ తొలి దశ కోసం కంపెనీ రూ.250 కోట్లు ఖర్చు చేస్తోంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి లభిస్తుంది. మూడు దశల్లో రూ.1,000-1,100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ సమగ్ర యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కెటిఆర్ చెప్పారు. ఈ యూనిట్‌కు అవసరమైన సుశిక్షితులైన సిబ్బందిని సమకూర్చేందుకు స్థానిక యువకులకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలతో అనేక కంపెనీలు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కోసం తెలంగాణలో తమ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది చివరికల్లా రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు 15 ఎంబిపిఎస్ వేగంతో బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. దీంతో రాష్ట్ర పరిపాలన, విద్య, వైద్య రంగాల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటాయన్నారు.

మినీ యుఎవిల యూనిట్!

రక్షణ రంగం కోసం హైదరాబాద్ సమీపంలో కొత్త యూనిట్ ఏర్పాటు చేసేందుకూ కంపెనీ ఆసక్తితో ఉంది. ఈ యూనిట్‌లో సైన్యానికి అవసరమైన మినీ యుఎవిలు, నైట్ విజన్ పరికరాలు తయారీ చేస్తామని హెచ్ఎఫ్‌సిఎల్ ఎండి నహతా చెప్పారు. అయితే ఈ ప్రాజెక్టు ఇంకా ప్రతిపాదన దశలోనే ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక తర్వాత పెట్టుబడులపై అవగాహనకు వస్తామని చెప్పారు.

మూడు దశల్లో విస్తరణ

ఏటా 64 లక్షల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ ఉత్పత్తి సామర్థ్యంతో 20 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ యూనిట్ వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుందని హెచ్ఎఫ్‌సిఎల్ ఎండి మహేంద్ర నహతా చెప్పారు. బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ కింద రూ.250 కోట్ల అంచనాతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్థికం ఆశావహం

పారిశ్రామికం పైకి, ద్రవ్యోల్బణం దిగువకు

ఆర్థిక రంగం రికవరీ బాట పట్టింది. వరుసగా రెండో నెలలో కూడా పారిశ్రామికోత్పత్తి సూచి 7 శాతానికి పైబడి వృద్ధిని నమోదు చేయగా రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి దిగజారింది.

న్యూఢిల్లీ : వినియోగ వస్తువులు, యంత్రపరికరాల రంగాలందించిన మద్దతుతో జనవరిలో పారిశ్రామిక రంగం ఉరకలేసింది. పారిశ్రామికోత్పత్తి 7.5 శాతం పెరిగింది. గత ఏడాది జనవరిలో ఈ రంగం వృద్ధిరేటు 3.5 శాతానికే పరిమితం అయింది. తయారీ రంగం కార్యకలాపాలకు దర్పణం పట్టే పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపి) డిసెంబరు నెలలో 7.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఐఐపిలో 77.63 శాతం వాటా ఉన్న తయారీ రంగం మంచి వృద్ధిని నమోదు చేసింది. గత జనవరిలో 2.5 శాతం వృద్ధికే పరిమితం అయిన ఈ విభాగం ఈ జనవరిలో 8.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆర్థిక రంగం రికవరీ పథంలో ఉన్నదనేందుకు ఇది సంకేతమని పరిశీలకులంటున్నారు. అలాగే పెట్టుబడులకు సూచిక అయిన యంత్ర పరికరాల రంగం 14.6 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది జనవరిలో ఈ విభాగం 0.6 శాతం ప్రతికూల వృద్ధిని సాధించింది. ఎఫ్ఎంసిజి అందించిన మద్దతుతో కన్సూమర్ నాన్ డ్యూరబుల్స్ విభాగంలో వృద్ధి 9.6 శాతం నుంచి 10.5 శాతానికి చేరింది. కన్సూమర్ డ్యూరబుల్స్ విభాగంలో వృద్ధి మైనస్ 2 శాతం నుంచి 8 శాతానికి చేరింది. అయితే జనవరిలో మైనింగ్ రంగంలో వృద్ధి 0.1 శాతానికే పరిమితమైంది. వినియోగ ఆధారిత వర్గీకరణ ప్రకారం ప్రాథమిక వస్తువుల రంగం 5.8 శాతం, ఇంటర్మీడియెట్ వస్తువుల రంగం 4.9 శాతం, మౌలిక వసతులు/నిర్మాణ రంగం 6.8 శాతం వృద్ధిని నమోదు చేశాయి. మొత్తం 23 పారిశ్రామిక బృందాల్లోను 16 సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. కాగా ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో ఐఐపి వృద్ధిరేటు 4.1 శాతం ఉంది.

4 నెలల దిగువకు రిటైల్ ద్రవ్యోల్బణం

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 4.44 శాతానికి దిగజారింది. జనవరిలో ఇది 5.07 శాతం, గత ఏడాది ఫిబ్రవరిలో 3.65 శాతంఉంది. కూరగాయల ధరల్లో పెరుగుదల 17.5 శాతానికి తగ్గడం, పళ్ల ధరల ద్రవ్యోల్బణం కూడా 6.24 శాతం నుంచి 4.80 శాతానికి దిగజారడంతో రిటైల్ ద్రవ్యోల్బణం దిగి వచ్చినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. పాలు, పాల ఉత్పత్తుల ధరలు 4.21 శాతం మేరకు, తృణధాన్యాల ధరలు 2.10 శాతం మేరకు, చేపలు, మాంసం ధరలు 3.31 శాతం మేరకు తగ్గాయి. అయితే గుడ్ల ధర మాత్రం 8.51 శాతం పెరిగింది.

మొబైల్స్ రిటైల్‌లోకి హ్యాపీ మొబైల్స్

అనంతపురంలో తొలి స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ ఫోన్ల రిటైల్ రంగంలోకి కొత్త బ్రాండ్ 'హ్యాపీ మొబైల్స్' ప్రవేశించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో సోమవారం తొలి స్టోర్‌ను నటి సమంతా అక్కినేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ మొబైల్స్ ఎండి కృష్ణ పవన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్, డైరెక్టర్లు యువరాజ్, కన్నీ యువరాజ్ పాల్గొన్నారు. త్వరలోనే దేశంలోని పలు రాష్ట్రాల్లో స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్టు కృష్ణ పవన్ తెలిపారు. ముందు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో హ్యాపీ బ్రాండ్ మొబైల్ స్టోర్లను ప్రారంభిస్తామన్నారు. రానున్న కాలంలో 150 నుంచి 200 స్టోర్లను ఏర్పాటు చేయాలన్న యోచనలో ఉన్నామని, రూ.500 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా



చేసుకున్నామని చెప్పారు. ఈ మార్చి చివరినాటికి హైదరాబాద్‌లో ఒకే రోజు 20 స్టోర్లను ప్రారంభించనున్నట్టు సంతోష్ తెలిపారు. మారుతున్న కస్టమర్ల అభిరుచులకు, సౌకర్యాలకు అనుగుణంగా తమ స్టోర్లను తీర్చిదిద్దామన్నారు. కాగా హ్యాపీ మొబైల్స్ స్టోర్‌లో 200కు పైగా దేశ, విదేశీ బ్రాండ్ మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉండనున్నాయి. తొలి స్టోర్ ప్రారంభం సందర్భంగా ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించారు. ఇందులో భాగంగా రూ.999 విలువైన ఫోన్‌ను రూ.299కు, 1,000 విలువైన ఫోన్‌ను రూ.399కు, 4జిబి ఫోన్‌ను రూ.2999కు, 1,999 రూపాయలకే స్మార్ట్‌ఫోన్‌ను సంస్థ ఇస్తోంది. స్టోర్ ప్రారంభం సందర్భంగా మొదటి ఏడు రోజుల్లో ఆకర్షణీయమైన ఆఫర్లు ఇస్తున్నది. రూ.15 వేలమొబైల్‌ను కొనుగోలు చేస్తే అంతే విలువైన టీవీ లేదా రూ.8 వేల ఎయిర్ కూలర్ లేదా రూ.8 వేల వాషింగ్ మిషన్‌ను ఉచితంగా కస్టమర్లకు ఇస్తున్నారు.

358 పరిశ్రమల మూసివేతకు సిపిసిబి ఆదేశం

న్యూఢిల్లీ : కాలుష్య నిబంధనలను తుంగలో తొక్కిన 358 పరిశ్రమల మూసివేతకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) ఆదేశాలు జారీ చేసినట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. 2015 డిసెంబరు నుంచి 2017 ఏప్రిల్ మధ్య కాలంలో ఈ మేరకు ఆదేశాలు వెలువడినట్టు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి మహేష్ శర్మ సోమవారం రాజ్యసభకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. దేశవ్యాప్తంగా, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అడ్డగోలుగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలు 2,600 ఉన్నాయని, వీటిలో 1,218 ఉత్తర ప్రదేశ్‌లో, 660 హర్యానాలో, 198 ఆంధ్రప్రదేశ్‌లో, 191 గుజరాత్‌లో, 84 బిహార్‌లో, 76 ఉత్తరాఖండ్‌లో, 69 జమ్మూకశ్మీర్‌లో, 43 పశ్చిమ బెంగాల్‌లో, 29 కేరళాలో, 6 ఒడిశాలో, 5 పంజాబ్‌లో, నాలుగు చొప్పున మహారాష్ట్ర, కర్ణాటకలో, మూడు చొప్పున ఢిల్లీ, పుదుచ్చేరిలో, రెండు చొప్పున అండమాన్ నికోబార్ దీవులు, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో, ఒకటి తెలంగాణలో ఉన్నట్టు మంత్రి చెప్పారు.

ఐకియా ఇండియా సిఇఒగా పీటర్ బెట్జెల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్వీడన్‌కు చెందిన హోమ్ ఫర్నీచర్ కంపెనీ ఐకియా.. తన భారత వ్యాపార నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫసర్ (సిఇఒ)గా పీటర్ బెట్జెల్‌ను నియమించింది. ఇప్పటిదాకా ఈ బాధ్యతలను జువెన్సియో మెజ్జు నిర్వహించారు. ఈయనకు ఐకియా గ్రూప్ (ఐఎన్‌జికెఎ హోల్డింగ్ బివి) సిఎఫ్ఒ, డిప్యూటీ సిఇఒ బాధ్యతలు అప్పగించడంతో ఈయన స్థానంలో పీటర్‌ను నియమించారు. ఈ ఏడాదిలోనే ఐకియా భారత్‌లో తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించనుంది. దేశంలో స్టోర్లను మరింతగా విస్తరించేందుకు పీటర్ కృషి చేయనున్నట్టు ఐకియా తెలిపింది. ఐకియాకు అత్యంత ముఖ్యమైన వృద్ధి మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, ఇక్కడి మార్కెట్లో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నట్టు కంపెనీ పేర్కొంది. ఇంతకుముందు ఈయన ఐకియా గ్రూప్ అతిపెద్ద మార్కెట్ జర్మనీకి సారథ్యం వహించారు. అంతేకాకుండా ఐకియా స్పెయిన్ కంట్రీ మేనేజర్‌గా పని చేశారు.

పొలారిస్‌తో ఐషర్ తెగదెంపులు

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన పొలారిస్ ఇండస్ట్రీస్‌తో భాగస్వామ్యాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఐషర్ మోటార్ ప్రకటించింది. పర్సనల్ యుటిలిటీ వెహికిల్ 'మల్టిక్స్' తయారీ, మార్కెటింగ్ కోసం అక్టోబర్ 2012లో పొలారిస్‌తో ఐషర్ మోటార్స్ జాయింట్ వెంచర్ కుదుర్చుకుంది. జూన్ 2015లో ఈ వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. వర్తకులకు వ్యాపారంతోపాటు వ్యక్తిగత అవసరాలకు కూడా పనికొచ్చేలా డిజైన్ చేసిన వాహనానికి మార్కెట్లో ఆశించినంత స్పందన లభించలేదు. దాంతో ఇరు వర్గాలు భాగస్వామ్యాన్ని రద్దు చేసుకున్నాయి. జాయింట్ వెంచర్ సంస్థ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఐషర్ పొలారిస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇపిపిఎల్) బోర్డు తీర్మానించిందని ఐషర్ మోటార్స్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జాయింట్ వెంచర్ కుదుర్చుకున్నప్పటి నుంచి గత ఏడాది చివరివరకు ఐషర్ మోటార్స్ ఇపిపిఎల్‌లో రూ.289.50 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. ఈ పెట్టుబడులను నియంత్రణ మండళ్ల నిబంధలకు లోబడి రైట్ ఆఫ్ చేయనున్నట్లు సంస్థ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో ఇపిపిఎల్ రూ.91.83 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది.

సావెక్స్ టెక్‌తో హువే జట్టు

న్యూఢిల్లీ : భారత్‌లో తన బిజినెస్ టు బిజినెస్ అమ్మకాలను పెంచుకునేందుకుగాను ఐటి, టెలికాం సొల్యూషన్ డిస్ట్రిబ్యూటర్ సావెక్స్ టెక్నాలజీతో హువే ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ గ్రూప్ (ఇబిజి) చేతులు కలిపింది. "సావెక్స్ భారత్‌లో మూడో అతిపెద్ద ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ డిస్ట్రిబ్యూటర్. ఈ సంస్థతో వ్యూహాత్మక ఒప్పందం వల్ల హువే చానల్ పార్ట్‌నర్ నెట్‌వర్క్, టెక్నికల్ శిక్షణ, అభివృద్ధికి అవకాశం ఉంటుంది" అని హువే తెలిపింది. హువే ఎంటర్‌ప్రైజ్ ఉత్పత్తులు, సొల్యూషన్లు భారత్ సరికొత్త డిజిటల్ యుగంవైపు అడుగులు వేసే విధంగా రూపొందించినట్టు హువే ఇండియా ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ గ్రూప్ ప్రెసిడెంట్ డెరెక్ హావో తెలిపారు.

చెన్నైలో పల్సస్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పల్సస్ గ్రూప్ చెన్నైలో తన కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ సంస్థ బహుళ భాషల్లో సైంటిఫిక్ జర్నల్స్, ఫార్మా కోవిజిలెన్స్ రంగాలపై దృష్టిసారిస్తోంది. చెన్నై, గుర్‌గ్రామ్ కేంద్రాల ద్వారా రానున్న కాలంలో 2,000 మంది ఫార్మా, లైఫ్ సైన్సెస్ గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కంపెనీ యోచిస్తోంది. స్థానిక భాషల్లో సైన్స్, హెల్త్‌కేర్ రచనలకు చాలా డిమాండ్ ఉందని, వీటిని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు పల్సస్ సిఇఒ శ్రీనుబాబు గేదెల తెలిపారు.

వచ్చే పదేళ్లలో 25 శాతం

లిస్టెడ్ కంపెనీలు కనుమరుగు!

స్టాక్ ఇన్వెస్టర్ పొరింజు వెలియాత్ హెచ్చరిక

కార్పొరేట్ పాలన ప్రమాణాలు పాటించని కంపెనీలకు దూరంగా ఉండటమే మేలని మార్కెట్ విశ్లేషకులు హెచ్చస్తున్నారు. వచ్చే పదేళ్లలో కనీసం 25 శాతం లిస్టెడ్ కంపెనీలు మార్కెట్ నుంచి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ ఇన్వెస్టర్ పొరింజు వెలియాత్ అభిప్రాయపడ్డారు. స్టాక్స్ ఎంపిక విషయంలో చాలా జాగ్రత్త అవసరమని ఆయన మదుపర్లకు సూచించారు. క్యాపిటల్ మార్కెట్‌పై పెద్దగా అవగాహన లేనివారు, కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించే మదుపర్లు ట్రాక్ రికార్డు బాగున్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడమే ఉత్తమం అని అన్నారు. వచ్చే 5-10 ఏళ్లలో భారీగా వృద్ధి చెందేందుకు అవకాశాలున్న బడా కంపెనీలను ఎంచుకోవాలన్నారు. మంచి కంపెనీల షేర్ల ధరలు గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పటికీ, అవి భవిష్యత్ మరింత వృద్ధి చెందగలవన్న ధీమా ఉంటుందని, మార్కెట్లో ఇలాంటి షేర్లు ఎప్పుడూ చౌకగా లభించవన్నారు. ఈ మధ్యకాలంలో మార్కెట్ దిద్దుబాటుకు లోనైనప్పుడు చిన్న, మధ్యస్థాయి షేర్లు 15 శాతం మేర క్షీణించాయి. కానీ ఫండమెంటల్స్ బాగున్న స్టాకులు మాత్రం మహా అయితే 5 శాతం వరకు తగ్గాయని వెలియాత్ పేర్కొన్నారు.

2027కల్లా రూ.396 లక్షల కోట్లకు ఈక్విటీ మార్కెట్

పదేళ్ల (2027నాటికి)లో భారత ఈక్విటీ మార్కెట్ సంపద 6.1 లక్షల కోట్ల డాలర్లకు (రూ.396.5 లక్షల కోట్లు) చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తోంది. 2017లో మన మార్కెట్ క్యాపిటలైజేషన్ 2.3 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. ఆసియా దేశాలన్నింటిలోకెల్లా భారత ఈక్విటీ మార్కెట్ సంపద శరవేగంగా వృద్ధి చెందనుందని, ఏటేటా 10.1 శాతం చొప్పున సమ్మిళిత వార్షిక వృద్ధిని నమోదు చేసుకోనుందని తాజాగా విడుదల చేసిన నివేదికలో మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. సంస్థ రిపోర్టులోని ముఖ్యాంశాలు..

- పదేళ్లలో ఆసియా ఈక్విటీ మార్కెట్ల సంపద ఉత్తర అమెరికా (యుఎస్, కెనడా)ను మించిపోనుంది. 2027కల్లా 56 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుంది. అంటే పదేళ్లపాటు 6.5 శాతం చొప్పున సమ్మిళిత వృద్ధిని నమోదు చేసుకోనుంది.
- 2027వరకు ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియాయేతర జి-20 దేశాలు సరాసరిగా 3.2-3.4 శాతం చొప్పున వృద్ధి చెందనున్నాయి.
- వచ్చే పదేళ్లలో ప్రపంచ మార్కెట్ సంపదలో ఆసియాదే 56 శాతం వాటా. ఉత్తర అమెరికా 29 శాతం, ఐరోపా 11 శాతం వాటా కలిగి ఉండనున్నాయి.
- ప్రస్తుతం 13.8 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న చైనా, హాంకాంగ్‌ల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్ వచ్చే పదేళ్లపాటు 7.9 చొప్పున వార్షిక సమ్మిళిత వృద్ధి చెంది 30 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చు.
- 2027నాటికి జపాన్ ఈక్విటీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 8 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుంది.

ఇండిగో, గోఎయిర్‌కు డిజిసిఎ షాక్

11 విమానాల నిలిపివేతకు ఆదేశం

న్యూఢిల్లీ: ప్రాట్ అండ్ విట్నీ (పి అండ్ డబ్ల్యు)కి చెందిన సమస్యాత్మక సిరీస్ ఇంజిన్లతో కూడిన పదకొండు ఎ320 నియో విమానాలను తక్షణమే నిలిపివేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆదేశించింది. అందులో 8 విమానాలను ఇండిగో, మూడింటిని గోఎయిర్ ఆపరేట్ చేస్తున్నాయి. మరో మూడు విమానాలను ఇండిగో ఇప్పటికే నిలిపివేసింది. దీంతో ఈ రెండు సంస్థలు సర్వీసులందించడంలో తీవ్ర ఇబ్బందులెదుర్కోవాల్సి రావచ్చని, కంపెనీల పనితీరుపైనా ప్రభావం పడనుందని మార్కెట్‌వర్గాలంటున్నాయి.


వరుస వైఫల్యాలు

ఈ మధ్యకాలంలో పి అండ్ డబ్ల్యుకు చెందిన ఒక సిరీస్ ఇంజిన్లలో తరచుగా సాంకేతిక లోపాలు తలెత్తాయి. తాజాగా సోమవారం ఇండిగోకు చెందిన ఎ320 నియో విమానం మధ్యాకాశంలో ప్రయాణిస్తున్నప్పుడు ఇంజిన్ ఆగిపోవడంతో అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటన జరిగిన కొద్ది గంటలకే డిజిసిఎ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా, పిడబ్ల్యు 1100 (ఇఎస్ఎన్ 450కి మించిన) ఇంజిన్లను అమర్చిన ఎ 320 ఎయిర్‌క్రాఫ్ట్‌లను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. మళ్లీ ఈ సిరీస్ ఇంజిన్లను విమానాల్లో ఫిట్ చేయవద్దని ఇండిగో, గోఎయిర్‌లను వారించింది. ఎందుకంటే, ఈ రెండు సంస్థల వద్ద ఈ సిరీస్‌కు మరిన్ని ఇంజిన్లు నిల్వ ఉన్నాయి.

ఆక్వా కంపెనీలకు అమెరికా ఝలక్

రొయ్యల దిగుమతిపై యాంటీ డంపింగ్ సుంకాల పెంపు.. అవంతీ ఫీడ్స్, వాటర్‌బేస్, అపెక్స్ ఫ్రోజెన్‌పై ప్రభావం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఆక్వా కంపెనీలకు అమెరికా ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. భారత్ నుంచి దిగుమతి అవుతున్న రొయ్యల (ష్రింప్)పై యాంటీ డంపింగ్ సుంకాలను ఏకంగా మూడింతలు పెంచినట్లు అమెరికా ప్రకటించింది. రొయ్యల దిగుమతులపై ఇప్పటి వరకు 0.84 శాతంగా యాంటీ డంపింగ్ సుంకాన్ని 2.34 శాతానికి పెంచినట్లు తెలిపింది. అమెరికా యాంటీ డంపింగ్ సుంకాల పెంపుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్న ఆక్వా కంపెనీలైన అవంతీ ఫీడ్స్, వాటర్‌బేస్, అపెక్స్ ఫ్రోజెన్, దేవి సీఫుడ్స్ సహా మరికొన్ని కంపెనీలకు గడ్డుకాలం ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ కంపెనీలు రొయ్యలు, చేపల దాణా, ష్రింప్ ప్రాసెసింగ్‌లో కీలకంగా ఉన్నాయి. మరోవైపు ఈ కంపెనీల ఎగుమతుల్లో అమెరికా మార్కెట్ వాటా దాదాపు 90 శాతంగా ఉంది. ఇందులో అవంతీ ఫీడ్స్, అపెక్స్ ఫ్రోజెన్, వాటర్‌బేస్ మార్కెట్లలో లిస్టవగా దేవి సీఫుడ్స్ త్వరలో పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సంధ్య మెరైన్స్ లిమిటెడ్, నెక్కంటి సీఫుడ్స్ కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కాగా అమెరికాలో రొయ్యల అమ్మకాలు, దిగుమతులను పరిశీలించిన పిదప యాంటీ డంపింగ్ సుంకాల విధింపునకు



సంబంధించి సమీక్ష నిర్వహించనున్నట్లు వాణిజ్య శాఖ తెలిపింది. యాంటీ డంపింగ్ సుంకాలను మదింపు చేయటానికి యుఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) పలువురి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటుందని డిఒసి తెలిపింది. సుంకాల విధింపునకు సంబంధించి దేశీయ కంపెనీలతో చర్చించిన తర్వాత అమెరికా ప్రభుత్వంతో విస్తృత స్థాయిలో చర్చలు జరపనున్నట్లు పేర్కొంది. మరోవైపు సీఫుడ్ ఇంపోర్ట్ మానిటరింగ్ ప్రొగ్రామ్ (ఎస్ఐఎంపి) కిందకు రొయ్యలను చేర్చాలన్న అమెరికా సెనెటర్ల ఆలోచనకు అనుగుణంగా యుఎస్ ప్రభుత్వం యాంటీ డంపింగ్ సుంకాలను పెంచినట్లు తెలుస్తోంది. అమెరికా ప్రధానంగా భారత్, ఇండోనేషియా, థాయ్‌లాండ్, వియత్నాం దేశాల నుంచి పెద్ద ఎత్తున రొయ్యలను ఎగుమతి చేసుకుంటోంది.

పతనబాటలో షేర్లు..

అమెరికా నిర్ణయంతో వాటర్‌బేస్, అవంతి ఫీడ్స్, అపెక్స్ ఫ్రోజెన్ షేర్లు పతనబాట పట్టాయి. సోమవారం వాటర్‌బేస్ షేరు ఇంట్రాడేలో ఏకంగా 8 శాతానికి పైగా పడిపోయి చివరలో కొద్దిగా కోలుకుని 5.62 శాతం నష్టంతో రూ.258.55 వద్ద స్థిరపడింది. అవంతీ ఫీడ్స్ షేరు 3.22 శాతం నష్టంతో రూ.22,81.70 వద్ద క్లోజైంది. అపెక్స్ ఫ్రోజెన్ షేరు స్వల్ప నష్టంతో రూ.653 వద్ద ముగిసింది.

అవంతీ ఫీడ్స్‌లో థాయ్ యూనియన్ వాటా విక్రయం

అవంతీ ఫీడ్స్‌లో థాయ్ యూనియన్ గ్రూప్ పబ్లిక్ కంపెనీ దాదాపు 10 శాతం వాటాను రూ.1,047.20 కోట్లకు విక్రయించింది. సోమవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ వాటాలను విక్రయించింది. 9.69 శాతానికి సమానమైన 44 లక్షల షేర్లను థాయ్ యూనియన్ ఆసియా ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ కొనుగోలు చేసింది. ఒక్కో షేరును 2,380 రూపాయల సగటు ధరకు థాయ్ యూనియన్ గ్రూప్ విక్రయించింది.

మార్కెట్‌లో రిలీఫ్ ర్యాలీ

600 పాయింట్లు దూసుకుపోయిన సెన్సెక్స్



ముంబై : ప్రపంచ మార్కెట్లలో ఏర్పడిన రిలీఫ్ ర్యాలీ ఎఫెక్టుతో భారత మార్కెట్లకు పెద్ద ఊరట లభించింది. కొద్ది రోజులుగా నిరాశ నిస్పృహల్లో ట్రేడవుతూ భారీ నష్టాలు చవిచూస్తూ వచ్చిన సెన్సెక్స్ 611 పాయింట్ల మేరకు దూసుకుపోయింది. రెండు సంవత్సరాల కాలంలో ఒక రోజులో సెన్సెక్స్ గరిష్ఠంగా లాభపడడం ఇదే ప్రథమం. అమెరికన్ ఆర్థిక వ్యవస్థపై నెలకొన్న ఆశాభావం మార్కెట్‌ను పరుగులు తీయించిందని బ్రోకింగ్ వర్గాలంటున్నాయి. దీనికి తోడు గత కొద్ది రోజులుగా భారీగా దిగజారిన మార్కెట్‌లో తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చిన నాణ్యమైన షేర్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు చూపిన ఆసక్తి, ఎఫ్‌పిఐల కొనుగోళ్లు కూడా మార్కెట్ ర్యాలీకి అండగా నిలిచాయని వారు చెప్పారు. మొత్తం మీద సర్వత్రా సానుకూలంగా కనిపించిన వాతావరణంలో సెన్సెక్స్ ఒక దశలో 33962.48 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకి చివరికి 610.80 పాయింట్ల లాభంతో 33917.94 వద్ద ముగిసింది. 2016 మార్చి ఒకటో తేదీన 777.35 పాయింట్ల భారీ లాభం అనంతరం సెన్సెక్స్ తిరిగి అత్యధికంగా లాభపడడం ఇదే ప్రథమం. నిఫ్టీ 194.55 పాయింట్ల లాభంతో 10421.40 పాయింట్ల వద్ద క్లోజయింది. 4.68 శాతం లాభంతో భారతి ఎయిర్‌టెల్ సెన్సెక్స్ షేర్లలో అగ్రగామిగా నిలవగా 4.09 శాతం లాభంతో ఐటిసి, 4.33 శాతం లాభంతో ఎన్‌టిపిసి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఒఎన్‌జిసి, విప్రో, ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, ఆర్ఐఎల్, హెచ్‌యుఎల్, ఎల్ అండ్ టి, సన్ ఫార్మా, కోటక్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ లాభపడిన షేర్లలో ఉన్నాయి.

- దేశీయంగా ఆటోమొబైల్ అమ్మకాలు ఫిబ్రవరిలో 8 శాతం మేరకు పెరిగాయన్న సియామ్ గణాంకాలతో టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్, మారుతి సుజుకీ, మహీంద్రా, బజాజ్ ఆటో లాభపడ్డాయి.
- వేదాంత, జిందాల్ స్టీల్, సెయిల్, హిండాల్కో, టాటా స్టీల్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, నాల్కో, ఎన్ఎండిసి, హిందుస్థాన్ జింక్ వంటి మెటల్ స్టాక్‌లు కూడా లాభపడ్డాయి.

ఇన్వెస్టర్ల సంపద రూ.1.78 లక్షల కోట్లు వృద్ధి

మార్కెట్‌లో ఏర్పడిన ఈ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద 1.78 లక్షల కోట్ల రూపాయల మేరకు పెరిగింది. బిఎస్ఇలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ 1,44,52,009 కోట్ల రూపాయల నుంచి ఒక్క సెషన్‌లోనే 1,78,393.67 కోట్ల రూపాయలంత పెరిగింది.

పారిస్, లండన్ ఎక్స్ఛేంజ్‌లకు ఇన్ఫోసిస్ గుడ్‌బై

పారిస్‌లోని యూరోనెక్స్ట్ ఎక్స్ఛేంజ్, లండన్ యూరోనెక్స్ట్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి స్వచ్ఛందంగా డీలిస్ట్ కావాలని సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ నిర్ణయించింది. అయితే న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మాత్రం యథాతథంగా కొనసాగుతుంది. రోజువారీ ట్రేడింగ్ సగటు చాలా తక్కువ స్థాయికి పడిపోవడం ఆ రెండు ఎక్స్ఛేంజ్‌ల నుంచి వైదొలగాలన్న నిర్ణయానికి కారణమని తెలిపింది. 2013 నుంచి ఇన్ఫోసిస్ ఈ రెండు ఎక్స్ఛేంజ్‌ల్లోనూ ట్రేడవుతోంది.

ఎయిర్‌టెల్ రూ.16,500 కోట్లు సమీకరణ

రుణాల రీఫైనాన్సింగ్ అవసరాలతో పాటు స్పెక్ట్రమ్ చెల్లింపుల కోసం 16,500 కోట్ల రూపాయల సమీకరణకు సంకల్పించిన భారతి ఎయిర్‌టెల్‌కు డైరెక్టర్ల బోర్డు అనుమతి లభించింది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన పది వేల కోట్ల రూపాయల విలువ గల ఎన్‌సిడిల జారీకి, ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ విడతల్లో విదేశీ కరెన్సీ బాండ్ల జారీ ద్వారా 100 కోట్ల డాలర్ల సమీకరణకు ఈ అనుమతి వర్తిస్తుంది. గత ఏడాది డిసెంబరు 31 నాటికి ఎయిర్‌టెల్ కన్సాలిడేటెడ్ రుణ భారం 91,480 కోట్ల రూపాయలుంది.

జెఎస్‌డబ్ల్యు స్టీల్ నిధుల సమీకరణ

డాలర్ మారకంలో నోట్లు జారీ చేయడం ద్వారా నిధులు సమీకరించనున్నట్లు జెఎస్‌డబ్ల్యు స్టీల్ ప్రకటించింది. మార్కెట్ పరిస్థితులను బట్టి ఈ నోట్లు ఎప్పుడు జారీ చేసేది నిర్ణయించనున్నట్లు తెలిపింది.

"దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడం ఇన్వెస్టర్లను మురిపించింది."
- వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

"ఆసియా మార్కెట్లలో ఏర్పడిన ర్యాలీ దేశీయ మార్కెట్‌కు ఉత్తేజం ఇచ్చింది. అమెరికా వాణిజ్య యుద్ధ భయాలు తగ్గడంతో పాటు వారాంతంలో ప్రకటించిన అమెరికా ఉపాధి గణాంకాలు కూడా ప్రోత్సాహకరంగా ఉండడం మార్కెట్‌ను పరుగులెత్తించింది."
- కార్తిక్‌రాజ్ లక్ష్మణన్, బిఎన్‌పి పారిబా ఎంఎఫ్

15 ఏళ్ల కనిష్ఠ స్థాయిలో ఆంధ్రాబ్యాంక్
కుప్పకూలిన షేరు ధర



ఆంధ్రాబ్యాంక్ షేరు ధర 15 ఏళ్ల కనిష్ఠ స్థాయిని చేరింది. సోమవారం నాడు మార్కెట్ బుల్లిష్‌గా ఉన్నప్పటికీ ఆంధ్రా బ్యాంక్ షేరు ధర మాత్రం 7 శాతం నష్టపోయింది. ఇంట్రాడేలో షేరు ధర 32.55 రూపాయలను తాకింది. ఇది దాదాపు 15 ఏళ్ల కనిష్ఠ స్థాయిగా మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. సోమవారం నాడు బిఎస్ఇలో షేరు అత్యంత బలహీనంగా 35.85 వద్ద ముగిసింది. సంస్థ మాజీ డైరెక్టర్ అనూప్ గార్గ్‌పై వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇడి శుక్రవారం నాడు తుది చార్జ్ షీట్ దాఖలు చేసిన వార్తలతో బ్యాంకు షేరు ధర భారీగా పతనమైంది. బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తున్న పిఎన్‌బి స్కామ్ దెబ్బకు ఇప్పటికే దాదాపు అన్ని పిఎస్‌యు బ్యాంకుల షేర్లు పతనమార్గంలో ఉన్నాయి. ఈ దెబ్బకు తోడుగా గర్గ్ దెబ్బ కూడా తోడుకావడంతో ఆంధ్రా బ్యాంకు షేర్లలో పతనం మరింత తీవ్రంగా ఉంది.

ఇదీ కేసు...

గుజరాత్‌కు చెందిన స్టెర్లింగ్ బయోటెక్ అనే సంస్థ, గార్గ్ ఆంధ్రా బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్న కాలంలో బ్యాంకుల కన్సార్టియం నుంచి 5,000 కోట్ల రూపాయల మేర రుణాలు తీసుకుంది. 2008-09 మధ్య కాలంలో తప్పుడు వివరాలు, లెక్కలను సమర్పించి అర్హత లేకున్నా బ్యాంకుల నుంచి భారీగా రుణాలు దండుకునేందుకు గార్గ్ సహకారాన్ని స్టెర్లింగ్ బయోటెక్ తీసుకుంది. ఈ సహాయానికి గాను ముడుపుల కింద స్టెర్లింగ్ బయో ప్రమోటర్లు చేతన్ జయంతీలాల్ సందేశరా, నితిన్ జయంతీలాల్ సందేశరా నుంచి 1.52 కోట్ల రూపాయల మేర గార్గ్‌కు అందాయి. ఈ వివరాలను 2011లో ఐటి అధికారులు స్టెర్లింగ్ బయోపై జరిపిన దాడి సందర్భంగా లభించిన ఒక డైరీలో ఉన్నాయి. ఐటి నుంచి అందిన వివరాలతో సిబిఐ గతేడాది అక్టోబర్‌లో గార్గ్‌కు వ్యతిరేకంగా కేసు నమోదు చేసింది. బ్యాంకులకు స్టెర్లింగ్ బయోటెక్ సుమారు 5,383 కోట్ల రూపాయలను ఎగవేసినట్టుగా సిబిఐ ఆరోపించింది. ఆంధ్రా బ్యాంకు పద్దుల్లోనే స్టెర్లింగ్ బకాయిల మొత్తం 1,150 కోట్ల రూపాయలున్నట్టు తెలిసింది. ముడుపుల సొమ్మునకు సంబంధించి గార్గ్ మనీలాండరింగ్‌ను పాల్పడినట్టుగా వెల్లడికావడంతో ఇడి రంగంలోకి దిగింది.

బ్యాంకుల మార్కెట్ విలువ రూ.90 వేల కోట్లు హాంఫట్

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం బట్టబయలైన నెల రోజుల వ్యవధిలో బ్యాంకింగ్ ఇండెక్స్ 20 శాతం దిగజారింది. నెల రోజుల్లో నిఫ్టీ పతనం 1.6 శాతంతో పోల్చితే ఇది 20 శాతం ఎక్కువ. ఫలితంగా స్టాక్‌మార్కెట్లో లిస్టింగ్ అయిన 21 పిఎస్‌బిల ఉమ్మడి మార్కెట్ విలువ 90 వేల కోట్ల మేరకు ఆవిరైపోయింది. ఫిబ్రవరి 12వ తేదీన ఈ బ్యాంకుల ఉమ్మడి మార్కెట్ విలువ 4,75,300 కోట్ల రూపాయలుండగా సోమవారం నాటికి అది 3,84,600 కోట్ల రూపాయలకు క్షీణించింది.

తదుపరి నిరోధం 10500

టెక్ వ్యూ

నిఫ్టీ 100 పాయింట్ల పైన 10300 వద్ద ప్రారంభమై 10350 వద్ద కన్సాలిడేట్ అయి చివరికి డే గరిష్ఠ స్థాయిలో 10420 వద్ద క్లోజయింది. టెక్నికల్‌గా వెయ్యి పాయింట్ల కరెక్షన్ అనంతరం ఏర్పడిన రిలీఫ్ ర్యాలీగానే దీన్ని భావించాలి. ఈ బలమైన రికవరీతో తక్షణ డౌన్‌ట్రెండ్‌ను నిలువరించినట్టు కనిపిస్తోంది. కాని బుల్లిష్ ధోరణిలో ఇంకా ప్రవేశించలేదు. ఇప్పటికీ 20 డిఎంఎ కన్నా దిగువనే ఉంది.

- మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 10500 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం 10600. గత నెలలో ఈ స్థాయిలో రెండు టాప్‌లు ఏర్పడ్డాయి.
- 10500 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10300. అంతకన్నా దిగజారితే కరెక్షన్ ముప్పు ఎదుర్కొంటుంది.
- బ్యాంక్ నిఫ్టీ మైనర్ అప్‌ట్రెండ్ సాధించింది. ప్రధాన నిరోధం 25000.

సూచన : స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు బై పొజిషన్లు హోల్డ్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10500 మద్దతు : 10300

■ వి.సుందర్ రాజా

ఉదయం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ బహుళ ఏకాదశి/ద్వాదశి **నక్షత్రం :** ఉత్తరాషాఢ (12.30 వరకు), శ్రవణం ఆర్ద్ర, స్వాతి, శతభిషం/పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మిథున రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10421.40 (+194.55)

ట్రెండ్ మార్పు వేళలు : 12.30

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 12.30 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ ఆ తర్వాత 2 గంటల వరకు నిస్తేజంగా ఉండి తదుపరి చివరి వరకు నిలకడ/మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయంలో క్లోజ్ చేసుకోవాలి. 2.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే మరిన్ని లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపులో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం: 10460, 10500 **మద్దతు స్థాయిలు:** 10385, 10350

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM 3.94(4.14)20
ADITYA SPIN. 8.25(8)517
AGRO TECH FO 625.95(623.55)850
AISHWARYA TE 5.66(5.75)2050
ALPHAGEO (I) 748.55(760)4364
ALU FLUORIDE 107.7(108.65)10466
AMAR RAJA BA 812.95(793.5)21775
ANDHRA BANK 35.85(38.5)4443299
ANDHRA CEMEN 9.7(10.13)38070
ANDHRA PETRO 58.9(57.65)77120
ANJANI PORTL 178(177.05)1329
ASTRA MICRO 86.25(85.05)59726
AUROB.PHARMA 582(592.45)741253
AVANTEL LTD 546.6(524)6046
AVANTI FEEDS 2281.7(2357.7)4428133
B.N.RATHI SE 39.55(39.05)27468
BALAJI AMINE 572.5(576)8763
BAMBINO AGRO 225.05(234)1159
BARTRONICSIN 12.03(11.8)7274
BHAGIRA.CHEM 282(289)300
BHAGYA INL 45.3(47.15)31143
BHARATFIN 1062.85(1032.3)37495
BNR UDYOG 30.7(30.5)133
CAMBRIDGE 72.7(73.15)3535
CAT TECHN. 1.04(1.09)99
CCHHL 13.43(13.43)17699
CCL PRODUCTS 287.6(289.15)2357
CELESTIAL 14.55(15)13543
CIL SECURITS 26.9(25.65)1191
COROM INTER 506.65(510.2)8385
CUBEX TUBING 22.7(23.75)6336
CYBERMATE 3.03(2.83)22569
CYIENT 624.5(621.9)20396
DANLAW TECH. 73.7(73)1583
DECAN CEMENT 539(541)1168
DHAN ROTO SP 47.5(50)2493
DIAMONPOWER 11.73(11.95)51115
DIVI'S LAB. 1010.7(996.45)15286
DIVYA.GRANIT 94.95(92)4
DQ ENT 13.05(12.81)11835
DR.REDDY'S 2147.1(2130.45)30666
EMPEE SUGARS 3.55(3.72)11605
EVEREST ORG. 137(143)456
FACOR ALLOYS 2.82(2.75)395413
FIRSTOBJ 15.2(15.55)7426
GATI LTD. 101.15(100.95)113338
GAYATRI PROJ 206.2(201.35)6443
GENNEX LAB 3.91(3.89)224987
GMR INFRASTR 17.4(17.1)3155901
GODAVARI DRU 32.55(34)1610
GOLDST INFRA 196.35(197.05)8453
GOLDSTONE EN 13.36(13.65)2030
GRANULES (I) 108.6(107.2)80288
GVK POWERINF 15.35(14.65)477316
HBL P SYS 48.25(49.6)70851
HERITGFOOD 694(694.2)552
HIND.FLUROCA 9.54(10.01)900
I.C.S.A. IND 3.25(3.1)8384
IKF TECHNO .61(.62)68602
INCAP LTD. 80.5(80)201
IPAPPM 297.8(289.65)9406
IVRCL LTD 3.76(3.9)336725
KAKATIYA CEM 264.05(268.65)7548
KALLAM SPG. 31.3(31.5)24098
KAVERI SEED 483.15(479.9)26030
KCP LTD 115.9(117.25)9596
KERNEX MICRO 37.25(38.2)17542
KNR CONST 294.35(295)7931
KREBS BIOCHM 204.15(209.2)1707
LANCO INFRA 1.01(1.06)818530
LOKESH MACH 58.25(58.65)25129
LOTUS CHOC 49.95(50.35)2606
MADHUCON PRJ 24.05(23.95)21982
MOLD-TEK TEC 53.85(55.5)400448
MOSCHIP SEMI 31.15(28.55)169229
MSR INDIA 49.7(49.4)1087
N C L IND. 222.6(219.05)12645
NACLIND 41.15(38.8)45523
NATCO PHARM 729.55(721.05)45601
NCC 122.8(117.95)755943
NEHA INTER. 6.57(6.59)50147
NETTLINX LTD 75.15(80.4)12116
NEULAND LAB. 704.6(715)1911
NIHAR INFO 12.86(12.25)1002
NILE LTD. 699.1(726.95)9234
NTL 3.7(3.56)1
OIL COUNTRY 37.05(37.7)10442
PADMALAYA TE 3.61(3.8)11163
PALRED 76.8(73.75)4151
PANYAM CEMEN 42.45(44.05)18075
PENNAR STEEL 55.8(55.25)38567
PFL INFOTECH 8.37(8.81)1651
PHYTOCHEM I. 61.85(60.9)5986
PITTI LAMIN. 86.1(86.7)4243
POKARNA LTD 193.15(198.2)3778
PRAJAY ENGS. 12.51(13.05)10257
PREMIER EXPL 364.5(361)458
PRISM CEMENT 116.4(115.9)72722
RAIN 392.45(388.5)389140
RAJ PACKAGIN 41.3(35.1)34757
REG.CERAMIC 5.64(5.93)410
RESTILE CER. 7.15(6.6)21
SAAMYA BIO 1.89(1.89)10
SAGAR CEM. 934.55(921.8)5679
SAMKRG PIST. 291.1(290.8)9430
SAMPRE NUTRI 54.95(53.4)740
SANGHI IND. 118.4(110.85)78596
SATVAH.ISPAT 20.1(19.95)3906
SAVEN TECHNO 26.8(27)60234
SMPL 1.27(1.29)43331
SMS PHARMACE 77.4(76.25)7393
SREE RAYALA 150.5(152.1)4583
STEEL EXCH 24.7(24.4)32750
SUJANA INDUS .77(.81)156117
SURANATP 4.95(4.9)4865
SURYACHAKRA .94(.9)19861
SURYAMBA SP 70.45(74.9)113
SURYAVA SPIN 6.36(6.06)175
SURYLAK.COTT 72.05(73)102979
SUVEN LIFE S 178.7(176.85)58158
TAJ GVK HOTL 154.8(151.7)2831
TANLA 33.15(33.45)77698
TRANSCORP IN 32.85(32)1257
TRANSGENE BI 2.25(2.35)27356
TRANSPORT CO 256.4(261.95)3386
USHER AGRO 5.21(5.31)9537
VICEROY HOTE 13.95(14)16391
VIJAY TEXTIL 43.1(45.3)8179
VIMTA LABS 199.45(194.35)2338
VIRAT CRANE 58.85(56.05)30074
VIRINCHI 101.65(105.65)48443
VISAKA IND. 663.15(639)8013
VISTA PHARMA 42.5(42.65)43167
VIVIMED LABS 75.45(71.9)169050
VST INDUS. 2946.75(2989.2)53
WATERBASE 258.55(273.95)332163
XLENERGY 2.5(2.49)3031
YBRANTDIGI 5.04(4.99)228035
ZEN TECH 133(132.45)100059
ZENOTECH 39.55(37.7)68009

ఎన్ఎస్ఇ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా


AARTIDRUGS 533(558.85)33830
AARTIIND 1156.55(1168)28922
ABAN 157.55(156.7)453256
ABB 1433.6(1437.7)16143
ABFRL 145.05(144.1)481372
ABGSHIP 9.25(9.45)12735
ACC 1559.9(1531.85)270932
ADANIENT 162.25(156.1)20088994
ADANIPORTS 386.6(377.9)3693431
ADANIPOWER 26.35(25.45)9979106
ADANITRANS 185.3(182.75)847233
AEGISCHEM 242.95(243.1)142126
AHLUCONT 373.25(368.6)47409
AIAENG 1442.95(1446.3)11248
AJANTPHARM 1353.2(1321.65)119908
AKZOINDIA 1830.45(1756.1)11432
ALBK 45.4(45.45)5133175
ALLCARGO 155.8(159.65)608131
ALOKTEXT 3(2.9)1943505
AMARAJABAT 813.55(793.7)373895
AMBUJACEM 240.85(235.4)1926518
AMTEKAUTO 26.05(24.85)1908014
ANANTRAJ 51(50.45)619108
ANDHRABANK 35.95(38.55)58615136
APARINDS 753.8(761.3)17848
APLLTD 543.25(532.55)13738
APOLLOHOSP 1129.65(1149.05)278157
APOLLOTYRE 262.15(260)1659940
ARVIND 402.45(388.95)1281777
ASHIANA 155.7(158.15)88760
ASHOKA 226.7(226.2)84577
ASHOKLEY 145.4(147)17320780
ASIANPAINT 1131.5(1129.1)527293
ASTRAL 864.35(865.25)77732
ASTRAZEN 975.95(984.1)5027
ATUL 2694.05(2639)10217
AUROPHARMA 582.85(592.45)2692769
AVANTIFEED 2283.55(2362.05)200972
AXISBANK 519.2(505.35)5283334
BAJAJ-AUTO 2957.75(2935.4)246428
BAJAJCORP 466.2(472.55)15703
BAJAJELEC 576.55(565.8)516014
BAJAJFINSV 5040.05(4966.25)107704
BAJAJHIND 10.05(10.75)8095095
BAJAJHLDNG 2745.35(2728.8)63508
BALKRISIND 1042.55(1038.45)163301
BALLARPUR 12.85(13.25)702489
BALMLAWRIE 225.9(224)54209
BALRAMCHIN 86.9(85.1)11255160
BANKBARODA 132.1(131.55)13816607
BANKINDIA 95.1(97.65)13853663
BASF 2083.9(2060.5)6023
BATAINDIA 710.9(707.75)472461
BBTC 1349.9(1346.65)86354
BEML 1122.55(1110.55)1429416
BERGEPAINT 245.9(247.2)458727
BFUTILITIE 402.95(402.1)416695
BGRENERGY 105.6(107.3)72710
BHARATFIN 1066.9(1034)827021
BHARATFORG 735.6(747.8)933624
BHARTIARTL 421.55(402.15)7558993
BHEL 86.95(86.15)9123597
BHUSANSTL 42.25(44.15)3223058
BIOCON 595.25(595.15)2071157
BIRLACORPN 802(804.7)46772
BLISSGVS 183.3(184.35)123976
BLUEDART 4179.65(4229.1)17661
BLUESTARCO 789.95(797.6)94863
BOMDYEING 241.45(242.8)2581717
BOSCHLTD 18247.45(18203.55)8342
BPCL 446.75(439.4)2541996
BRFL 46.85(49.3)73397
BRIGADE 273.5(272.2)25172
BRITANNIA 4866.8(4841.8)73006
CADILAHC 389.3(384.2)574306
CANBK 238.6(235.45)15383581
CAPF 643.15(643.95)781200
CARERATING 1345.15(1350.5)15744
CASTEXTECH 4.45(4.6)6412265
CASTROLIND 207(204.4)3706009
CCL 288.4(290.1)59809
CEATLTD 1552.45(1546.5)373379
CENTRALBK 74.6(75.25)6209754
CENTURYPLY 322.7(325.9)130748
CENTURYTEX 1186.25(1134.3)709577
CERA 3183.65(3145.45)13195
CESC 968.75(981.8)486243
CHAMBLFERT 158.7(153.15)547809
CHENNPETRO 347.05(341.85)247590
CHOLAFIN 1445.5(1402.45)170541
CIPLA 580.65(571.05)919792
CLNINDIA 550.85(543.5)11838
COALINDIA 297.65(304.05)6796993
COLPAL 1043.95(1037.65)211717
CONCOR 1238.25(1248.7)153267
COROMANDEL 506(510.3)114679
CORPBANK 29(29.6)360099
COX&KINGS 250.6(253.05)70624
CRISIL 1952.7(1961.8)6687
CUB 181.7(179.95)1587282
CUMMINSIND 776.2(776.75)107217
CYIENT 626.8(622.2)122254
DABUR 327.75(327.25)1508106
DALMIABHA 2843.1(2740.55)110734
DBCORP 322.85(332.95)471146
DBREALTY 53.85(52.2)1184818
DCBBANK 161.2(160.5)978758
DCMSHRIRAM 484.7(488.95)122813
DEEPAKFERT 323.35(311.85)247772
DELTACORP 319.9(314.9)1594508
DEN 94.15(93.15)107948
DENABANK 18.4(18.75)1624550
DHANUKA 582.6(583)11760
DHFL 513.9(496.25)5945277
DISHTV 65.8(66.3)2384001
DIVISLAB 1013.8(998.7)244331
DLF 217.7(211.35)6107809
DREDGECORP 665.85(654.15)237647
DRREDDY 2148.4(2129.9)530428
DYNAMATECH 1739(1734)7065
ECLERX 1355.95(1384.6)20900
EDELWEISS 264.95(260.15)1042896
EICHERMOT 28316.9(27963.85)23032
EIDPARRY 298.95(300.15)59922
EIHOTEL 168.7(173.95)67674
ELECTCAST 27.85(28.75)424393
ELGIEQUIP 280.55(285.1)67793
EMAMILTD 1061.55(1084.5)105102
ENGINERSIN 163.45(162.5)1179034
EROSMEDIA 173.55(174.95)483188
ESCORTS 857.55(851.45)647041
ESSDEE 52.1(53.7)16366
ESSELPACK 253.05(252.5)17619
EVEREADY 354.8(376.7)165463
EXIDEIND 213.1(210)1927013
FCONSUMER 50.3(52.9)7926411
FDC 284.8(282.45)246881
FEDERALBNK 94.45(94)6349997
FINCABLES 707.85(699.95)172770
FINPIPE 644.4(632.45)31880
FLFL 387.15(393.25)23458
FORTIS 149.3(145.4)8539983
FSL 49.35(48.65)5628252
GAIL 446.45(436.9)1934480
GATI 101.65(101.1)444342
GDL 208.1(204.3)36014
GEPIL 846.8(845)7499
GESHIP 355.05(351.9)30112
GET&D 390.4(387.45)20424
GILLETTE 6599.65(6571.45)2727
GLAXO 2256.15(2272.8)8479
GLENMARK 536.65(533.15)723438
GLOBOFFS 26.35(26.35)59970
GMDCLTD 128.35(125.95)493065
GMRINFRA 17.45(17.1)30564825
GODFRYPHLP 833.65(804.65)160355
GODREJCP 1078.6(1072.85)232726
GODREJIND 538.55(547)749231
GODREJPROP 736.2(741.9)47461
GPPL 143.2(143.3)139929
GRANULES 108.5(107.2)1043838
GREAVESCOT 119.4(119.8)415403
GREENPLY 323.6(327.15)65162
GRINDWELL 505.15(510.5)12141
GRUH 553.35(548.9)206130
GSFC 122.25(119.85)1319674
GSKCONS 6836.65(6626.75)11245
GSPL 195.4(200.15)530924
GUJFLUORO 776.35(781.4)16838
GUJGASLTD 853.35(855.7)13388
GULFOILLUB 924.35(963.9)11735
GVKPIL 15.35(14.65)2409035
HATHWAY 33.5(34.7)2463051
HAVELLS 505.2(503.25)744387
HCC 31.3(31.1)4079730
HCL-INSYS 54.1(53.55)1842289
HCLTECH 967.65(943)2473118
HDFC 1858.05(1818.6)3242604
HDFCBANK 1867.25(1851.05)1639279
HDIL 41.4(42.2)14927994
HEIDELBERG 149.95(148.75)148604
HEROMOTOCO 3694.5(3586.35)192336
HEXAWARE 375.15(362.6)1247253
HFCL 27.05(26.25)5359416
HIMATSEIDE 331.6(334.25)33423
HINDALCO 227.65(220.2)9531278
HINDCOPPER 64.75(63.65)1942505
HINDPETRO 366.75(357.05)1930082
HINDUNILVR 1324.2(1300.75)874857
HINDZINC 318.85(313.3)3756718
HMT 29.95(30.3)84385
HMVL 229.1(230.55)10097
HONAUT 15891.95(15861.45)3736
HOTELEELA 17.5(17.5)251137
HSIL 405.1(409.05)65893
HTMEDIA 86(85.95)214089
IBREALEST 203.7(200.7)4781134
IBULHSGFIN 1210.45(1199.2)1406491
ICICIBANK 300.65(292.7)12163952
ICRA 3755.5(3758.45)2517
IDBI 64.85(70.7)69313252
IDEA 78.5(78.85)11486493
IDFC 50.15(49.05)4213818
IFBIND 1331.4(1332.65)7547
IFCI 20.95(21.2)12538289
IGARASHI 795.3(803.7)83870
IIFL 847.9(809.6)1353073
IL&FSTRANS 66.9(67.6)190854
INDHOTEL 128.7(128.6)931276
INDIACEM 149.55(145.15)3049464
INDIANB 283.65(278.45)2041514
INDOCO 240.85(240.8)629753
INDUSINDBK 1735.3(1697.55)858788
INEOSSTYRO 894.85(879)7445
INFRATEL 339.5(333.15)6680146
INFY 1185.75(1163.4)3838485
INGERRAND 713.35(710.85)7684
INOXLEISUR 262.65(267.35)50398
INOXWIND 119.95(120.4)170308
INTELLECT 178.05(177.35)307147
IOB 18(18.15)1690948
IOC 400.65(385.5)13848992
IPAPPM 296.75(289)44027
IPCALAB 683.8(679.8)125212
IRB 216.4(214.7)1204421
ITC 270.1(259.25)19900387
J&KBANK 60.5(61.05)603560
JAGRAN 162.65(164.6)53095
JAICORPLTD 128.85(128.7)1735996
JBCHEPHARM 301.55(300.6)47978
JBFIND 135.8(138.75)119489
JCHAC 2497.05(2364)32724
JETAIRWAYS 689(688.35)2492174
JINDALPOLY 339.35(331.6)87951
JINDALSTEL 230.4(222.25)12273881
JISLJALEQS 107.85(104.05)8586386
JKCEMENT 1005.85(1004.35)30244
JKIL 295.6(284.45)80833
JKLAKSHMI 422.6(419.05)111328
JKTYRE 153.75(153.4)459500
JMFINANCIL 130.75(129.1)887187
JPASSOCIAT 14.6(13.95)50770866
JPINFRATEC 9.6(9.95)8920695
JPPOWER 6.15(5.15)13445481
JSWENERGY 77.5(78.8)3088849
JSWHL 1665.05(1641.6)3674
JUBILANT 804.25(795.6)454488
JUBLFOOD 2084.05(2060.3)882266
JUSTDIAL 428.55(421.95)1246822
JYOTHYLAB 353.5(352.6)47006
KALPATPOWR 459.85(465.7)43461
KANSAINER 494.9(484.7)237367
KEC 389(401.65)399726
KESORAMIND 115.2(115.3)430436
KIRLOSENG 363.5(360.25)11024
KITEX 251.65(246.7)49020
KOLTEPATIL 324.35(320.65)122874
KOTAKBANK 1100.6(1082.45)1255474
KPIT 217.5(210.15)2378499
KRBL 469.15(440.5)695348
KSCL 482.45(480.15)451660
KSK 9.45(9)1348247
KTKBANK 115.9(115.55)7702902
KWALITY 89.75(86.5)2148449
L&TFH 162.5(160)3518650
LAKSHVILAS 101(99.5)443127
LAOPALA 650.25(639.2)19174
LAXMIMACH 6424.85(6428.85)2864
LICHSGFIN 492.55(483.3)2756313
LITL 1(1.05)2165400
LT 1310.05(1290.5)2267260
LUPIN 769.8(764.5)1174238
M&M 737.1(728.5)1867680
M&MFIN 414.9(419.95)2278135
MAGMA 157.65(150.85)64967
MAHINDCIE 225.7(229.45)95163
MAHLIFE 445.9(435.5)22549
MANAPPURAM 104.35(102.5)2698485
MANPASAND 380.1(374.3)160725
MARICO 309.45(308.6)444257
MARKSANS 35.25(35.95)2204861
MARUTI 8810.3(8660.6)438339
MAYURUNIQ 513.4(519.4)16063
MCDOWELL-N 3134.1(2978.25)777077
MCLEODRUSS 152.75(154.3)190757
MERCK 1516.45(1500.15)10140
MHRIL 295.8(296.3)59852
MINDACORP 180.3(175.05)191067
MINDTREE 815.15(813.85)1266696
MMTC 48.15(45.85)1537478
MOIL 205.3(203.45)337447
MONSANTO 2591.25(2559.7)5640
MOTHERSUMI 319.2(317.15)1843613
MOTILALOFS 1135.2(1124.15)38547
MPHASIS 856.85(825.1)516985
MRF 71094.2(70781.65)3757
MRPL 116.45(115.65)531424
MTNL 19.95(20.3)1336374
MUTHOOTFIN 378.15(370.65)478850
NATCOPHARM 730.05(719.4)219426
NATIONALUM 63.85(62.5)3684146
NAUKRI 1228.5(1269.9)51348
NAVKARCORP 158.75(156.85)120416
NCC 123.15(118.1)6509117
NETWORK18 53.8(49.8)2924088
NHPC 26.65(26.85)5347073
NIITTECH 910.6(879.25)1576384
NITINFIRE 5(5.2)261324
NLCINDIA 96.95(97.3)218391
NMDC 123.75(121.9)3630215
NTPC 171.15(164.4)2911168
OBEROIRLTY 532(524.8)489962
OFSS 3934.35(3892.1)15476
OIL 326.7(320.85)300758
OMAXE 227.25(226.4)538410
ONGC 183.85(179.9)4161129
ORIENTBANK 89.35(91.25)11345864
ORIENTCEM 145.6(148.45)65584
ORISSAMINE 1623.75(1655.45)6162
PAGEIND 21626.75(21504.55)11942
PARSVNATH 15.8(16.6)130165
PCJEWELLER 338.5(337.4)3210285
PEL 2415.55(2362.6)120392
PERSISTENT 826.5(820.35)377461
PETRONET 231(230.7)4320480
PFC 88.25(93.1)12617836
PFIZER 2200.05(2196.9)13957
PFS 26.2(26.9)1648514
PGHH 9402.45(9402.7)1262
PHOENIXLTD 680.15(699.05)333931
PIDILITIND 890.25(878.7)520945
PIIND 862.7(861.55)109847
PNB 94.6(95.6)45021305
POLARIS 471.95(472.05)11605
POWERGRID 195(192.9)8011688
PRAJIND 77.55(78.2)737665
PRESTIGE 303.8(304.85)148634
PRISMCEM 116.5(115.75)637618
PTC 92.05(90.2)1778046
PUNJLLOYD 17.45(17.7)1147796
PURVA 140.05(143.6)180944
PVR 1319(225)150000
PVR 1324.3(1320.95)76149
RADICO 332.9(321.4)1381091
RAIN 393.3(389.45)3195175
RAJESHEXPO 805.4(805.15)94945
RALLIS 231.75(229.45)200609
RAMCOCEM 736.65(725.9)289071
RAMCOSYS 423.95(421.45)25344
RATNAMANI 890.5(896.3)9681
RAYMOND 923.45(901.75)331480
RCF 73.25(75.4)2186261
RCOM 23(22.7)76366808
RECLTD 126.45(128.15)4390077
REDINGTON 141.95(136.65)523230
RELAXO 618.35(611.3)7266
RELCAPITAL 432.55(410.9)5535527
RELIANCE 930.3(913.1)3801407
RELINFRA 430.75(416.8)2879831
RENUKA 15.45(15.55)5222412
REPCOHOME 561.45(547.6)234703
RIIL 429.15(421.65)265039
RKFORGE 751.15(751.2)44331
RNAVAL 35.1(33.85)3161599
ROLTA 63.25(62.55)1103433
RPOWER 39.15(38.25)6484927
RTNPOWER 5.6(5.75)5415412
RUCHISOYA 16.8(17.05)556049
SADBHAV 383.75(381.45)312251
SADBHIN 129.85(129.75)43863
SAIL 72.35(69.5)19443718
SANOFI 5079.4(5089.05)2526
SBIN 252.85(253.25)25332474
SCHAEFFLER 5293.45(5330.55)2019
SCHNEIDER 109.2(109.35)100243
SCI 63.4(63.5)694114
SHARDACROP 376.05(385.2)10504
SHILPAMED 447(445.85)73696
SHK 272.2(275.15)24257
SHOPERSTOP 538.95(533.15)22637
SHREECEM 16151.5(16000.75)17193
SHRIRAMCIT 2019.35(1973.55)52487
SIEMENS 1106.85(1085.8)78009
SIMPLEXINF 544.3(564.8)49169
SINTEX 18.4(18.4)2449257
SITINET 14.65(15.75)1171127
SJVN 34.9(34.85)916401
SKFINDIA 1726.1(1743.35)3636
SMLISUZU 763.15(782.65)18641
SNOWMAN 48.25(47.9)399404
SOBHA 548.35(552.25)92425
SOMANYCERA 655.5(651.6)65001
SONATSOFTW 314.75(319.55)259563
SOUTHBANK 24.7(24.95)8622030
SPARC 408.85(405)208876
SREINFRA 81.65(77.85)1522268
SRF 1868.95(1853.35)99184
SRTRANSFIN 1343.7(1338.7)1208005
STAR 667.95(661.15)153682
STCINDIA 140.35(140.2)61467
SUNDARMFIN 1659.05(1663.2)56265
SUNDRMFAST 579.05(574.05)189343
SUNPHARMA 512.65(506.8)4632925
SUNTV 893(879.3)1531117
SUPREMEIND 1185.85(1196.7)34414
SUVEN 178.15(176.45)246272
SUZLON 11.35(11)25480021
SWANENERGY 181.55(187.9)384137
SYMPHONY 1799.95(1794.55)19678
SYNDIBANK 54.35(54.35)4816123
SYNGENE 578.1(578.4)37011
TAKE 170.7(164.8)241049
TATACHEM 689.55(686.9)255384
TATACOFFEE 121.55(122.4)327414
TATACOMM 625.6(620)191644
TATAELXSI 1013.55(1002.35)250781
TATAGLOBAL 276.05(268.35)2583575
TATAMOTORS 352.6(341.5)8238960
TATAMTRDVR 197.65(192.75)2591729
TATAPOWER 80.85(80)3328605
TATASPONGE 984.25(988.8)94434
TATASTEEL 622.9(606.75)12193581
TBZ 96.75(96.5)157614
TCS 3052.15(3034.1)1045670
TECHM 619.55(619.2)4336200
TECHNO 357.35(359.8)14380
TEXRAIL 88.85(87.8)875426
THERMAX 1164.3(1156.9)8384
THOMASCOOK 261.55(259.75)166653
TIDEWATER 6256.75(6251.45)758
TIMKEN 747.05(755.6)18372
TITAN 829.1(819.1)1033715
TNPL 364.5(353.1)136926
TORNTPHARM 1311.85(1329.8)487366
TORNTPOWER 254.05(252.25)624702
TREEHOUSE 9.95(10.2)30279
TRIDENT 67.35(67.05)375529
TRITURBINE 112.2(113.9)128247
TTKPRESTIG 6661.4(6664.35)2716
TTML 5.6(5.75)746224
TV18BRDCST 63.8(62.8)8262229
TVSMOTOR 650.1(646.15)438550
TVSSRICHAK 3459.1(3495)6134
TVTODAY 451.8(450.55)23861
UBL 1033.2(1016.8)404929
UCOBANK 23.2(23.95)1022668
UFLEX 332.05(342.65)412748
ULTRACEMCO 4176(4079.85)102681
UNICHEMLAB 335(333.95)39558
UNIONBANK 91.15(93.45)11450366
UNITECH 6.05(6.3)34306027
UPL 717.95(712.15)944809
VAIBHAVGBL 691.3(690.15)9265
VAKRANGEE 205.4(195.75)7275515
VEDL 317.4(304.15)11167602
VIDEOIND 14(13.35)319472
VIJAYABANK 53.6(53.35)1786090
VINATIORGA 782.05(784.3)8482
VIPIND 321.75(327)752014
VOLTAS 638.85(629.4)1810263
VRLLOG 397.75(402.7)306512
VSTIND 2941.2(2968.7)1086
VTL 1326.95(1316)14435
WABAG 502.35(500.1)126766
WABCOINDIA 7665.3(7715.05)1642
WELCORP 158.45(165.8)482959
WELSPUNIND 60.75(61.05)685534
WHIRLPOOL 1560.9(1532.2)129077
WIPRO 290.7(285.05)1746849
WOCKPHARMA 766.6(749.05)1329066
WONDERLA 358.05(361.15)24241
ZEEL 576.25(568.5)894309
ZEELEARN 37.1(37.85)304385
ZENSARTECH 891(889.7)6878
ZYDUSWELL 1263.45(1255.25)8277

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,420	---	31,320	31,330	30,460
క్రితం ముగింపు	31,420	31,340	31,340	---	30,660
22 క్యారెట్లు	29,090	---	28,810	29,030	29,010
క్రితం ముగింపు	29,090	29,100	28,830	---	29,210
వెండి (కిలో)	39,600	---	39,200	39,600	41,400
క్రితం ముగింపు	39,600	40,000	39,300	---	41,600

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	63.00	విజయవాడ	63.00
కరీంనగర్	63.00	గుంటూరు	63.00
వరంగల్	63.00	ఒంగోలు	65.00
మహబూబ్‌నగర్	63.00	చిత్తూరు	64.00
కర్నూలు	63.00	నెల్లూరు	64.00
విశాఖపట్నం	70.00	అనంతపురం	62.00
గోదావరి	63.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	330.00	చిత్తూరు	362.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	322.00	నమక్కల్	360.00
గోదావరి	322.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	332.00	ముంబై	370.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.11	68.54
పౌండ్	81.91	95.00
యూరో	72.83	84.47
ఆస్ట్రేలియా డాలర్	46.49	53.78
బహ్రెయిన్ దినార్	160.09	183.46
కువైట్ దినార్	178.88	222.68
ఒమని రియాల్	156.77	179.36
సౌదీ రియాల్	15.72	18.62
సింగపూర్ డాలర్	44.97	53.28
యుఎఇ దిరమ్	16.09	18.81

కువైత్ 'చట్ట బంధం'లో ప్రవాసులు

కేసులు కొలిక్కి వస్తేనే స్వదేశానికి.. ఫోన్లు, బిల్లులు, కేసులతో ఇబ్బందులు



- అష్టకష్టాలు పడుతున్న తెలుగువారు
- ఆమ్నెస్టీ అయినా కనికరించేనా?
- భారత ఎంబసీ అధికారులు ఆదుకోవాలని వినతి

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: కువైత్‌లో ఉంటున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆ దేశ చట్టాల కారణంగా స్వదేశానికి తిరిగి రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులకు వారి వారి దేశాలకు వెళ్లిపోయేందుకు కువైత్ ప్రభుత్వం క్షమాభిక్ష పథకం పొడిగించినప్పటికీ తెలుగు ప్రజలు చట్టపరమైన సమస్యల కారణంగా అష్టకష్టాలు పడుతున్నారు. కువైతీ మహాకమా(న్యాయస్థానాలు)ల్లో కేసులు కొలిక్కి వస్తేగానీ వీరు కువైత్‌ను విడిచి వెళ్లడానికి అవకాశం ఉండదు. ఫోన్ బిల్లుల విషయంలో మాత్రం ఇప్పటికే పబ్లిక్ ప్రాసిక్యూషన్లు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సంబంధిత బిల్లులు చెల్లించి సొంత ప్రాంతాలకు వెళ్లిపోవచ్చు. మిగిలిన నేరారోపణలపై మహాకమాల్లో కేసులు ఎదుర్కొంటున్నవారు మాత్రం తప్పనిసరిగా న్యాయప్రక్రియను పూర్తి చేయాల్సిందే.

- రాజమండ్రి రూరల్ మండలం మోరంపూడికి చెందిన బత్తిన వెంకన్న మూడు ఐ ఫోన్లు కొనుగోలు చేశాడు. సిమ్‌కార్డులతో సహా వాయిదాల పద్ధతిలో ఈ ఫోన్లను కొన్నాడు. బకాయిలు చెల్లించలేదు. 3వేల దిర్హాంలు (సుమారు రూ.6.5 లక్షలు) చెల్లించలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. ఈ క్రమంలో గడువు పొడిగించినా స్వస్థలానికి రాలేకపోతున్నాడు.
- నిర్మల్ జిల్లా కడెం మండలానికి చెందిన నాగావత్ శ్యాంలాల్‌బుక్యా నాయక్.. తక్షణ అవసరం కింద ఫోన్, సిమ్‌కార్డు కొనుక్కొని దాన్ని బంగ్లా దేశస్థుడికి విక్రయించాడు. అతను వాడిన బిల్లు కాస్తా నాయక్ నెత్తిన పడింది. ఇప్పుడా బిల్లు చెల్లిస్తేనే నాయక్ స్వదేశానికి వెళ్లగలుగుతాడు.
- విశాఖపట్నం జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన ఆర్.అప్పలనాయుడిది కూడా ఇదే పరిస్థితి.
- నిజామాబాద్ జిల్లా దర్పల్లికి చెందిన అలీ అబ్బాస్‌ది మరో గాథ. తాను పనిచేస్తున్న పెట్రోలు పంపులో అగ్నిప్రమాదం జరగడంతో ఓ కారు దగ్ధమైందని, ఆ కారు యజమాని అకారణంగా తనపై పెట్టిన కేసు వల్ల స్వదేశానికి తిరిగి వెళ్లలేకపోతున్నట్లు వాపోయాడు.
- వేలిముద్రల సేకరణ పూర్తయినా ఇంకా నివేదిక రాకపోవడంతో ఏమైనా కేసు ఉందేమోనని భయంగా ఉన్నట్లు పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలానికి చెందిన సందాడి మియమ్మ ఆందోళన చెందుతోంది.
- కడప జిల్లాకు చెందిన పలువురు మహిళలకు పేర్లలో వ్యత్యాసాలు ఉండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

మొత్తం మీద ప్రవాసుల వాదన సరైందా? లేక కువైత్‌లోని యజమానుల ఫిర్యాదులు సరైనవా? అనే విషయాన్ని పక్కన పెడితే ప్రస్తుతం తెలుగువారు అక్కడ అనేక సమస్యల్లో చిక్కుకున్నారు. తమపై ఉన్న కేసుల్లో కనీసం ప్రాథమికంగా కూడా న్యాయ సహాయం, సూచనలు అందక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆమ్నెస్టీ సంస్థ అయినా తమను ఆదుకుంటుందేమోన్న ఆశతో దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నారు. భారత ఎంబసీ అధికారులు తమ సమస్యలను పట్టించుకోవాలని, కేసుల్లో రాజీ లేదా సత్వర పరిష్కార మార్గాలు చూపాలని కోరుతున్నారు. ఆమ్నెస్టీ లేదా భారత దౌత్యాధికారులు సాయం చేస్తే స్వదేశానికి వెళ్లిపోతామని చెబుతున్నారు.



అందమైన తీరం.. పసందైన ఆహారం

ఏ దేశంలో ఏముంది? Foreign

ప్రపంచంలో అందమైన దేశాల్లో పోర్చుగల్ ఒకటి. 1139 నుంచి సరిహద్దులు మారకుండా యూరప్‌లో తన అస్థిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్న ఈ దేశానికి వెళ్లాలనుకొనే పర్యాటకులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో చూద్దాం.. పోర్చుగల్‌కు వెళ్లిన వారు తప్పనిసరిగా చూడాల్సినవి అక్కడ బీచ్‌లు. దాదాపు 750 కిలోమీటర్ల కోస్తా తీరం ఉన్న ఈ దేశంలో బీచ్‌లు సర్ఫింగ్‌కు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. అమెరికా, ఇతర దేశాల నుంచి ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది యాత్రీకులు కేవలం సర్ఫింగ్ కోసమే ఈ దేశానికి వస్తారు. అసలు అలవాటు లేకుండా సర్ఫింగ్ చేయటానికి ప్రయత్నించటం శ్రేయస్కరం కాదు. కొన్ని బీచ్‌లలో అలలు చాలా వేగంగా వస్తూ ఉంటాయి. పరిస్థితులను గమనించి సర్ఫింగ్ చేయటానికి ప్రయత్నించటం మంచిది.

ఫుడ్, వైన్‌లకు ప్రసిద్ధి

ప్రపంచంలో అత్యంత రుచికరమైన పదార్థాలు పోర్చుగల్‌లో దొరుకుతాయి. ఫ్రాచింనా, ఎన్‌చిడోస్ వంటి పదార్థాలను కేవలం పోర్చుగీస్‌లోనే తినాలి. రుచికరమైన ఆహారపదార్థాలు మాత్రమే కాకుండా వైన్‌లకు పోర్చుగీస్ ప్రసిద్ధి. అక్కడకు వెళ్లిన వారు వైన్‌లను తప్పనిసరిగా రుచి చూడాల్సిందే!

హైహీల్స్ వద్దు

పోర్చుగీస్‌లోని చాలా పట్టణాల్లో ఫుట్‌పాత్‌లు ఎగుడుదిగుడుగా ఉంటాయి. సాధారణంగా వీటిని స్థానికంగా దొరికే రాళ్లతో నిర్మిస్తారు. అందువల్ల హైహీల్స్ వేసుకొని వెళ్తే పర్యాటకులు ఇబ్బంది పడే అవకాశముంది. ఇక వాతావరణ పరిస్థితుల విషయానికి వస్తే- మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ విపరీతమైన వేడి ఉంటుంది. అందువల్ల ఆ సమయంలో బయట తిరగకుండా ఉంటే మంచిది. పోర్చుగల్‌లో ఎలక్ట్రిక్ కారు సర్వీసులు చాలా బావుంటాయి. అందువల్ల వీలైనంత వరకూ వాటిల్లో తిరగడమే మంచిది. దీని వల్ల తక్కువ ఖర్చు అవుతుంది.

స్పానిష్షే అనుకోవద్దు

పోర్చుగీసు, స్పానిష్ భాషలు వినటానికి ఒకే రకంగా ఉంటాయి. అందువల్ల చాలా మంది పోర్చుగల్‌లో మాట్లాడేది స్పానిష్ అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు. పోర్చుగీస్ పౌరులు తమ భాషను చాలా గౌరవిస్తారు. అందువల్ల వారితో- 'మీరు మాట్లాడేది స్పానిష్షా?' అని అడిగితే ఇబ్బంది పడతారు. అందువల్ల భాష విషయంలో జాగ్రత్తగా ఉండటం మంచిది.

– స్పెషల్ డెస్క్



అమెరికా పౌరసత్వం కావాలా..?



అమెరికాలో ఉన్న వనరులు, అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఏదో ఒక విధంగా అమెరికాకు చేరుకొని, పౌరసత్వాన్ని పొంది స్థిర నివాసం ఏర్పరుచుకోవాలని కలలు కంటుంటారు. అయితే కొందరు మాత్రమే ఆ కలను సాకారం చేసుకోగలుగుతారు. ఉదాహరణకు.. 2016 సంవత్సరంలో దాదాపుగా పది లక్షల మంది అమెరికా పౌరసత్వానికై దరఖాస్తు చేసుకోగా ఏడు లక్షల యాభై రెండు వేల ఎనిమిది వందల మందికి అమెరికా దేశపౌరసత్వం లభించింది. ఇంతకీ అమెరికా పౌరసత్వం పొందడం ఎలా? ఆ విషయాన్ని తానా మాజీ అధ్యక్షుడు తోటకూరప్రసాద్ వివరిస్తున్నారిలా..

మూడు రకాలుగా చాన్స్

అమెరికా దేశపు పౌరసత్వాన్ని మూడు రకాలుగా పొందే అవకాశం ఉంది. అవేంటంటే..

అమెరికాలో జన్మించడం ద్వారా

అమెరికా దేశంలోని ఏ రాష్ట్రంలో జన్మించినా లేదా అమెరికా ఆధీనంలో ఉన్న పోర్టోరీకో, గ్వామ్, యూ.ఎస్. వర్జిన్ ఐలాండ్స్, మరియునార్తర్న్ మరయానా ఐలాండ్స్‌లో 1986 తరువాత జన్మించినా అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

వారసత్వపు హక్కు...

అమెరికా పౌరులైన దంపతులకు (కనీసం ఒకరు అమెరికా (గతం)లో గాని ప్రస్తుతం గాని నివాసం ఉండి ఉండాలి) జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభిస్తుంది.

- దంపతులలో ఒకరికి మాత్రమే అమెరికా పౌరసత్వం ఉంటే.. వారు పిల్లలు పుట్టే సమయానికి కనీసం 5 సంవత్సరాలు అమెరికాలో నివసించి ఉండి ఉండాలి. అందులో 2 సంవత్సరాలు.. 14 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత అమెరికాలో ఉన్నట్లు రుజువు చేసుకోవాలి. అప్పుడే వారికి పుట్టిన పిల్లలకు పౌరసత్వం లభిస్తుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం ఐదేళ్ల కాలపరిమితిలో కొన్ని మినహాయింపులుంటాయి.
- తల్లికి అమెరికా పౌరసత్వం ఉండి తండ్రికి లేకపోయినా పుట్టిన పిల్లలకు పౌరసత్వం లభిస్తుంది. అయితే, పిల్లలు పుట్టే సమయానికి ఏడాది ముందు తల్లి అమెరికాలో నివసించి లేదా నివసిస్తూ ఉండాలి.
- తండ్రి అమెరికా పౌరుడై ఉండి తల్లి కాకపోతే? పుట్టిన శిశువుకు తానే తండ్రినని, బిడ్డకు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని తండ్రి రాతపూర్వకంగా తెలిపితే పౌరసత్వం లభిస్తుంది.

తగిన అర్హతలు సంపాదించడం ద్వారా (ఎన్-600)..

పైన పేర్కొన్న రెండు వర్గాలకూ చెందక.. అమెరికా పౌరసత్వం కోరుకునేవారు కనీసం 5 సంవత్సరాలు పాటు గ్రీన్ కార్డు కలిగి ఉండాలి. ఆ ఐదేళ్లలో కనీసం 30 నెలల పాటు అమెరికాలోనే ఉండి ఉండాలి.

- 18 సంవత్సరాల వయసు నిండి ఉండాలి.
- పౌరసత్వం కోసం దరఖాస్తు చేసేనాటికీ కనీసం 3 నెలలు ముందుకాలం అమెరికాలో ఉండి ఉండాలి.
- దరఖాస్తు చేసిన నాటి నుంచి పొందే వరకూ అమెరికాలోనే ఉండాలి (సెలవులపై విదేశీ ప్రయాణాలు చేయొచ్చు).
- అమెరికా దేశపు చరిత్ర, ప్రభుత్వ పరిపాలనావిధానం తెలిసి ఉండి ఆంగ్ల భాష చదవడం, రాయడం, మాట్లాడటం కొంత వరకైనా వచ్చి ఉండాలి.
- అమెరికా రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవిస్తూ, బాధ్యతాయుత వ్యక్తిగా ఉండాలి.

వివాహం..

అమెరికా పౌరసత్వం ఉన్నవారిని వివాహం చేసుకున్నాక పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేవారు.. కనీసం 3 సంవత్సరాల పాటు గ్రీన్ కార్డు కలిగి ఉండాలి. ఆ మూడేళ్లలో 18 నెలలపాటు.. దరఖాస్తు సమయానికి ముందు కనీసం 3 నెలల కాలం అమెరికాలో ఉండి ఉండాలి.

- ఆ మూడేళ్ల కాలం పూర్తయి పౌరసత్వం కోసం దరఖాస్తు చేసి పౌరసత్వం పొందే వరకు వైవాహిక బంధంలోనే ఉండి ఉండాలి. దరఖాస్తు చేసిన నాటి నుంచి పౌరసత్వం పొందే వరకు అమెరికా దేశంలో నివసించాలి. సెలవుపై విదేశీ ప్రయాణాలు చేయొచ్చు.

గ్రీన్ కార్డు పొందేందుకు కావాల్సిన అర్హతలు (ఏ-485)

కుటుంబ బంధం ద్వారా, ఉద్యోగం ద్వారా, పెట్టుబడి పెట్టడం ద్వారా, ప్రత్యేక పరిస్థితుల్లో, శరణార్థులు/కాందిశీకులుగా, లాటరీ పద్ధతి ద్వారా, పేర్లునమోదు చేసుకోవడం ద్వారా గ్రీన్ కార్డు పొందవచ్చు. మరింత వివరంగా చెప్పాలంటే..

కుటుంబ బంధం ద్వారా గ్రీన్ కార్డు

అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్ కార్డు ఉన్నవారితో వివాహం జరిగితే గ్రీన్‌కార్డుకు అర్హులు.

- తల్లిదండ్రులు అమెరికా పౌరులు లేదా గ్రీన్ కార్డు ఉన్నవారు అయితే (ఒకవేళ తల్లిదండ్రులు గ్రీన్ కార్డు ఉన్న వారు అయితే, వారి పిల్లలు అవివాహితులుగా ఉన్నప్పుడు మాత్రమే అర్హులు)
- కనీసం 21 సంవత్సరాల వయస్సున్న సోదరుడు లేదా సోదరి అమెరికా దేశపు పౌరులై ఉంటే.
- అమెరికా పౌరసత్వం ఉన్నవారితో పెళ్లి నిశ్చయమైతే
- తల్లి లేదా తండ్రికి అమెరికా పౌరసత్వం కలిగిన వారితో వివాహం నిశ్చయమైనపుడు, పిల్లలు కూడా గ్రీన్ కార్డుకు అర్హులే.

ఉద్యోగం ద్వారా గ్రీన్ కార్డు

వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారి యాజమాన్యం ద్వారా గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా, అమెరికాలో కనీసం 5 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి కనీసం 5 ఉద్యోగాలను కల్పించడం ద్వారా లేదా 10 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి కనీసం 10 ఉద్యోగాలను కల్పించడం ద్వారా గ్రీన్‌కార్డు పొందవచ్చు.

శరణార్థులు లేదా కాందిశీకులకు గ్రీన్ కార్డు

అమెరికా ప్రభుత్వం నుంచి శరణార్థులు లేదా కాందిశీకులుగా గుర్తింపు పొందిన ఒకసంవత్సర కాలం తరువాత వారు గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రత్యేక పరిస్థితుల్లో గ్రీన్ కార్డు

అమెరికాలోని లాభాపేక్ష రహిత, మతపరమైన సంస్థల్లో పని చేయడం ద్వారా.

- విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన వారు
- అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు
- అమెరికా దేశపు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇతర దేశం నుంచి వచ్చి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

లాటరీ పద్ధతి ద్వారా గ్రీన్ కార్డు

కనీసం హైస్కూల్ స్థాయి విద్యార్హత కల్గి ఉండి (లేదా) గడిచిన ఐదేళ్లలో రెండేళ్లు అమెరికాలో ఏదైనా ఉద్యోగం చేసిన వారు ఈ విధానంలో గ్రీన్‌కార్డుకు అర్హులు. అమెరికాకు తక్కువ వలసలు ఉండే దేశాల వారికే ప్రాధాన్యమిస్తారు. సాధారణంగా ప్రతి అక్టోబరులో లాటరీద్వారా 55,000 వరకు గ్రీన్ కార్డులను జారీ చేస్తారు.

పేర్లునమోదు చేసుకోవడం ద్వారా గ్రీన్ కార్డు

1972 జనవరి 1కి ముందు అమెరికాలో ప్రవేశించి, అమెరికా పౌరసత్వం పొందడానికి అర్హులైతే ప్రత్యేకంగా నమోదు చేసుకోవడం ద్వారా గ్రీన్ కార్డు పొందవచ్చు.

బర్మా.. రెండో 'తెలుగు గడ్డ'

- అక్కడ మనవారు 'మూన్'లు
- సామాజిక, సాంస్కృతిక నిర్మాతలు తెలుగువారే
- బీటీఏ సలహాదారు నాయుడు వెల్లడి

కష్టాలను సైతం అవకాశాలుగా మలచుకుని ఎక్కడ ఉన్నా అల్లుకుపోవడం తెలుగువారి ప్రత్యేకత. ఒకప్పటి బర్మా.. నేటి మయన్మార్‌లో సామాజిక, సాంస్కృతిక నిర్మాతలుగా గుర్తింపు తెచ్చుకున్న తెలుగువారే ఇందుకు నిదర్శనం. ఉపాధి కోసం బర్మాకు వలస వెళ్లిన తెలుగువారు అక్కడ తమ బతుకుదెరువుకు బాటలు వేసుకున్నారు. అందుకే దాన్ని రెండో 'తెలుగు గడ్డ'గా వర్ణిస్తున్నారు బర్మా తెలుగు అసోసియేషన్ (బీటీఏ) సలహాదారు ఎర్రానాయుడు అలియాస్ బర్మా నాయుడు. ఇటీవల ఆయన విజయవాడకు వచ్చారు. బర్మాలోని తెలుగు వారి జీవన విధానాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



దేశం నలుమూలల నుంచి ఎంతోమంది బర్మాకు వలస వెళ్లారుగానీ.. వారిలో ఎవరికీ లేని గుర్తింపు తెలుగువారికే దక్కింది. బర్మాలోని రంగూన్, మాల్‌మేన్, కటోన్, ధై వంటి ప్రాంతాల నిర్మాణంలోనే కాదు సామాజిక, సాంస్కృతిక నిర్మాణంలోనూ తెలుగువారి పాత్ర ఉంది. ఉత్తరాంధ్ర నుంచే ఎక్కువమంది బర్మాకు వలసవెళ్లారు. బ్రిటీష్ పాలన ఉన్నప్పుడు 15 లక్షల మంది ఉన్న తెలుగువారి సంఖ్య 1962లో మిలటరీ పాలన ఆరంభమయ్యాక 2 లక్షలకు పడిపోయింది. దేశంకాని దేశంలో ఉంటున్నా.. మన ఆచార వ్యవహారాలను మాత్రం మనవాళ్లు చెక్కు చెదర కుండా కాపాడుకున్నారు. వివిధ అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. మనవారిని మొదట్లో తలాయ్‌అని వ్యవహరించేవారు. ఇప్పుడు మూన్ అని పిలుస్తున్నారు. బర్మాలో తెలుగువారు పెద్దలకు అపారమైన గౌరవం ఇస్తారు. వయసు మీదపడి కాలు కదపలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ముఖం కడిగించి, స్నానం చేయించి ముస్తాబు చేసిన తర్వాతే మిగిలిన పనులు చేసుకుంటారు. అక్కడ వరకట్న ఆచారమే ఉండదు. బర్మాలో గృహహింసకు అవకాశం లేదు. ఇక్కడ ఈడు వచ్చిన ఆడపిల్లకు పెళ్లి చేయకపోతే చుట్టుపక్కల వారు చాటుమాటుగా ఎన్నో సూటిపోటి మాటలు అంటారు. బర్మాలో పెళ్లికాని అమ్మాయిలను గౌరవంగా చూస్తారు.

సీడీల్లో సీరియళ్లు

అక్కడి వారికి తెలుగు సీరియళ్లంటే ఇష్టం. కానీ అంత సులభంగా దొరకవు. కొంతమంది వాటిని సీడీల్లో కాపీ చేసి అద్దెకు ఇస్తారు. అమ్ముతారు. తెలుగు సీరియళ్ల సీడీల అమ్మకం బర్మాలోని తెలుగువారి వ్యాపారాల్లో ఒకటి. ఇదేకాదు చేపలు, కూరగాయలు, మాంసం వ్యాపారాలూ మనవాళ్లు చేస్తుంటారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

వీసా ధరలు తగ్గించాలి

- భారత పర్యాటకులను ఆకర్షించడానికి ఇదే మార్గం
- నూతన విధానాన్ని ప్రతిపాదించిన యూకే మేధోవర్గం

భారత పర్యాటకులను ఆకర్షించడానికి వారి వీసా ధరలు తగ్గించాలని బ్రిటన్‌కు చెందిన మేధోవర్గం అభిప్రాయపడింది. దీనికోసం సరికొత్త వీసా విధానాన్ని అమల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఇంగ్లండ్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య నానాటికీ తగ్గుముఖం పడుతోందని రాయల్ కామన్‌వెల్త్ సొసైటీ(ఆర్‌సీఎస్) నిర్వహించిన అధ్యయనంలో తేటతెల్లమైంది. 2016లో భారత్ నుంచి 6లక్షల మంది ఫ్రాన్స్‌ను సందర్శించగా అదే సమయంలో యూకేను సందర్శించినవారి సంఖ్య 1,85,000 మాత్రమే అని ఆ సంస్థ విడుదల చేసిన 'బ్రిటన్ అండ్ ఇండియా: బిల్డింగ్ ఏ న్యూ వీసా పార్ట్‌నర్‌షిప్' నివేదిక వెల్లడించింది. అయితే వీసా ధరలు తగ్గించడం ద్వారా భారత్ నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించవచ్చని పేర్కొంటూ అందుకోసం 'నూతన యూకే-ఇండియా వీసా అగ్రిమెంట్'ను ప్రతిపాదించింది. ప్రస్తుతం 389 పౌండ్లుగా ఉన్న రెండేళ్ల వీసా ధరను 89 పౌండ్లకు తగ్గించాలని, ఈ సమయంలో ఎన్నిసార్లయినా రాకపోకలు సాగించే అవకాశాన్ని పర్యాటకులకు ఇవ్వాలని సూచించింది. నూతన విధానంపై ప్రధాని మోదీతో చర్చించి, ఓ ప్రకటన చేయడానికి వచ్చేనెలలో జరగనున్న చోగమ్ సదస్సు సరైన వేదికగా పేర్కొంది. ఈ విధానంతో వాణిజ్యపరంగానూ, పర్యాటక రంగంలోనూ యూకే మరింత అభివృద్ధి చెందడంతో పాటు ఇరు దేశాల మధ్య వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు బలోపేతమయ్యే అవకాశం ఉందని లేబర్ పార్టీ ఎంపీ వీరేంద్ర శర్మ అభిప్రాయం వ్యక్తం చేశారు.



ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి: ఏ.జీవన్‌రెడ్డి



గవర్నర్ ప్రసంగానికి ఆటంకం కలిగించొద్దని అసెంబ్లీ స్పీకర్ స్వయంగా కోరినా కాంగ్రెస్ పట్టించుకోలేదని టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఏ. జీవన్‌రెడ్డి తెలిపారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల అనుచిత ప్రవర్తనపై గతంలో మహారాష్ట్ర అసెంబ్లీ తీసుకున్న నిర్ణయాన్ని ఇక్కడా తీసుకోవాలన్నారు.

తెలంగాణ దశ తిరిగింది

రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడొద్దు.. అణగారిన వర్గాలకు వృద్ధి ఫలాలు అందాలి

- సవాళ్లను అధిగమిస్తూ వృద్ధిలోకి రాష్ట్రం
- టీఎస్ ఐపాస్‌తో 1.18 లక్షల కోట్ల పెట్టుబడులు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 4.47 లక్షల కొలువులు
- 36 నీటిపారుదల ప్రాజెక్టులు చేపడుతున్నాం
- సౌరవిద్యుత్తులో దేశంలోనే అగ్రస్థానం
- ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీని విస్తరింపజేస్తున్నాం
- అనుకున్నదానికంటే ముందుగానే మిషన్ భగీరథ
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దశతిరిగి.. అభివృద్ధి పథంలోకి ప్రవేశిస్తోందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 4% ఉన్న తెలంగాణప్రాంత స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి మూడేళ్లలో 8.6%కు చేరిందన్నారు. దేశ తలసరి ఆదాయం రూ.1.03 లక్షలు ఉంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.54 లక్షలుగా ఉందన్నారు. సోమవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. దీనికి శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో పాటు సీఎం కేసీఆర్, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత కె.జానారెడ్డి, మండలి విపక్షనేత మహ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. బంగారు తెలంగాణ లక్ష్య సాధనకు విధానాలను రూపొందించడానికి బడ్జెట్ సమావేశాల్లో సభ్యుల చర్చలు నిర్మాణాత్మకంగా, ఉపయుక్తంగా ఉండాలని గవర్నర్ కోరారు. 'సమ్మిళితంపై సుస్థిరమైన దృష్టితో శీఘ్రమైన ఆర్థిక వృద్ధి అనేది ప్రభుత్వ ప్రాథమిక సిద్ధాంతం. సమాజంలో ఇప్పటివరకు నిర్లక్ష్యానికి, అణచివేతకు గురైన వర్గాలు వృద్ధి ఫలాలు కచ్చితంగా పొందాలి. నూతన తెలంగాణ రాష్ట్రం మూడున్నరేళ్లుగా ఆశించిన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు నడుస్తోంది. సవాళ్లను అధిగమిస్తూ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. నా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో గణనీయమైన పాత్ర పోషిస్తోంది' అని గవర్నర్ అన్నారు. దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ముందుకెళ్తోందన్నారు. మూడున్నరేళ్లలో సామాన్య ప్రజల జీవితాల్లో ప్రభుత్వం సానుకూలమైన, గణనీయమైన మార్పును తెచ్చిందని, బంగారు తెలంగాణ లక్ష్యాన్ని సాధించేందుకు పూర్తి నిబద్ధతతో ముందుకుసాగుతోందని పునరుద్ఘాటించారు. గవర్నర్ ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే..

కోటి ఎకరాలకు సాగునీటి దిశగా..

"తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీటి సామర్థ్యం సమకూర్చడానికి పూర్తిసిద్ధంగా ఉన్నాం. గోదావరి, కృష్ణా నదుల్లోని నీటిని వినియోగించుకునేందుకు 23 భారీ, 13 మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాం. వీటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటిదాకా 16.64 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లిచ్చాం. 8.97 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాం. కాళేశ్వరం,సీతారామ ఎత్తిపోతల పథకాలకు రికార్డు సమయంలో కేంద్రం నుంచి అనుమతులు పొందాం. నేను ఇటీవలే కొన్ని ప్రాజెక్టులను వ్యక్తిగతంగా సందర్శించాను. పనులు చురుగ్గా జరుగుతున్న తీరుకు ముగ్ధుడినయ్యాను. ఈప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రమే మారుతుంది. పరిశ్రమలకు 2రోజుల పవర్‌హాలిడే నుంచి కోతల్లేని కరెంట్ ఇస్తున్నాం. జనవరి 1 నుంచి రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. 2014లో 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉంటే ప్రస్తుతం 15,344 మెగావాట్ల సామర్థ్యానికి చేరుకున్నాం. మిగులు విద్యుత్తు రాష్ట్రంగా మార్చడానికి 12,931 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులు నిర్మాణదశలో ఉన్నాయి. సౌరవిద్యుత్తులో 3,283 మెగావాట్ల సామర్థ్యంతో దేశంలోనే అగ్రగామిగా ఉన్నాం. టీఎస్ ఐపాస్ కింద దరఖాస్తు చేసుకున్న 15రోజుల్లోనే పారిశ్రామిక అనుమతులు ఇస్తున్నాం. 6206 పరిశ్రమలకు అనుమతులు లభించి, రాష్ట్రానికి రూ.1.18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చి, 4.47 లక్షల మందికి నేరుగా ఉపాధి దొరకనుంది. వీటిలో 3703 పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభించాయి. చేనేత రంగం అభివృద్ధికి సమగ్ర మెగా జౌళి పార్కును ఏర్పాటు చేస్తున్నాం. ఈ పార్కులో పెట్టుబడుల కోసం 22 మంది పారిశ్రామికవేత్తలతో ఒప్పందం చేసుకున్నాం. నేతన్నకు చేయూత పథకం కింద రాష్ట్రప్రభుత్వం వాటాను 8% నుంచి 16%కు పెంచాం. హైదరాబాద్‌లో 1500 ఐటీ/ఐటీఈఎస్ కంపెనీలు ఏర్పాటు చేశాయి. 4.3 లక్షల మంది వృత్తి నిపుణులకు ప్రత్యక్షంగా, 7 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. 2016-17లో ఐటీ ఎగుమతుల విలువ రూ.85,470 కోట్లుగా ఉంది. ఐటీ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు 10 ఐటీ పాలసీలను ఆవిష్కరించాం. స్టార్టప్‌ల కోసం టీహబ్ విజయవంతమైంది.4వేల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం టీహబ్ రెండో దశను అభివృద్ధి చేస్తున్నాం. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతం వెలుపల నూతన ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయంతో బుద్వేల్, చుట్టుపక్కల గ్రామాల్లో నూతన ఐటీ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నాం. గ్రామీణ, పట్టణ కుటుంబాలన్నింటికీ సురక్షిత నీటిని అందించడానికి చేపట్టిన మిషన్ భగీరథ పనులను నిర్ణీత సమయం కంటే ముందుగానే 95% పూర్తి చేశాం. 5500కు పైగా గ్రామీణ ఆవాసాలకు, 13 స్థానిక సంస్థలకు నీటిని సరఫరా చేస్తున్నాం. రాష్ట్రంలో పచ్చదనాన్ని 33%కు పెంచడానికి వీలుగా 2015-16లో హరితహారం కార్యక్రమం ప్రారంభించాం. 2017-18లో 34 కోట్ల మొక్కలు నాటాం. 30 కోట్ల మొక్కలకు జియో ట్యాగింగ్ చేశాం.



జనావాసాలన్నింటికీ రోడ్ల అనుసంధానం..

మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్లను అనుసంధానం చేస్తున్నాం. దీని కింద 1970 కిలోమీటర్ల మండలాల రోడ్లను 4665 కిలోమీటర్ల జిల్లా, రాష్ట్ర రహదారులకు అనుసంధానం చేసి డబుల్ రోడ్లుగా మారుస్తున్నాం. పట్టణీకరణ విషయంలో తెలంగాణ దేశంలోనే 7వ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే పీపీపీ విధానంలో అతిపెద్ద మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా 30 కిలోమీటర్ల రూట్‌ను 2017 నవంబరులో ప్రధానమంత్రి మెట్రోను ప్రారంభించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు మెట్రోలో ఉన్నాయి. మెట్రోతో హైదరాబాద్ అభివృద్ధి తదుపరి స్థాయికి వెళుతుంది.

వ్యవసాయానికి సమగ్ర విధానం..

రైతుల సమస్యలను పరిష్కరించడానికి సమగ్ర విధానాన్ని రూపొందించాం. తక్షణ సాయంగా 35.3 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పిస్తూ రూ.లక్ష దాకా రుణ మాఫీ చేశాం. క్షేత్ర యాంత్రీకరణ, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాను సకాలంలో కట్టుదిట్టం చేశాం. సూక్ష్మసేద్యం, గ్రీన్ హౌస్‌లు, పాలీహౌస్‌ల వంటి చర్యలతో వ్యవసాయ ఉత్పాదకతలో పెరుగుదలకు చర్యలు తీసుకున్నాం. 2016-17లో 101.29లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేశాం. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు, ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్తును ఉచితంగా సరఫరా చేస్తూ కొత్త రికార్డులు సృష్టించాం. పశువులు, గొర్రెల పెంపకం, మత్స్య పరిశ్రమ వంటి వ్యవసాయేతర కార్యకలాపాలతో రైతుల ఆదాయాన్ని వృద్ధిచేస్తున్నాం. 50.10 లక్షల గొర్రెలను 75% సబ్సిడీతో పంపిణీ చేశాం. మాంసం ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి, గొర్రె మాంసానికి ఎగుమతిదారుగా రాష్ట్రాన్ని రూపొందిస్తున్నాం. గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 100 సంచార పశువైద్య చికిత్స కేంద్రాలను ప్రారంభించాం. చేపపిల్లల పంపిణీ, చేపల మార్కెట్ యార్డుల నిర్మాణం ద్వారా మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం క్రియాశీల కార్యక్రమాలు చేపడుతోంది. మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ చేపడుతున్నాం. రాష్ట్రం ఏర్పడినప్పుడు పంట నిల్వసామర్థ్యం 4.17 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా 356 శాస్త్రీయ గోదాముల నిర్మాణంతో దీనిని 18.30 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చాం. భూరికార్డుల శుద్ధీకరణలో 10,823 గ్రామాల్లో 100 రోజులపాటు 1507 బృందాలతో 96% రికార్డులను తనిఖీ చేశాం. త్వరలో రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేస్తాం. రైతులందరికీ సుస్థిర ఆదాయం కల్పించేందుకు భూరికార్డుల సమాచారం కోసం 'ధరణి' అనే వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నాం.


కేసీఆర్ కిట్‌తో 49 శాతానికి చేరిన సంస్థాగత ప్రసవాలు

నవజాత శిశువులు, మాతృత్వ మరణాలను తగ్గించడానికి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచడానికి కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించాం. మగ శిశువు పుడితే రూ.12 వేలు, ఆడ శిశువు పుడితే రూ.13 వేలతోపాటు రూ.2 వేల విలువ కలిగిన కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నాం. దీనివల్ల సంస్థాగత ప్రసవాలు 33% నుంచి 49%కు చేరాయి. గర్భిణులకు పరీక్షలు, ప్రసవాలు, టీకాల కోసం ఆస్పత్రులకు వెళ్లడానికి వీలుగా 250 వాహనాలతో '102' సర్వీసు పథకాన్ని ప్రారంభించాం. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి 9 జిల్లాల్లో 150 పడకల మాతాశిశు ఆరోగ్య బ్లాకులను నిర్మిస్తున్నాం. మిగతా జిల్లాల్లోనూ ఈ బ్లాకులను నిర్మిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కోసం కొత్తగా 517 గురుకులాలను ఏర్పాటు చేశాం. ఎస్సీ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాం. గురుకుల విద్యార్థులకు సమతుల ఆహారం అందిస్తున్నాం. రాష్ట్రంలో ఉర్దూ ద్వితీయ భాష అయినప్పటికీ ప్రథమ భాషగా ఉర్దూను చదవడానికి విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నాం. తెలుగు భాషను, సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించాం. ప్రపంచ వ్యాప్తంగా 8వేల మంది ప్రతినిధులు ఈ సభలకు హాజరయ్యారు."

ప్రజల భద్రతకు ప్రాధాన్యం..

"ప్రజల రక్షణ, భద్రతను మెరుగుపరచడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. దీనికోసం రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను ఆధునికీకరిస్తున్నాం. కొత్త జిల్లాల నేపథ్యంలో పోలీసు నియామకాలు చేపడుతున్నాం. కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో సమస్యాత్మక ప్రాంతాల్లో 2లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలపై వేధింపులను అరికట్టడానికి 'షీ' టీమ్స్‌ను ఏర్పాటు చేశాం. 18 నియోజకవర్గాల్లో అగ్నిమాపక కేంద్రాలను మంజూరుచేశాం. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాం. జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు హైదరాబాద్ కేంద్రబిందువైంది. ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు, వరల్డ్ ఐటీ కాంగ్రెస్, ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం వంటి కార్యక్రమాలతో తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది"అని గవర్నర్ వివరించారు. కాగా గవర్నర్ ప్రసంగం తెలుగులో ప్రారంభమై తెలుగుతో ముగిసింది. ముగింపులో ఆయన సంస్కృతంలో 'అందరూ సుఖ సంతోషాలతో సమృద్ధిగా వర్ధిల్లాలి. ఆరోగ్యంగా ఉండాలి. ఆధ్యాత్మిక ఉన్నతి ఏంటో తెలుసుకోవాలి. ఓం శాంతి.. శాంతి.. శాంతి" అంటూ ప్రసంగాన్ని ముగించారు.

సంక్షేమానికి పెద్దపీట..



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసి, నిధులు ఖర్చు చేయకపోతే వచ్చే ఆర్థిక సంవత్సరానికి క్యారీ ఫార్వర్డ్ చేసే నిబంధన పెట్టాం. ఎస్టీల సామాజిక ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. అత్యధికంగా ఉన్న బీసీల గౌరవం పెంచేలా చర్యలు చేపడుతున్నాం. సంప్రదాయ వృత్తులకు మద్దతుతోపాటు గురుకుల పాఠశాలలు, విదేశీ విద్య కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్, కల్యాణలక్ష్మి, రజకుల కోసం దోభీఘాట్‌ల నిర్మాణం, అత్యంత వెనుకబడిన వర్గాల(ఎంబీసీల) కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాం. మైనారిటీలకు గురుకులాలు, ఉపకార వేతనాలు, వృత్తిపరమైన కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీవిద్యకు ఉపకార వేతనాలు, స్టడీ సర్కిళ్లు, షాదీ ముబారక్ పథకం అమలు, మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం, ఇస్లామిక్ సెంటర్, క్రిస్టియన్ భవన్, సిక్కు భవనాలు కడుతున్నాం. 41.78 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇస్తున్నాం.



తాగి వచ్చారనడం.. అవమానకరం!

- సమస్యలపై పోరాడటం ప్రతిపక్షం బాధ్యత
- ఒత్తిడి వల్లే వెనక సీటులోకి వెళ్లి కూర్చున్నా
- సభను వీడి వెళ్లాననడం అవాస్తవం : జానారెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సభ్యులు మద్యం సేవించి వచ్చారంటూ టీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఒకరు చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, సభకు అవమానకరమని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. సభ్యులందరినీ అవమానించినట్లేననీ, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సీఎల్పీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, మూడెకరాల భూమి, రిజర్వేషన్లు, ఉద్యోగాలు, గిట్టుబాటు ధర, రైతుల ఆత్మహత్యలు టవంటి ప్రధానాంశాలు లేకపోవడంతో తమ సభ్యులు నిరాశకు గురయ్యారన్నారు. సమస్యల ప్రస్తావన లేకపోతే ప్రతిపక్షం సహజంగానే నిరసన తెలిపే ప్రయత్నం చేస్తుందన్నారు. తమ సభ్యులు కూడా నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారని, ఈ క్రమంలో ఒక బల్ల విరిగి తనపై ఒత్తిడి పెరగడంతో వెనక్కి వెళ్లి కూర్చున్నాని తెలిపారు. తాను సభను విడిచి వెళ్లానంటూ వక్రీకరించి మాట్లాడటం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే భట్టి విక్రమార్క మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు సంబంధించిన ఏ అంశం కూడా లేకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. మండలి ఛైర్మన్ కంటికి గాయమైనట్లుగా చిత్రీకరించడం బాధాకరమని, గవర్నర్‌కు వీడ్కోలు పలికిన వ్యక్తి కొద్ది సేపటికే ఆస్పత్రికి వెళ్లడం కుట్రలో భాగమేనని ఆరోపించారు. చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జీవన్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. 'ముఖ్యమంత్రితో కలిసిరండి. వైద్య పరీక్షలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరం సిద్ధంగా ఉన్నాం. ఎవరు మద్యం సేవించారో తేలిపోతుంది' అని సవాల్ విసిరారు.

కాంగ్రెస్ రగడపై గరంగరం!

'బీఏసీ'లో ప్రధానంగా చర్చ.. స్పీకర్ అసంతృప్తి.. విచారం వ్యక్తంచేసిన జానారెడ్డి

- కేసు పెట్టాలన్న అక్బరుద్దీన్
- నిర్ణయాధికారం స్పీకర్‌కు

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ.. తొలి రోజే వేడెక్కింది. అసెంబ్లీ, శాసన మండలి బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగాన్ని కాంగ్రెస్ అడ్డుకునే క్రమంలో ఆ పార్టీ సభ్యులు కొందరు చేసిన రగడ చర్చనీయాంశమైంది. మధ్యాహ్నం అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అధ్యక్షతన జరిగిన సభా వ్యవహారాల సలహా సంఘం(బీఏసీ) భేటీలో ఈ అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, పార్టీల శాసనసభాపక్ష నేతలు కె.జానారెడ్డి, అక్బరుద్దీన్, కిషన్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య (టీడీపీ), సున్నం రాజయ్య (సీపీఎం), సీఎల్పీ ఉపనేత మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్న ఈ భేటీలో తొలుత ఈ అంశాన్ని స్పీకర్ మధుసూదనాచారి ప్రస్తావించారు.



స్పీకర్ మధుసూదనాచారి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నేతలు

సభలో కాంగ్రెస్ సభ్యుల నిరసన తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం బీఏసీ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

స్పీకర్: కాంగ్రెస్ సభ్యుల తీరు నాకు ఆవేదన కలిగించింది. ఇది చట్టసభలను అగౌరవపర్చడమే. అన్ని పార్టీల శాసనసభాపక్ష నేతలకు ఫోన్ చేసి గవర్నర్ ప్రసంగానికి సహకరించాలని కోరా. అయినా కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరు దురదృష్టకరం.

జానారెడ్డి: సభలో జరిగిన దానికి విచారం వ్యక్తం చేస్తున్నా. గవర్నర్ ప్రసంగంలో మేం అనుకున్న అంశాలు కనిపించలేదని మా సభ్యులు నిరసనకు దిగారు.

భట్టివిక్రమార్క: సభలో జరిగిన ఘటన ఆవేదన కలిగించేదే. కానీ, దాన్ని కొట్టడంగా చూడొద్దు.

అక్బరుద్దీన్: బాధ్యులను సభ నుంచి సస్పెండ్ చేయాలి. వారి పదవీ కాలం ముగిసే వరకు సభకు హాజరుకాకుండా చర్యలు తీసుకోవాలి. ఈ రోజు గాయపడింది మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కాదు.. ప్రజాస్వామ్యమే.

అనంతరం ఈ మొత్తం వ్యవహారంపై ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకునే అధికారాన్ని అసెంబ్లీ స్పీకర్‌కు కట్టబెట్టారు. ఈ విషయంలో కాంగ్రెస్ నేతలు సానుకూలంగా స్పందించలేదు.

గవర్నర్ విదేశాలకు వెళ్తున్నారని..

గవర్నర్ నరసింహన్ ఈ నెల 28న విదేశాలకు వెళ్తున్నారని, అంతకంటే ముందుగానే సభలో ద్రవ్య వినిమయ బిల్లు(బడ్జెట్)ను ఆమోదించుకోవాలని, లేకపోతే ఉద్యోగులకు వేతనాలు, ఇతర చెల్లింపులు జరపలేమని ప్రభుత్వం బీఏసీ భేటీలో తెలియజేసింది. ఇందుకు విపక్షాలన్నీ సమ్మతించాయి. దీంతో ఉభయ సభల్లో 15న బడ్జెట్ ప్రవేశపెట్టి, 27న ఆమోదించుకోవటానికి ఏకగ్రీవ ఆమోదం లభించింది. అదే సమయంలో బడ్జెట్ ఆమోదం తదుపరి సభా నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తంచేసింది.

సీఎం గైర్హాజరుపై అసంతృప్తి

బీఏసీ భేటీకి సభా నాయకుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ గైర్హాజరవడంపై బీజేఎల్పీ నేత జి.కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తంచేశారు. సభలో నిరసన తెలిపే అవకాశం సభ్యులకు ఇవ్వాలని కోరారు.

అసెంబ్లీ మాదిరిగానే మండలి

అసెంబ్లీ మాదిరిగానే శాసన మండలి బడ్జెట్ సమావేశాల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. మధ్యాహ్నం మండలి బీఏసీ భేటీ జరిగింది. ఛైర్మన్ కె.స్వామిగౌడ్ ఆస్పత్రిపాలు కావడంతో డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, మంత్రి హరీశ్‌రావు, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి, విప్‌లు రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఉమ్మడి సమావేశంలో మండలి ఛైర్మన్‌ను కాంగ్రెస్ సభ్యులు కొందరు గాయపర్చటాన్ని ఏకగ్రీవంగా ఖండించారు.



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్

గవర్నర్ ప్రసంగమంతా అబద్ధాలే!

- నిరసన తెలిపే అవకాశం ఇవ్వరా? : ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్‌లో మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ, సహచర ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. చివరి బడ్జెట్ సమావేశాల్లోనైనా ప్రాధాన్య అంశాల్ని పొందుపరుస్తారని ఆశించామన్నారు. ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల విషయంలో గవర్నర్ మౌనం వహించడాన్ని తప్పుపట్టారు. ఉద్యోగాల కల్పన, దళితులు, గిరిజనులకు మూడెకరాల భూపంపిణీ ప్రస్తావనే తీసుకురాలేదని మండిపడ్డారు. వ్యవసాయంపై చాలా అన్యాయంగా మాట్లాడారని, రైతులను ఉద్ధరించినట్లు చెప్పారని ధ్వజమెత్తారు. రుణమాఫీ పథకంలో పోగుపడిన వడ్డీని కూడా మాఫీ చేస్తామని గత ఏడాది చెప్పిన కేసీఆర్.. ఇప్పటి వరకు చేయలేదన్నారు. 1.40 లక్షల కోట్ల మేర రుణాలు తీసుకుని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలో 16 లక్షల ఎకరాలకే నీరిచ్చామని చెప్పారని, మరి కోటి ఎకరాలకు నీరు ఎప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తి పడి బయటి రాష్ట్రాల నుంచి విద్యుత్తు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఐటీ రంగంలో రూ.2500 కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు వస్తాయని మంత్రి కేటీఆర్ చెప్పారని.. మరి అవన్నీ ఎటు పోయాయని నిలదీశారు. ఉత్పత్తి రంగంలో 5,500 చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్న టీఆర్ఎస్.. అసెంబ్లీలో పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపే అవకాశం కూడా తమకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

• ప్రచార ఆర్భాటమే: ఎమ్మెల్యే సున్నం రాజయ్య

మిషన్ భగీరథ ప్రాజెక్టు ప్రచార ఆర్భాటం తప్ప ఇంకేమీ లేదని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య విమర్శించారు. ఖమ్మం జిల్లాలో నీటి సమస్య ఇప్పటికే తీవ్రమైందని, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

• బీసీలను బిచ్చగాళ్లను చేస్తున్నారు: కృష్ణయ్య

నాలుగేళ్లలో ఏ ఒక్క హామీటీ నెరవేరలేదని టీడీపీ ఎమ్మెల్యే కృష్ణయ్య విమర్శించారు. బీసీ పథకాలకు నిధులు కేటాయించకుండా వారిని బిచ్చగాళ్లను చేస్తున్నారంటూ మండిపడ్డారు.

• నిరుత్సాహానికి గురిచేసింది: సండ్ర

గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజలను నిరుత్సాహానికి గురిచేసిందని టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఇటీవలే గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీకి వెళ్లిన గవర్నర్ అక్కడి సౌకర్యాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని, తన ప్రసంగంలో మాత్రం ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తారన్నారు.

• వారిపై అనర్హత వేటు వేయాలి : చాడ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి.. సీఎం కేసీఆర్ రాజకీయ నిజాయితీ నిరూపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిరాయింపుదారుల రాజీనామాలు నెలలు, ఏళ్ల తరబడి స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, దీనిపై సీఎం స్పందనేంటో చెప్పాలని కోరారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న థర్డ్‌ఫ్రంట్‌లోనూ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారా? అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగలలేదా? అని నిలదీశారు.




ప్లకార్డులతో అసెంబ్లీకి వస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

• టీఆర్ఎస్, కాంగ్రెస్.. దొందూ దొందే : బీజేపీ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్, కాంగ్రెస్.. దొందూ దొందేనని బీజేపీ శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు సమావేశాలను టీఆర్ఎస్ ఎంపీలు ఎలా స్తంభింపజేస్తున్నారో.. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా అదేరీతిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాలులో ఎమ్మెల్సీ నేత ఎన్.రాంచందర్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మతపరమైన రిజర్వేషన్లపై ప్రధాని మోదీ గతంలో ఉన్న చట్టంలో ఒక్క అక్షరం కూడా మార్చలేదు.. చేర్చలేదు. అలాంటి పరిస్థితిలో ఏ ప్రాతిపదికన టీఆర్ఎస్ సభ్యులు మోదీని విమర్శిస్తారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న ఆందోళనతో టీఆర్ఎస్ ప్రభుత్వం నిరాశ, నిస్పృహల్లో ఉందని, అందుకే థర్డ్ ఫ్రంట్ ప్రకటన చేసిందని, పార్లమెంటు సమావేశాలను అడ్డుకుంటోందని, గవర్నర్ ప్రసంగ పాఠాన్ని పది పేజీలు తగ్గించిందని ఆరోపించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను న్యాయంగా 42 రోజులు నిర్వహించాల్సి ఉండగా.. 12 రోజులకు ఎందుకు కుదించారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు నిర్బంధం పెరిగిందని, కేసులకు శిక్షలు న్యాయస్థానాలకు బదులుగా ప్రగతి భవన్‌లో, డీజీపీ కార్యాలయంలో వేస్తున్నారని ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగం అబద్ధాల పుట్ట అని విమర్శించారు. నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి సచివాలయానికి ఎందుకు రాలేదో గవర్నర్ తన ప్రసంగంలో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రసంగ పాఠం గవర్నర్ వ్యవస్థకే కళంకం తెచ్చేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ అంశంపై దూకుడుగా వ్యవహరించాలని బీజేపీ నిర్ణయించింది. సాగు, తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్న అంశంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఉద్యోగాల భర్తీ, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయలో అవినీతిపై చర్చకు పట్టుబట్టాలని తీర్మానించింది.

• కనీస మద్దతు ధర కోసం ఒత్తిడి: టీడీఎల్పీ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర కల్పించడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని టీడీఎల్పీ నిర్ణయించింది. అసెంబ్లీలోని టీడీఎల్పీలో పార్టీ ఉపనేత సండ్ర వెంకటవీరయ్య.. ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య, సీనియర్ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అమర్‌నాథ్‌బాబు తదితరులతో కలిసి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నోటిఫికేషన్లు, మిషన్ కాకతీయ, బతుకమ్మ చీరల పంపిణీ, గొర్రెల పంపిణీలో అవినీతి, భూదందాలు, ఇసుక, డ్రగ్స్ మాఫియా, రాష్ట్రం కోసం అమరులైన వారి కుటుంబాలకు సాయం చేయడంలో నిర్లక్ష్యం, నదుల అనుసంధానం తదితర హామీల అమలుపై సభలో చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించారు.



అసెంబ్లీ చరిత్రలోనే బ్లాక్ డే : కొండా సురేఖ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి సంఘటన గతంలో ఎన్నడూ జరగలేదని, ఈ రోజు బ్లాక్ డేగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే కొండా సురేఖ పేర్కొన్నారు. మండలి చైర్మన్‌పై కాంగ్రెస్ నేతలు గురిచూసి హెడ్‌సెట్ విసిరారని ఆరోపించారు. ప్రజల కోసం ఉద్యమిస్తున్నామన్న భావన కల్పించేందుకు కాంగ్రెస్ నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఉద్దేశపూర్వకంగా
దాడి చేయలేదు

- కాదని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం
- స్వామిగౌడ్ అంటే.. నాకు అభిమానం
- టీఆర్ఎస్ నన్ను టార్గెట్ చేసింది
- పార్టీ ఆదేశిస్తే గజ్వేల్ నుంచి పోటీ
- సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తన కాలికి గాయమైందని చూపిస్తున్న కోమటిరెడ్డి

నల్లగొండ/చౌటుప్పల్/హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై తాను ఉద్దేశపూర్వకంగా దాడి చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపే క్రమంలో హెడ్‌సెట్ పొరపాటున మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలిందని, తాను కావాలని చేసింది కాదని తేల్చిచెప్పారు. స్వామిగౌడ్ అంటే తనకు ఎంతో అభిమానమన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అర్థరహితంగా ఉందని, తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి చెత్త ప్రసంగాన్ని ఎన్నడూ చూడలేదని అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని, ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు తాము పోడియం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. వందల మంది మార్షల్స్‌ను పెట్టి అడ్డుకుందని అన్నారు. ఈ క్రమంలో తన కాలికి గాయమైందని తెలిపారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రౌడీల్లా వ్యవహరించారని మండిపడ్డారు. అంతకుముందు అసెంబ్లీ ఎలైటింగ్ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ తనను టార్గెట్ చేసిందని ఆరోపించారు. పార్టీ ఆదేశిస్తే గజ్వేల్ నుంచి పోటీ చేస్తానన్నారు. కేసీఆర్ నల్లగొండ నుంచి పోటీ చేస్తే.. తాను ఇంట్లో కూర్చున్నా గెలుస్తానని వ్యాఖ్యానించారు.





కాంగ్రెస్ సభ్యులను అడ్డుకుంటున్న మార్షల్స్; గాయపడ్డ స్వామిగౌడ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

యోచిస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం ఆనవాయితీ. దాంతో, గవర్నర్ నరసింహన్‌ను స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ముఖ్యమంత్రి కేసీఆర్ తోడ్కొని వచ్చారు. అయితే, ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా, 10:03 గంటలకు గవర్నర్ వచ్చారు. మూడు నిమిషాల ఆలస్యాన్ని దృష్టిలో పెట్టుకొని.. 'నో డిసిప్లిన్' అంటూ కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. జాతీయ గీతాలాపన అనంతరం గవర్నర్ తన ప్రసంగం ప్రారంభించారు. కాంగ్రెస్ సభ్యులంతా ప్లకార్డులు పట్టుకొని.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ 10:10 గంటలకు నినాదాలు చేయడం ప్రారంభించారు. రెండు నిమిషాల్లోనే పోడియం ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించారు. వారు పోడియంలోకి రాకుండా దాదాపు 40 మందికిపైగా మార్షల్స్ అడ్డుగా నిల్చున్నారు. దాంతో, గవర్నర్ ప్రసంగం తెలుగు, ఆంగ్లం కాపీలను ముక్కలు చేసిన కాంగ్రెస్ సభ్యులు.. తాము ఉన్నచోటు నుంచే వాటిని గాల్లోకి విసిరారు. మరో సభ్యుడు తన కళ్లజోడును విసిరేశారు. అవి గవర్నర్ వైపు వెళ్లకుండా సూట్ కేసులు, చేతులతో మార్షల్స్ వాటిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ గందరగోళం కొనసాగుతుండగానే, పార్టీ సభ్యుల మధ్యలో నిలుచున్న కాంగ్రెస్ పక్ష ఉప నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 10:18 గంటల సమయంలో తన ఎడం చేత్తో హెడ్ ఫోన్‌ను విసిరారు. అది కాస్తా గాల్లో ఎగురుకుంటూ వచ్చి స్వామిగౌడ్‌కు తగిలింది. అయినా, గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. దాంతో, కాంగ్రెస్ సభ్యులు నిరసన స్వరాన్ని మరింత పెంచారు. ఈ క్రమంలోనే, కాంగ్రెస్ సభ్యులకు, మార్షల్స్‌కు మధ్య తోపులాట జరిగింది. మార్షల్స్ అడ్డుకోవడంతో కొందరు కాంగ్రెస్ సభ్యులు తమ సీట్ల వద్దనే ఉండిపోయారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని, ప్రభుత్వ నిర్లక్ష్యం నశించాలంటూ నినాదాలతో సభను హోరెత్తించారు. వారి ఆందోళన కొనసాగుతుండగానే, కాంగ్రెస్ పక్ష నేత జానారెడ్డి బయటికి వెళ్లిపోయారు. కాంగ్రెస్ సభ్యుల ఆందోళనల మధ్యే గవర్నర్ తన ప్రసంగాన్ని పదిన్నరకు ముగించారు. అనంతరం, జాతీయ గీతాలాపనతో కాంగ్రెస్ సభ్యులు మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత గవర్నర్‌ను కట్టుదిట్టమైన భద్రత నడుమ బయటికి తీసుకెళ్లారు. కాగా, ఇటు కాంగ్రెస్ నిరసన, అటు గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగానే.. 10:20 గంటల సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, రాజాసింగ్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావులు గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత స్వామిగౌడ్‌ను సరోజినీ కంటి ఆస్పత్రికి తరలించారు.

ఆరంభం నుంచే ఆందోళన

గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించి కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేయనున్నారనే సమాచారంతో ఉదయం 9 గంటల సమయంలోనే మార్షల్స్ స్పీకర్ పక్కన ఉన్న భాగంలో అప్రమత్తంగా నిల్చున్నారు. ఉదయం 10 గంటలకు వచ్చీ రాగానే కాంగ్రెస్ సభ్యులు ఆందోళనకు దిగారు. గవర్నర్ ఆలస్యంగా రావడంతో ఆయన సభలో అడుగు పెడుతుండగానే 'నో డిసిప్లిన్' అంటూ నినదించారు. ప్లకార్డులు పట్టుకొని నిరసన కొనసాగించారు. సభలో ఉన్న మార్షల్స్‌కు తోడు బయటి నుంచి మరింత మంది రావడంతో కాంగ్రెస్ సభ్యులు వారితో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముందు వరుసలో ఉండగా.. కోమటిరెడ్డి ఆయన పక్కనే ఉంటూ నినాదాలు చేశారు. వెంకట్‌రెడ్డి ప్రసంగ ప్రతులను విసిరేస్తూ ఆందోళన చేపట్టగా.. ఉత్తమ్ నినాదాలతో హోరెత్తించారు.

కళ్లద్దాలతో సీఎం

బడ్జెట్ సమావేశాల తొలిరోజు ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్ ప్రసంగాన్ని కళ్లద్దాలు పెట్టుకొని చదవడం కనిపించింది. కాంగ్రెస్ సభ్యులు నినాదాలతో హోరెత్తించినా.. ప్రసంగ ప్రతులను చించేస్తున్నా అటువైపు చూడకుండా సీఎం మాత్రం ప్రసంగ ప్రతిని చదువుకుంటూ కనిపించారు. కాగా, మజ్లిస్‌పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ గవర్నర్ ప్రసంగానికి దూరంగా ఉన్నారు.



కార్నియా దెబ్బతింది

- 24 గంటలు పరిశీలనలోనే.. హెల్త్ బులెటిన్లో వైద్యులు



స్వామిగౌడ్‌ను పరామర్శిస్తున్న కడియం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో గాయపడిన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు కుడి కంటి కార్నియా దెబ్బతిందని సరోజినిదేవి కంటి ఆస్పత్రి డాక్టర్లు తెలిపారు. ఆయనకు శస్త్ర చికిత్స చేయాలా లేదా అనే దానిపై 24 గంటలపాటు పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. స్వామిగౌడ్‌కు మధుమేహం ఉండడంతో వైద్యులు చాలా జాగ్రత్తగా చికిత్స అందిస్తున్నారు. స్వామిగౌడ్ కంటిపై తీవ్రమైన ఒత్తిడి పెరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్ చెప్పారు. స్వామిగౌడ్‌ను అసెంబ్లీలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. అంతకుముందు, ప్రతిపక్ష నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెడ్‌ఫోన్ విసరడంతో స్వామిగౌడ్ కంటికి గాయమైంది. వెంటనే అసెంబ్లీ ప్రాంగణంలోనే వైద్యుడు పరీక్షించి నేత్ర వైద్యుడి వద్దకు వెళ్లాల్సిందిగా సూచించారు. అయితే, గవర్నర్ ప్రసంగం పూర్తయ్యే వరకు ఆయన అసెంబ్లీలోనే ఉన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఆయనను సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో చేర్పించారు. కంటికి దెబ్బ తగలడంతో వాపు వచ్చి, ఎర్రగా మారింది. దాంతో, డాక్టర్లు తొలుత స్కానింగ్ చేశారు. కంటిపై ఒత్తిడి పరీక్షలు జరిపారు. అనంతరం, కార్నియా పాడైనట్లు గుర్తించారు. మంగళవారం వరకు ఆయనకు విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పారు.

పలువురు నాయకుల పరామర్శ

మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. స్పీకర్ మధుసూదనాచారి, మంత్రులు కేటీఆర్, హరీశ్, ఈటల, నాయిని, మహమూద్ అలీ, కడియం, మహేందర్‌రెడ్డి, ఎంపీ కేశవరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర నాయకులు, సినీనటి కవిత, నటుడు సుమన్ తదితరులు స్వామిగౌడ్‌ను పరామర్శించారు. కాగా స్వామిగౌడ్‌ను పరామర్శించడానికి వచ్చిన కాంగ్రెస్ నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, షబ్బీర్ అలీని టీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగింది. విషయాన్ని పోలీసులు స్వామిగౌడ్‌కు తెలపడంతో ఆయన ఆదేశాల మేరకు వారిని లోనికి పంపించారు. టీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంపై స్వామిగౌడ్ వారికి సారీ చెప్పారు.

స్వామిగౌడ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం: జాజుల

స్వామిగౌడ్‌పై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దాడి చేయడాన్ని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు. దాడిపై విచారణ జరిపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సచివాలయం మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ స్థానాల్లో రెండు బీసీలకు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.



సరోజిని కంటి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రులు ఈటల, హరీశ్

గూండాల్లా వ్యవహరించారు

- గవర్నర్ లక్ష్యంగానే దాడి
- దాడులను జానారెడ్డి సమర్థిస్తారా?
- కాంగ్రెస్‌పై మంత్రి హరీశ్ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శాసనసభలో కాంగ్రెస్ నేతలు గూండాల్లా వ్యవహరించారని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో ఆయనే లక్ష్యంగా దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డే స్వయంగా అంగీకరించారని మీడియా ప్రతినిధుల ద్వారా తెలిసిందన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణకు సీఎం కేసీఆర్ ఎంతో మంచి పేరు తీసుకొస్తుంటే.. దాన్ని చెడగొట్టేందుకే కాంగ్రెస్ సభ్యులు గవర్నర్‌ని లక్ష్యంగా చేసుకొని దాడికి దిగారన్నారు. అయితే కాంగ్రెస్ సభ్యులు విసిరిన వస్తువులు మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కి తగిలాయన్నారు. భౌతికదాడులు చేయడం ద్వారా సమాజానికి ఏం సందేశం ఇవ్వాలని భావిస్తున్నారని ప్రశ్నించారు. సోమవారం టీఆర్ఎస్ఎల్పీలో మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలతో కలిసి హరీశ్ విలేకరులతో మాట్లాడారు. ఏ అంశానికైనా సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెబుతున్నా కాంగ్రెస్ సభ్యులు పట్టించుకోవడం లేదన్నారు. పైగా ప్రభుత్వం కుట్ర చేసిందని భట్టి విక్రమార్క ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. చట్టసభల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రతిపక్ష నేత జానారెడ్డి కాంగ్రెస్ సభ్యుల తీరును ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు.

దేశద్రోహానికి.. దేశభక్తికి ఉన్నంత తేడా

ఉమ్మడి రాష్ట్రంలో టీఆర్ఎస్ సభ్యులుగా తామూ నిరసన తెలిపామని మంత్రి హరీశ్‌రావు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సమయంలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వనందుకే నిరసనలు తెలిపామన్నారు. ఇప్పుడు రాష్ట్రం ఏర్పడ్డాక అలాంటి పరిస్థితి లేదని, ఏ అంశంపైనైనా చర్చించేందుకు టీఆర్ఎస్ సర్కారు సిద్ధంగా ఉందని తెలిపారు. గతంలో టీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ సభ్యులు తెలుపుతున్న నిరసనలకు.. దేశద్రోహానికి, దేశభక్తికి ఉన్నంత తేడా ఉందన్నారు. గవర్నర్ ప్రసంగం మొదలైన తర్వాత ఐదు నిమిషాల పాటు మార్షల్స్ సభలోకి రాలేదని, కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ వైపునకు వస్తుంటేనే రక్షణగా నిలబడ్డారని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కాంగ్రెస్ వద్ద సరుకులేదని హరీశ్ ఎద్దేవా చేశారు. స్వామిగౌడ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి అధికారాన్ని స్పీకర్ నిర్ణయానికి వదిలేశామని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా దాన్ని శిరసావహిస్తామని చెప్పారు.

బీసీల జోలికొస్తే పాతరేస్తాం

కాంగ్రెస్ గూండాయిజాన్ని సాగనివ్వం.. కేసీఆర్ వచ్చాకే బీసీలకు స్వాతంత్ర్యం

- మంత్రులు తలసాని, జోగు రామన్న
- ఆ పార్టీకి పుట్టగతులుండవ్: నాయిని
- అసెంబ్లీ, మండళ్లను బీసీలు నడపడాన్ని ఓర్చుకోలేకపోతోంది: శ్రీనివాస్ గౌడ్
- కాంగ్రెస్ సభ్యులు తాగి వచ్చారు: పల్లా

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై కాంగ్రెస్ సభ్యులు దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జోగు రామన్న మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఇంకా ఎంతకాలం గూండాయిజం చలాయిస్తారని ధ్వజమెత్తారు. వాళ్ల గూండాయిజాన్ని ఇకమీదట సాగనిచ్చేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురి చూసి మరీ హెడ్‌ఫోన్ విసిరినట్టు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో సోమవారం మంత్రులు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు తమ గుత్తాధిపత్యాన్ని ఇంకా చలాయించాలనే ఆలోచనతోనే బడుగు వర్గాలపై దాడులకు దిగారని మంత్రి తలసాని ఆరోపించారు. నోటికొచ్చిన బూతులు తిట్టిన కాంగ్రెస్ నేతల తీరు చూసి రాష్ట్ర ప్రజానీకం సిగ్గుపడుతోందన్నారు. బడుగు బలహీన వర్గాల పట్ల కాంగ్రెస్‌కి ఎంత అక్కసు ఉందో అసెంబ్లీ సాక్షిగా తేటతెల్లమైందన్నారు. బీసీల జోలికొస్తే పాతరేస్తామని కాంగ్రెస్ నాయకులను మంత్రి జోగు రామన్న హెచ్చరించారు. 70 ఏళ్లపాటు బీసీలని కాంగ్రెస్ పార్టీ అణగదొక్కిందన్నారు. ఉభయ సభలు సమావేశమైన నిండు సభలో మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై కాంగ్రెస్ నేతలు హత్యాయత్నానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, అప్పుడు కూడా పోలీసులని ప్రయోగించి స్వామిగౌడ్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించిందని గుర్తు చేశారు. కోమటిరెడ్డి వీధి గూండాలా వ్యవహరించారని మండిపడ్డారు. కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే బీసీలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అసెంబ్లీలో మాట్లాడేందుకు విషయం లేకనే కాంగ్రెస్ దాడులకు పాల్పడుతోందని మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గవర్నర్, స్పీకర్లపై గతంలో ఎన్నడూ ఇలాంటి దాడులు జరగలేదన్నారు. స్వామిగౌడ్‌పై దాడి ప్రజాస్వామ్య విరుద్ధమని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని, ఆ పార్టీకి పుట్టగతులుండవని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు గూండాల్లో ప్రవర్తిస్తున్నారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ విమర్శించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌ను బీసీలు నడపడాన్ని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే గురి చూసి స్వామి గౌడ్‌పై దాడి చేశారని చెప్పారు. మరో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి టీఆర్ఎస్ఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలి చైర్మన్‌పై దాడితో కాంగ్రెస్ సంస్కృతి బహిర్గతమైందన్నారు. బీసీలపై కాంగ్రెస్ కక్షపూరిత వైఖరిలో భాగంగానే స్వామిగౌడ్‌పై దాడి జరిగిందని కమలాకర్ ఆరోపించారు.

కాంగ్రెస్ నేతలు తాగి వచ్చారు: పల్లా

కాంగ్రెస్ సభ్యులు అసెంబ్లీకి తాగి వచ్చారని మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. సభ్య సమాజం తలదించుకునేలా వారు ప్రవర్తించారని మండిపడ్డారు. "కాంగ్రెస్ సభ్యుల్లో కొందరు మద్యం తాగి వచ్చారు. వారిలో ఒకరు తూలి ప్రతిపక్ష నేత జానారెడ్డిపై పడ్డారు. దాంతో, ఆయన సభ నుంచి వెళ్లిపోయారు. మద్యం తాగి వచ్చినందుకు, మండలి చైర్మన్‌పై భౌతిక దాడికి పాల్పడినందుకు కాంగ్రెస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు. మండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి సహా పలువురు ఎమ్మెల్సీలు టీఆర్ఎస్ఎల్పీలో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పథకం ప్రకారమే స్వామిగౌడ్‌పై దాడి చేశారని ఆరోపించారు. స్వామిగౌడ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీలు బోడకుంటి వెంకటేశ్వర్లు, నారదాసు లక్ష్మణ్‌రావు, గంగాధర్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ సభ్యులు గూండాల్లా ప్రవర్తించారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు.

గుండాగిరీకి నిదర్శనం: శ్రీనివాస్‌గౌడ్




అసెంబ్లీలో జరిగిన సంఘటన కాంగ్రెస్ ఎమ్మెల్యేల గుండాగిరీకి నిదర్శనమని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇది బిహార్ అసెంబ్లీ కాదు.. తెలంగాణ అసెంబ్లీ. ఇక్కడ కాంగ్రెస్ దాదాగిరి సాగనియ్యబోమన్నారు. గవర్నర్‌పై హెడ్ ఫోన్స్ విసరడం దారుణమని, హెడ్ ఫోన్స్ తగిలి కంటి చూపు పోతే ఎవరు బాధ్యులని ఆయన ప్రశ్నించారు.

టీఆర్ఎస్ వాళ్లలా మేం చేయలేం: గీతారెడ్డి



హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : "మేం డ్రామా వాళ్లం కాదు. టీఆర్ఎస్ వాళ్లలా మేం చేయలేం. అలా చేయడం మాకు తెలియదు"అని కాంగ్రెస్ ఎమ్మెల్యే గీతారెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఆమె మాట్లాడుతూ "మా సభ్యులకు కూడా దెబ్బలు తగిలాయి. అంత మాత్రాన మేం హంగామా చేస్తున్నామా?"అని ప్రశ్నించారు.

హరీశ్ డైరెక్షన్‌తోనే ఆస్పత్రికి స్వామిగౌడ్: సంపత్‌కుమార్



హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి విసిరిన హెడ్‌సెట్ తగిలి.. మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం కావడం, ఆయనను ఆస్పత్రికి తరలించడం వెనుక మంత్రి హరీశ్‌రావు డైరెక్షన్ ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆరోపించారు. అప్పటిదాకా హుషారుగా ఉన్న స్వామిగౌడ్ హఠాత్తుగా ఆస్పత్రిలో ఎలా చేరారని ప్రశ్నించారు.

సర్కారు సీరియస్!

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తోందా!? పదవీ కాలం ముగిసే వరకు వారు సభలో అడుగు పెట్టకుండా చూడనుందా!? మిగిలిన కాంగ్రెస్ సభ్యులపైనా సస్పెన్షన్ వేటు వేయనుందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. అసెంబ్లీ, మండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ సృష్టించిన గందరగోళాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోంది. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం, మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను గాయపర్చడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమనే సంకేతాలు ఇస్తోంది. శాసనసభలో చోటుచేసుకున్న ఈ ఘటనలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ప్రభుత్వం గట్టిగా భావిస్తోంది. బాధ్యులను వదిలిపెడితే, అలవాటుగా మారుతుందని, సంప్రదాయంగా కొనసాగుతుందని ఆందోళన చెందుతోంది. అసెంబ్లీ నిబంధనల ఆధారంగా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. సభలో రణరంగాన్ని సృష్టించారనే కారణంతో కోమటిరెడ్డి, సంపత్‌కుమార్, రామ్మోహన్ రెడ్డిపై బహిష్కరణ వేటు వేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పదవీ కాలం ముగిసే వరకు సభలో అడుగు పెట్టకుండా వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న మిగిలిన కాంగ్రెస్ సభ్యులపై బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ వేటు వేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం అసెంబ్లీ సచివాలయం నుంచి ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకుంది.

చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు

అసెంబ్లీలో సోమవారం జరిగిన ఘటనలపై విచారణ జరిపి, చర్యలు తీసుకునే అధికారాన్ని స్పీకర్ మధుసూదనాచారికి సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) అప్పగించింది. దాంతో, మధ్యాహ్నం తర్వాత ఆయన సభ కవరేజీ వీడియోలను తెప్పించుకొని తన చాంబర్‌లో శాసనసభ వ్యవహారాల మంత్రి హరీశ్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు, శాసనసభ, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌లు, విప్‌లతో కలిసి పలుమార్లు క్షుణ్ణంగా వీక్షించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే క్రమంలో మూడు హెడ్ ఫోన్లు, ఒక కళ్లజోడును ఆయన వైపు విసిరినట్లు గుర్తించారు. ఆ హెడ్ ఫోన్లలో ఒకటి గురి తప్పి గవర్నర్ పక్కనే కూర్చున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలి, గాయపడినట్లు కనుగొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ కుమార్, రామ్మోహన్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించడాన్ని గమనించారు. కోమటిరెడ్డి కుర్చీ మీదకు ఎక్కి ఎడమ చేత్తో హెడ్ ఫోన్‌ను గవర్నర్ వైపు విసిరిన తర్వాత, కిందికి దూకే క్రమంలో కింద పడినట్లుగా వీడియోల్లో ఉంది. కింద పడిన ఆయన్ను షబ్బీర్ అలీ వంగి పైకి లేవనెత్తినట్టూ గుర్తించారు. అదే సమయంలో మిగిలిన కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడానికి ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయటం, ముందుకు దూసుకు రావడానికి యత్నించడం, వారిని అతికష్టం మీద మార్షల్స్ నిలువరించిన సన్నివేశాలు గమనించారు. కొందరు నోటికి పని చెప్పారని, గవర్నర్‌పై దూషణ పర్వానికి కూడా దిగినట్లు గుర్తించారు. కాంగ్రెస్ సభ్యులు తప్పు చేసినట్లు ధ్రువీకరించుకున్న స్పీకర్.. వారిపై చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయ నిపుణులతో రాత్రి పొద్దుపోయే వరకు సంప్రదింపులు జరిపారు. అడ్వొకేట్ జనరల్, న్యాయశాఖ కార్యదర్శిని పిలిపించుకొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని, శాసనసభ విధి విధానాలు, చట్టాలను తిరగేశారు. సభ్యులపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉన్న సెక్షన్లు, నిబంధనలను వడపోశారు. లోగడ వివిధ రాష్ట్రాలు, పార్లమెంటులో చోటుచేసుకున్న ఘటనలు, ప్రత్యేకించి మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న క్రమంలో సభ్యులపై తీసుకున్న చర్యల వివరాలను పరిశీలించారు. అప్పుడు ఆయా సభ్యులు కోర్టులకు వెళ్లిన సందర్భంగా వెలువడ్డ తీర్పులను అధ్యయనం చేశారు. అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకుని.. కాంగ్రెస్ సభ్యులపై ప్రభుత్వం కఠిన చర్యల దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. వెంకట్‌రెడ్డి, సంపత్, రామ్మోహన్‌రెడ్డిపై అనర్హత వేటు వేస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ సభ్యుల నిరసన క్షమించరాని విధంగా అదుపు తప్పిందని భావిస్తున్న ప్రభుత్వం.. మంగళవారం సభ ప్రారంభం కాగానే వారిపై చర్యలను ప్రతిపాదిస్తుందని, ఆ వెంటనే స్పీకర్ ప్రకటన చేస్తారని తెలుస్తోంది.


హిమాలయ పర్వత ప్రాంతంలో గుర్రంపై రజనీకాంత్

● కార్తీకి 13 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ, మార్చి 12: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరానికి ఢిల్లీ కోర్టు 13 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతిచ్చింది. దీంతో ఆయనను తిహార్ జైలుకు తరలించారు. మార్చి 24వరకు ఆయన జైల్లో ఉండనున్నారు. మరోవైపు జైల్లో ప్రత్యేక గదిని కేటాయించాలని, అత్యవసరంగా బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలన్న విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. అయితే కార్తీకి సరైన భద్రత కల్పించాలని ఆదేశించింది. ఇంటి నుంచి వచ్చే భోజనం, పుస్తకాలు, బట్టలను జైల్లోకి అనుమతించకూడదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 15న షెడ్యూల్ ప్రకారమే విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

● చిదంబరంపై చర్యలకు సంకేతాలు!

న్యూఢిల్లీ, మార్చి 12: కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరంపై కేంద్రం ఉచ్చుబిగుస్తోంది. ఆయనపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కేంద్రం సంకేతాలిచ్చింది. యూపీఏ హయాంలో ప్రైవేటు వర్తక సంస్థలకు అనుకూలంగా బంగారం దిగుమతి నిబంధనలు సడలించిన వారిపై చర్యలు తీసుకుంటామని కేంద్రం సోమవారం వెల్లడించింది. బంగారం దిగుమతి సడలింపు వల్ల 13 సంస్థలకు ఆరు నెలల్లోనే రూ.4,500 కోట్లు వచ్చాయని పేర్కొంది. అయితే.. 2014 మార్చి 5న ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత మే 13న అప్పటి ఆర్థిక మంత్రి సవరించిన గోల్డ్ ఇంపోర్ట్ స్కీంకు ఆమోదముద్ర వేశారని వాణిజ్య శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆపద్ధర్మ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు బంగారం దిగుమతులకు అనుమతిస్తూ వాటికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపింది. ఇందులో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని కేంద్రం స్పష్టం చేసింది.

● చీటీలు పాడేప్పుడు వీడియో తప్పనిసరి

లోక్‌సభలో చిట్ ఫండ్ సవరణ బిల్లు

న్యూఢిల్లీ, మార్చి 12: చిట్ ఫండ్ సవరణ బిల్లు-2018ను లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టారు. చీటీ పాడేప్పుడు చాలా మంది ప్రత్యక్షంగా హాజరయ్యే వీలుండదు కాబట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా హాజరయ్యేందుకు ఈ బిల్లు అవకాశం కల్పించనుంది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా 1982 నాటి చిట్ ఫండ్ చట్టంలో సవరణలు చేశారు. దీని ప్రకారం చీటీలు పాడేప్పుడు వీడియో రికార్డింగ్ తప్పనిసరి కానుంది. ఇందుకోసం కనీసం ఇద్దరు సభ్యులుండాలి. ఫోర్‌మన్ ఈ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డు చేయాలి.

● బీజేపీలోకి ఎస్పీ ఎంపీ నరేశ్ అగర్వాల్

న్యూఢిల్లీ, మార్చి 12: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు ఆ పార్టీ ఎంపీ నరేశ్ అగర్వాల్ గట్టి షాకిచ్చారు. యూపీ నుంచి రాజ్యసభ సభ్యత్వం తనకు కాకుండా సినీనటి, అమితాబ్ బచ్చన్ భార్య జయా బచ్చన్‌కు ఇచ్చినందుకు ఆగ్రహించి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. బీజేపీలో చేరిపోయారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో అగర్వాల్ సోమవారమిక్కడ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.. 'సినిమాల్లో నటించే, డాన్సులేసే మహిళతో నన్ను పోల్చి నాకు రాజ్యసభ టికెట్ ఇవ్వలేదు. ఇది నాకు చాలా బాధ కలిగించింది. అందుకే బీజేపీలో చేరాను' అని జయా బచ్చన్‌పై ఆయన ఈ సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అగర్వాల్ వ్యాఖ్యలపై మంత్రి సుష్మా స్వరాజ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అగర్వాల్ బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నానని.. కానీ జయా బచ్చన్‌పై చేసిన వ్యాఖ్యలు అనుచితమని, అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు.

● పబ్‌పై దాడి కేసులో 'శ్రీరామసేన' నిర్దోషి!

మంగళూరు, మార్చి 12: పబ్‌పై దాడి కేసులో సాక్ష్యాధారాలు లేవంటూ శ్రీరామసేన అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్‌తోపాటు సుమారు 30 మంది కార్యకర్తలను నిర్దోషులుగా కోర్టు విడుదల చేసింది. 2009 జనవరి 24న కర్ణాటకలోని మంగళూరులో 'ఆమ్నేసియా-ది లాంగ్' అనే పబ్‌పై శ్రీరామసేన అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్‌తోపాటు కార్యకర్తలు దాడి చేశారు. భారతీయ సాంప్రదాయాలను మంటగలుపుతున్నారని ఆరోపిస్తూ పబ్ నుంచి యువతులను జుట్టుపట్టుకొని బయటికి లాక్కురావడం, చెంపదెబ్బలు కొట్టడం, దురుసుగా ప్రవర్తించడం కెమెరాల్లో రికార్డయింది.

● కశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్, మార్చి 12: దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. హకురా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా దళాలు ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయాక గాలింపు చర్యలు ప్రారంభించాయి. తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరగ్గా... ముగ్గురు ఉగ్రవాదులు సంఘటనా స్థలంలోనే మరణించారు. మృతుల్లో ఇద్దర్ని శ్రీనగర్‌కు చెందిన ఈసా ఫాజిల్, అనంతనాగ్‌కు చెందిన సయ్యద్ ఒవైస్‌గా గుర్తించారు. కాగా, శ్రీనగర్ కేంద్ర కారాగారంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తనిఖీలు నిర్వహించింది. రెండు డజన్లకుపైగా మొబైల్ ఫోన్లు, జిహాదీ సాహిత్యం, పాకిస్థాన్ జెండా, డేటా హార్డ్‌వేర్‌ను స్వాధీనం చేసుకుంది.

● లోక్‌సభలో ఆర్థిక నేరగాళ్ల బిల్లు

న్యూఢిల్లీ, మార్చి 12: వరుసగా ఆరో రోజు కూడా పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించాయి. అవే సమస్యలు.. అదే హోరు.. లోక్‌సభ, రాజ్యసభ సమావేశమైన వెంటనే టీడీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు లేచి ఒక్క పెట్టున సభ మధ్యలోకి దూసుకెళ్లి నినాదాలు చేయడం మొదలెట్టారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు కొనసాగించారు. ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ మొదట ఓ గంటసేపు సభను వాయిదా వేశారు. ఆ తరువాత సమావేశమయ్యాక కూడా అదే పరిస్థితి. అయినా ఆమె వాయిదా వెయ్యలేదు. ఆ సమయంలోనే ఆర్థిక నేరగాళ్ల నియంత్రణ బిల్లును ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్ శుక్లా ప్రవేశపెట్టారు. దీని ప్రకారం రూ 100 కోట్ల పైబడి అప్పు పడి, దేశం విడిచి పారిపోయి, భారతీయ కోర్టులకు అందుబాటులో లేకుండా విదేశాల్లో తలదాచుకునేవారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనపర్చుకుంటుంది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు సభ మధ్యలోనే చాలాసేపు నిలబడిపోయి తన నిరసన కొనసాగించారు. మిగిలిన పార్టీల సభ్యులు కూడా దూసుకొచ్చి తమ తమ అంశాలను లేవనెత్తుతూ చర్చకు, ప్రభుత్వ సమాధానానికి పట్టుబట్టారు. 'సభ ఆర్డర్‌లో లేనపుడు పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ఎలా అవకాశం ఇవ్వగలుగుతాం?' అని ఛైర్మన్ వెంకయ్యనాయుడు ప్రశ్నించారు. అసలు వెల్ లోకి సభ్యులెందుకు వస్తున్నారో తనకు అర్థం కావట్లేదన్నారు. ఆ తరువాత మంగళవారానికి వాయిదా వేశారు.


ముంబైలోని ఆజాద్ మైదానంలో రైతుల ఆందోళన


రైతులకు ఆహార పదార్థాలు అందజేస్తున్న ముంబైవాసులు

అన్నదాతా.. జయహో!

రైతుల డిమాండ్లకు ఫడణవీస్ సర్కారు ఓకే.. మహారాష్ట్రలో ఆందోళన విరమణ

ముంబై, మార్చి 12: పోరాటం ఫలించింది! పాదయాత్ర ఫలితం ఇచ్చింది! కిసాన్ లాంగ్ మార్చ్ విజయవంతమైంది! గిరిజనులు, రైతులు గెలిచారు! వారి డిమాండ్లకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు లిఖితపూర్వకంగా రాసిచ్చింది. దాంతో, రైతులు తమ ఆందోళనను విరమించారు. అసెంబ్లీని ముట్టడించకుండానే వెనుదిరిగారు. తమ డిమాండ్ల సాధనకు సీపీఎం రైతు విభాగం అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులు, గిరిజనులు 'కిసాన్ లాంగ్ మార్చ్'కు మంగళవారం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. సుమారు 50 వేల మంది రైతులు, గిరిజనులు ఇందులో పాల్గొన్నారు. ఎరుపు రంగు టోపీలు, ఎరుపు రంగు చొక్కాలు, ఎరుపు రంగు జెండాలు చేతబట్టి పాదయాత్రలో పాల్గొన్నారు. నాసిక్ నుంచి ముంబై వరకూ జాతీయ రహదారిపైనే వీరంతా పాదయాత్ర చేశారు. ఇంకా విచిత్రం ఏమిటంటే, ఎర్రని ఎండలో జాతీయ రహదారిపై కూడా వీరిలో అత్యధికులు కాళ్లకు చెప్పుల్లేకుండానే పాదయాత్ర చేశారు. రోజుకు 30 కిలోమీటర్లు నడుచుకుంటూ ఆరు రోజుల్లో ఆదివారం రాత్రికే వీరంతా ముంబై శివారుకు చేరారు. అక్కడి నుంచి సోమవారం తెల్లవారుజామున ముంబైలోని ఆజాద్ మైదాన్‌కు చేరుకున్నారు. దాంతో, అది ఎర్ర సముద్రమే అయింది. సోమవారం ఉదయమే అసెంబ్లీని ముట్టడించాలన్నది ఆందోళనకారుల తొలి యోచన. అయితే, సోమవారం ఉదయం పదో తరగతి పరీక్షలు ఉండడంతో, ట్రాఫిక్‌ను స్తంభింపజేయరాదని, వారికి ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశంతో ముట్టడిని సాయంత్రానికి వాయిదా వేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకూ ఇంటికి వెళ్లేది లేదని, ముంబైలోనే ఉంటామని ఆందోళనకారులు స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రభుత్వ ఆహ్వానం మేరకు సోమవారం మధ్యాహ్నం విధాన భవన్లో రైతు సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి ఫడణవీస్, ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఇవి సానుకూల ఫలితం ఇచ్చాయి. అనంతరం ఆజాద్ మైదానంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సమక్షంలో రైతులను ఉద్దేశించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్ మాట్లాడారు. రైతుల 'అన్ని డిమాండ్ల'నూ ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. గిరిజనులు, రైతులు సాగు చేసుకుంటున్న భూములను వారికే అప్పగిస్తామని, అయితే, 2005కు ముందు నుంచే తాము సాగు చేసుకుంటున్నట్లు రైతులు ఆధారం చూపాల్సి ఉంటుందని, ఈ మేరకు ఓ కమిటీని ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరిందని విధాన్ భవన్ బయట సీఎం ఫడణవీస్ తెలిపారు. రైతులకు సంబంధించి దాదాపు అన్ని డిమాండ్లను ఆమోదించామన్నారు. కాగా, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ చవాన్, శివసేన నేత ఆదిత్య ఠాక్రే, ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే తదితరులు రైతుల ఆందోళనకు మద్దతు పలికారు. తాము మద్దతు తెలపడమే కాదని, అవసరమైతే తాము కూడా ఆందోళనలో పాల్పంచుకుంటామని శివసేన ప్రకటించింది. ఈ పాదయాత్ర సీపీఎం ఆధ్వర్యంలో జరిగినా, వాళ్లు ఎర్ర జెండాలు పట్టుకున్నా.. రైతుల సంక్షేమం కోసం తాము వారికి మద్దతు ఇస్తామని తెలిపారు. ఉద్యమ విజయోత్సాహంతో ఉన్న సీతారాం ఏచూరి రైతులను దేశానికి నవ సైనికులుగా అభివర్ణించారు.

రైతుల డిమాండ్లలో కొన్ని..

- రుణాలను, విద్యుత్తు బిల్లులను బేషరతుగా మాఫీ చేయాలి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులకు ఉత్పత్తి ధర కంటే ఒకటిన్నర రెట్లు మద్దతు ధర ప్రకటించాలి
- రైతులకు కూడా పింఛను పథకం ప్రకటించాలి
- ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న అటవీ భూమిని రైతులకే పట్టా ఇవ్వాలి.
- వడగండ్ల వానకు, గులాబీ పింక్ బోల్ వార్మ్ పురుగు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి
- గిరిజనుల భూములు మునిగిపోకుండా నాసిక్, థానే, పాల్ఘార్ జిల్లాల్లో నదుల అనుసంధాన ప్రణాళికను మార్చాలి.
- జాతీయ రహదారులు, బుల్లెట్ రైలు, నదుల అనుసంధానం తదితరాలకు బలవంతంగా భూములు సేకరించరాదు.

ముంబైకర్ల మద్దతు

గిరిజన, గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు వస్తే పట్టణాలు, నగరాల్లో పరిస్థితి ఎలా ఉంటుంది!? నగరవాసులు వారిని చూస్తారు!? సాధారణంగా వారి ఉనికిని నగరవాసులు అంతగా ఇష్టపడరు. కానీ, ముంబైలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నం. ముంబైకర్లు వారికి పూర్తిగా మద్దతు తెలిపారు. భారీ పాదయాత్రగా వచ్చిన రైతులను చూసి తలుపులు బిడాయించుకోకుండా వీధుల్లోకి వచ్చి వారికి స్వాగతించారు. వారిపై పూలవాన కురిపించారు. వారితో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కొంత మంది మంచినీళ్లు ఇచ్చారు. మరికొందరు బిస్కెట్లు, స్నాక్స్, ఆహార పదార్థాలు అందించారు. కాళ్లకు చెప్పులు కూడా లేకుండా 180 కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చిన వారికి ఇంకొందరు పాదరక్షలను ఇచ్చారు. పాఠశాల విద్యార్థులు కూడా ఈ పంపిణీలో పాల్గొనడం చూపరులను విశేషంగా ఆకర్షించింది. "ఎర్రని ఎండలో.. ఆరు రోజులపాటు.. జాతీయ రహదారిపై.. కాళ్లకు చెప్పుల్లేకుండా.. ఉత్త కాళ్లతో పాదయాత్ర చేశారని తెలుసుకుని నివ్వెరపోయాం. కొంత మంది కాళ్లు బొబ్బలెక్కిపోయాయి. మరికొందరి కాళ్ల నుంచి అయితే రక్తం కూడా కారుతోంది. దాంతో, అప్పటికప్పుడు మా కాళ్లకున్న చెప్పులను తీసేసి వారిలోని మహిళలకు ఇచ్చాం. పాదరక్షలు విరాళాలు ఇవ్వాలంటూ వాట్సాప్‌లో ఓ గ్రూప్ ఏర్పాటు చేశాం. ఇందుకు మంచి స్పందన వచ్చింది" అని ఫ్లవర్ వ్యాలీ వాసి నీతా కర్నిక్ చెప్పారు. ఆమె ఒక్కరే వంద జతల బూట్లు ఇచ్చారు. అలాగే, ముంబైలోని డబ్బావాలాలు ఆందోళనకారులకు టిఫిన్, భోజనాలు పెట్టారు. "మనకి తిండి పెట్టేది వాళ్లే. అందుకే వాళ్లకు ఆహారం అందించాలని నిర్ణయించాం" అని ముంబై డబ్బావాలాల అసోసియేషన్ అధికార ప్రతినిధి సుభాష్ తాలేకర్ చెప్పారు. క, ముంబైకర్లంతా 'రైతులతో సెల్ఫీ'లు తీసుకున్నారు. కొందరు అయితే, కొంతమంది రైతులకు ఆశ్రయమిచ్చారు. తమపై పూలవాన కురిపించిన థానే వాసుల అభిమానానికి రైతులు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

సోలార్ దండు



మహారాష్ట్రలో వ్యవసాయ సంక్షోభం తీవ్రతను తెలియజేయడానికి 35వేల మంది రైతులు ముంబైకి ఎర్ర దండులా తరలివచ్చారు. నాశిక్ నుంచి ముంబైకి 180 కిలోమీటర్ల కాలినడక ప్రయాణంలో..ఆరు రోజుల పాదయాత్రలో ఎన్నో అవస్థలు పడ్డారు. కానీ ఈ సుదీర్ఘ ప్రయాణంలో కొంత మంది రైతులు తమ మొబైల్‌ఫోన్ల చార్జింగ్ కోసం మినీ సోలార్ ప్యానల్స్‌ను తమ వెంట తెచ్చుకున్నారు.

నేపాల్‌లో కూలిన బంగ్లాదేశ్ విమానం

50 మంది దుర్మరణం


త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుప్పకూలిన విమానం. మంటల్లో దహనమవుతున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో)

పైలట్ తప్పిదమే కారణమా?

కాఠ్మండూ, మార్చి 12: బంగ్లాదేశ్‌కు చెందిన ఓ విమానం నేపాల్ రాజధాని కాఠ్మండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కూలిపోయింది. ఈ ఘటనలో 50 మంది మరణించినట్లు సమాచారం. విమానంలో మొత్తం 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఢాకా నుంచి కఠ్మాండూ వస్తున్న అమెరికా-బంగ్లా గ్రూప్(యూబీజీ) విమానం బొంబార్డర్ డాష్ 8 క్యూ 400.. సోమవారం ల్యాండ్ అవుతున్న సమయంలో బ్యాలెన్స్ తప్పి కూలిపోయింది. 31 మంది అక్కడికక్కడే మరణించారు. 9 మంది ఆసుపత్రుల్లో చేర్పించిన తరువాత చనిపోయారు.

అసలేం జరిగింది?

ఢాకా నుంచి మధ్యాహ్నం 2 గంటల వేళ యూబీజీ విమానం త్రిభువన్ విమానాశ్రయం వద్దకు చేరింది. గగనతలం నుంచే పైలట్ అబిద్ సుల్తాన్ గ్రౌండ్ కంట్రోల్‌ను సంప్రదిస్తూ ల్యాండింగ్ హేంగర్ గురించి వాకబు చేశాడు. వెంటనే అనుమతి దొరక్కపోవడంతో ఓ రెండు రౌండ్లు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. కంట్రోల్ రూం సిబ్బంది చివరకు ఏర్‌పోర్ట్ దక్షిణం వైపు నుంచి ల్యాండ్ అవ్వాలని సంకేతాలిచ్చినా పైలట్ ఉత్తరం వైపు నుంచి దింపడానికి ప్రయత్నించాడు. దిగుతున్న సమయంలోనే విమానం అటూ ఇటూ వూగుతూ వచ్చింది. పూర్తిగా బ్యాలెన్స్ కోల్పోయి ఒరుగుతూ వెళ్లి ఓ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోకి దూసుకెళ్లింది. వెంటనే నిప్పంటుకుంది. 30 మందికి పైగా అందులోనే సజీవంగా దహనమయ్యారు. పొరపాటున రాంగ్ డైరెక్షన్‌లో దింపడం వల్లే విమానం స్కిడ్ అయిందని ఏర్‌పోర్ట్ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ ఛెత్రీ అల్ జజీరా ఛానెల్‌కు తెలిపారు. ప్రమాదం నుంచి పైలట్ బతికి బయటపడి చికిత్స పొందుతున్నాడు. కారణాలు వెంటనే చెప్పలేమని, సాంకేతిక వైఫల్యం కారణమై ఉండొచ్చని భావిస్తున్నామని, బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సంజీవ్ గౌతమ్ చెప్పారు. చనిపోయిన వారిలో 33 మంది నేపాలీలు, మిగిలిన వారు బంగ్లాదేశీయులు. క్రాష్‌ల్యాండ్ అవడానికి ముందు విమానంలో పెద్ద కుదుపు, శబ్దం వచ్చాయని, తామంతా ఉలిక్కి పడ్డామని బతికి బయటపడ్డ బసంతా బొహ్రా అనే నేపాలీ యువకుడు చెప్పాడు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఎవరూ లేకపోవడం వల్ల మృతుల సంఖ్య అక్కడితో ఆగింది. ఇటీవలి కాలంలో నేపాల్‌లో విమాన ప్రమాదాలు కాస్త ఎక్కువయ్యాయి. 2016 ఫిబ్రవరిలో 16 మంది, 2014 ఫిబ్రవరిలో 18 మంది, 2012 మే నెలలో 15 మంది, సెప్టెంబరులో 19 మంది వివిధ విమాన ప్రమాదాల్లో చనిపోయారు.

కాల్చేసిన 'నిర్లక్ష్యం'!

కార్చిచ్చుకు 10మంది బలి

- మరో 8మంది పరిస్థితి విషమం
- బాధిత కుటుంబాలకు 4లక్షల పరిహారం
- ఉపరాష్ట్రపతి, ప్రధాని, రాహుల్ దిగ్భ్రాంతి

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'కార్చిచ్చు' విషాదమేఘాలు ఇంకా తమిళనాడును వీడలేదు. అంతకన్నా ముఖ్యంగా, అధికారుల నిర్లక్ష్యమే పెను నిప్పురవ్వలు చిమ్మి, సరదాగా ట్రెక్కింగ్‌కు వెళ్లిన వారి యాత్రను విషాదాంతం చేసినట్టు వస్తున్న వార్తలు మరింత కలవరపరుస్తున్నాయి. తమిళనాడు- కేరళ సరిహద్దుల్లోని తేని అడవులను 15 రోజుల క్రితమే కార్చిచ్చు అలుముకొంది. అలాంటప్పుడు ఈ ప్రాంతంలోకి ట్రెక్కీలను అటవీ అధికారులు ఎలా అనుమతించారనేది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఈ దావానలంలో చిక్కుబడిపోయినవారిలో 10 మంది మృతదేహాలను సోమవారం గుర్తించారు. మిగతా వారిలో 20మందికి పైగా కాలిన గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్య అధికారులు తెలిపారు. కురంగని కార్చిచ్చు మరణాలపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మరోవైపు ట్రెక్కింగ్ కోసం కురంగని కొండకు ఈ బృందాలను పంపిన చెన్నైకి చెందిన ట్రెక్కింగ్ క్లబ్ నిర్వాహకుడు పీటర్ వాన్కే క్లబ్‌ను మూసేసి పారిపోయాడు. కురంగని కార్చిచ్చులో మృతి చెందిన వారి కుటుంబీకులకు తలా రూ.4లక్షల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రకటించారు.


సహాయక చర్యల్లో సిబ్బంది

రామాయణ శ్రవణం.. గంగా విహారం

- శంఖనాదం.. బెనారసీ పట్టు చీరల సోయగం
- ఫ్రాన్స్ అధ్యక్షుడికి భారతీయ సంస్కృతిని రుచి చూపిన మోదీ

వారణాశి, మార్చి 12: కాశీ క్షేత్ర గొప్పదనం చెప్పనలవి కాదు... పవిత్ర గంగా తీరంలో వెలసిన ఈ శివ సన్నిధానంలో కాలుమోపడమే ఓ దివ్యానుభూతి. అటువంటి క్షేత్రానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌ను తీసికెళ్లి దేశ సాంస్కృతిక ఔన్నత్యాన్ని పరిచయం చేశారు ప్రధాని నరేంద్ర మోదీ! అంతేకాదు.. గంగానదిలో బోటు షికారు చేయించారు. ఓ పక్క తులసీదాస్ రచించిన రామ్‌చరిత మానస్ నుంచి రామాయణ ఘట్టాలను వినిపిస్తూ- మెక్రాన్‌ను, ఆయన భార్య బ్రిజిట్‌ను గంగలో తిప్పారు. మెక్రాన్‌కు పూర్తి భారతీయ సంప్రదాయంలో పూల రెక్కలు జల్లి స్వాగతం పలికారు సన్నాయి మేళంతో, వేద మంత్రోచ్చాటనలతో స్వాగతిస్తూ మొదటగా- దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ట్రేడ్ ఫెలిసిటేషన్ సెంటర్‌లో స్కూలు విద్యార్థుల చేత రామలీల పేరిట ఓ నృత్యనాటిక ప్రదర్శించారు. అనంతరం అక్కడి నుంచి నది ఒడ్డుకు తీసికెళ్లారు. పూలతో అలంకరించిన బోటులో మెక్రాన్ దంపతుల్ని మోదీ వెంట తీసుకెళ్లారు. అస్సి, దశాశ్వమేథ ఘాట్‌ల చుట్టూ తిప్పారు. రామాయణ విశిష్టతను చెబుతూ భారతీయ జీవనానికి రామాయణమే మార్గదర్శి అని వివరించారు. అస్సి ఘాట్‌లో ఆయనకు పూలు జల్లి స్వాగతం పలికి శుక్ల యజుర్వేదాన్ని పఠించారు. హస్తకళాకృతులను ఫ్రెంచి అధినేత, ఆయన భార్య చాలా ముచ్చటగా చూశారు. బెనారస్ పట్టుచీరలు, తివాచీలు చూసి కూడా ముగ్ధులయ్యారు. చీర నేసే విధానాన్ని మెక్రాన్ భార్య అడిగి తెలుసుకున్నారు.


బోటులో షికారు చేస్తూ అభివాదం చేస్తున్న మోదీ, మెక్రాన్. చిత్రంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

పవర్ ప్లాంట్‌ను ప్రారంభించిన మాక్రాన్

ఉత్తరప్రదేశ్‌లో అతిపెద్ద పవర్ ప్లాంట్‌ను మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌లను సోమవారం ఆవిష్కరించారు. మిర్జాపూర్ జిల్లాలోని చావనీ బ్లాక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సోలార్ ప్యానెల్ బటన్ నొక్కి 75 మెగావాట్ల పవర్‌ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మెక్రాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

త్రిపురలో మూడు నెలల్లో తిప్పేశాం



40 సీట్లు వస్తాయంటే మోదీ నమ్మలేదు

- మాకు సరైన అభ్యర్థులు కూడా లేరు
- 'ఆంధ్రజ్యోతి'తో బీజేపీ నేత రాంమాధవ్

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): త్రిపురలో చివరి మూడు నెలల్లోనే మొత్తం పరిస్థితి మారేలా చేశామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తెలిపారు. త్రిపుర ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన వ్యూహకర్తల బృందంలో కీలకంగా వ్యవహరించిన ఆయన సోమవారం న్యూఢిల్లీలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. "ప్రభుత్వాలు ఎంత చక్కగా పాలించినా చివరి ఆరు నెలల్లోనే పరిస్థితి తారుమారవుతుంది. చంద్రబాబు హయాంలో ఎంతో అభివృద్ధి జరిగినా, వైఎస్ పాదయాత్రతో పరిస్థితి మారిపోయింది కదా!. నిజానికి బీజేపీకి త్రిపురలో అంత బలం లేదు. మాకు అభ్యర్థులు కూడా సరిగా దొరకలేదు. వారి బయోడేటా చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోతారు. చివరి మూడు నెలల వరకూ బీజేపీ గెలుస్తుందన్న నమ్మకం ఏర్పడలేదు. నిఘా వర్గాలు సైతం 15 సీట్లకు మించి రావని చెప్పాయి. బీజేపీకి 40 సీట్ల వరకు వస్తాయన్న నా మాటలను ప్రధాని కూడా విశ్వసించలేదు. మేం ప్రతి దశలోనూ సీపీఎం కంటే ఒకడుగు ముందున్నాం. కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రచారం చేశామ"ని రాంమాధవ్ వివరించారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే మాకు ప్రధానం!

"ఆంధ్రప్రదేశ్‌ని మేం రాజకీయంగా చూడడం లేదు. బీజేపీకి అది అభివృద్ధికి సంబంధించిన అంశం" అని రాంమాధవ్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందని అన్నారు. "తెలుగుదేశం పార్టీ రాజకీయ అవసరాల రీత్యా యోచిస్తుండవచ్చు. కానీ కేంద్రానికి మాత్రం ఏపీ అభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రధానం" అని స్పష్టం చేశారు. "రాజకీయాల్లో ఎప్పటికప్పుడు సమీకరణలు మారుతుంటాయి. బీజేపీ మాత్రం తనంతట తాను సమస్యలను తీవ్రతరం చేసేందుకు ప్రయత్నించదు. తెగే దాక లాగదు" అని వివరించారు.

సునందా పుష్కర్‌ది హత్యే!

- విష ప్రయోగంతోనే మృతి
- వెలుగులోకి తెచ్చిన డీఎన్ఏ వార్తాసంస్థ



న్యూఢిల్లీ, మార్చి 12: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ భార్య సునందా పుష్కర్ అనుమానాస్పద మృతి వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. 2014 జనవరి 17న ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో ఆమె మరణించారు. విష ప్రయోగంతో ఆమెను హత్య చేశారని, కేసును దర్యాప్తు చేసిన అధికారులకు మొదటి నుంచే ఈ విషయం తెలుసని డీఎన్ఏ వార్తా సంస్థ పేర్కొంది. ఈ కేసులో నాటి డిప్యూటీ పోలీస్ కమిషనర్ బీఎస్ జైస్వాల్ ఈమేరకు ప్రాథమిక నివేదిక రూపొందించినట్లు డీఎన్ఏ ప్రకటించింది. జైస్వాల్ నివేదిక ప్రకారం... 'విష ప్రయోగం వల్లే ఆమె చనిపోయింది. శరీరంపై 15 వరకూ గాయాలు న్నాయి. అయితే, చేతిపై ఉన్న 10వ నంబర్ గాయం ఇంజెక్షన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చేతిపైనే ఉన్న 12వ నంబర్ గాయం... పంటి గాటు. అల్ప్రాజోలంను ఆమెపై ప్రయోగించినట్లు భావిస్తున్నాం' అని పోస్టుమార్టంలో ప్రకటించారు. ఈ విషయాలన్నిటినీ ప్రస్తావిస్తూ... నాటి దక్షిణ ఢిల్లీ రేంజ్ జాయింట్ పోలీస్ కమిషనర్ వివేక్ గోగియాకు జైస్వాల్ నివేదిక ఇచ్చారు. ఈ రహస్య నివేదిక తమ వద్ద ఉందని డీఎన్ఏ ప్రకటించింది. సునంద మృతికి కారణం తెలిసినా... పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం.



విరాట్ కోహ్లీకి ముద్దుపెడుతున్న ఫొటోను అనుష్క శర్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇప్పుడీ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది

12వ ర్యాంకర్‌కు షాకిచ్చాడు



ఇండియన్ వెల్స్: భారత టెన్నిస్ ఆటగాడు యుకీ భాంబ్రీ తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని నమోదు చేశాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 110వ స్థానంలో ఉన్న యుకీ.. 12వ ర్యాంకు ఆటగాడు లూకాస్ పౌలిని వరుస సెట్లలో కంగుతినిపించి ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీ మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. సోమవారం జరిగిన రెండోరౌండ్లో యుకీ 6-4, 6-4 స్కోరుతో 9వ సీడ్, ఫ్రెంచ్ ఆటగాడు పౌలికి షాకిచ్చాడు. గతేడాది ఆగస్టులో ప్రపంచ 22వ ర్యాంకర్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)ను ఓడించి సంచలనం సృష్టించిన 25 ఏళ్ల యుకీ మరోసారి సత్తా చాటాడు. ఈ విజయంతో యుకీకి 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించనున్నాయి.

చిల్లర రాజకీయాలకు బలయ్యా!



ఢిల్లీ క్రికెటర్ ఉన్ముక్త్ చంద్

న్యూఢిల్లీ: ఢిల్లీ క్రికెటర్ ఉన్ముక్త్ చంద్.. 2012 అండర్-19 వరల్డ్‌కప్ నెగ్గిన కెప్టెన్. ఆ టోర్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్లో చంద్ అజేయ శతకంతో కప్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. చంద్ ఆట తీరు చూసి సీనియర్ టీమ్‌లో చాలా తొందరగానే ఎంట్రీ ఇస్తాడని అంచనా వేశారు. కానీ ఆ తర్వాత దేశవాళీల్లో పేలవ ప్రదర్శనతో ఆకట్టుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీ జట్టులో కూడా చోటు కోల్పోయాడు. అయితే ఢిల్లీ క్రికెట్ సంఘం చిల్లర రాజకీయాలకు తాను బలిపశువునయ్యానని ఉన్ముక్త్ వాపోతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ జట్టులో చోటు దక్కకపోవడంతో ఆ ప్రభావం ఐపీఎల్ వేలంపై పడింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో చంద్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. తన కెరీర్‌ను కాపాడుకోవడానికి మరో రాష్ట్రానికి ఆడే ఆలోచనలో కూడా ఉన్నానని అంటున్నాడు. 'నీచ రాజకీయాలకు నేను బలిపశువుగా మారా. రెండేళ్ల క్రితం ముంబైలో టీ20 జోనల్ మ్యాచ్ ఆడుతుండగా వన్డే జట్టు నుంచి నన్ను తప్పించనున్నారని తెలిసింది. దానికి కొన్ని నెలల ముందు భారత్-ఎకు ప్రాతినిథ్యం వహించా.. టాప్ స్కోరర్‌గా నిలిచా. అంతకు ముందు సీజన్‌లో కూడా ఢిల్లీ తరఫున అత్యధిక స్కోరు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచినా.. నాపై వేటు పడడంతో షాక్‌కు గురయ్యాన'ని చంద్ అన్నాడు.

దెబ్బకు దెబ్బ..

ప్రారంభ మ్యాచ్‌లో ఎదురైన భంగపాటుకు భారత జట్టు సమష్టి ఆటతీరుతో బదులు తీర్చుకుంది. 153 పరుగుల లక్ష్యం కోసం ఆరంభంలో వికెట్లు కోల్పోయి కాస్త ఇబ్బంది ఎదుర్కొన్నా రైనా దూకుడు.. మనీష్ పాండే నిలకడ జట్టును విజయతీరాలకు చేర్చింది. కెప్టెన్ రోహిత్ శర్మ పేలవ ఫామ్ ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. అంతకుముందు పేసర్ శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో చెలరేగడంతో లంక ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. కుశాల్ మెండిస్ ఒక్కడే రాణించాడు.

- భారత్ ప్రతీకార విజయం
- 6 వికెట్ల తేడాతో లంక ఓటమి
- రాణించిన మనీష్, శార్దూల్



మనీష్ పాండే (42 నాటౌట్)



శార్దూల్ (4/27)

కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. సోమవారం శ్రీలంకతో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. మనీష్ పాండే (31 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్‌తో 42 నాటౌట్) కీలక బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. ఆఖర్లో దినేశ్ కార్తీక్ (25 బంతుల్లో 5 ఫోర్లతో 39 నాటౌట్) అతడికి చక్కటి సహకారం అందించగా సురేశ్ రైనా (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) తుఫాన్ ఇన్నింగ్స్‌తో శుభారంభాన్ని అందించాడు. ప్రస్తుతం జట్టు నాలుగు పాయింట్లతో టాప్‌లో ఉంది. వర్షం కారణంగా మ్యాచ్ గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 9 వికెట్లకు 152 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) అర్ధ సెంచరీ చేయగా ఉపుల్ తరంగ (24 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 22), షనక (16 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 19) ఫర్వాలేదనిపించారు. ఠాకూర్‌కు 4, సుందర్‌కు 2 వికెట్లు దక్కాయి. లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 153 పరుగులు చేసి నెగ్గింది. శార్దూల్ ఠాకూర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

మొదట రైనా.. చివర్లో మనీష్, కార్తీక్

ఓ మాదిరి లక్ష్యమే అయినా భారత ఆటగాళ్లలో ఆత్రుతే ఎక్కువగా కనిపించింది. వేగంగా ఆడి నెట్ రన్‌రేట్ పెంచుకుందామనే లక్ష్యంతో త్వరగా వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ రోహిత్ శర్మ (11) బ్యాటింగ్‌లో అదే వైఫల్యం.. తొలి ఓవర్‌లో వరుసగా రెండు బంతులను 6,4గా మలిచి ఆహా అనిపించినా మరుసటి ఓవర్‌కే అతడి కథ ముగిసింది. దనంజయ తన రెండు ఓవర్లలో రోహిత్‌తో పాటు ఫామ్‌లో ఉన్న ధవన్ (8)ను కూడా అవుట్ చేయడంతో 22 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. అయితే ఈ సమయంలో రైనా (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగి 16 పరుగులు సాధించాడు. ఏడో ఓవర్‌లో ఓ ఫోర్, సిక్స్ బాదినా డ్రైవ్ షాట్‌కు యత్నించి మిడాఫ్‌లో క్యాచ్ ఇచ్చాడు. ఎక్కువగా సింగిల్స్‌కు పరిమితమైన రాహుల్ (18) తొమ్మిదో ఓవర్ నాలుగో బంతికి రనౌట్ నుంచి తప్పించుకున్నా మరుసటి బంతికే హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. టీ20 చరిత్రలో ఇలా అవుటైన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఈ దశలో భారీ షాట్లకు వెళ్లకుండా పాండే, దినేశ్ కార్తీక్ జాగ్రత్తగా ఆడారు. 15వ ఓవర్‌లో పాండే సిక్స్ బాదగా అటు కార్తీక్ కూడా వరుస బౌండరీలతో చెలరేగడంతో మరో 9 బంతులుండగానే నెగ్గింది.

కుశాల్ మెండిస్ ఒక్కడే..

తొలి బంతికే ఓవర్‌త్రో ద్వారా ఐదు పరుగులు.. ఆ తర్వాత బంతికే కుశాల్ మెండిస్ సిక్సర్.. ఇలా ప్రారంభమైంది లంక ఇన్నింగ్స్. ఆ ఓవర్‌లో లంక 15 పరుగులు పిండుకోగా.. రెండో ఓవర్ తొలి బంతికే గుణతిలక మరో సిక్సర్. పరుగుల వరద ఖాయంగా కనిపించినా ఆ తర్వాత వరుసగా రెండు ఓవర్లలో గుణతిలక (8 బంతుల్లో 1 సిక్స్‌తో 17)ను ఠాకూర్ అవుట్ చేయగా భీకర ఫామ్‌లో ఉన్న కుశాల్ పెరీరా (3) రివర్స్ స్వీప్‌కు యత్నించి సుందర్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. దీంతో లంక 36 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. అయితే మెండిస్ తన ధాటిని కొనసాగించగా అటు తరంగ (22) జత కలిశాడు. ఎనిమిదో ఓవర్‌లో చెరో సిక్స్ కొట్టడంతో 17 పరుగులు వచ్చాయి. దాదాపు ఆరు ఓవర్ల వరకు క్రీజులో నిలిచిన ఈ జోడీ మూడో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. తిసార పెరీరా (15) తానెదుర్కొన్న రెండు బంతులను సిక్సర్లుగా మలిచినా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అటు మెండిస్ 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. అయితే ఊపు మీదున్న మెండిస్‌ను 15వ ఓవర్‌లో చాహల్ అవుట్ చేయడంతో పరుగుల వేగం తగ్గడంతో పాటు బౌలర్ల విజృంభణతో చివరి 8 ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయింది. ఆఖరి ఓవర్లో ఠాకూర్ వరుసగా రెండు వికెట్లు తీశాడు.

స్కోరు బోర్డు

శ్రీలంక: గుణతిలక (సి) రైనా (బి) ఠాకూర్ 17, కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 55, కుశాల్ పెరీరా (బి) సుందర్ 3, తరంగ (బి) శంకర్ 22, తిసార పెరీరా (సి) చాహల్ (బి) ఠాకూర్ 15, జీవన్ (బి) సుందర్ 1, షనక (సి) దినేశ్ కార్తీక్ (బి) ఠాకూర్ 19, దనంజయ (సి) రాహుల్ (బి) ఉనాద్కట్ 5, లక్మల్ (నాటౌట్) 5, చమీర (సి) ఉనాద్కట్ (బి) ఠాకూర్ 0, ఫెర్నాండో (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 19 ఓవర్లలో 9 వికెట్లకు 152; వికెట్ల పతనం:** 1-25, 2-34, 3-96, 4-113, 5-118, 6-120, 7-146, 8-151, 9-151; **బౌలింగ్:** ఉనాద్కట్ 3-0-33-1, వాషింగ్టన్ సుందర్ 4-0-21-2, శార్దూల్ ఠాకూర్ 4-0-27-4, యజ్వేంద్ర చాహల్ 4-0-34-1, విజయ్ శంకర్ 3-0-30-1, సురేశ్ రైనా 1-0-6-0.

భారత్: రోహిత్ (సి) మెండిస్ (బి) దనంజయ 11, ధవన్ (సి) పెరీరా (బి) దనంజయ 8, రాహుల్ (హిట్‌వికెట్) (బి) మెండిస్ 18, రైనా (సి) పెరీరా (బి) ఫెర్నాండో 27, మనీష్ పాండే (నాటౌట్) 42, కార్తీక్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 153; వికెట్ల పతనం:** 1-13, 2-22, 3-62, 4-85; **బౌలింగ్:** లక్మల్ 2-0-19-0, దనంజయ 4-0-19-2, చమీర 3-0-33-0, ఫెర్నాండో 2.3-0-30-1, మెండిస్ 4-0-34-1, పెరీరా 2-0-17-0.

కోహ్లీ..సచిన్ రికార్డుల్ని దాటేస్తాడు!

ఇది ఓ జ్యోతిష్కుడి జోస్యం

న్యూఢిల్లీ: అద్భుత బ్యాటింగ్‌తో ఇప్పటికే ఎన్నో రికార్డులను తిరగరాసిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ..మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 100 సెంచరీల రికార్డును కూడా బద్దలుగొడతాడని ప్రముఖ జ్యోతిష్కుడు నరేంద్ర బుందే చెబుతున్నాడు. అంతేకాదు టీ20, వన్డే వరల్డ్ కప్‌లనూ అతడు సాధిస్తాడని, ఇంకా.. ఈ ఏడాది క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద మొత్తానికి ఓ వాణిజ్య ఒప్పందాన్ని విరాట్ కుదుర్చుకోబోతున్నాడని జోస్యం చెప్పాడు. నాగ్‌పూర్‌కు చెందిన బుందే.. మాజీ కెప్టెన్ ధోనీ వచ్చే వన్డే ప్రపంచకప్ (2019)లో ఆడడం ఖాయమని కొద్దినెలల కిందట వెల్లడించిన సంగతి తెలిసిందే. అప్పట్లో జట్టులో ధోనీ కొనసాగింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో నరేంద్ర తన జోస్యం వెలువరించాడు. అయితే వచ్చే ప్రపంచకప్‌లో భారత జట్టులో ధోనీ ఉంటాడని సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్ స్పష్టంజేయడం విశేషం. 'నేను ఇంతకుముందు ఊహించినవన్నీ జరిగాయి. టీ20, వన్డే వరల్డ్‌కప్‌లను కోహ్లీ గెలుచుకుంటాడు. 2025నాటికి సచిన్ 100 సెంచరీల రికార్డునూ అధిగమిస్తాడు. అంతేకాదు 2018లో ఎవరూ ఊహించని భారీ మొత్తానికి ఓ డీల్ కుదుర్చుకుంటాడు. 1990ల్లో సచిన్ అమోఘమైన ఫామ్‌లో ఉన్న తరుణంలో మస్కరెనాస్ కళ్లు చెదిరే మొత్తానికి సచిన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంకంటే పెద్దదిగా అది ఉంటుంది' అని వెల్లడించాడు. 1995లో ఐదేళ్ల కాలానికి రూ. 30 కోట్లతో సచిన్‌తో మస్కరెనాస్ డీల్ కుదుర్చుకున్నాడు. 'టెన్నిస్ ఎల్బో' గాయం నుంచి టెండూల్కర్ కోలుకొని మళ్లీ కెరీర్ కొనసాగిస్తాడని, అతడిని భారతరత్న వరిస్తుందని నరేంద్ర చెప్పిన జోస్యాలు నిజమయ్యాయి. అలాగే భారత జట్టులోకి గంగూలీ పునరాగమనం, 2011లో టీమిండియా వన్డే వరల్డ్‌కప్ కైవసం చేసుకుంటుందన్న అతడి అంచనాలు వాస్తవరూపం దాల్చాయి. సౌరవ్‌తోపాటు, మురళీ కార్తీక్, శ్రీశాంత్, జహీర్, గంభీర్, రైనా గతంలో నరేంద్ర సలహాలు తీసుకున్నారు.

బోల్టన్ శతకం

- తొలి వన్డేలో భారత మహిళలపై ఆసీస్ గెలుపు



బోల్టన్ (101 బంతుల్లో 100)

వడోదరా: ఓపెనర్ నికోల్ బోల్టన్ (101 బంతుల్లో 100) అజేయ శతకంతోపాటు స్పిన్నర్లు అదరగొట్టడంతో తొలి వన్డేలో ఆతిథ్య భారత్‌ను ఆస్ట్రేలియా మహిళల జట్టు 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. భారత్ నిర్దేశించిన 201 పరుగుల స్వల్పస్కోరును ఆసీస్ 32.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బోల్టన్‌కు హీలీ (38), కెప్టెన్ మెక్ లానింగ్ (33), పెర్రీ (25 నాటౌట్) సహకారం అందించడంతో ఆసీస్ మరో 107 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు భారత్.. స్పిన్నర్ జొన్నసెన్ (4/30) దెబ్బకు నిర్ణీత 50 ఓవర్లలో 200 పరుగులకే కుప్పకూలింది. పూజా వస్త్రకార్ హాఫ్ సెంచరీ సాధించింది. అమందా జేడ్ మూడు వికెట్లు పడగొట్టింది. అనారోగ్యం కారణంగా కెప్టెన్ మిథాలీ రాజ్ దూరం కావడంతో మ్యాచ్‌కు ముందే భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.



ఏఐటీఏ టోర్నీలో శ్రీవల్లికి 'డబుల్'

వరంగల్ అర్బన్ స్పోర్ట్స్: ఏఐటీఏ అండర్-14 జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన శ్రీవల్లి వర్మ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచి 'డబుల్' సాధించింది. మూడురోజుల క్రితం ఇక్కడ మొదలైన పోటీలు సోమవారం ముగిశాయి. బాలికల సింగిల్స్ ఫైనల్లో శ్రీవల్లి 1-6, 6-1, 6-4తో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి లావణ్యను ఓడించి ట్రోఫీ అందు కుంది. డబుల్స్ ఫైనల్లో శ్రీవల్లి-సాయి ద్యుతి జోడీ 6-1, 6-4తో లావణ్య-యశస్విని జంటపై గెలిచింది. బాలుర సింగిల్స్‌లో గగన్, డబుల్స్‌లో శ్రద్ధ-మురళి జోడీ విజేతలుగా నిలిచారు. జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి, నగర పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు.

షమి.. మోసగాడు కాదు

- మాజీ కెప్టెన్ ధోనీ మద్దతు
- కోర్టు బయట సమస్య పరిష్కారానికి యత్నం
- బీసీసీఐని ఆరాతీసిన పోలీసులు



ముంబై: భార్య హసీన్ జహా ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరవుతున్న పేసర్ మహ్మద్ షమికి తొలిసారిగా తన సహచర ఆటగాడి నుంచి మద్దతు లభించింది. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఈ మొత్తం వ్యవహారంలో షమికి బాసటగా నిలిచాడు. అతడు మోసగాడు కాదని, మంచి వ్యక్తిగానే తనకు తెలుసని స్పష్టం చేశాడు. 'నాకు తెలిసినంత వరకు షమి మంచి మనసున్న వ్యక్తి. అతడు భార్యను, ఈ దేశాన్ని మోసం చేయలేడు. అయితే ఇదంతా అతడి వ్యక్తిగత వ్యవహారం. ఇంతకు మించి మాట్లాడలేం' అని తెలిపాడు. ఇప్పటికే మాజీలు కపిల్ దేవ్, చేతన్ చౌహాన్ కూడా షమి తరఫున మాట్లాడారు. బీసీసీఐ కాంట్రాక్ట్ అనేది ఓ ఆటగాడి నైపుణ్యానికి సంబంధించిన విషయమని, అయినా షమిని కోర్టు దోషిగా ప్రకటించనప్పుడు అతడి కాంట్రాక్ట్‌ను పక్కనపెట్టడమేమిటని చౌహాన్ ప్రశ్నించాడు. షమి కష్టపడే వ్యక్తిగా తనకు తెలుసని, అతడి భార్య ఆరోపణలు నిరాధారమని కపిల్ అన్నాడు.

ముగింపు దిశగా వివాదం..: షమి, అతడి భార్య హసీన్ మధ్య సాగుతున్న వివాదం త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు షమి కుటుంబ సభ్యులు హసీన్ లాయర్‌ను కోల్‌కతాలో కలవనున్నారు. కోర్టు బయట సమస్యను ముగించేందుకు గల అవకాశాలపై ఆయనతో చర్చించనున్నారు.

షమి.. దుబాయ్ ఎందుకెళ్లాడు?

ఇటీవల ముగిసిన దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించి షమి వివరాల కోసం కోల్‌కతా పోలీసులు బీసీసీఐని సంప్రదించారు. ఎందుకంటే షమి అక్కడి నుంచి నేరుగా భారత్‌కు రాకుండా దుబాయ్‌కు వెళ్లి పాక్ అమ్మాయితో గడిపినట్టు అతడి భార్య ఫిర్యాదు చేసింది. దీంతో అతడు దుబాయ్‌కు ఎందుకెళ్లాల్సి వచ్చిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సఫారీలదే విజయం

రెండో టెస్టులో ఆసీస్ ఓటమి



పోర్ట్‌ఎలిజిబెత్: ఓవైపు మెడపై 'రెండు టెస్టుల నిషేధం' కత్తి వేళాడుతున్న వేళ..ఆ ఆందోళన దరిచేరనీయని దక్షిణాఫ్రికా పేసర్ రబాడ జట్టుకు ఓ అద్భుత విజయం అందించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల (6/54)తో విజృంభించడంతో ఆస్ట్రేలియాతో రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో నాలుగు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. రబాడ పదునైన బౌలింగ్‌కు ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 239 పరుగులకే ముగిసింది. అనంతరం లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 4 వికెట్లు కోల్పోయి 102/4తో ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో కలిపి ఈ టెస్ట్‌లో 11 వికెట్లు పడగొట్టిన రబాడ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. 28 టెస్టుల కెరీర్‌లో ఓ మ్యాచ్‌లో పది అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టడం రబాడకు ఇది నాలుగోసారి. ఇలా టెస్ట్‌ల్లో కనీసం నాలుగుసార్లు పది వికెట్లు కైవసం చేసుకున్న మూడో సౌతాఫ్రికా బౌలర్‌గా రబాడ నిలిచాడు. స్టెయిన్, ఎన్తిని అతడికంటే ముందున్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 180/5తో సోమవారం నాలుగోరోజు ఆట కొనసాగించిన ఆసీస్‌కు రబాడ ఆరంభంలోనే షాకిస్తూ.. మిచెల్ మార్ష్ (45)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత కమిన్స్ (5), స్టార్క్ (1)ను వెంట వెంటనే పెవిలియన్ చేర్చాడు. ఇక లియాన్ (5)ను ఎన్‌గిడి, హాజెల్‌వుడ్ (17)ను స్పిన్నర్ కేశవ్ అవుట్ చేయడంతో 239 పరుగుల వద్ద ఆసీస్ రెండో ఇన్నింగ్స్ ముగిసింది. ఆపై.. లక్ష్యం చిన్నదే (101 పరుగులు) కావడంతో మార్క్రమ్ (21), ఆమ్లా (27), డివిల్లీర్స్ (28) సఫారీ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. మూడో టెస్ట్ ఈనెల 22న ప్రారంభంకానుంది.

రబాడపై రెండు టెస్ట్‌ల నిషేధం

ఐసీసీ ప్రవర్తనా నియమావళి 'రెండు' కింద దోషిగా తేల్చి రబాడపై మ్యాచ్ రెఫరీ జెఫ్ క్రో రెండు టెస్ట్‌ల నిషేధం విధించాడు. రెండో టెస్ట్‌లో ఆసీస్ కెప్టెన్ స్మిత్‌ను అవుట్ చేసిన అనంతరం అతడిని భుజంతో ఢీకొట్టిన రబాడపై ఈ చర్య తీసుకున్నారు. ఫలితంగా ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్ట్‌లకు అతడు దూరం కానున్నారు.

మిచెల్ తలకు 16 కుట్లు!

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మాజీ పేసర్ మిచెల్ జాన్సన్.. జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. తలపై బలమైన గాయం కావడంతో 16 కుట్లు కూడా పడ్డాయి. చిన్-అప్ బార్ వ్యాయామం చేస్తుండగా.. ఆ కడ్డీకి జాన్సన్ తల బలంగా తగిలింది. తలపై సుమారు రెండు అంగుళాల వెడల్పుగా కట్ అయింది. ఈ గాయం కారణంగా ఐపీఎల్‌లో మిచెల్ ఆడేది అనుమానమే..! జాన్సన్‌ను రూ. 2 కోట్లకు కోల్‌కతా ఖరీదు చేసిన సంగతి తెలిసిందే.



స్కాట్లండ్‌తో మ్యాచ్ టై జింబాబ్వే రికార్డు పదిలం!

బులవాయో: వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో 36 ఏళ్ల తన అపజయ రికార్డును జింబాబ్వే కాపాడుకుంది. సోమవారం స్కాట్లండ్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్ టై కావడంతో ఆ జట్టు రికార్డు పదిలంగా ఉండిపోయింది. రెండు జట్లు ఇప్పటికే క్వాలిఫయర్స్ సూపర్‌సిక్స్ దశకు చేరడంతో ఈ మ్యాచ్ నామమాత్రమైనా రెండు జట్ల పోరాట పలితంగా మ్యాచ్ చివరి వరకూ మజా పంచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జింబాబ్వే 46.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో.. విజయం అంచుల దాకా వచ్చిన స్కాట్లండ్ మరో రెండు పరుగులు కావాల్సిన దశలో మూడు బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయి 49.1 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. ఇక టోర్నీ ఫేవరెట్ ఆఫ్ఘానిస్థాన్ నాలుగో మ్యాచ్‌ల్లో ఒకదానిలోనే గెలుపొందినా రన్‌రేట్ ఆధారంగా సూపర్‌సిక్స్‌కు చేరింది.

వెంటాడి.. వేటాడి..
నడిరోడ్డుపై నరికేశారు!


సుధీర్(ఫైల్)

ఇంటర్ విద్యార్థి హత్య.. వేట కొడవళ్లతో దాడి


నిందితుడు నవీన్

కూకట్‌పల్లి/హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళుతున్న ఓ విద్యార్థిని నలుగురు దుండగులు అడ్డగించారు.. వేట కొడవళ్లతో దాడి చేయబోయారు.. అప్రమత్తమైన ఆ విద్యార్థి తప్పించుకొని ఓ స్కూల్ బస్సును ఎక్కాడు. దుండగులు కూడా బస్సెక్కి అతన్ని కిందకు లాక్కొచ్చారు. నడిరోడ్డుపై జనం చూస్తుండగానే వేట కొడవళ్లతో నరికి చంపేశారు! సినీ ఫక్కీలో జరిగిన ఈ దారుణ హత్య కూకట్‌పల్లిలో కలకలం రేపింది. హత్యకు సంబంధించి పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటలోని జనతానగర్‌లో నివాసముంటూ పాలవ్యాపారం చేసే ఎలగల రాజు, రాణి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నవాడైన సుధీర్ (19) ఇంటర్ ఫెయిలయ్యాడు. సోమవారం ఉదయం 8గంటల సమయంలో స్నేహితులు సాయికృష్ణ, మేఘనాథ్‌లతో కలిసి బైకుపై కూకట్‌పల్లిలోని పరీక్షాకేంద్రానికి బయలుదేరాడు. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ హోటల్ వద్దకు రాగానే.. మూసాపేట జిల్లెల బస్తీకి చెందిన జిల్లా మహేష్ అతని స్నేహితులు బైపేట నవీన్, కొర్రె తేజ, ఇ.కృష్ణలు సుధీర్ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని అడ్డగించారు. సుధీర్‌పై వేటకొడవళ్లతో దాడికి యత్నించారు. సుధీర్ తప్పించుకొని పరుగెత్తుకొంటూ వెళ్లి జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ స్కూల్ బస్సు ఎక్కాడు. దుండగులు ఆ బస్సెక్కి సుధీర్‌ను కిందకు లాక్కొచ్చి రోడ్డుపై పడేసి వేటకొడవళ్లతో నరికి చంపేశారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై అందరూ చూస్తుండగానే హత్య జరగడంతో స్థానికులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజు, ప్రభాకర్, అంజి, మల్లేష్‌లు రికవరీ వాహనంలో వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. వారంతా దుండగులను నిలువరించేందుకు వెళ్లారు. అప్పటికే సుధీర్ రహదారిపై పడిపోగా.. నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. మహేష్, కృష్ణ, తేజలు వైజంక్షన్ వైపు పారిపోగా.. నవీన్‌ను ట్రాఫిక్ పోలీసులు పట్టుకొన్నారు. ఈ క్రమంలో నవీన్ తన చేతిలో ఉన్న వేటకొడవలితో పోలీసులపై దాడి చేయబోయాడు. కానిస్టేబుళ్లు ప్రభాకర్, అంజి ప్రాణాలకు తెగించి నవీన్‌ను పట్టుకొన్నారు. బస్తీ గొడవలు హత్యకు దారి తీయడంతో స్థానికంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు ప్రత్యేక బలగాలను మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ భుజంగరావు ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. తన కుమారుడు చావుకు కారణమైన మహేష్, బైపేట నవీన్, కొర్రె తేజ, కృష్ణలపై చర్యలు తీసుకోవాలంటూ సుధీర్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య వెనక మూసాపేటకు చెందిన వంశీయాదవ్ ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బస్తీల్లో 2వర్గాల మధ్య జరిగే గొడవలే ఈ హత్యకు కారణమని పోలీసుల విచారణలో తేలింది.

వీడియోనే ప్రాణం తీసిందా?

సుధీర్ తండ్రి రాజు మూసాపేటలో పాల వ్యాపారం చేస్తుంటాడు. తన దుకాణంలో పాల ప్యాకెట్లు పోతుండడంతో అనుమానం వచ్చి నిఘా పెట్టాడు. నిందితుల్లో ఒకరైన కృష్ణ పాల ప్యాకెట్లు దొంగిలిస్తుండగా రాజు వీడియో తీశాడు. అది గమనించిన కృష్ణ రాజుతో వాగ్వాదానికి దిగిఅతన్ని బెదిరించాడు. తండ్రిని బెదిరించిన విషయం తెలుసుకున్న సుధీర్ కృష్ణ దగ్గరకు వెళ్లి చంపేస్తానని బెదిరించాడు. దీంతో సుధీర్‌పై కక్ష పెంచుకున్న కృష్ణ.. పథకం ప్రకారం అతన్ని హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

మా పిల్లల్ని..
తాగుబోతుల్ని చేస్తారా..

బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా గోడ మీద ఉత్తరం




తంగళ్లపల్లి గ్రామంలో బెల్ట్‌షాపులను మూసి వేయాలని కోరుతూ మూడు పేజీల లేఖను అంటించిన అజ్ఞాత మహిళ

- చిన్న ఊరిలో 11 బెల్టు షాపులు.. పిల్లలు కూడా మద్యానికి బానిస
- అడ్డుకోవాలని అధికారులకు అజ్ఞాత మహిళ లేఖ

ఆమె వ్యవస్థలో లోపాలను తిట్టుకుంటూ కూర్చోలేదు. మార్పు కోసం మొదటి అడుగు వేసింది. తన ఆవేదనను అక్షరాల్లో నింపింది. ఆమెకు సామాజిక మాధ్యమాల గురించి తెలియకపోవచ్చు కానీ సామాజిక బాధ్యత ఉంది. ఫేస్‌బుక్ వాల్ గురించి తెలియకపోయినా..పంచాయితీ ఆఫీసు గోడ మీద ఉత్తరాన్ని అంటించి పోలీసులను నిలదీసింది. గ్రామంలో బెల్ట్ షాపులను మూయించాలని అధికారులకు లేఖ రాసింది. ఆ అజ్ఞాత మహిళ అక్షరాలు వ్యవస్థను ప్రశ్నిస్తున్నాయి. సమాజాన్ని కదిలిస్తున్నాయి..

కోహెడ, మార్చి 12: 'అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు! అయ్యా! నేను దళితురాలిని. నా భర్త రోజూ సంపాదించేది 600 రూపాయలు. కానీ బెల్ట్ షాపుల వల్ల రూ.200 మాత్రమే ఇంట్లో ఇస్తూ.. మిగతా పైసలన్నీ బెల్ట్‌షాపులకే ఖర్చు చేస్తున్నాడు. నాలాగే గ్రామంలో ఎంతోమంది మహిళలు బాధపడుతున్నారు. ఇంతకు ముందు సీఐ భూమయ్య ఉన్నప్పుడు గ్రామంలో బెల్ట్ షాపులు నడపడానికి భయపడేవారు. మా గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ మహిళలే! అయినా మాకు అన్యాయం జరుగుతోంది. సార్, ఏడో తరగతి చదివే పిల్లాడు కూడా మా ఊళ్లో మందు తాగుతున్నాడు. వాళ్లకు మందు ఎలా వస్తోంది? వాళ్ల భవిష్యత్తు ఏమిటి? మందు అమ్మేవారి పిల్లలు ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. మరి మా పిల్లలు తాగుబోతులు కావాలా? మీరే ఆలోచించండి! మా ఊళ్లో 11 బెల్ట్ షాపులున్నాయి. వాళ్లందరూ ఊరిని ముంచుతున్నారు. గ్రామంలో 32 గౌడ కులస్తుల పొట్ట కొడుతున్నారు. ఇదేమి న్యాయం? సర్పంచ్ గారు, ఎంపీటీసీ గారు.. నేను చేసింది తప్పా? మీరు చేయలేనిది నేను చేస్తున్నాను. ఎస్సైగారు, మాది పోలీసుల దత్తత గ్రామం..మీరే ఆలోచించండి! పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గ్రామంలో బెల్టు షాపులే లేవనడం హాస్యాస్పదం! అన్నలారా, అక్కలారా..! నేను ఏడో తరగతి వరకు చదివినా.. నా భర్తను ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు! కానీ ఊరి కోసం ఓ మహిళగా పోరాడుతున్నాను, నాకు మద్దతు ఇవ్వండి! ఇప్పటికైనా ఎస్సై, సర్పంచ్, ఎంపీటీసీ వెంటనే చొరవ తీసుకోవాలి. లేదంటే..కలెక్టర్ ఆఫీసు ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తాను. ఊళ్లో బెల్ట్ షాపులు మూయించడానికి చావడానికైనా సిద్ధం!' అంటూ సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో ఓ అజ్ఞాత మహిళ మూడు పేజీల లేఖను రాసి పంచాయితీ భవనం గోడకు అంటించడం చర్చనీయాంశమయింది. తనభర్తలాగే ఎందరో మగాళ్లు బెల్ట్‌షాపులకు కష్టపడినదంతా ధారపోస్తున్నారని ఆమె వ్యక్తం చేసిన ఆందోళన .. ఏడో తరగతి పిల్లలు కూడా మద్యానికి బానిసలవుతున్నారన్న ఆమె ఆవేదన, గ్రామం నుంచి బెల్ట్ షాపులు తరిమి కొట్టాలన్న ఆమె సామాజిక బాధ్యత అందరినీ ఆలోచింపజేస్తోంది. తంగళ్లపల్లి గ్రామంలో బెల్ట్‌షాపులకు వ్యతిరేకంగా దళిత స్త్రీ ఒంటరిగా మొదటి అడుగువేసింది. ఇక తమ దత్తత గ్రామంలో బెల్ట్‌షాపులను మూయించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

బావామరదళ్ల బలవన్మరణం

- ఏడాదిగా ప్రేమలో ఉన్న మైనర్ జంట
- పెళ్లికి ఇంట్లో ఒప్పుకోరని కలత
- ఒకే చోట చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య


ప్రవీణ్, మంజుల (ఫైల్)

దౌల్తాబాద్, మార్చి 12 : వారిద్దరూ వరుసకు బావామరదళ్లు.. ఇద్దరి మధ్య ఉన్న చనువు కాస్త.. ప్రేమకు దారి తీసింది. ఏడాది కాలంగా ప్రేమలో ఉన్నారు. అయితే ఇంట్లో వారికి విషయం తెలిస్తే.. ఏమంటారోనన్న భయం వారిని కొంతకాలంగా వెంటాడింది. విషయం బావ ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు మందలించారు. ఇటీవల అమ్మాయికి పెళ్లి చేయాలని ఆమె తల్లిదండ్రులు నిశ్చయించడంతో కలత చెందిన ఈ మైనర్ జంట ఒకే చెట్టుకు ఉరేసుకుని తనువు చాలించింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం పోల్కంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం మేరకు.. అనంతయ్య కుమారుడు ప్రవీణ్ (18) ఐటీఐ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భీమప్ప కుమార్తె మంజుల ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. భీమప్ప.. ప్రవీణ్‌కు వరుసకు మామ కావడంతో ఆయన కుమార్తె మంజులతో చనువుగా ఉండేవాడు. ఇదే వీరి మధ్య ప్రేమకు దారి తీసింది. భీమప్ప తన కూతురు మంజులకు వరుసకు బంధువులైన వ్యక్తితో నిశ్చితార్థం చేసేందుకు నిర్ణయించాడు. విషయాన్ని మంజుల హైదరాబాద్‌లో ఉన్న ప్రవీణ్‌కు తెలిపింది. దీంతో ప్రవీణ్ ఆదివారం రాత్రి పోల్కంపల్లికి చేరుకున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ.. ఇద్దరూ కలిసి ఆదివారం రాత్రి ఊరి పొలిమేరల్లోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం అటుగా వెళ్లిన గ్రామస్థులు విషయాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడ్డిగా నమ్మి గుడ్ మార్నింగ్ చెప్తే..

అత్యాచారానికి దారితీసిన వాట్సాప్ పరిచయం

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరితో ఒకరికి పరిచయం లేదు. ఏదో ఒక నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే వాట్సాప్‌లో ఓ మహిళ పరిచయమైంది. దొరికిందే చాన్సని తియ్యని మాటలు చెబుతూ ఆమెను మెల్లిగా ముగ్గులోకి దింపాడు. సదరు మహిళ పూర్తి వివరాలు తెలుసుకొని.. ఎవరూ లేని సమయంలో ఆమె ఇంటికెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బ్లాక్‌మెయిల్‌కు దిగి రూ.55వేల నగదు, చెవి కమ్మలను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో చివరకు కటకటాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని ఓల్డ్ మలక్‌పేటకు చెందిన పందుల పవన్‌కుమార్ డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఒకరోజు తన మొబైల్ నుంచి తోచిన నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేశాడు. అవతలి నుంచి ఎవరని ప్రశ్నించడంతో సారీ అనుకోకుండా వచ్చిందని బదులిచ్చాడు. అవతలివైపు వ్యక్తి మహిళ అని తెలియడంతో ఆమెను ఎలాగైనా ట్రాప్ చేయాలని భావించాడు. ఆ మరుసటి రోజు మళ్లీ గుడ్ మార్నింగ్ అని మెసేజ్ చేశాడు. దానికి సదరు మహిళ గుడ్‌మార్నింగ్ అని రిప్లై ఇచ్చింది. అప్పట్నుంచి వాట్సాప్ లో మెసేజ్‌లు పెడుతూ.. తియ్యని మాటలతో ఆమెను ముగ్గులోకి దించాడు. ఆ మహిళతో స్నేహం నటించి ఆమె గురించి పూర్తి వివరాలు సేకరించాడు. అదును కోసం చూస్తున్న సమయంలో.. ఒకరోజు సదరు మహిళ భర్త ఊళ్లో లేరని తెలిసింది. దీంతో బాలాపూర్‌లో ఉంటున్న ఆమె ఇంటికి వెళ్లాడు. ఆమెను భయపెట్టి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఇలాగే బెదిరించి పలుమార్లు లొంగదీసుకున్నాడు. ఆమె బలహీనతను అడ్డుపెట్టుకొని ఇటీవల ఇంట్లోని రూ.55వేల నగదు, 5గ్రాముల బంగారు చెవి దిద్దులను ఎత్తుకెళ్లాడు. రోజురోజుకూ పవన్ కుమార్ ఆగడాలు శ్రుతిమించడంతో విసిగిపోయిన ఆ మహిళ జరిగిందంతా తన భర్తకు చెప్పి.. మీర్‌పేట పోలీసులను ఆశ్రయించింది. వనస్థలిపురం ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో రంగంలోకి దిగిన మీర్‌పేట పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎల్‌బీనగర్ డీసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు.

యువకుడిపై అత్యాచారం!

- నలుగురు యువకులపై కేసు నమోదు

నర్సంపేట టౌన్, మార్చి 12: ఓ యువకుడిపై నలుగురు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన చెందిన ఓ యువకుడు కొద్ది నెలలుగా అక్కడి హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 8న రాత్రి యజమాని ఇంటివద్దకు వెళుతుండగా నర్సంపేటకు చెందిన ఆటోడ్రైవర్ ఊకల శరత్ మరో ముగ్గురు యువకులతో కలిసి కొమ్మాల జాతరకు వెళ్లి విందు చేసుకుందామని చెప్పాడు. ఆటోలో ఎక్కించుకున్నాడు. అదే రోజు రాత్రి కొమ్మాల ఊరు చివరలో నలుగురూ అతనిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కాగా, సోమవారం యజమానికి జరిగిన విషయం చెప్పాడు. అతని సలహా మేరకు తనపై జరిగిన అఘాయిత్యం గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శరత్ తోపాటు ముగ్గురు యువకులపై రేప్ కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా బాధితుడి ఇచ్చిన ఫిర్యాదులో తాను మగవాడిగా జన్మించినా.. వయసు పెరుగుతున్న కొద్దీ ఆడ లక్షణాలు పెరుగుతూ వచ్చాయని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు

భర్తను వదిలి ప్రియుడితో పెళ్లి

- ఫొటోలు వాట్సా‌ప్‌లో పంపిన భార్య
- మనస్తాపంతో భర్త ఆత్మహత్య


ధర్మరాజు (ఫైల్)

దండేపల్లి మార్చి 12: ప్రియుడిని పెళ్లాడానంటూ.. తన భార్య పెళ్లి దృశ్యాలను వాట్సాప్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన నక్క ధర్మరాజు, జగిత్యాల జిల్లా కన్నాపూర్‌కు చెందిన ముద్దం నాగలక్ష్మి భార్యాభర్తలు. నాగలక్ష్మికి మంత్రి మహేశ్ అనే వ్యక్తితో పెళ్లికి ముందు నుంచే సంబంధం ఉంది. ఈ నెల 9న మహేశ్‌ను పెళ్లి చేసుకుని, ధర్మరాజుకు వీడియోను వాట్సాప్ చేసింది. తీవ్ర మనస్తాపానికి లోనైన ధర్మరాజు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు

రిజర్వేషన్లపై చర్చకు టీఆర్ఎస్ ప్లాన్

- లోక్‌సభలో వాయిదా తీర్మానం కోసమే పట్టు

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల అంశంపై లోక్‌సభలో చర్చ జరగాలని టీఆర్ఎస్ పట్టుబడుతోంది. 193 నిబంధన కింద నోటీసు ఇవ్వాలని పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ సూచించారు. ఇది ప్రధాన సమస్య అని, తాము వాయిదా తీర్మానానికే కట్టుబడి ఉన్నామని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సభ ప్రారంభం కాగానే టీఆర్ఎస్ ఎంపీలు నిరసన గళం వినిపిస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. స్పీకర్ రాక ముందే 'ఒక దేశం.. ఒకే నీతి' అంటూ నినాదాలిచ్చారు. అదే సమయంలో ప్రత్యేక హోదా అంశంపై టీడీపీ, వైసీపీ ఎంపీలు, కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుపై అన్నాడీఎంకే, నీరవ్ మోదీ అంశంపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలూ స్పీకర్ పోడియం చుట్టూ చేరి నినాదాలిచ్చారు. ప్రాంతీయ పార్టీల నిరసనలతో సభ నిమిషం కూడా జరగకుండానే మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. రిజర్వేషన్లు ఇస్తారో లేదో కేంద్రం తేల్చి చెప్పాలని ఎంపీ కవిత ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సభ ప్రారంభమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ గందరగోళం మధ్యే చిట్‌ఫండ్ సవరణ, ఆర్థిక నేరాల కట్టడి బిల్లులను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి ప్రవేశపెట్టారు. ఎంపీల నినాదాల హోరు పెరగడంతో సభను స్పీకర్ సుమిత్ర మహాజన్ మరుసటి రోజుకు వాయిదా వేశారు.

పార్లమెంట్ ఆవరణలో నిరసన

టీఆర్ఎస్ ఎంపీలు గేట్ నెం.4 వద్ద కూర్చుని రిజర్వేషన్ల అంశంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలంటూ నినాదాలిచ్చారు. ఎంపీ సీతారామ్ నాయక్ మాట్లాడుతూ.. హక్కులను సాధించేందుకు దళిత, గిరిజనులు ఇలా ఫుట్‌పాత్‌పై ధర్నా చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని న్యాయబద్ధంగా కోరుతున్నా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే ఉందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Balanagar (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.